

# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక, ఏప్రిల్, 2020 ₹ 30/-

ISSN 2454–4329



మీనాక్షి

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 31 సంచిక 4

ఏప్రిల్ 2020

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

KALA JYOTHI — Since 1946 —

Printed & Published by

BAPANNA ALAPATI

at Kala Jyothi Process Pvt. Ltd.,

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27612436, 27645538.

పత్రిక ప్రతి నెలా ఒకటవ తేది మీ ముంగిట వాలుతుంది...

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి

ఫోన్ : 040 - 27645538. సెల్ : 994 951 6567.

LIBRARY OF CONGRESS

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

LCCN 91-903060 ISSN 2454-4329

E-mail : misimi90monthly@gmail.com,

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

https://twitter.com/MISIMIMONTHLY

YouTube Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## ఏప్రిల్ నెల సూచికలు...




| | |
|---|---|
| కమ్మ తెమ్మెరలు | : ... 5 |
| నేర్చుకోవడం | : కిల్లాడ సత్యనారాయణ... 7 |
| యక్షగానము - 2 | : ఆచార్య పప్పు వేణుగోపాలరావు, ... 12 |
| కాకతీయులు - 2 | : ప్రొ. రావినూతల సత్యనారాయణ... 20 |
| దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, విజయలక్ష్మి పండిట్ | : ముత్తంగి వేంకట భారతలక్ష్మి... 31 |
| మా ఊరు మాధవ నగరం | : కొసరాజు వెంకటేశ్వరరావు... 43 |
| సేవాగ్రామం | : ప్రొ. ఎన్. లక్ష్మీ అయ్యర్... 52 |
| దయాగుణ చేతన - జ్ఞానామృత బోధన | : దాసరి శివకుమారి... 55 |
| పాల్ గాగున్ | : విశ్వేశ్వర ప్రసాద్... 60 |
| కళాశాల విద్య - జీవన నైపుణ్యాలు | : డా. గుజ్జు చెన్నారెడ్డి... 64 |
| తెలుగుకు వెలుగు ఎన్నడు కలుగు | : వి. వరదరాజు... 67 |
| జిడ్డు కృష్ణమూర్తి - పునర్దర్శనం | : కాసుల శ్రీనివాసులు... 69 |
| మనిషిలో నది | : డా. పి. విజయకుమార్... 74 |
| సామజ వర గమన! నా తెనుగు వాన! | : ఐ.వి. రామరాజు... 89 |
| చదవండి... | : మిసిమి... 80 |




యక్షగాన ఆహార్యం



మా ఊరు

**అట్టమీద బొమ్మలు**




**ఆనంద హేల**
(పంజాబీ బాల)
చిత్రకారుడు: రంజిత్ సింగ్



**మీనాక్షి**



**రాధే**
(కృష్ణుని చేయి)



**వసంత వేళ**
చిత్రకారుడు: వృందావన్ దాస్

# కమ్మతెమ్మెరలు

"…. చాలా కాలంగా ***మిసిమి*** మాసపత్రిక మీ కార్యాలయానికి వచ్చి మరీ తీసుకు వెళుతుంటాను. అన్ని వ్యాసాలూ శ్రద్ధగా చదువుతాను. సమకాలీన తెలుగు మాసపత్రికలతో పోలిస్తే ***మిసిమి*** నిండైన తెలుగుదనంతో తొణికిసలాడుతుంది. ప్రతి నెలా నూతనత్వపు తన్మయత్వం కలిగిస్తుంటాయి ***మిసిమి*** మిసమిసలు…"

*- గోమాస జయంతి డానియేల్, హైదరాబాద్*


"…. ***మిసిమి*** జనవరి - 2020 సంచికలో టెట్రాసైక్లిన్, Aeromycinలాంటి యాంటీబయోటిక్స్ ఇంకా తదితర ఔషధాలు కనిపెట్టిన మహామనిషి డా. ఎల్లాప్రగడ రామారావుగారి గొప్పతనం గురించి చాలా బాగా రాశారు మోటూరు శివరామ్ ప్రసాద్ గారు. ఈయన (ఎల్లాప్రగడ) గురించి పాఠ్యగ్రంథాలలో చదువుకున్నాంగానీ ఈయన ఎవరి గురించో బలైపోవడం అంటే Fiske (Scientist) తన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు నుంచి ప్రొఫెసర్ ప్రమోషన్ కొరకు, ఎల్లాప్రగడ గారు చేసిన కొన్ని పరిశోధనలు (ఫాస్ఫరస్ – Phosphocreatine ATP) హక్కులను వదులుకోవడం నాకు తెలియదు. చదివిన తరవాత కొత్త విషయం బయటపడింది. మన భారతీయుడికి జరిగిన అన్యాయం చాలా బాధనిపించింది. ఈ విషయంలో ఎల్లాప్రగడ గారూ లైట్ (తేలిక)గా తీసుకున్నా, మనకు ఎంతో బాధనిపిస్తుంది. ఇంచుమించు ఇలాంటి విషయమే ప్రసిద్ధ దర్శకులు కె. విశ్వనాథ్ తన స్వాతికిరణం అనే సినిమాలో శిష్యుడు గురువును సంగీతంలో దాటిపోతున్నాడని, ఆ కుర్రాడిని బయట సొంత కచేరీలు చేయకుండా అణచి వేస్తాడు. ఆ అబ్బాయి ఆత్మహత్య చేసుకుని చనిపోతాడు. ఇలాంటివి ఎప్పటి నుంచో జరుగుతున్నాయి. ఇలాంటి మంచి వ్యాసం కాలేజీ విద్యార్థులు చదివితే ఎంతో జ్ఞానం కలుగుతుంది. అంతేగాక ఈ మధ్య ఒక విద్యార్థి గేట్ ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకు రాలేదని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లాప్రగడ గారు మెట్రిక్ పరీక్ష రెండవసారి పాసయ్యాడని తెలుసుకుంటే నేటి 'ఇన్ఫీరియారిటీ' కాంప్లెక్స్ ఉన్న విద్యార్థులకు కనువిప్పు కలుగుతుంది. ఓటమి అనేది ఒక మేథావి అన్నట్లు 'ఫెయిల్యూర్ ఈస్ ఎ స్టెప్పింగ్ స్టోన్ టు ద సక్సెస్' అని తెలుస్తుంది. ఎంతో చక్కగా రాసిన మోటూరు శివరాం ప్రసాద్ గారికి నా అభినందనలు. కథకళి ఒక గొప్ప అభినయ కళ. కథకళి ఒక రసవత్తర రవళి. ఎంతో పరిశోధించి రాసిన కథకళి వ్యాస రచయిత పప్పు వేణుగోపాలరావు గారికి అభినందనలు. రాజ్యాంగ పరిషత్తులో ధీర మహిళల గురించిన వ్యాసం చాలా బాగుంది. రాజ్యాంగానికే పరిమితం కాకుండా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని, మగవారితో సమానంగా జైలు శిక్ష అనుభవించడం చదివిన తరువాత స్త్రీలు దేంట్లో తక్కువవారు కారు అనిపించింది. ముచ్చటైన వ్యాసం రాసిన ముత్తంగి వేంకట భారతలక్ష్మి గారికి నా ధన్యవాదాలు. *లక్ష్యాలు* - మార్గాలు అనే వ్యాసంలో కిల్లాడ సత్యనారాయణ గారు ఇలా అన్నారు - "…జీవితంలో పైకి రావాలంటే ఎదగాలన్న ఆకాంక్ష ఉండాలి - ఆ ఆకాంక్ష ఎంత ఎక్కువ ఉంటే అంత ఆపద (రిస్కు) ఉంటుంది. ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలనుకున్నప్పుడు ఆపద కూడా ఎవరెస్ట్ ఎత్తే ఉంటుంది" అని. మంచి కవితాత్మకంగా చెప్పారు. అంతేకాదు ఒక నగ్నసత్యాన్ని సులువైన మాటల్లో చెప్పారు. ఈ వ్యాసం రాసిన కిల్లాడ వారిని అభినందించకుండా ఉండగలమా? వీరికి నా ధన్యవాదాలు. అలాగే కర్ణాటక విద్వాంసులు గురించిన తెలుగు అనువాదం బాగుంది. వారిరువురికీ నా ధన్యవాదాలు. తంగిరాల వేంకట సుబ్బారావు రాసిన 'తెలుగులో సర్వజ్ఞుని త్రిపదలు - ఒక మంచి ప్రయత్నం' అనే వ్యాసం అనే బదులు ఒక ఎం.ఫిల్. గ్రంథం అనవచ్చు. కాలేజీ విద్యార్థులు తెలుసుకోదగ్గ విషయాలున్నాయి. ఇంత మంచి వ్యాసం రాసిన తంగిరాల వారికి నా అభినందనలు, ధన్యవాదాలు. 'కృష్ణశాస్త్రి కవిత' అనే వ్యాసంలో కృష్ణశాస్త్రి



గారిని అందరూ రొమాంటిక్ పొయెట్‌గానే చూస్తారు గానీ ఆయన హేతువాద భావాలు గలవాడుగా చాలామందికి తెలియదని పాపినేని శివశంకర్ గారు ఆయన (కృష్ణశాస్త్రి) కవితలనుదహరిస్తూ చెప్పిన పాపినేనివారికి నా అభినందనలు. శిరంశెట్టి కాంతారావు గారి మీద రాసిన సమీక్ష కూడా చాలా బాగుంది. సమీక్ష రాసిన వారికి నా అభినందనలు. అన్ని వ్యాసాలూ బాగున్నాయి. మంచి వ్యాసాలు ప్రచురించిన **మిసిమి** సంపాదకులకు నా ధన్యవాదాలు...''

*- ఆకెళ్ల వి. రమణమూర్తి, హైదరాబాద్.*

''..... **మిసిమి** జనవరి - 2020 సంచికలో సునీల్ కుమార్ ''జానపద సంస్కృతీ'' వ్యాసం చదివాను. జానపదుల జీవనం గురించి చక్కగా వ్రాశారు. అభినందనలు. కానీ విషయం అది కాదు. వారు, మ్యూజియం ఎప్పుడు చూశారో తెలియదు. డిసెంబర్ మొదటి వారంలో, పెద్దలు, శ్రీ లంకా సూర్యనారాయణగారు, వరంగల్‌లోనే ఉన్నారు. ఆయన గిరిజన మ్యూజియం చూడాలంటే, నేను, ఆయన, వారి పెద్ద అబ్బాయి విజయ సారథి, చిన్న అబ్బాయి కృష్ణానంద్, అతని మామగారు, ప్రేమచంద్‌గారు బయలుదేరాము. నా మిత్రుడు గిరిజ మనోహర్‌ని, దాని చిరునామా, అడిగి తెలుసుకున్నాను. అతను, ''చిరు'' విలాసం చెప్పి, ఏదో రోడ్‌లో తిన్నగా పొమ్మన్నాడు. అది మేము బయలుదేరిన చోటు నుంచి 5 కిలోమీటర్లకంటే ఎక్కువ ఉండదు. మొదట హన్మకొండలో, నయీమ్‌నగర్‌లో, అద్దె భవనంలో ఉండేది. తరువాత ప్రభుత్వం వారి స్థలంలోకి, సొంత భవనంలోకి మారిందట. సరే, వారిని, వీరిని, అడుక్కొంటూ, మేము, విచారిస్తూ, మొత్తానికి, ఒక అరగంట, పైన (నిజ్జంగా) శ్రమపడి, పీఠం పట్టుకొన్నాము. ఒక సమయంలో, సూర్యనారాయణగారు, అడ్రెస్స్ దొరకదు, వెనక్కి వెళ్లి పోదామని అన్నారు. ఐతే, బండిలో ఉన్న ముగ్గురం, పట్టు వదలని త్రివిక్రమ్‌లలాగా వదలలేదు. అదిగో భద్రాద్రి, అని దానిని చుసిన సంతోషం, నిముషంలో ఆవిరి అయింది. మేము ప్రవేశించిన, ఆ భవంతి, పాడుపడి, శిథిలావస్థలో ఉన్నది. భవంతి నేలలో క్రుంగి పోవటం వలన, బరువు తగ్గటానికి, రెండో అంతస్తు పడగొట్టారు. మొదటి అంతస్తులో ఏవో కార్యాలయాలు, కొన్ని తరగతి గదులు ఉన్నాయి. అంతా దుమ్ము, ధూళి. ఎక్కడ ఎవరూ లేరు. మేము, అటు యిటు, తిరుగుతుంటే, యిద్దరు అటెండర్లు (?) వచ్చారు. యిలా మ్యూజియం చూడటానికి వచ్చామని, చెబితే, అన్ని తాళాలు వేసి ఉన్నాయని అన్నారు. సరే,రావటానికి పడిన శ్రమ వృథా అయింది, తిరిగి వెళ్లి పోదాం అని అనుకొన్నాము. అందులో ఒక అతను మ్యూజియం చూస్తారా అని అడిగాడు. అవును, వీళ్లు గుంటూరు నుంచి వచ్చారని చెబితే, ఉండండి, తాళం చెవులు ఉన్నాయేమో చూస్తానని, వెళ్లి, కాసేపటికి, తాళం చెవితో వచ్చాడు. అందరం, క్రింద గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న మ్యూజియంలోకి దిగి వెళ్ళాము. లోపలికి అడుగు పెడితే, సినిమాలో చూపించినట్లు ఒక పాడుబడిన, భవంతిలాగా ఉన్నది. సునీల్ కుమార్ వ్రాసినట్లు, అనేక వస్తువులు ఉన్నాయి. ఒక క్రమపద్ధతి లేదు. ఎక్కడికక్కడ గుట్టలుగా, పడివున్నాయి. వాటికి సంబంధించిన ఎలాంటి వివరణ, సమాచారం లేదు. టైల్స్ వేసిన ఫ్లోర్, నేలలోకి కృంగిపోయింది. అది మ్యూజియం అంటే, ఆశ్చర్య పోవాలి. ఒక స్టోర్ రూమ్‌లాగా ఉన్నది. మాతో ఉన్న, వాళ్ళిద్దరు, చాలా ఓపికగా, చూపించి, వారికి, తెలిసింది, చెప్పారు. ఒక అరగంట పైన గడిపి, వారికి, ధన్యవాదాలు, తెలిపి తిరిగి వచ్చాము. తరువాత, నేను, చాలామందిని, గిరిజన మ్యూజియం ఎక్కడ ఉందో, తెలుసా అంటే, అసలు మ్యూజియం, ఉన్న సంగతే, తెలియదన్నారు. అదీ, వరంగల్ గిరిజన మ్యూజియం. మ్యూజియం, ఎలా ఉండాలో, తెలుసుకోవాలంటే, భువనేశ్వర్‌లో కానీ, దూరమనుకొంటే, అరకులో కానీ, ఉన్న గిరిజన మ్యూజియంను, వరంగల్ మ్యూజియం నిర్వాహకులుకానీ, దాని, పరివేష్కులైన, తెలుగు విశ్వ విద్యాలయ, అధికారులు, కానీ, చూసివస్తే, బాగుంటుంది. ఉత్త చూసిరావటం కాకుండా, కనీసం కాస్త శ్రద్ధ తీసుకొంటారని, ఆశిస్తున్నా. చివరాఖరుకు, గిరిజన పీఠం వరంగల్‌లో పెట్టటానికి, ఎవరు ఏ ప్రయత్నం చేశారో, నాకు తెలియదు కానీ, దానిని, వరంగల్‌లో, పెట్టించటానికి, చాలా శ్రమపడింది, అనేక శ్రమలకోర్చినది, ఈ పీఠానికి ఒక గుర్తింపు తెచ్చింది, మహానుభావుడు, భక్తవత్సల రెడ్డిగారు. ప్రస్తుతం, ఆయన, తిరుపతిలో, ఉన్నారు.....''



*- మనోహర్ పంత్, వరంగల్*



# నేర్చుకోవడం

– కిల్లాడ సత్యనారాయణ

అమ్మ కొడుతోంది. (మూడేళ్ళ) పాప ఏడుస్తోంది. ఎన్నిసార్లు దిద్దించినా అక్షరాలు అందడంలేదు.

నేర్పడం శిక్షా? అది పాపనడిగి తెలుసుకోవాలి. నేర్చుకోవడం ప్రతిష్టా? అది అమ్మనడిగి తెలుసుకోవాలి.

నేర్పకుంటేగానీ నేర్చుకోరా? మనం ఏం నేర్పుతున్నాం? కొన్ని అక్షరాలు, ఆ అక్షరాలతో అల్లిన కొన్ని పదాలు. మనం మెదడుకు వేస్తున్న మేత అవే. వాటినే గ్రహిస్తుంది. వాటినే నిల్వ చేస్తుంది.

ముక్కునబెట్టడం నేర్చుకోవడమా? ఉదరం కోసం జారవిడవడం జ్ఞానమా?

ఎంత చెప్పినా నేర్చుకోరేం? ఎన్నిసార్లు చెప్పినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే. అనుభవమైతేగానీ నేర్చుకోలేరంటారు ఐన్‌స్టీన్.

ఎలా నేర్చుకుంటాం? వినడం ద్వారా. అది గర్భంలో జన్మిస్తుంది. ఉయ్యాలలో చిగురిస్తుంది. తర్వాత మాటలు మొదలవుతాయి. వినడం వెనక్కి తగ్గుతుంది. ఆ తర్వాత చదువుతాం. చడవడం పెరిగినకొద్దీ మాటలు మెత్తబడుతాయి. అప్పుడు ఆలోచనలు మేఘాల్లా మెదడును అల్లుకుంటాయి. ఆ ఆలోచనలు వ్యక్తిగతమవుతాయి. వ్యక్తిగత ఆలోచనల నుండి అభిప్రాయాలు వికసిస్తాయి. ఆ అభిప్రాయాలకు అక్షరాలు రూపాన్నిస్తాయి. అంటే వ్రాత మొగ్గ తొడుగుతుంది. అలా నేర్చుకుంటాం ఏ భాషనైనా, ఏ విషయాన్నైనా.

నేర్చుకున్నామని భావించాక ఎక్కువ మందిమి యంత్రాలైపోతాం. వినడం, చదవడం, వ్రాయడం అన్నీ ఆగిపోతాయి. అన్నీ తెలిసినవే అనుకుంటాం. మూసగా మాట్లాడడం, చేయడం మిగులుతాయి. నిజానికి నేర్చుకోవడం ఆజీవన ప్రక్రియ. అది గర్భం నుండి మరణం వరకూ సాగాలి.

మనం దేని ద్వారా నేర్చుకుంటున్నాం? మెదడు ద్వారా? మనసు ద్వారా?

నేర్చుకోవడానికి మెదడు కేంద్రమని నమ్ముతున్నాం. మెదడు కుడి, ఎడమ వైపులు వేర్వేరుగా వేర్వేరు విషయాలు నేర్చుకుంటాయనుకుంటాం. ఈ మధ్య పరిశోధనలు ఈ విభజన సరికాదని చెబుతున్నాయి.

మన మెదడులో ఇరవై శాతాన్ని మాత్రమే ఉపయోగించుకోగలుగుతున్నామని బాధపడతాం. అందుకు కారణం మన మెదడులో మిగిలిన భాగం ఇంద్రియ కార్యాలచే సక్రియ కాకపోవడం. వీటిని నిశ్శబ్ద ప్రాంతాలంటారు. ఈ నిశ్శబ్ద ప్రాంతాలు కూడా అభిజ్ఞా విధుల్లో (cognitive functions) పాత్ర పోషిస్తున్నాయని పరిశోధనలు తెలుపుతున్నాయి.

నేర్చుకునేందుకు ఉపయోగపడే ఒక అసాధారణ అంగం మెదడు. దాని అసాధారణతను చేజిక్కించుకుంటే, అద్భుతాలు సృష్టిస్తుంది. యాంత్రికంగా ఉపయోగిస్తే మొక్కుబడి తీర్చుకుంటుంది.

మెదడును అసాధారణంగా ఉపయోగించుకోడం ఎలా?

ఫీల్ అవాలి - అది పుస్తకమైనా. జీవితమైనా. అది లేనప్పుడు చదువైనా, సంసారమైనా రసహీనమే కదా!

తెలుసుకోవడం నేర్చుకోవడం ఒక్కటేనా?

మిరపకాయ తింటే నోరు మండుతుందన్న జ్ఞానం తెలుసుకోవడం. మిరపకాయ తిని నోరు మంటను

అనుభవంలోకి తెచ్చుకోవడం నేర్చుకోవడం. మనం మెదడు ద్వారా తెలుసుకుంటున్నాం. మనసు ద్వారా నేర్చుకుంటున్నాం.

మనిషి మెదడుకన్నా కంప్యూటర్ మెండా? మనిషి చేసే పనులన్నీ కంప్యూటర్ చేయలేదు. కంప్యూటర్ మెదడుకు సాదృశ్యం కాదు. అది మెదడులా నమూనాలను (patterns) గుర్తించగలదు. కానీ మనిషి మెదడులా ఆలోచించలేదు. అది మనిషిలా అనుభూతి చెందలేదు.

నేర్చుకోవడానికి పసి మనసు కావాలి, పసిడి మనసు కాదు. ఆటైనా పాటైనా ఆసక్తి ఉండాలి. ఉత్సాహం ఉరకలు వేయాలి. ఆసక్తిలేని అభ్యాసం ఆనందంలేని జీవితం.

నలిగిన బాటలో నడవడం నేర్చుకోవడమా? కాదు. వైద్యుని పిల్లలు వైద్యులు, నటుని పిల్లలు నటులు కావడం నలిగిన బాట కాక ఇంకేంటి? ఆ పని మనుషులే కాదు, రోబోలూ చేస్తున్నాయి.

అందుకే, కొందరు 'నేర్చుకోవడం దేనికి మర మనుషులుండగా?' అని ప్రశ్నిస్తున్నారు. యంత్రాలు కూడా నేర్చుకుంటున్నాయి మనుషుల్లాగే. మనిషిని పోలిన మనిషి అనేవారు. ఇప్పుడు? మనిషిని పోలిన మరమనిషంటున్నారు. అన్ని పనులూ మనిషిలాగే చేస్తుంది, హావభావాలు కూడా.

అయితే మర మనుషుల్ని ప్రోగ్రాం నడిపిస్తుంది. అవి చెప్పింది మాత్రమే చేయగలవు. స్వతంత్రంగా ఆలోచించలేవు. కొత్త సవాళ్ళ నుంచి నేర్చుకోలేవు.

నేర్చుకోవాలంటే ప్రశాంత మనస్సు కావాలి. పురాణాలతో, పద్ధతులతో నిండని మనస్సు కావాలి. సమాచారంతో నిండని మెదడు కావాలి. భూగర్భాన్ని చీల్చుకుని నలుదిశలా ఆసక్తితో చూస్తున్న అంకురంలా ఉండాలి మనస్సు.

ఉన్నది కాకుండా కొత్తది ఏదైనా నేర్చుకున్నామా? తెలిసినదానికి కొనసాగించడం కాదు. భ్రమలకు దూరంగా, ఆశలకు అపోహలకు అతీతంగా ఆలోచిస్తున్నామా? అదే నేర్చుకోవడం.

ఆలోచన సమాధానాల సంతానం కాకూడదు. అది ప్రశ్నల గర్భం నుండి పుట్టాలి.

జ్ఞానమంటే ఏమిటి? బయటి లవణాల్ని లోపలికి తొయ్యడమా? లోపలి ఖనిజాల్ని బయటకు తియ్యడమా?

"ఆత్మ పొరల్లో కప్పివేయబడిన ఆలోచనల్ని వెలికి తియ్యడమే నేర్చుకోవడం" అంటారు ప్లాటో. అది మనలో మంత్రసానిలా దాగి ఉన్న ప్రశ్నకుడి ద్వారానే సాధ్యమంటారు. మనం ఏదైనా నేర్చుకున్నామంటే మనలో దాగినదాన్ని బయటకు తెచ్చామని అర్థం. సూర్యకాంతిలో ఏ వస్తువు ఎక్కడుందో చూడగలిగినట్లు, అంతర్దృష్టితో మనలో నిక్షిప్తమైన జ్ఞానాన్ని చూడాలంటారు ప్లాటో.

చాలామందికి విద్య ఒక పరువు. నేర్చుకోవడం ఒక క్రతువు. ఈ చట్రంలో బిగించిన ఆటైనా, పాటైనా ఒక తంతుగానే మిగిలిపోతుంది.

ఏ చట్రంలోనూ బంధించబడని మనస్సు కావాలి నేర్చుకోడానికి. సంకెళ్ళను తెంచుకున్న ఆ మనస్సుకి ప్రతి ఆలోచనా మిసిమే.

జ్ఞాపకం నేర్చుకోడానికి ఇంధనమా? బాధకమా?

కూడబెట్టడం నేర్చుకోవడం అవదు, అది జ్ఞానమైనా, సంపదైనా. కూడబెట్టే మనసుకు నేర్చుకోవడం తెలీదు.

ఇప్పటి మన విద్య మనకు కూడబెట్టడమే నేర్పుతుంది. కూడబెట్టడానికే మనల్ని నిత్యం పరుగెత్తిస్తుంది.

జ్ఞాపకం గతానికి సంబంధించినది. అది ఎప్పుడూ మనిషిని వెనక్కి లాగుతుంటుంది. గతం వలలో చిక్కుకున్న మనస్సు నకలు చెయ్యాలని చూస్తుంది.

నేర్చుకోవడం వర్తమానం. వసంతకాల వనంలా మనసు పచ్చగా ఉండాలి నేర్చుకోవాలంటే.

అయితే జ్ఞాపకంతో పనిలేకుండా నేర్చుకోవడం సాధ్యమా? జ్ఞాపకానికి నేర్చుకోవడం ఆధారమైనట్లే, నేర్చుకోడానికీ జ్ఞాపకం తోడుండాలి. అయితే జ్ఞాపకమెప్పుడూ నేర్చుకోవడానికి సేవకుడిగా ఉండాలేగాని, యజమానిగా కాదు.

మనం ప్రకృతిని వింటున్నామా? సుప్రభాత కిరణాల్ని, వసంత కోకిల రాగాన్ని, జలజల పారుతున్న సెలయేరుని విన్నామా? అవుననక - కాదనక ప్రకృతితో, మన ప్రవృత్తితో చేసే సంవాదమే నేర్చుకోవడం.

ప్రఖ్యాత ఆంగ్ల కవి విలియం వర్డ్స్ వర్త్ తన 'ది టేబుల్స్ టర్న్డ్' కవితలో "... ప్రకృతిని నీ గురువు కానివ్వు / ఆమె వద్ద సంపదల ప్రపంచం సిద్ధంగా ఉంది / మన హృదయాలను, మనస్సులను దీవించేందుకు" అంటారు.

గుర్తుండాలంటే పునశ్చరణ చేయాల్సిందే. రుద్దిందే రుబ్బుతూ ఉంటే మెదడు మొద్దుబారుతుంది. మెదడు గానుగు ఎద్దు చందం కాకూడదు.

కలిసిన భిన్న రంగుల నూలును ఒక బట్టగా నేసినట్టు, సంబంధం కలిగిన పనుల్ని కలిపి చేయడంలో చురుకుదనం ఉంటుంది.

సానబడితేనే పదును. కథకుడు కవితలతో, భౌతికవేత్త గణితంతో, క్రికెటరు ఫుట్‌బాల్‌తో సానబడుతుంటారు.

నేర్చుకోవడం ఎలా? అనుభవం ద్వారానా? స్వీయ అనుభవాలే కాదు, తల్లిదండ్రుల, గురువుల, సమాజ అనుభవాల నుంచి నేర్చుకోవడం. అంతేగాదు సాంప్రదాయాలు, సంస్కృతి, పుస్తకాల నుంచి నేర్చుకోవడం అన్నీ అనుభవంలో భాగమే. ఇవన్నీ కనిపిస్తున్న ప్రపంచం గురించి మనకు చెబుతాయి.

ఇల్లు కట్టగానే సరిపోదు. ఆ ఇంట్లో ఆనందంగా జీవించాలి. అలా జీవించాలంటే, మన గురించి మనం తెలుసుకోవాలి. అలా తెలుసుకోవాలంటే మన అంతరంగాన్ని నిత్యం గమనించాలి. అలా గమనించాలంటే, పూర్వాభిప్రాయాల నుండి స్వేచ్ఛ పొందాలి.

నేర్చుకొనేవారికి జీవితం ఒక విద్యాలయం. మనసొక గ్రంథాలయం. ప్రతి ఘటనా ఒక పుస్తకం.

లోపల పరుగెడుతున్న అశ్వాలను లొంగదీసుకోవడం ఒక్క రోజులో అయ్యేపని కాదు. సంవత్సరంలోనూ అయ్యేది కాదు. జీవితాంతం కృషి చేయాలి. అందుకే నేర్చుకోవడమనేది ఏ ఒక్కరి నుంచో, ఏ ఒక్క విషయానికో, ఏ ఒక్క సమయానికో పరిమితమయ్యేది కాదు.

మనం శాస్త్రాలు పఠిస్తున్నాం. చరిత్ర చదువుతున్నాం. గణితం చేస్తున్నాం. ఈ చదువులు మన చుట్టూ సాలీడులా అల్లుకున్న బంధనాల్ని తొలగిస్తున్నాయా? మన మనస్సును నవ్య నవనీతం చేయగలుగుతున్నాయా?

ఒత్తిడి నీడలో నేర్చుకోవడం సాధ్యమా? ఏదో అవడం కోసం, ఏదో పొందడం కోసం చేసే పనిలో ఒత్తిడి లేదా? ఒత్తిడిలో నేర్చుకున్నది మరచిపోవడం సహజం కాదా?

అసలు నేర్చుకోవడానికి మరచిపోవడం ఉంటుందా? నిల్వ ఉండేదానికే పోగొట్టుకోవడం ఉంటుంది. నేర్చుకోవడం నిల్వ కాదు. నిత్య నూతన సాధన.

ఏం అవాలన్నదానికన్నా, మనం ఏమిటన్నదాని మీద దృష్టి పెట్టాలి.

మనందరం నేర్చుకోవడానికి పుట్టిన పిల్లలం. ఏది నేర్చుకోవాలో మనం ఎన్నుకోలేదు. నేర్చుకోవడమే మనల్ని ఎంచుకుంటుంది.

బడికి వెళ్ళాలని పిల్లలు కోరకముందే బడిలో ఉంటారు. ఏం నేర్చుకోవాలన్నది పిల్లలుకాక బడి నిర్ణయిస్తుంది.

ప్రముఖ తత్వవేత్త స్పినోజా "స్వేచ్ఛా సంకల్పం లేని నిశ్చయమైన, అవశ్య విశ్వంలో మనం జీవిస్తున్నాం" అంటారు.

'మనం నిశ్చయ జీవులం' అన్న స్పినోజా మాటకు అర్థం మనకు నిర్ణయించే స్వేచ్ఛ లేదని కాదు.

మనం ప్రేమించే పనులు చేసే స్వేచ్ఛ మనకుంది. అంతరాత్మ వెలుగులో చేసే పనిలో ఆనందం ఉంటుంది. మానవ హితం ఉంటుంది.

ఆశ, భయం నేర్చుకోవడానికి ఉత్ప్రేరకాలా? కాదని అందరం అంటాం. కానీ వీటినే పనిముట్లుగా వాడుతాం. వీటి పునాదులపైనే చాలా విద్యాలయాలు నిలబడ్డాయి.

శిక్ష బహుమానం కాదు, అంతరాత్మ మనల్ని

నడిపించాలి. దానికి బలంగా హేతువు నిలబడాలి. అప్పుడు పశ్చాత్తాపానికి తావుండదు.

పోటీకీ పోలికకు దూరంగా, అహానికి అసూయకు అతీతంగా నేర్చుకోలేమా?

అభ్యాసం మనకు విభజన నేర్పుతుందా? లేదా ఐక్యతా?

పువ్వుకు పరిమళాన్ని దూరం చేసే చదువు ఎలా సార్థకం? ఆకాశంలో ఒక్కో తారను వేరు చేసి చూస్తే సౌందర్యం ఎక్కడ? చుక్కలన్నిటినీ కలిపితే కొండంత వెలుగు. విశ్వంలో భాగంగా అర్థం చేసుకుంటే అంతులేని అనుభూతి.

సామాజిక శాస్త్రాలను విజ్ఞాన శాస్త్రాల నుండి, ఒక విషయంలో విభిన్న అంశాలను వేరు చేసి చదువుతున్నాం. అది అహానికి ఆజ్యం పోస్తుందే తప్ప, ఆనందానికి తలుపులు తెరవదు.

విభిన్న విషయాల మధ్య అంతర్వాహినిగా ప్రవహిస్తున్న భావసారాన్ని గమనించాలి. ప్రహ్లాదుడు చెప్పినట్లు 'చదువులలో సారమెల్ల' చదవాలి. అప్పుడు జీవితం ఆనందంతో నాట్యమాడుతుంది.

నేర్చుకోవడమంటే అందర్నీ నడిపిస్తున్న సాధారణ గుణాల్ని గ్రహించడం; అన్నింట్లో నిక్షిప్తమైన చైతన్యాన్ని తెలుసుకోవడం.

నేర్చుకోవడమంటే సృష్టిలో ఉన్న వాటన్నిటినీ జోడించి చూడడం. ఈ సృష్టిలో ప్రతీదీ ముత్యమే. అన్ని ముత్యాలూ ఒక బంగారు తీగతో కలపబడ్డాయి. గమనించు. అర్థం చేసుకో. అదే నేర్చుకోవడం.

ఇ. ఎం. ఫాస్టెర్ తన "హోవార్డ్స్ ఎండ్" నవలలో "జోడించడం మాత్రమే. ఆమె సందేశ సారాంశం అదే. అభిరుచినీ, గద్యాన్నీ జోడించు. రెండూ అత్యున్నత స్థితికి చేరుకుంటాయి. దాని శిఖరంపై మానవ ప్రేమ దర్శనమిస్తుంది. తునకలుగా జీవించకు. మృగాన్నీ, సన్యాసినీ కలుపు. ఒంటరితనం ఏ ఒక్కరికీ జీవితాన్నివ్వదు. రెండూ మరణిస్తాయి."

నేర్చుకోవడమంటే విభిన్న అంశాల మధ్య వారధి వేయడం. సంబంధం లేనివాటి మధ్య కూడా బంధాన్ని కలపడం. నేర్చుకోవడమంటే కొంత మట్టి, కొంత ఆకాశం, కొందరు మనుషులు. వీటి అంతర్గత సంబంధం. అవినాభావ సంబంధం. విశ్వంలో వీటికున్న స్థానం. అంతేగా?

నేర్చుకోవడమంటే జీవించడం, నిజంలో. నమ్మకాల్లో కాదు. నిజం వర్తమానం. నమ్మకం నిన్నదీ, రేపుదీ. నమ్మకాల్ని నమ్ముకుంటే మనం నడిచేవాళ్ళమా? సాలీడులా మన చుట్టూ అల్లుకున్న నమ్మకాల్ని ఛేదించడమే నేర్చుకోవడమంటే.

నేర్చుకోవడమంటే మనల్ని మనం తెలుసుకోవడం. మన ఆసక్తినీ, శక్తియుక్తులనూ గ్రహించడం. మన ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నించడం.

నేర్చుకోవడం అంటే మన మనస్సు తగిన ఆలోచనలను సృష్టించడం. స్వతంత్రంగా ఆలోచించాలి. చేసి నేర్చుకోవాలి. ఒక పద్యాన్ని పిల్లలు చదువుతున్నారంటే, ఆ పద్యం నేపథ్యాన్ని చదవాలి. ఆ పద్యాన్ని సృష్టించిన పరిస్థితుల్నీ, ఆ పరిస్థితుల మధ్య వికసించిన కవినీ అర్థం చేసుకోవాలి. ఆ పద్యం తనను కదిలించిన తీరూ గమనించాలి. అలా రచయిత ప్రపంచాన్నీ, తన ప్రపంచాన్నీ పద్యంతో ముడివేస్తూ నేర్చుకోవాలి.

నేర్చుకోవడం అంటే భావోద్వేగాలను మచ్చిక చేసుకోవడం. తినాలంటే ఆకలుండాలి. నేర్చుకోవడానికి తపనుండాలి. అప్పుడే ఆరోగ్యం, ఆనందం. నేర్చుకోవడం ఉత్సవంగా మారాలి.

మన విద్యాలయాలు కార్ఖానాలు. మన చదువులు మంత్రాలు. తంత్రాలు. శక్తులన్నీ మార్కెట్ చుట్టూనే తిరుగుతుంటాయి. ఏదో రకంగా గమ్యం చేరడమే వాటి పని.

నేర్చుకోవడం బాధ్యత కాదు. బరువు అంతకన్నా కాదు. అది ఆట. అది పాట. ఉత్సాహం పరవళ్ళు తొక్కే తోట.

కొందరు నేర్చుకోవడానికి భయపడతారు? దేనికి? కోరింది దక్కదనా? జరిగింది బాగోలేదనా?

బడి యమలోకమా భయపడ్డానికి? అది తరగతి

గదిలోకి తొంగి చూస్తే తెలుస్తుంది. అక్కడ బల్ల మీద బెత్తం పెట్టి పాఠం చెబుతారు. బెత్తం చూస్తూ పిల్లలు నేర్చుకుంటారు. అడుగడుగునా పరీక్షలు, మందుపాతర్లలా. అక్కడ చూపేవి తప్పులూ, తీర్పులు; పోలికలూ పోటీలు. ఆ కృత్రిమ ఆవరణంలో పిల్లలే కాదు, పెద్దలూ భయపడతారు.

కాలుష్యాన్ని హరించడం కదా నేర్చుకోవడమంటే. అది గాలైనా, నీరైనా; మట్టయినా, మనసయినా. ఆలోచన స్వచ్ఛంగా ఉండాలి స్ఫటికంలా. తృప్తిగా ఉండాలి తల్లిపాలలా.

నేర్చుకోవడమంటే మెదడుకు పదును పెట్టాలి. మనసుకు ఊహనివ్వాలి. చూడనివి చూడాలి. విననివి వినాలి. తెలియనివి తెలుసుకోవాలి. బుద్ధి వికసించాలి, హేతుభావంతో.

నేర్చుకోవడానికి పత్రాలు కొలమానాలా? ప్రతిభకు ప్రమాణం పనా? పట్టమా? అంకెల గారడీల్లో జ్ఞానం ఉక్కిరిబిక్కిరవుతుంది. నేర్చుకోడానికి సారం అభిరుచి కదా. ఆ అభిరుచిని తూచే తూనికలేవి? అభిరుచిలేని విద్య డొల్లే కదా.

ఒకే కొలత బట్టల్ని అందరికీ సరిపెట్టేట్లు ఉండకూడదు విద్య. పిల్లల మానసిక స్థాయిని బోధకుడు గ్రహించాలి. కొందరు ఉపాధ్యాయుల బోధనవల్ల విద్యార్థులు ఆ విషయాన్ని ఇష్టపడతారు. ఆ ఉపాధ్యాయులనూ ఇష్టపడతారు. ఫలితంగా వాళ్ళల్లో విషయగ్రహణ శక్తి రెండింతలవుతుంది.

కొన్ని విద్యాసంస్థలకు పేరు కావాలి. అందుకు అగ్రశ్రేణి విద్యార్థులను వాడుకుంటారు. వాళ్ళను ముద్దుబిడ్డల్లా చూసుకుంటారు. ఇది కొందరిలో అసూయ, కొందరిలో అహం పెంచుతుంది.

నేర్చుకునే దారిలో అలవాట్లు ముల్లులా? పువ్వులా? అలవాట్లు పరిసరాలు పెంచే పెంపుడు కుక్కలు. కులం, కుటుంబం, హోదా, విద్యవంటివన్నీ మన యాసకూ, వేషానికీ, భావానికీ, భావోద్రేకానికీ పోషకాలు. పాఠశాల ప్రామాణికానికి తక్కువగా ఉన్న భాష, భావం ఆత్మన్యూనతకు లోనవుతుంది. అది నేర్చుకోవడానికి బాధకమవుతుంది. కాకినీ, కోయిలనీ సమానంగా గౌరవించే వాతావరణాన్ని పిల్లలకు ఇవ్వలేమా?

నేర్చుకోవడమనే గుడికి నాలుగు మెట్లు.

జ్ఞానం మొదటి మెట్టు. జ్ఞానం సమాచార సేకరణ కాదు. విషయగ్రహణ. విషయాన్ని వడబోసి మిగిల్చిన మంచి.

అవగాహన రెండో మెట్టు. జ్ఞానమొక్కటే మనిషిని నడిపించదు. ఆలోచన ఉండాలి. సాధ్యాసాధ్యాల విచక్షణ కావాలి. ప్రకృతికీ ప్రవృత్తికీ సరిపోవాలి. అదీ అవగాహన. ఈ అవగాహనే జ్ఞానానికి కాళ్ళిస్తుంది.

నైపుణ్యం మూడో మెట్టు. అందరిలో మంచిని చూడాలి. అన్నింటి నుంచీ తెలుసుకోవాలి. నేర్చుకోవడం నేర్చుకోవాలి, దేన్నుంచయినా, ఎవర్నుంచయినా.

అనుపాలన నాలుగో మెట్టు. ఆచరణలో పెట్టాకే నేర్చుకోవడమనే గుడిని చేరుతాం. అనుభవమే మనిషికి అసలు గురువు.

మన విద్యావిధానం ఈ నాలుగు మెట్లకీ వేరు కుంపటి పెడుతుంది.

ప్రవృత్తికి విరుద్ధంగా వెళ్ళమని బుద్ధి చెప్పదు. తనని తాను ప్రేమించమంటుంది.

తన సంతోషానికి పాటుపడమంటుంది. తన అస్తిత్వాన్ని కాపాడుకొమ్మంటుంది. భాగం కూడా మొత్తమంత ముఖ్యమేనని తెలియజేస్తుంది.

మన జీవితం ఒక ఇల్లు. దాని నిర్మాణానికి వేసే ఒక్కో ఇటుకా నేర్చుకోవడం. కాలమనే సిమెంటుతో మనం ఒక్కో ఇటుకను జోడించుకుంటూ వెళితే సుందర జీవనగృహం తయారవుతుంది.

సుగుణం ఆంతరంగికం. మనం సుగుణంలో జీవిద్దాం. ఆనందం కూడా ఆంతరంగికమే. మనం ఆనందంలో జీవిద్దాం. నేర్చుకోవడం సుగుణమే కాదు, ఆనందం కూడా. మనం నేర్చుకోవడంలో జీవిద్దాం.

కిల్లాడ సత్యనారాయణ
మంగళగిరి. ఫోన్: 833 398 7838.

# యక్షగానము - 2

## వివిధ ప్రాంతాలలో యక్షగానాలు

*- పప్పు వేణుగోపాల రావు*

ఇంతవరకు యక్షగానాల ఆవిర్భావ వికాసాలు, వాటి లక్షణాలు తెలుసుకున్నాం. ఇప్పుడు ఒక్కొక్క ప్రాంతంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో, తమిళనాట, కర్ణాటకలలో యక్షగానాలను పరిశీలిద్దాం.

**ఆంధ్రదేశం:**

తెలుగులో యక్షగానాలు 15-16 శతాబ్దులలో ఆవిర్భవించిన తరువాత, పెరిగి వటవృక్షమై, శాఖోపశాఖలై ప్రభంజనమై విస్తరించాయి. ఆ ప్రభంజనం ఇలాటలాటిది కాదు. ఎవరేది రాసిన అందులో పద్యాలు, పాటలు ఉంటే, గద్యం ఉంటే, దాన్ని యక్షగానం అనడం పరిపాటి అయిపోయింది. హరికథలు, సంగీత రూపకాలు, కొన్ని-కొన్ని నాటకాలు, యక్షగానాల కోవలో పరిగణింపబడ్డాయి. త్యాగరాజస్వామి వారు రాసిన ప్రహ్లాద భక్తివిజయం, నౌకాచరిత్రం, ఆదిభట్ల నారాయనదాసుగారి యథార్థ రామాయణం ఇలా ఎన్నో అందులో చేరాయి. తప్పులేదు. ఎందుకంటే యక్షగానాల లక్షణాలు, సాహిత్యంలో సంగీతంలో కొన్ని ఉన్నాయి కదా!. యక్షగాన రచనలు ఆంధ్రదేశంలో అన్ని ప్రాంతాలలోను జరిగాయి.

తెలంగాణంలో 1780 ప్రాంతంలో శేషాచల కవి ధర్మపురి రామాయణం, రాపాక శ్రీరామకవి ఆధ్యాత్మ రామాయణం మొదటి యక్షగానాలు. 20వ శతాబ్దంలో తెలంగాణంలో యక్షగానాల సంఖ్య నూరుకు పైగా అయింది. రచనలతో ఆగలేదు, యక్షగాన ప్రదర్శనలూ బాగా సాగాయి. తెలంగాణంలో చేర్విరాల బాగయ గారు 34 యక్షగానాలు రాశారు. ఆంధ్రదేశంలో ఇంతవరకు ఇన్ని యక్షగానాలు రాసిన కవి మరియొకడు పుట్టలేదు. ఆయన రచనలలో వస్తువైవిధ్యం కూడా గొప్పది. కొన్నిటిలో 'గణపతి సరస్వతుల రాకడ', 'రంభ ఊర్వశుల రాకడ' ఉన్నాయి. హిందీ, ఉర్దూ సంభాషణలు ఉన్నాయి. ప్రసిద్ధమైన పౌరాణికాలేకాక అల్లీరాణి కథ, నాగార్జున చరిత్ర, బాలనాగమ్మ ఇలా ఎన్నో వారి రచనలు. తెలంగాణంలో ఎక్కువ యక్షగానాలు ప్రదర్శనకు ఉపయోగపడేవిగా రాశారు.

**కూచిపూడి - యక్షగానాలు:**

కూచిపూడిలో యక్షగానాల గురించి పలువురు విద్వాంసులు వేరువేరు అభిప్రాయలు వెల్లడించారు.

మా గురువు గారు యస్వీ జోగారావుగారు 17వ శతాబ్దం ఉత్తర భాగంలో యక్షగానాలకు కూచిపూడితో సంపర్కం కలిగిందని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా యక్షగానాన్ని భరత నాట్యశాస్త్రం జోడించిన ఘనత కూచిపూడి భాగవతులదేమో అని కూడా అన్నారు. ప్రహ్లాద, రామనాటకం, ఉషాపరిణయం, మొదలగునవి కొన్ని నాటకములే అయిన యక్షగాన ప్రాయములైనవే అని చెప్పారు. అయితే వారు సిద్ధేంద్రయోగి 17వ శతాబ్ది మధ్యవాడు అని పేర్కొన్నారు.

ఇంక నా సహాధ్యాయుడు - యస్వీ జోగారావుగారి వద్దనే నాలాగే పరిశోధన చేసిన చింతా రామనాథంతన కూచిపూడి నాట్య విశిష్టత అనే గ్రంథంలో సిద్ధేంద్రయోగి 13-14 శతాబ్దాలకు చెందినవాడని అన్నాడు. ఆయనే ఆంధ్ర యక్షగానానికి ఆద్యుడేమో అనే ఒక అభిప్రాయం వెలిబుచ్చాడు. కూచిపూడి యక్షగానాలలో ఛందో వైవిధ్యాన్ని వివరించాడు. కూచిపూడివారు ప్రదర్శించే 13 యక్షగానాల పట్టిక ఒకటి ఇచ్చాడు, వంశవృక్షాలు

ఇచ్చాడు, కాని ఎక్కడా ఎవరి కాలం ఇవ్వలేదు. అయితే యక్షగానాన్ని తొలుత కూచిపూడిలో ప్రవేశపెట్టినది చింతా వేంకటరామయ్యగారని అంగీకరించాడు.

మొదలి నాగభూషణ శర్మగారు వారి ఆంగ్ల గ్రంథం Kuchipudi: Gurus, Performers and Performance Traditionsలో చింతా వేంకట రామయ్యగారే యక్షగానాన్ని కూచిపూడిలో ప్రవేశాపెట్టారని చెపుతూ హరి మాధవయ్య (1860-1949) ఈ పనిలో వారిని ప్రోత్సహించారని ఈయన వేంకటరామయ్యగారికంటే వయసులో పెద్దవాడని చెప్పారు. అంటే కూచిపూడి యక్షగానాలు 19వ శతాబ్దం తరువాతవే అని తేల్చి చెప్పారు.

ఆరుద్ర గారు వారి ఆంగ్ల గ్రంథం, Dance Traditions of Andhraలో యక్షగానాలకు ఒక్కొక్క కాలంలో ఒక్కో పేరు ఉండేదని, ఈ కోవకి చెందిన వాటిలో దాదాపు 28 భామాకలాపాలు, 13 గొల్లకలాపాలు ఉన్నాయని మద్రాసు ప్రాచ్య లిఖిత భండారంలో వాటి సంఖ్యలతోసహా వివారాలు ఇచ్చారు. ఆయన కూడా 19వ శతాబ్దంలోనే కూచిపూడివారు యక్షగానాలను ప్రయోగించడం మొదలుపెట్టారని చెప్తున్నారు.

మిత్రులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రిగారు వారి పరిశోధన గ్రంథం తెలుగులో కూచిపూడి నాటక వికాసం అనే గ్రంథంలో కూచిపూడివారు అనేక ప్రక్రియలు ప్రదర్శించేవారని ఒక జాబితా ఇచ్చారు:

1. రూపకాలు, 2. కలాపాలు, 3. నృత్యనాటకాలు, 4. కేళీలు, 5. యక్షగానాలు, 6. నృత్యనాటికలు, 7. వ్యస్తాంశాలు.

భామాకలాపం ప్రభావంతో 15 నుండి 19వ శతాబ్దం మధ్యలో కూచిపూడి వారు యక్షగానాలు పరిశ్కృతములుగా వెలువరించారని అన్నారు.

ఈ పలువురు పండితుల అభిప్రాయంలో చరిత్రకు, వాదనకు, విమర్శకు, ఆధారాలకు, ప్రామాణికంగా నిలిచేది చింతా వేంకట రామయ్యగారు కూచిపూడిలో యక్షగానం మొదట ప్రవేశాపెట్టారన్నదొక్కటే.

కూచిపూడివారు ప్రదర్శించే యక్షగానాల గురించి ఇంకొంత తెలుసుకొనేముందు ఏ విధంగా చింతా వెంకటరామయ్య గారు ఈ యక్షగానాలను కూచిపూడిలోకి తీసుకువచ్చారో తెలియజేసే ఒక ఉదంతం తెలుసుకుందాం.


హరి మాధవయ్యగారి పూర్వులు కూచిపూడివారు కారు. వారి పూర్వులు గుంటూరు ప్రాంతంలో అనంతవరం నుంచి 17-18 శతాబ్దులలో కూచిపూడి వచ్చి స్థిరపడి కూచిపూడి నేర్చుకుని వారి మేళంతో ఊరూరా ప్రదర్శనలు ఇచ్చేవారు. ఒకసారి తంజావూరు వెళ్లి అక్కడ ఉషాపరిణయం యక్షగాన ప్రదర్శన చూసి, వాళ్లకు భామాకలాపం నేర్పి, వాళ్ళ దగ్గర నుంచి ఉషాపరిణయం తీసుకొచ్చారట. కాకపోతే కూచిపూడిలో మొదట ప్రదర్శించినది ప్రహ్లాద. చింతా వేంకటరామయ్యగారి చేత ఈ రెండు యక్షగానాలని నాట్యశాస్త్రానుసారంగా పునఃసృష్టి చేయించారు. అందుకని చింతా వేంకటరామయ్యగారు కూచిపూడి యక్షగానానికి పితామహులు.

కూచిపూడి భాగవతులు సంస్కృతాంధ్రాలలో విద్వాంసులు, పాండిత్య ప్రకర్షగలిగినవారు. భరతముని నాట్యశాస్త్రం మధ్యయుగాలలో నిలబెట్టిన మహాపురుషులు. వారి చేతిలో యక్షగానం అత్యంత సౌందర్యాన్ని సంతరించుకుంది. ప్రవేశ దరువులు, ద్విపదలు, అర్ధచంద్రికలు, అనేకమైన మార్గ దేశి ఛందస్సులు ఉపయోగించారు. ఉషాపరిణయం, ప్రహ్లాద, రామనాటకం, శశిరేఖా పరిణయం, సత్యహరిశ్చంద్ర మొదలైనవివారి కొన్ని ప్రఖ్యాత యక్షగానాలు.

మిగిలిన వివరాలు మనం వేరే కూచిపూడి మీద రాయబోయే విశిష్ట వ్యాసంలో తెలుసుకుందాం.

**దక్షిణ దేశంలో యక్షగానాలు:**

విజయనగర సామ్రాజ్యం పతనమైన తరువాత 16వ శతాబ్దం ఉత్తరార్థంలో ఎంతోమంది కళాకారులు, సాహితీవేత్తలు, శిల్పులు, దేవదాసీలు, సంగీత విద్వాంసులు తంజావూరు తరలిపోయారు. తంజావూరు నాయకరాజుల కాలం (1532-1673) యక్షగానానికి స్వర్ణయుగం. అచ్యుతప్ప నాయకుడు (1560-1614),




మేలట్టూరు ప్రాంతం

మేలట్టూరు భాగవతమేళ వారికి అచ్యుతాపురం అనే అగ్రహారం ఇచ్చి పోషించాడు. శ్రీరంగం దేవాలయాన్ని పునరుద్ధరించి ఎన్నో కట్టడాలను నిర్మించాడు. ఈయన మంత్రి గొప్ప విద్వాంసుడైన గోవింద దీక్షితులు. అచ్యుతప్ప అనేకమందికి అగ్రహారాలు దానం చేశాడు.

ఆయన కుమారుడు రఘునాథ నాయకుడు (1600-1634) సంగీత సాహిత్య కళలలో గొప్ప విద్వాంసుడు. ఆయన సృష్టించిన వీణ రఘునాథ వీణ. తంజావూరు ఈ నాటికీ వీణకు ప్రసిద్ధి. ఆయన కొత్తరాగాలు సృష్టించాడు, ఎన్నో యక్షగానాలు రచించాడు. ఈయన రాసిన కొన్ని యక్షగాన వ్రాతప్రతులు ఈయనే నెలకొల్పిన సుప్రసిద్ధమైన తంజావూరు సరస్వతి మహల్ గ్రంథాలయంలో ఉన్నాయి.

ఆయన కుమారుడు విజయరాఘవ నాయకుడు (1634-1673). ఇదే యక్షగానానికి స్వర్ణ యుగం. ఆయనయే స్వయంగా అనేక యక్షగానాలు రచించి ప్రదర్శనలు ఏర్పాటు చేసేవాడు. అతని ఆస్థానంలో రంగాజమ్మవంటి చతుర అయిన కవయిత్రి ఉండేది. ఆమె ఎన్నో యక్షగానాలు రాసింది. ఆయన తన తండ్రిగారి పేరనే రఘునాథాభ్యుదయం ఒక యక్షగానం వెలయించాడు. తరువాతి యక్షగాన కవులకు మార్గదర్శకుడు విజయ రాఘవుడు. రంగాజమ్మ మన్నారుదాస విలాసము, కోనేటి దీక్షితులు రాసిన విజయరాఘవ కల్యాణంలాంటి యక్షగానాలలో ఎరుకల సాని, ఇలాంటివే తరువాతి కాలంలో కోరవంజిలై తమిళనాట విస్తరించాయి.

1673లో నాయక రాజ్యము ముగిసింది. శివాజీ వంశానికి చెందిన మహారాష్ట్రులు తంజావూరు పాలకులైనారు, కానీ తెలుగు అధికార భాషగా, సంగీత సాహిత్య భాషగా కొనసాగించారు. స్వయంగా తెలుగులో యక్షగానాలు, సంగీత లక్షణ గ్రంథాలు వెలయించారు. శహాజి (1684-1712) ఒక గొప్ప విద్వాంసుడు రసజ్ఞుడు, కళాకారులను పోషించిన మహనీయుడు. సుమారు 20 యక్షగానాలు రచించాడు. అందులో శంకర పల్లకీసేవా ప్రబంధము, విష్ణుపల్లకీ సేవాప్రబంధాలు శ్రీమతి ఉమారామారావు గారు కూచిపూడిలో ప్రదర్శించారు. ఆయన ఎన్నో పదాలు రాశాడు.

ఇదంతా ఒక ఎత్తు మేలట్టూరు భాగవత మేళా ఒక ఎత్తు.

**మేలట్టూరు భాగవత మేళా యక్షగానాలు :**

అచ్యుతప్ప నాయకుడు (1560-1614), మేలట్టూరు భాగవత మేళ వారికి అచ్యుతాపురం అనే అగ్రహారం ఇచ్చి పోషించాడు అని ఇంతకు ముందే చెప్పుకున్నాం. శాసనాల ఆధారం ప్రకారం అచ్యుతప్ప నాయకుడు సుమారు 500 బ్రాహ్మణ కుటుంబాలకు 3 అగ్రహారాలు దానం చేశాడు, అవి మేలట్టూరు, సాలయ మంగళం, ఊతుక్కాడు. ఈనాటికీ ఈ మూడు గ్రామాలవారు భాగవతమేళం చేస్తున్నారు. మేలట్టూరు గురించి శాసనాలు 'నృత్త వినోద వలనాడు' అని పేర్కొనడం విశేషం. మేలట్టూరు ఒక భాగవత మేళాకే కాదు కొందరు ప్రముఖ కర్ణాటక సంగీత వాగ్గేయకారులకూ పుట్టినిల్లు. కర్ణాటక సంగీత చరిత్రలో మేలట్టూరు త్రిమూర్తులని ముగ్గురు వాగ్గేయకారులను చెప్తారు. మేలట్టూరు కాశీనాథయ్య(1690-1764), వీరభద్రయ్య (1739-1774), వేంకటరామ శాస్త్రి (సుమారు 18వ శతాబ్దం మధ్యభాగం నుంచి - 19 శతాబ్దం మధ్యవరకు). వీరి తండ్రిగారు మేలట్టూరు గోపాలకృష్ణశాస్త్రి కూడా వాగ్గేయకారులు. మేలట్టూరు వీరభద్రయ్య ముత్తు స్వామి దీక్షితుల తండ్రి రామస్వామి దీక్షితులకు గురువు.

మేలట్టూరు కాశీనాథయ్యని భరతం కాశీనాథయ్యే అంటారు. ఈయనే మొట్టమొదట అలరిప్పు, శబ్దం,


సలామ్ జతులు రాసినవాడు. కూచిపూడి వాళ్ళు చేసే మాండూక శబ్దం, దశావతార శబ్దం ఈయన రచనలు. కూచిపూడి వారి దశావతార శబ్దం రచన తరువాత కాలంలో సిద్ధాబత్తుల రంగదాసు. ఈయన 9 అలరిప్పులు రాశాడు, వింత-వింత తాళాలలో, ద్విరాజశేఖర, మదనకుంజర, శశాంకలాటివి. తన రచనలు ఆనాటి మరాఠీ పాలకులు, శహాజి, శర్ఫోజి, తులజిలకు అంకితం చేశాడు. మేలట్టూరు వెంకటరామ శాస్త్రి భాగవతమేళాకి పితామహుడు, 12 యక్షగానాలు విరచించాడు.

ప్రహ్లాద, మార్కండేయ, హరిచంద్ర, ఉషాపరిణయం, రుక్మాంగద, హరిహరలీలా విలాసం, కంసవధ, రుక్మిణీ కళ్యాణం, ధ్రువచరిత్రం, సీతా పరిణయం, సతీ సావిత్రి. అన్నిటికీ ఉపోద్ఘాతంలో ఆయన శ్రీవత్సగోత్రానికి చెందినవాడని, గోపాలకృష్ణశాస్త్రి పుత్రుడని, లక్ష్మణార్య శిష్యుడని ఉంది. (తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయం నం. 799-906). ఆయన బ్రాహ్మణులను చేర్చి నాట్య శాస్త్రానుసారంగా నాట్యమేళా ప్రదర్శనలు చేసేవారు. ఆయన ఇతివృత్తాలన్నీ భాగవతంకి సంబంధించినవి కనుక భాగవతమేళా అన్న పేరు సరిగ్గా సరిపోయింది. ఇందులో స్త్రీవేషాలన్నే పురుషులే వేసేవారు, ఇప్పటికీ వీలైనంత వరకు అలాగే చేస్తున్నారు. వేంకటరామశాస్త్రిగారు ఆయన రచనలన్నీ మేలట్టూరు అధిష్టాన దేవత వరదరాజస్వామికే అంకితం చేశారు. పచ్చిమిరియం ఆదిప్పాయ్యతో కలిసి 'ఏ మందయానరా' స్వరజతి రచించారు. ఈయన జీవిత కాలంలోనే తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయం ఈయన రచలను సేకరించి భద్రపరిచింది. భాగవతమేళా అచిర కాలంలో ప్రసిద్ధిచెంది చుట్టుపక్కల 5 గ్రామాలకు ప్రాకింది; సూలమంగల, శాలీయమంగళం, ఊతుక్కాడు, నల్లూరు, తేపెరుమనల్లూరు.

మేలట్టూరు వేంకటరామశాస్త్రిగారి తపస్సు ఫలితంగా రచించిన అనన్యమైన యక్షగానం 'ప్రహ్లాద చరిత్రం'. భాగవతమేళా సంప్రదాయానికి కిరీటంవంటిది. ఇది వీరు ఇప్పటికీ మేలట్టూరులో వరదరాజస్వామి ఆలయం ఎదుట తప్ప ప్రపంచంలో ఎక్కడా ప్రదర్శించరు. అంతటి పవిత్రమైన ఈ యక్షగానంలో సంగీతం, సాహిత్యం, నాటకీయత ఒకదానితో ఒకటి పోటీగా నడుస్తాయి. ఈనాటికీ సంగీత విద్వాంసులు, నాటకంలో పాత్రధారులు రోజంతా దీక్షతో ఉండి రాత్రి 9 గంటలకి నాటకం ప్రారంభిస్తే తెల్లవారు ఝామున 5 గంటలకి నరసింహుడు హిరణ్యకశిపుని వధిస్తాడు. అది ఒక యజ్ఞం, చూసి తరించవలసిందే. మే నెలలో ఏటా ఈ ప్రదర్శన జరుగుతూ ఉంటుంది.

భాగవతమేళా సంప్రదాయంలో ప్రవేశదరువు ఒక ప్రముఖమైన అంశం. హిరణ్యకశిపుడి ప్రవేశదరువు దేవగాంధారిలోను, లీలావతి అఠాణాలోను, ప్రహ్లాదుడికి భైరవి, శుక్రాచార్యులవారి ప్రవేశం ఆనంద భైరవిలోను స్వరపరచారు. ఇందులో కొన్ని అపూర్వమైన రాగాలు, ఘంట, ఆహిరి, మాంజి, నీలాంబరి శ్రోతలను సమ్మోహపరుస్తాయి. వేంకటరామయ్యగారి రచనాశిల్పం అనిదంపూర్వమైనది. ప్రతి ప్రవేశదరువు ముందు ఆయన ఒక గద్యం రాశారు. లీలావతి ప్రవేశ దరువు ముందున్న గద్యం ముక్తపదగ్రస్తంలో అత్యంత రమణీయమైన సాహిత్యంలో పరవశింపజేస్తుంది. ఈనాటికీ లీలావతి పాత్ర ధరిస్తున్నది నా మిత్రుడు శ్రీ నటరాజన్. లీలావతిగా ఆయనకి 60 ఏళ్ళు. దుబాయ్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరుగా పనిచేస్తూ ఏటా ఈ కార్యక్రమాలు చేస్తూ ఉంటారు.

ఇందులో హిరణ్యకశిపుడు పాత్ర పోషిస్తున్నవారు శ్రీ కుమార్. అది ఒక విచిత్రమైన ఉద్ధతమైన పాత్రపోషణ. విశిష్టమైన శైలి. తండ్రి స్వామినాథన్, తాత గణేశ అయ్యర్ ఈ పాత్రలు పోషించారు, ఈయన సాధారణంగా యముడు, కంసుడు, బాణాసురుడు, హిరణ్యకశిపు పాత్రలు పోషిస్తూ ఉంటాడు.


కుమార్

ప్రహ్లాద నాటకంలో హిరణ్యకశిపుడు రంగస్థలం దిగిపోయి నరసింహునితో యుద్ధం చేస్తారు. ఇందులో ముఖ్యమైనది స్తంభ



నరసింహుడు స్థంభంలోంచి

శ్లోకం అని వాళ్ళు చెప్పే తెలుగు పద్యం, సర్వలఘువులతో భక్తితాత్పర్యంతో ఉండే ఇది.. *దేవదేవ ఇదే సమయమయ్యా - ఈ స్తంభమున ఆవహించి నన్ను బ్రోవవయ్యా..* *పూర్వీకల్యాణి రాగం*

దీని తరువాత నరసింహుని ప్రవేశం..

*సాముజేసే నిదిగో చూడండి - గడగడమని అండమదరగా పుడమినిగల కడిమి దనుజులెల్ల చెదరగ ...*

ఇది చూస్తున్నప్పుడు ప్రేక్షకులందరూ పులకించిపోయి లేచి నించుని నమస్కారం చేస్తూ ఉంటే ఉగ్రనరసింహుడు స్థంభంలోంచి వెలికి వస్తాడు.

ఇలా భాగవతమేళాలో ఎన్నో అపురూపమైన యక్షగానాలు, కంసవధలో కంసుని ప్రవేశదరువు సావేరిలో ఉంటుంది. హరిశ్చంద్రలో ఎన్నో అపురూపమైన రాగాలు; మణిరంగు, కానడ, చెంజురుటిలాంటివి. చంద్రమతి హరిశ్చంద్రునితో చెప్తుంది:

*సత్యము తల్లాడవలదు సకలభూవర నా ప్రాణ దేవర - రాగం మణిరంగు*

హరిశ్చంద్రలో ఎన్నో అపురూపమైన దరువులున్నాయి. హరిశ్చంద్రుని వైభవాన్ని, దరిద్రాన్ని తెలిపే రెండు దరువులు ఒకటి కానడలో ఒకటి చెంజురుటిలో అద్భుతంగా ఉంటాయి.

వేంకటరామశాస్త్రిగారి రుక్మిణీ కల్యాణంలో రుక్మిణి ప్రవేశం:

*కదలివచ్చెను రుక్మిణి నయగుణ మణి* - అఠాణాలో రమణీయమైన రచన.

వేంకటరామ శాస్త్రిగారు కూచిపూడి యక్షగానాలలా కాకుండా సుమారుగా అన్ని పాత్రలకీ ప్రవేశదరువులు రచించడం విశేషం. ఆయన



వరరజస్వామి దేవాలయం

శిష్టమైన తెలుగులోనే అన్ని యక్షగానాలు రచించారు. ఈ నాటికీ తమిళులు తెలుగు యక్షగానాన్ని, తమిళంలో రాసుకుని ఉచ్చారణ లోపం లేకుండా ఇవే పాడుతున్నారు, ప్రదర్శిస్తున్నారు. త్యాగరాజస్వామివారు ఈయన ప్రభావంవల్లనే నౌకాచరిత్రం, ప్రహ్లాద భక్తీ విజయం రచించారు. త్యాగయ్యగారి ప్రహ్లాద భక్తి విజయం ఒక విచిత్రమైన రచన. ఇందులో నరసింహుడే లేడు! ఆ కాలంలో ఆధునికుడు వేంకట రామశాస్త్రిగారు. హరిశ్చంద్రలో నాదనామ క్రియలో మతంగకన్యలకు 'తళుకు బెళుకు కులుకుగల మిటారి రా'వంటి ఒక చిందు నృత్యం ఏర్పరచడమే దీనికి తార్కాణం.

భాగవత మేళా మీద మన నారాయణతీర్థులవారి (1650 -1745) ప్రభావం కూడా ఉంది.

మేలట్టూరులో వరదరాజస్వామి దేవాలయంలో నరసింహుని ప్రభావమే దీనికి మూలం. ఈనాటికీ ప్రహ్లాదలో నరసింహుని పాత్రధారి వేసుకొనే నరసింహుని ముఖం ఈ దేవాలయంలో ఒక రోజంతా పూజలో ఉంచి ఆహార్యం పూర్తయ్యాక ఇది ధరిస్తే నరసింహుడు ఆ పాత్రదారిని ఆవహిస్తాడు, అనేది అంధవిశ్వాసం కాదు, పరంపరగా ప్రజలు చూసి తరిస్తున్న ఆధ్యాత్మిక ఆర్ద్రత.




నరసింహ ముఖం

**కన్నడ యక్షగానాలు:**

కన్నడంలో యక్షగానాలు తెలుగు తరువాతనే వచ్చాయన్న వాదం చాలామంది కన్నడ పండితులే అంగీకరించిన సత్యం. ప్రాంతీయ భాషాభిమానాలవల్ల మనలాగే వాళ్ళూ కన్నడంలో వెయ్యి సంవత్సరాలుగా ఉంది అంటారు. కాకపోతే ఆ రోజుల్లో దానిని కేలికే, ఆటే, బయలాటే అనేవారని వాళ్ళూ

ఒప్పుకుంటారు. వీళ్ళు యక్షగానాలని 'ప్రసంగ' అని వ్యవహరిస్తారు. రత్నాకర వాణి అనే కవి రాసిన గ్రంథం వల్ల యక్షగానం 500 సంవత్సరాల చరిత్రగలిగి ఉందని అంగీకరించాలి. వాళ్ళ చరిత్రకారులు కొందరు తెలుగులో ఉన్న కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయం మొదటి యక్షగానంగా పేర్కొన్నారు. 1556 కాలంనాటి ఒక శాసనం బళ్ళారి జిల్లా కొరుగోడు లక్ష్మీనారాయణ ఆలయంలో యక్షగానం ప్రస్తావించింది. కర్ణాటక రాష్ట్రం ఒక పక్క మహారాష్ట్ర, ఇంకోవంక ఆంధ్రం, తమిళనాడు, కేరళతో సరిహద్దులు కలిగియుండడంవల్ల ఆయా ప్రాంతాల ప్రభావం కనిపిస్తుంది. మహారాష్ట్రుల నాటకీయత, కేరళ కథకళి మేకప్, తెలుగు యక్షగాన శైలి, తమిళ దేశపు సంగీత వాసనలు కన్నడ యక్షగానంలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కన్నడ విద్వాంసులు వారి యక్షగాన సంగీతం వేరని అంటారు, కొంత నిజమే. కర్ణాటక సంగీతం మధ్యమ గ్రామం నుంచి, హిందుస్తానీ సంగీతం షడ్జగ్రామం నుంచి ఉద్భవిస్తే, యక్షగాన సంగీతం గాంధార గ్రామం నుంచి వచ్చిందనే ఛాందసులు ఉన్నారు. యక్షగానంలో రాగంకన్నా 'మట్టు'కి ప్రాధాన్యత ఉంటుంది అంటారు. వాళ్ళుపయోగించే వాయిద్యాలు కూడా తరువాత వివరిస్తాను. ఇదంతా ఎందుకంటే కన్నడ యక్షగానాలు ఒక అత్యంత సుందరమైన కనులకింపైన, వీనుల విందైన, రంగురంగుల హంగులు కలిగిన, ఆసక్తికరమైన ఉధృతమైన వినోద ప్రక్రియలు.

యక్షగానంలో కళాకారులను రెండుగా విభజిస్తారు, సంగీతం అందించేవారు, గాయకులు, వాద్యం వాయించేవాళ్ళు కూడా వేదిక మీదే రంగస్థలం మధ్యలో వెనుక ఉంటారు. వీళ్ళని 'హిమ్మేళ' అంటారు. నటులు ముందుంటారు, వీళ్ళని 'ముమ్మేళ' అంటారు. సాధారణంగా ఇతివృత్తం పౌరాణికమో, చారిత్రికమో, జానపదమో, ఆధ్యాత్మికమో అయి ఉంటుంది. ఎక్కువగా నృత్తం, పాదాలతో చేసి నృత్యం నాటకీయత




యక్షగాన ఆహార్యం

ఉంటుంది. హస్తాభినయమో, కనులతో అభినయమో ఉండవు. ఇటీవల స్త్రీలు వచ్చారుగాని మొన్న మొన్నటి వరకు స్త్రీపాత్రలనూ పురుషులే పోషించేవారు. యక్షగానంలో ఉండే దరువులు, పద్యాలు, సంభాషణలు, పాటలు కన్నడ యక్షగానంలోనూ ఉంటాయి. సాధారణంగా రాత్రి భోజనాలయ్యేక ప్రారంభిస్తే యక్షగాన ప్రదర్శన తెల్లతెల్లవారుతూ ఉండగా ముగుస్తుంది. హిమ్మేళ కళాకారుల ప్రార్థనతో యక్షగానం మొదలవుతుంది. మొదట మద్దలం మొదలైన వాద్యాలతో ప్రారంభం అవుతుంది. దీనిని 'అబ్బర' అని 'పీఠికె' అని అంటారు. ఇది చాలాసేపు వాయిస్తారు. జనం వచ్చేవరకు అనుకోండి. సుమారు ఒక గంట ఉంటుంది. రాజుల చరిత్రలయితే 'ఉడ్డోలగ' అనే ప్రక్రియ ఉంటుంది, అంటే దర్బారు, రాజసభ అన్నమాట.

నటులకి మంచి రంగుల రంగుల ఆహార్యం ఉంటుంది, ముఖానికి మాస్క్ వేసుకుంటారు కొన్ని-కొన్ని పాత్రలకి. ఆభరణాలు ఉంటాయి. ముఖ్యమైన పాత్రలకి ప్రవేశదరువు ఉంటుంది. యక్షగానంలో సంభాషణలు సాధారణంగా లిఖితంగా ఉండవు, పాత్రధారుల సమయస్ఫూర్తిబట్టి, ప్రదర్శిస్తున్న స్థలాన్నిబట్టి, ఇచ్చిన కాలాన్నిబట్టి, సంభాషణలు నడుస్తాయి. పాటలు, పద్యాలు, దరువులు మాత్రమే రాసి ఉంటాయి. రాక్షస పాత్రలు కథకళి వేషదారులులా ఉంటారు. వీటిని బన్నద వేష అంటారు. చాలా ఉధృతంగా ఉగ్రంగా పెడబొబ్బలు పెడుతూ ఉంటారు. వాళ్ళ అట్టహాసానికి, అరుపులకి, నిద్రపోతున్న ప్రేక్షకులు ఉలిక్కిపడి లేస్తారు. కాలు ఎడంగా పెట్టి నించునేవారి తీరు, సంభాషణలు, గెంతులు చూడవలసిన దృశ్యాలు.

రకరకాల శిరస్త్రాణాలు ఉపయోగిస్తారు. ముఖానికి పాత్రనిబట్టి రంగు ఉంటుంది, తెలుపు, నీలం, పసుపు, నలుపు, ఇలా, పెదాలకీ రంగు వేసుకుంటారు. నామం పెట్టుకుంటారు.



యక్షగాన ఆహార్యం




యక్షగాన శిరస్త్రాణాలు

దైవికమైన పాత్రలకి కన్నుల క్రింద కొంచెం ఎరుపురంగు వేస్తారు, చూస్తే అలౌకికంగా కనిపించడానికి. భుజాలకి, చెవులకి, మెడకి ఆభరణాలు ఉంటాయి, రకరకాల కిరీటాలు వాడుతారు.

యక్షగానంలో సంగీతం అందించేవారిని హిమ్మేళ అంటారని చెప్పుకున్నాం. ఇందులో ఒక ప్రధాన గాయకుడు ఉంటాడు, ఇతనిని మొదటి నటుడు; 'మొదలనె వేష' అంటారు. సాధారణంగా ఈయనే దర్శకుడు. మిగిలిన వాళ్ళంతా వివిధ సంప్రదాయ వాయిద్యాలు వాయించేవారు. మద్దెల, పూంగి, హార్మోనియం, చండే ఇవీ వాద్యాలు.

యక్షగానంలో కొన్ని-కొన్ని చోట్ల అవసరాన్నిబట్టి ఒకేసారి బహుపాత్రలు ప్రవేశించే దరువులూ ఉంటాయి. పాండవులు ఐదుగురూ ఒకేసారి ప్రవేశం చెయ్యడం. అలాగే దుర్యోధన వధలో తెర ఎలా ఉపయోగిస్తారో చూస్తే అద్భుతంగా ఉంటుంది. ఎందుకంటే మరణం రంగస్థలం మీద చూపడం భారతీయ సంప్రదాయం కాదు. సంస్కృత నాటకరంగంలో ఒక ముఖ్యమైన సూత్రం ఏమిటంటే అన్నీ మంగళంతో ప్రారంభించాలి మంగళంతోనే ముగించాలి. విషాద నాటకాలు గ్రీకు సంప్రదాయం. రాత్రంతా ప్రదర్శన జరుగుతుంది గనుక యక్షగానంలో ప్రేక్షకులు నిద్రపోకుండా



యక్షగాన వాద్యాలు



తెర ఉపయోగం - దుర్యోధన వధ


ఉండడానికి మధ్య-మధ్యలో రాక్షస పాత్రల అట్టహాసాలు, పెడబొబ్బలు, రుచికరమైన హాస్యం ఉంటాయి. ప్రహ్లాదలో గురుశిష్య సంభాషణ దీనికో ఉదాహరణ.

ఇటీవలి కాలంలో యక్షగానం కాలానుగుణమైన మార్పులు ఎన్నో చేసింది. సాధారణంగా యక్షగానాలు అనేకమంది నటులతోనే ఉంటాయి. ఇప్పుడిప్పుడు ఏకవ్యక్తి అంటే ఒకే పాత్రధారుడు చేసే యక్షగానాలు వెలిశాయి. ప్రభాకర్ ఉపాధ్యాయ అనే ఆయన స్త్రీపాత్ర దీనికో ఉదాహరణ.




ఆహార్యం

యక్షగానం ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి, షిమోగా, కాసరగోడ్ ప్రాంతాలలో బహుళ ప్రాచుర్యం పొందింది. ఉడిపిలో యక్షగాన కేంద్రం ఒకటి యక్షగాన అధ్యయన పరిశోధనలకు సహకరిస్తోంది. ఇటీవల బెంగళూరులోనూ యక్షగానం ప్రాచుర్యం అయింది. వాళ్ళు చేసే ప్రాంతాన్నిబట్టి యక్షగానాన్ని అనేక రకాలుగా విభజిస్తారు: మూడలోపాయ యక్షగాన (తూర్పు కర్ణాటక), పడువలోపాయ యక్షగాన (పశ్చిమ కర్ణాటక), తెంకుతిట్టు (కాసరగోడ్, మంగళూరు, ఉడిపి), బడగుతిట్టు (ఉత్తర కర్ణాటక)... ఇలా. కరమనే శివరామ హేగడే ఇడుగుంజి



యక్షగాన వాద్యాలు

మహాగణపతి యక్షగాన మండలి స్థాపించేరు. ఈయనే రాష్ట్రపతి పతకం అందుకున్న మొదటి కన్నడ యక్షగాన కళాకారుడు.

యక్షానం తోలుబొమ్మలాటలోనూ కన్నడ దేశంలో ఉండడం విశేషం. 1910-1915 మధ్యకాలంలో సుమారు 300 తోలుబొమ్మలాట యక్షగాన బృందాలు ఉండేవి. బర్కూర్, బక్రురు, ముడబిద్రి ప్రాంతాలలో ఇవి ఇప్పటికీ ఉన్నాయి. 18 అంగుళాల తోలుబొమ్మలతో ఆడే ఈ యక్షగానాలు శుద్ధమైనవి, సంప్రదాయాన్ని అనుసరించేవిగా మనకి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.


తోలుబొమ్మల యక్షగానం

యక్షగానం ఒక రత్నాకరం, ఒక అందమైన ఆహ్లాదమైన జీవకళ. ఇప్పుడు తోలుబొమ్మలాటలు రెండే ట్రూపులు మిగిలేయి. టీవీలు, సినీమాలు చూసే తీరికున్న సహృదయులకి అంతరించిపోతున్న కళలను ప్రోత్సహించే ఔదార్యం ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. యక్షగానం దాక్షిణాత్యులు గర్వించదగిన ఒక సాహిత్య, సంగీత, నృత్య, నాట్య సమాహార కళ.

ఆచార్య పప్పు వేణుగోపాలరావు,
చెన్నై. e-mail: pappuvenu@gmail.com


చికాకో సభలో స్వామి వివేకానంద

## సముచిత స్థానం

– తాజీ ప్రసాద్

1893లో సెప్టెంబర్ 11 నుంచి 27 వరకు చికాగో మహానగరంలో సర్వమత మహాసభలు జరిగాయి.


బ్రహ్మసమాజం, యూదు, బౌద్ధ, ఇస్లాం, క్యాథలిక్, జొరాష్ట్రియన్లు హిందూ మొదలైన అనేక మతాలకు చెందిన ప్రతినిధులు ఆ మహాసభలలో పాల్గొన్నారు. భారతదేశం తరపున హిందూ మతానికి ప్రాతినిథ్యం వహిస్తూ స్వామి వివేకానందుడు పాల్గొన్నాడు. వివేకానందుడు తన ఉపన్యాసాన్ని "అమెరికా దేశపు సోదర సోదరీమణులారా" అంటూ ప్రారంభించి "లేవండి, మేల్కొనండి" అని సందేశమిచ్చి హిందూమత ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు. పావన గంగా ప్రవాహంలాగా సాగిన ఆ మహోపన్యాసానికి అందరూ మంత్రముగ్ధులయ్యారు. వివేకానందుని ఉపన్యాసం ముగిసింది. సభా ముగిసింది. ఆ ఉపన్యాసాన్ని ఆసాంతం విన్నాడో లేదో కానీ వివేకానందుని మరో దృష్టితో పరిశీలించిన ఒక 'అనుమానాల అమెరికన్' వివేకానందుని సమీపించి "స్వామీ, నాకో సందేహం - అడగమంటారా" అన్నాడు.

"తప్పక అడగండి" అన్నాడు వివేకానందుడు.

"స్వదేశీ ఉద్యమానికి మీ దేశంలో ఊపిరి అందిస్తున్నారు. విదేశీ వస్తువులని బహిష్కరిస్తున్నారు. ఆ ఉద్యమ సారథులలో ఒకరిగా మీరూ అగ్రస్థానంలో ఉన్నారు. అయితే ఆంగ్లేయుల దేశంలో తయారైన బూట్లు మీరు ధరించారు. ఇందులో ఔచిత్యం ఏమిటి?" అని అడిగాడు ఆ సందేహప్రాణి.

వివేకానందుడు వెనువెంటనే "ఆంగ్లేయులకు సముచిత స్థానం ఇచ్చాను" అన్నాడు.

అయితే ఆ సమాధానం ఆ సందేహ ప్రాణికి చెప్పు దెబ్బలాగా తగిలింది! అక్కడి నుంచి అదృశ్యమైపోయాడు.



# కాకతీయులు - 2

## సార్వభౌమ పాలకులు
## రుద్రదేవుడు, మహాదేవుడు, గణపతిదేవుడు

*- రావినూతల సత్యనారాయణ*

*మనకు చరిత్ర పట్ల గౌరవం తక్కువ - అలాగే గత రాజ్యాల చరిత్ర దానశాసనాలలోనే నిక్షిప్తమై ఉన్నది. ఏ రాజూ - ఏ చక్రవర్తి వంశ చరిత్రలు రాయించి పెట్టుకోలేదు - దానికి కారణాలు అప్పుడు రాతలు లేక కాదు. మహాకావ్యాలే రాయించిన మహారాజులు చరిత్ర ఎందుకు రాయించలేదు? ఇప్పుడు మనం స్వార్థపూరితంగా రాయించిన బ్రిటిష్ చరిత్రకారుల రాతలు - ఏకపక్షంగా రికార్డు చేయించుకున్న అక్బర్ నామాలు, అదిల్ షాల అవశేషాలే ఏరుకొని అందులో నిజమేమిటో పరిశోధించాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే విజయనగర చరిత్రకు మా శక్తికొలదీ అక్షరరూపం ఇచ్చాం. అలాగే ఇప్పుడు కాకతీయులు అంటే రుద్రమదేవి, ప్రతాపరుద్రుడే కాదు, వందల సంవత్సరాల చరిత్ర ఉన్నది అని చెప్పటమే మా ఉద్దేశ్యం. - సం*

మొదటి వ్యాసంలో కాకతీయుల మూలాలు, ఆ వంశపు ఆరంభదశ, తొలిపాలకులను గురించిన వివరాలు క్లుప్తంగా చర్చించడం జరిగింది. తొలిపాలకులలో రెండవ ప్రోలుడు ప్రాముఖ్యాన్ని గడించాడు. చాళుక్యులు బలహీనపడిన సమయంలో స్వాతంత్ర్యము ప్రకటించుకొని రాజ్య విస్తరణ చేశాడు. పశ్చిమ చాళుక్యుల సామంతులైన తైలపదేవుడు, గోవిందరాజు, గుండరాజు (మంథెన ప్రాంతం), జగ్గదేవుడు అనే నలుగురు రాజులను జయించి చాళుక్యుల పాలనకు స్వస్తి చెప్పాడు. ఆ తర్వాత అతని పెద్ద కొడుకు రుద్ర దేవునితో కాకతీయ సార్వభౌముల పరిపాలన ప్రారంభమయింది.

**రుద్రదేవుడు (క్రీ.శ.1158-1195):**

రెండవ ప్రోలుని వారసుడుగా అతడి పెద్ద కొడుకు రుద్రదేవుడు సింహాసనమధిరోహించాడు. ప్రసిద్ధులైన సార్వభౌమ పాలకుల్లో రుద్రదేవుడు మొదటివాడు. ఈయనను మొదటి ప్రతాప రుద్రునిగా కూడా పేర్కొనేవారని తెలియుచున్నది. క్రీ.శ. 1163నాటి అనుమకొండ శాసనం (Inscriptions of Andhra Pradesh, Warangal : 36) రుద్రదేవుని దండయాత్రల గురించి వివరిస్తుంది. ఈ శాసనం ప్రకారం అతడు చాలామంది స్థానిక నాయకులను జయించాడు. వారిలో కరీంనగరుకు సమీపాన ఉన్న నగునూరు ప్రభువు దొమ్మరాజును జయించాడు. ఇతడు చాళుక్యుల సామంతుడు కూడా (Inscriptions of Andhra Pradesh, Dist. Karimnagar: 74); పొలవాస మేడరాజు, కాలచురి మైలిగదేవుడు (మల్లిగ దేవుడు), భీమచోడు (చోడనాయకుడు)లను కూడా జయించాడు. ఆ ప్రాంతంలో విజయాలు అతని స్థానాన్ని పటిష్ఠం చెయ్యడమేకాక, అధిక సంపదను సంపాదించడానికి అవకాశం కల్పించాయి.

రుద్రదేవుడు మొదట వర్ధమాన గిరిపై దండెత్తి దాన్ని విధ్వంసం చేశాడు. దాంతో భీమదేవుడు అడవులు పట్టి పారిపోయాడు! ఆ తర్వాత ఉదయచోడుడి పైన దాడి చేశాడు. ఉదయచోడుడు గట్టి ప్రతిఘటన చూపినట్లు తెలియుచున్నది. ఏరువనాడులో పైతృక భూమి ఉన్న చెరుకు నాయకులు ఉదయచోడుని, అతని సేనాని అరపాలుని ఓడించడంలో రుద్రదేవుడికి సాయం చేశారు. రుద్రదేవుడు చెరుకు నాయకులకు బహుమతిగా

పానుగల్లు, శ్రీశైల ప్రాంతాల్ని ఇవ్వడం జరిగింది. ఉదయచోడుడు తన కూతురును రుద్రదేవుడికి భార్యగా సమర్పించి, శాంతిని కొనుక్కున్నాడు! తనవంతుగా రుద్రదేవుడు కందూరునాడులో అతనికి (ఉదయ చోడుడికి) స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించాడు. రుద్రదేవుడు పానుగల్లు, ఇతర ప్రదేశాలపైన విజయ దండయాత్రకు చిహ్నంగా తను కొత్తగా కట్టిన రాజధానీ నగరం ఓరుగల్లులో ఆయాపేర్ల బస్తీలను నిర్మించాడని చెప్తారు.

రుద్రదేవుడి సైనిక కార్యకలాపాలు తీరాంధ్రదేశంలో క్రీ.శ. 1158లోనే ప్రారంభమైనట్లు తెలియుచున్నది. రెండవ రాజరాజుపై తిరుగుబాటు చేసిన హైహయులు, సూర్యవంశీయులవంటి సామంతులను అణచేందుకు ఇనంగాల బ్రహ్మిరెడ్డిని పెద్దసైన్యంతో రాజరాజుకు సాయం చేయడానికి పంపినట్లు తెలుస్తోంది. రెండవ రాజరాజు అందుకు కానుకగా రుద్రదేవుడికి గోదావరి డెల్టా ప్రాంతంలో ఒక చిన్న రాజ్యం ఇచ్చినట్లు తెలియుచున్నది. అందువల్లనే రుద్రదేవుడు తన హనుమకొండ శాసనంలో తన రాజ్యం తూర్పున సముద్రం నుండి పశ్చిమాన శ్రీశైలం వరకు విస్తరించి ఉన్నట్టు చెప్పుకున్నాడు! ఆ సమయంలో కృష్ణానదికి దిగువ, దిగువ ప్రాంతాలను వెలనాటి నాయకుడు రెండవ రాజేంద్ర చోడుడు పరిపాలిస్తుండేవాడు. ఈ ప్రాంతంలో రుద్రదేవుడు చొచ్చుకుపోవటాన్ని, అధికారాన్ని విస్తరించుకుంటున్న వెలనాటి నాయకుడు నిరోధించినట్లు తెలియుచున్నది. ఈ వెలనాటి నాయకులు రెండవ రాజరాజు కాలం వరకు చాళుక్య - చోళరాజులకు విధేయులై ఉండేవారని తెలుస్తోంది. అయితే, రెండవ రాజరాజు మరణించిన పిమ్మట క్రీ.శ. 1172లో వెలనాటి నాయకుడు రెండవ రాజేంద్ర చోడుడు రెండవ రాజాధిరాజు అధికారాన్ని ధిక్కరించి మొత్తం తీర ప్రాంతమంతా, ప్రకాశం జిల్లా దర్శి నుండి, విశాఖపట్నంలోని సింహాచలంవరకు విస్తరించిన ప్రాంతానికి ప్రభువయ్యాడు. అందువలన, చందవోలులో వెలనాటి నాయకుడు రెండవ కులోత్తుంగ రాజేంద్ర చోడుడు శక్తిమంతుడై తీరాంధ్ర దేశాన్ని పాలిస్తున్నంత కాలం, రుద్రదేవుడు తన అధికారాన్ని తీరాంధ్రాలో స్థిరపరచుకోలేకపోయాడు. అకస్మాత్తుగా క్రీ.శ. 1181లో రాజేంద్ర చోడుడు మరణించడంతో ఆ తర్వాత పలనాటి నాయకుల మధ్య భాతృయుద్ధం ప్రారంభమవడంతో, పలనాటి నాయకుడు నలకాముని ఆహ్వానంపై అతనకి సహాయం చేసే అవకాశం లభించడంతో తీరాంధ్ర రాజకీయాల్లో రుద్రదేవుడు జోక్యం చేసుకోవడం మొదలెట్టాడు!

వెంటనే రుద్రదేవుడు మల్యాల, కొమరవల్లి, విప్పర్ల, నతవాడికి చెందిన సమర్థ నాయకులను వెంటబెట్టుకొని బయలుదేరాడు. యుద్ధం జరిగింది. పలనాటి నాయకుడు నలకాముడు, అతడి మిత్రులు విజయం సాధించారు.

అటు తర్వాత రుద్రదేవుడు ధరణికోటపై దాడిచేసి, కోటనాయకుడు దొడ్డభీముని ఓడించి, వధించినట్లు తెలియుచున్నది. అంతేకాదు, అతని కొడుకు రెండవ కేతరాజును సింహాసనంపై నిలిపి రుద్రదేవుడు తన ఆధిక్యాన్ని స్థాపించికున్నాడు. రుద్రదేవుడు తాను వెలనాటి నాయకులపై దండెత్తినప్పుడు రెండవ కేతరాజు సహాయాన్ని పొందాడు. అటు తర్వాత రుద్రదేవుడు వెలనాటి రాజ్యం పశ్చిమ దిశలోని ప్రాంతాలను పాలిస్తున్న కొండపడమటి నాయకులను ఓడించాడు. క్రీ.శ. 1185 నాటి త్రిపురాంతకం శాసనం కొండపల్లినాడులో కృష్ణా తీరాన ఉన్న రేవూరు గ్రామాన్ని త్రిపురాంతకం మహాదేవునికి దానమిచ్చినట్లు తెలుపుతుంది. కాబట్టి ఒకప్పుడు కొండపడమటి నాయకుని ఆధీనంలో ఉన్న కొండపల్లినాడు ఆ కాలంలో రుద్రదేవుడి కైవసమయిందని తెలుస్తున్నది. వెలనాడులో రుద్రదేవుడి సైనిక కార్య కలాపాలు ఎంత ఉధృతంగా సాగాయంటే, వెలనాటి రెండవ రాజేంద్ర చోడుని మనుమడు పృథ్వీశ్వరుడు తన రాజధాని చందవోలు వదలి, గోదావరి దాటి పిఠాపురం పారిపోయాడు.

రుద్రదేవుడి విజయ యాత్రలో యాదవ రాజులు భిల్లమ, జైత్రపాలులుగట్టి వ్యతిరేకతను ప్రదర్శించినట్లు తెలియుచున్నది. రుద్రుని రాజ్య విస్తరణ విధానంలో

వారు లొంగలేదు. జల్హణుని సూక్తిముక్తావళి, హేమాద్రి చతుర్వర్గ చింతామణి ఈ విషయాన్ని వివరంగా చెప్తాయి. క్రీ.శ. 1200-1247ల మధ్య పాలించిన సింఘణుని పాట్నా శాసనంలో కాకతీయులపై సేవుణుల విజయాన్ని పేర్కొనటం గమనిస్తాం. అయితే, జైత్రపాలుడికి శత్రువుగా నిలిచిన ఆంధ్రరాజు రుద్రుడా లేక అతని తరువాత వచ్చిన మహాదేవుడా అన్న విషయం స్పష్టంగా పేర్కొనటం జరుగలేదు. యాదవరాజు చేతిలో రుద్రుడు మరణించిన సంగతి మనకు కాకతీయుల శాసనాలలో యెక్కడా కనిపించదు?! జైతుకి చేతిలో రుద్రుడి మరణాన్ని గురించి మనకు మరోవిధంగా తెలియదు, హేమాద్రి వక్తవ్యాన్ని నమ్మటానికి తగిన చారిత్రక సాక్ష్యాలు లేవు. అయితే, క్రీ.శ. 1195లో వేయబడిన వరంగల్లు జిల్లా, జనాం తాలుకాలోని బెక్కల్లు శాసనం రుద్రుడి గూర్చి తెలియజేసే చివరి తారీకు. అయినప్పటికీ చరిత్ర పుస్తకాలలో రుద్రదేవుడు దేవగిరి యాదవరాజు జైతుకి చేతిలో క్రీ.శ. 1196లో మరణించాడని పేర్కొనబడినది.

తెలంగాణాలో, తీరాంధ్రాలో రుద్రదేవుడికి కల్గిన విజయాలు అతడికి భద్రమైన స్థానాన్ని కట్టబెట్టాయి. పొలవాస, ముదిగొండ చాళుక్యులు, కందూరునాడు చోళనాయకులను నిర్మూలించడం జరిగింది. కరీంనగరు జిల్లాలోని సారవంతమైన భూములను పొలవాస నాయకులు పాలించారు. అది అనుమకొండ విషయానికి పక్కనున్న కారణంగా, దాన్ని తమ భూములలో కలుపుకోవడం కీలకం. అలాగే, ఖమ్మం జిల్లాలోని విరుసునాడు ముదిగొండ చాళుక్యులను, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలోని కందూరునాడు నాయకులను జయించడంవల్ల, ఆ రెండు ప్రాంతాలు అనుమకొండ విషయానికి తూర్పు, దక్షిణ ప్రాంతాలయ్యాయి కనుక, ఈ ప్రాంతాలను పట్టుకోవడం వ్యూహాత్మకంగా కాకతీయులకు చాలా ముఖ్యం. ఆ విధంగా, రుద్రదేవుడి దండయాత్రలు అతని రాజ్యాన్ని అన్ని వైపుల విస్తరింపజేశాయి. రుద్రదేవుడి రాజ్య విస్తీర్ణం గురించి అనుమకొండ శాసనం (A.P., Warangal; 36) ఈ విధంగా చెప్తుంది. "తూర్పున అది సముద్రంవరకు, దక్షిణాన శ్రీశైల పర్వతంవరకు, ఉత్తరాన మలయవంత పర్వత సానువుల వరకు వ్యాపించింది".

ఈ దండయాత్రలు రుద్రదేవుడి నేతృత్వంలో కాకతీయ రాజ్య భూభాగాల సరిహద్దులను విస్తరించడమే కాకుండా, ఎంతో సంపదను సహితం సమకూర్చాయి. హనుమకొండకు సమీపాన కొత్తపట్నం ఓరుగల్లు (వరంగల్లు)కు పునాదివేసి, తన రాజధానిని అక్కడకు మార్చాడు రుద్రదేవుడు. గణపేశ్వర శాసనం (Epigraphia Indica 111:85) ప్రకారం జయించిన ప్రదేశాల నుండి తీసుకొచ్చిన ప్రజలతో కొత్త పట్టణాన్ని నింపడం జరిగింది. అందులోని బస్తీలను, ప్రజలు తాము యే ప్రదేశాల నుండి వచ్చారో ఆ ప్రాంతాల పేరుతో పిల్చుకున్నారు. అంటే తెలంగాణాకు బయట నుండి వచ్చిన జనులతో కొత్త రాజధానిని నింపారన్న సూచన లభిస్తుంది. ఇలా వచ్చిన కొంతమంది జనం, సైన్యంలోను, పరిపాలనలోను, ఉన్నత శక్తిసామర్థ్యాలను ప్రదర్శించారు. వారిలో ప్రముఖుడు గంగాధరుడు. ఇతడు రెండవ ప్రోలుని మంత్రిగా చేశాడు. ప్రోలుడి మరణం తర్వాత, ఇతడు రుద్రదేవుడి కాలంలోను మంత్రిగా కొనసాగాడు. రుద్రదేవుడి పరిపాలనా కాలంలో కాకతీయ ఆర్థిక వ్యవస్థకు, వ్యావసాయక అభివృద్ధికి, నీరు సరఫరా చేసే పద్ధతులను కొత్తగా పాటించి, ఆ ప్రాంతపు అంతర్గత అభివృద్ధి చేసి, దేశ ఆర్థిక వ్యవ్స్థను పటిష్ఠం పరుచుటలో తోడ్పడ్డాడు. రుద్రదేవుడు గొప్ప విజేత. తనతండ్రి వదలి పెట్టిన కార్యంలో చెరకు, మల్యాల, రేచర్ల కుటుంబ నాయకుల, వీరసేనానుల సహాయంతో చెప్పుకోదగిన ప్రగతి సాధించాడాయన. తన తండ్రి మరణానికి దారి తీసిన తప్పిదానికి వెలనాడు రాజ్యాన్ని జయించి అతడు ధీటైన సమాధానం చెప్పాడు. కాకతీయుల ప్రతిష్ఠను, అధికారాన్ని వ్యాపింపజేయటంలో ఏమాత్రం అలసత్వం లేకుండా కృషి చేసిన సైనికులు, మంత్రులను పొందగలగటం రుద్రదేవుడు చేసుకున్న గొప్ప అదృష్టం. రుద్రదేవుడి మంత్రులలో వెల్లకి కుటుంబానికి చెందిన గంగాధరుడు గొప్ప రాజకీయవేత్త. క్రీ.శ. 1170నాటి

కరీంనగరు శాసనం, అతని రాజకీయ జీవితాన్ని గురించి క్లుప్తంగా వివరిస్తుంది. రుద్రదేవుడు చేపట్టిన అన్ని దండయాత్రలలో గంగాధరుడు పాల్గొని పేరు తెచ్చుకొనినట్లు తెలియుచున్నది. రుద్రదేవుడు గంగాధరుడ్ని సబ్బినాడు పాలజునిగా నియమించి, సలాంఛనాయుతంగా అతనికి మాండలిక బిరుదాన్ని ప్రసాదించాడు. అలాగే, ఇనంగాల బ్రహ్మిరెడ్డి కాకతీయ రుద్రదేవుడి ప్రెగ్గడగా ద్రాక్షారామ శాసనం పేర్కొందని మనం ఇంతకు ముందే చెప్పుకున్నాము. గంగాధరుడిలాగానే ఈ అధికారి కూడా ఇద్దరి రాజులను - రెండవ ప్రోలుడు, రుద్రదేవులను కొల్చినట్లు తెలియుచున్నది.

కాకతీయ అధికార పీఠమైన వరంగల్లుకు రాతికోటను నిర్మింపజేశాడు రుద్రదేవుడు. అంతేకాదు, హనుమకొండ వేయిస్తంభాలగుడి అని ప్రసిద్ధి చెందిన రుద్రేశ్వరాలయాన్ని కట్టించాడు. ఆయన ఉదాహరణను పాటిస్తూ, ఇతర నాయకులు, మంత్రులు కూడా ఎన్నో ఆలయాలను నిర్మింపజేసి, వాటికి కానుకలు కూడా సమర్పించారు. రుద్రదేవుడు కవి, పండితుడు అని తెలియుచున్నది. ఆయన సరస్వతీ విలాసం, నీతిసారం అనే గ్రంథాలు రచించినట్లు పేర్కొనబడినది. అంతేకాదు, రుద్రదేవుడు కళాసాహిత్యాలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించినట్లు చరిత్రకారులు ఉల్లేఖించారు. వేయిస్తంభాల గుడి నిర్మాణంలో పశ్చిమ చాళుక్య వాస్తు సాంప్రదాయం అనుసరించినట్లు తెలియుచున్నది.

**మహాదేవుడు (క్రీ.శ.1195-1198-99):**

రుద్రదేవుడికి సొంత వారసులు లేకపోవటంవల్ల, అతని తమ్ముడు మహాదేవుడు క్రీ.శ. 1195-96లో రాజ్యానికి వచ్చాడు. ప్రతాపరుద్రుడి ఖండవల్లి తామ్రదానపత్రం (Epigraphia Andhrica, IV, p.౧౦౨) ప్రకారం, రుద్రదేవుడు రాజ్యాన్ని తన తమ్ముడు మహాదేవుడుకి అప్పగించాడు. ఈ రాజుకు సంబంధించిన రెండు శాసనాలు మనకు లభ్యమవుతున్నాయి. ఒకటి క్రీ.శ. 1197నాటి కరీంనగరు జిల్లా, పెద్దపల్లి తాలుకా సుండెల్ల లోనిది. రెండవది వరంగల్లు కోటలో తారీకు లేని, విరిగిన శాసనం. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

సేవుణుల రాజ్యంపై మహాదేవుడు చేసిన దండయాత్ర ఒక్కటే అతని పరిపాలనా కాలంలోని ముఖ్య సంఘటనగా పేర్కొనబడినది. మహాదేవుడు రాజ్యానికి వచ్చిన వెంటనే, తన అన్న రుద్రదేవుడిలాగానే, తను కూడా, ఆక్రమణ యుద్ధాలు చేపట్టాడు. మొదటి జైతుకి కాలంలో యాదవదేశంపై దండయాత్ర చేశాడనీ, శత్రువు రాజధానిపై జరిగిన దండయాత్రలో రాత్రిపూట యేనుగుపై అధిష్ఠించి యుద్ధం చేస్తూ జైతుకిచేత వధించబడ్డాడని తెలియుచున్నది. బయ్యారం శాసనంలో మహాదేవుడిని కటకచూర కారుడు అని అభివర్ణించడం జరిగింది. బహుశా సేవుణదేశం దాడి సందర్భంగా మహాదేవుడు కటకాన్ని అంటే, కళ్యాణాన్ని, కొల్లగొట్టి ఉంటాడు?! సేవుణరాజు జైతుకితో శత్రుత్వం ఇద్దరు కాకతీయ పాలక రాజుల మరణంతో పోలేదు. జైతుకి మహాదేవుని కొడుకు గణపతిదేవుని కూడా బంధించాడు. ఆ తర్వాత, కాకతీయుల మంత్రి రేచర్ల రుద్రుడు, రాకుమారుని (గణపతిదేవుని) విడుదలను సాధించి, అతనిని కాకతీయ సింహాసనంపై క్రీ.శ. 1199లో అధిష్ఠింపజేశాడు. అంటే, మహాదేవుడు చాలా తక్కువకాలం రాజ్యమేలాడని తెలుయుచున్నది. రుద్రమదేవి తామ్రపత్ర శాసనం యాదవరాజు జైతుకి తన పుత్రిక సోమలదేవిని గణపతిదేవుడికిచ్చి వివాహం చేశాడని చెప్తుంది.

మహాదేవుడికి గణపతిదేవుడేకాక, మరో ఇద్దరు కూతుళ్ళు - మైలాంబ, కుందాంబ కూడా ఉన్నట్లు తెలియుచున్నది. వారిని కళ్యాణ చాళుక్యుల క్రింద చిన్న రాజ్యం ఇంగుర్తి ప్రాంతాన్ని ఏలుతున్న దుర్గరాజు మనవడు, బుద్ధని కొడుకు అయిన నతవాడి నాయకుడు రుద్రుడికిచ్చి వివాహం చేయటం జరిగింది. అక్కాచెళ్ళెండ్లనిద్దర్నీ నతవాది రుద్రుడికిచ్చి పెళ్ళి చేయాడం ఆశ్చర్యజనకంగానే ఉండిపోయింది! మహాదేవుడు శివభక్తుడు. ధ్రువేశ్వర పండితుడి నుండి శైవదీక్షను పొందాడని తెలియుచున్నది.

**గణపతిదేవుడు (1199-1262):**

యాదవరాజు జైతుకితో మహాదేవుడు చేసిన యుద్ధంలో మహాదేవుడు మరణించాడు. గణపతిదేవుడు పట్టుబడ్డాడు. మహాదేవునితో కలిసి చిన్నవాడైన గణపతిదేవుడు యుద్ధరంగానికి వెళ్ళాడా? లేదా? అనే అంశాన్ని నిర్ధారించలేము. గణపతిదేవుడుని పేర మనకు దొరికే తొలిశాసనం క్రీ.శ. 1199 డిసెంబరు 26 నాటిది (మంథెన శాసనం). అందులో అతనిని సకలదేశ ప్రతిష్ఠాపనాచార్య (అన్ని రాజ్యాల సంస్థాపకుడు) అని కీర్తించడం జరిగింది! అంటే, అప్పటికే గణపతిదేవుడు యాదవుల బంధికానా నుండి విడుదలయ్యాడని తెలియుచున్నది. గణపతిదేవుడు బంధీగా ఉన్నప్పుడు కాకతీయ రాజ్యంలోని సామంతులు విజృభించారు. కాకతీయ కొలువులో ఉన్న రేచర్ల రుద్రసేనాని, చాకచక్యంగా వారిని అణచి, శాంతిని నెలకొల్పి, విరియాల, మల్యాల సామంతులతో కలిసి, గణపతి దేవుడిని బంధ విముక్తుడినిచేసి, కాకతీయ సింహాసనంపై పట్టాభిషిక్తుడిని చేశాడు. క్రీ.శ. 1213లో పాలంపేటలో రేచర్ల రుద్రసేనాని వేయించిన శాసనం కాకతీయ సామ్రాజ్య పునరుద్ధరణలో రుద్రసేనాని పాత్ర స్పష్టం చేస్తుంది. యాదవరాజు కూతుర్ని (సోమాలదేవిని) గణపతిదేవుడు వివాహమాడాడన్న విషయం, చింతలూరు శాసనంవల్ల ఋజువవుతున్నది. రేచర్ల రుద్రుడూ, మల్యాల చౌండుడూ ఆదిగాగల విశ్వాసనీయ సేనానుల సహాయంతో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకున్న గణపతిదేవుడు, తీర ప్రదేశంపై దండయాత్రకు సన్నద్ధమయ్యాడు!

ద్రాక్షారామ ఆలయంలో కొన్ని శాసనాలు ఉన్నందువల్ల, తూర్పు తీరంపై రుద్రదేవుడు తన ఆధిక్యాన్ని స్థిర పరచుకున్నాడని, వాటిని సాక్ష్యంగా చూపి చెప్పలేం. వాటి తేదీలను చాళుక్య-చోళరాజు రెండవ రాజరాజు పాలన సంవత్సరాలలో వేయడంవల్ల, ఆ ప్రాంతాలలో రుద్రదేవుడు సార్వభౌమాధికారాన్ని వెలయించాడని చెప్పటానికి, ఎలాంటి అవకాశమూ లేదని స్పష్టమవుతుంది. తన పనిమీద అతడు ఆ ప్రదేశాన్ని సందర్శించినందుకే ఆ సాక్ష్యం. వెలనాటి నాయకుడు రాజేంద్రచోడుడు క్రీ.శ. 1181లో చనిపోయాడు. అతని కొడుకు మూడవగొంక, రుద్ర దేవుడితోనూ, వాయవ్యంగా తన పొరుగువారితోనూ, ఎలాంటి రాజకీయ సంఘర్షణలు లేకుండా ప్రశాంత జీవితం గడిపినట్లు కనిపిస్తుంది. గొంకరాజు కొడుకు పృథ్వీశ్వరుడు తన రాజ్యాన్ని గోదావరి ప్రాంతానికి కూడా విస్తరింపజేసినట్లు తెలియుచున్నది. ఆసక్తిదాయక విషయం ఏమిటంటే, కాకతీయరాజు రుద్రదేవుడు కూడా, ద్రాక్షారామ ఆలయంలో సర్వలోకాశ్రయ విష్ణువర్ధనుని ఐదవ పాలన సంవత్సరం (క్రీ.శ. 1186)లో ఒక శాసనం వేయించాడు. ఈ విష్ణువర్ధనుని, వేంగీచాళుక్య పిఠాపురం శాఖకు చెందిన మల్లదేవునిగా గుర్తించారు. తన పిఠాపురాన్ని పృథ్వీశ్వరుడికి పోగొట్టుకున్న మూడవ మల్లదేవునికి సాయం చేసినా, రుద్రదేవుడు లాభపడిందేమి లేదు. క్రీ.శ. 1201 వరకూ కృష్ణా ప్రాంతంలో పృథ్వీశ్వరుని ప్రభావం కొనసాగిందని శాసనాలవల్లా, సాహిత్య గ్రంథాలవల్లా తెలియుచున్నది. అయితే, కోట, చాగి, కొలను, హైహయ వంశస్థులయిన స్వతంత్ర లేక అర్ధ స్వాతంత్ర్యాన్ని అనుభవించే నాయకులు, అతని అధికారాన్ని కొంత నిలుపుదల చేశారు. క్రీ.శ. 1201నాటి నతవాడిరాజు వక్కమల్లుని శాసనం (Epigraphia Indica VI, No. 15:159) తూర్పున కాకతీయుల విజయానికి సంకేతాన్ని అందిస్తుంది. అంతకు ముందు తమ ఉనికి లేక శాశ్వత అధికారన్ని పాదుకొల్పే కాకతీయుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. శాసనాలు, సాహితీ గ్రంథాలు ఆధారంగా క్రీ.శ. 1186 నుండి క్రీ.శ. 1201 వరకు వెలనాటి ప్రభావం వ్యాప్తిపొంది ఉందని తెలుస్తుంది. కాకతీయ సైన్యాలు కృష్ణానది ముఖద్వారం దగ్గర ఉన్న ద్వీవి (ద్వీపం)వరకూ వెళ్ళాయి. అప్పుడది అయ్యనాయకుల - బహుశా వెలనాటి పృథ్వీశ్వరుని సామంతుల పాలనలో ఉంది. ఈ నాయకుల గట్టి ప్రతిఘటనను ఎదుర్కొనిన కాకతీయ సైన్యాలు ద్వీపపు కోటను ముట్టడించి, అందులోని వారు లొంగిపోయేటట్లు చేశాయి. క్రీ.శ. 1203నాటి మల్యాల

చౌండుని, క్రీ.శ. 1241నాటి కాటయల రెండు కొండపర్తి శాసనాలు (Inscriptions of Andhra Pradesh Warangal: 48,64) - ఈ యిద్దరు సేనానులు ద్వీపంపై దాడిచేసి, పృధ్వీశ్వరుని భద్ర కోశాగారాలలోని విలువయిన రత్నాలు, వజ్రాలను కొల్లగొట్టి గణపతి దేవుడి కోశాన్ని సంపన్నం చేసినట్లు చెప్తాయి! ఈ సేవలకు గుర్తింపుగా, రాజు కాటయకు ద్వీప లుఠాంక (ద్వీపాన్ని కొల్లగొట్టినవాడు) అన్న బిరుదాన్ని ఇచ్చాడు! దౌత్య కారణాలదృష్ట్యా, గణపతి దేవుడు ఇలా జయించిన ప్రాంతాన్ని తన రాజ్యంలో కలుపుకోలేదు. అయ్యనాయకులనే పరిపాలించనిచ్చాడు. అయ్య పినచోడుని ఇద్దరు కూతుళ్ళు - నారాంబ, పేరాంబలను వివాహమాడి, ఆ విధంగా స్నేహ బంధాలను నెలకొల్పాడు. వారి సోదరుడు జాయ లేక జాయపుని తన కొలువులోనికి తీసుకొని సేనాపతిని చేశాడు. ఈ విజయాల ఫలితంగా, ఈ ద్వీపంతో పాటు మొత్తం వెలనాడే క్రీ.శ. 1211 కంటే ముందే గణపతిదేవుడి వశమయిందని రెండు కొండపర్తి శాసనాలలో వాడిన భాష వెల్లడిస్తుంది. క్రీ.శ. 1211 గణపవరం శాసనతిథి (Epigraphia Indica 111:91) గణపతిదేవుడిలాగానే, నెల్లూరు చోడరాజైన తిక్కభూపాలుడు, యాదవ నాయకుడు విశ్వనాథుడు, మరికొంత మంది గణపతిదేవుడిని సామంతులు కూడా "పృధ్వీశ్వర శిరః కందుక క్రీడా వినోద బిరుదాన్ని ధరించడంవల్ల, వీరందరూ కలసి చేసిన యుద్ధంలో పృధ్వీశ్వరుడు ప్రాణాలు కోల్పోయాడని తెలుస్తుంది. గణపతిదేవుడు జాయపను వెలనాటి రాజ ప్రతినిధిని చేయడం తీరప్రాంతాలలో కాకతీయ ఉనికిని తెలియజేస్తుంది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

**దక్షిణదిశ దండయాత్ర:**

క్రీ.శ. 1213నాటి జాయపసేనాని చేబ్రోలు శాసనం (Epigraphia Indica V:142 ff) దక్షిణ ప్రాంతపు రాజులపై గణపతిదేవుడి దండయాత్రను గురించి ప్రస్తావిస్తుంది. ఆ రాజులు బహుశా నెల్లూరు తెలుగు చోడనాయకులై ఉండవచ్చు. క్రీ.శ. 1180లోనో లేక, ఆ సమీప ప్రాంతంలోనో చోళచక్రవర్తి మూడవ కులోత్తుంగ చోళుడు నెల్లూరి నుండి కంచి వరకు వ్యాపించి ఉన్న తెలుగు చోడ రాజ్యంపై దండెత్తాడు. అతడు మొదటి మనుమసిద్ధిని ఓడించి, అతని తమ్ముడు నల్లసిద్ధిని సింహాసనంపై కూర్చోబెట్టాడు. నల్లసిద్ధి, అతని తమ్ముడు తమ్ముసిద్ధి ఆ ప్రాంతాన్ని క్రీ.శ. 1207-08 వరకు పరిపాలించారు. ఆ కాలంలో వారు తమ ప్రభువుకు విధేయులుగా ఉన్నారు. అయితే, మనుమసిద్ధి కొడుకు తిక్కభూపాలుడు సింహాసనానికి న్యాయబద్ధ వారసుడు కనుక, గణపతిదేవుడి సాయంకోరి, వెలనాటి పృధ్వీశ్వరునిపై పోరు సల్పుచున్న కాకతీయ సైన్యాలతో కలిసి, క్రీ.శ. 1202లో పృధ్వీశ్వరుని అంతం చేయడం జరిగింది. ఈ సాయానికి ప్రతిగా గణపతిదేవుడు నెల్లూరు పైకి దండెత్తాడు. తమ్ముసిద్ధిని పారద్రోలి, తిక్కభూపాలుని నెల్లూరు సింహాసనంపై ప్రతిష్ఠించాడు. క్రీ.శ. 1228నాటి గణపతిదేవుడి మట్టెవాడ శాసనం (Inscriptions of Andhra Pradesh Warangal :No:61,63) అతడు చోళ రాజధాని కంచిని కొల్లగొట్టాడని తెలియజేస్తుంది. ఈ విషయాన్ని వివరణాత్మకంగా గణపేశ్వరం శాసనం పునర్వచిస్తుంది. గణపతిదేవుడు చోళ, కళింగ, సేవుణ, కర్ణాట ఆదికాగల దేశాలను జయించాక, ద్వీపంతో సహా వెలనాడు తన రాజ్యంగా చేసుకున్నాడు. (Epigraphia Indica 111:91). ఆ విధంగా క్రీ.శ. 1231 నాటికి, తిక్కరాజు అతని పూర్వికుల రాజ్యంలో గణపతిదేవుడి సహకారంతో స్థిరపడ్డాడు. ఆ రాజ్యంలో కంచి సహితము ఉన్నట్లు తెలియుచున్నది. క్రీ.శ. 1231నాటి జాయపసేనని గణపేశ్వరం శాసనం కూడా గణపతిదేవుడి చోడదేశ విజయాన్ని పేర్కొంటుంది.

గణపతిదేవుడి తూర్పుతీర దండయాత్ర మొదటి దశలో అతడు నేటి గిరిజన ప్రాంతాలయిన బస్తర్, చిత్రకూట, కళింగ, గోదావరీ ప్రాంతాలవైపుగా సాగాడు. మన్నియ ప్రాంతాల పాలకులపై సాధించిన విజయాలను క్రీ.శ. 1236నాటి కాకతీయ సేనాని రాజ్య నాయకుని ఉప్పరవల్లి శాసనం (Inscriptions of Andhra Pradesh Karimnagar : No:30) వివరిస్తుంది. ఆ రోజుల్లో

కళింగాన్ని తూర్పుగాంగరాజు మూడవ రాజరాజు పాలిస్తుండగా ఈ పాలకులు అతని సామంతులై ఉండాలి. కాకతీయ సేనాని తన విజయాల తర్వాత, కళింగలోకి ప్రవేశించి, ద్రాక్షారామానికి వచ్చి, భీమేశ్వరస్వామి అఖండ దీపానికిగాను కానుకలను క్రీ.శ. 1212 (South Indian Inscriptions IV:117)లో సమర్పించాడు. ఈ విజయవంతమైన దండయాత్ర రాజ్యానికి మరే అదనపు భూభాగాలను జోడించలేదు.

తీరాంధ్ర దక్షిణ కళింగ ప్రాంతాలను కాకతీయులు జయించడం దశలవారీగా, మూడు దశాబ్దాల కాలంలో జరిగింది. శక్తిమంతమైన చిన్నవేంగీ లేక కొలను (నరసపురి) రాజ్యం గణపతిదేవుడి పాలన క్రిందకు క్రీ.శ. 1231 వరకు రాలేదు. క్రీ.శ. 1192లో రాజ్యానికి వచ్చిన కొలని పాలకుడు మహామండలేశ్వర కొలని కేశవదేవుడు (అతని శాసనాల నుండి ఆ విషయం స్పష్ట మవుతుంది). క్రీ.శ. 1228 వరకు స్వతంత్రంగా పరిపాలించాడు. ఈ నాయకుని మరణం తర్వాత, కళింగ గాంగపాలకుడు క్రీ.శ. 1238లో మూడవ అనియంక భీముడు వేంగిని లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. కళింగరాజు కాకతీయ సైన్యాలు దక్షిణంలో వ్యస్తమై ఉన్న సమయం అనుకూలంగా భావించి, వేంగిపై దాడిచేసి, దానిని తన పాలనలోకి తీసుకుని తన అధికారిని ఒకడిని ద్రాక్షారామంలో క్రీ.శ. 1230కి ముందు నియమించాడు. గణపతిదేవుడి కళింగ దండయాత్ర ఇందుకు ప్రతీకారం తీర్చుకొనటమే. గణపతిదేవుడు తన సైన్యాన్ని ఇందలూరి సోమప్రధాని క్రింద గోదావరీ ప్రాంతాన్ని జయించడానికి పంపాడు. పదిహేనో శతాబ్దికి చెందిన కొలను గణపతి విరచిత ఆరాధ్య శైవగ్రంథం శివయోగసారం గణపతిదేవుడి దండయాత్ర విశేషాలను వివరంగా వర్ణిస్తుంది. ఇందులో కవి పూర్వికుడైన ఇందలూరి సోమప్రధాని కొలనును, కళింగను ఒకే దండయాత్రలో జయించి, కాకతీయ అధికారాన్ని పునఃస్థాపించాడని చెప్పడం జరిగింది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం పాలేశ్వర ఆలయంలోని శాసనం (క్రీ.శ. 1231), కొలనును ఆ సంవత్సరంకల్లా కాకతీయులు జయించినట్లు తెలియజేస్తుంది. అలా అది శివయోగసారం పేర్కొనిన మాటను ధ్రువపరుస్తుంది. కళింగరాజు మూడవ అనియంక భీముడు మరణించాక అతడి కొడుకు మొదటి నరసింహుడు క్రీ.శ. 1238లో సింహాసనం అధిష్ఠించాడు. అతడు గోదావరి ప్రాంతాన్ని జయించి, గాంగుల అధికారాన్ని స్థాపించ ప్రయత్నించాడు కానీ సఫలుడు కాలేకపోయాడు. ఈ ప్రాంతాలలో ఆ తర్వాత కాకతీయ వంశాంతము వరకూ వారి అధికారానికి ఎలాంటి అవాంతరమూ సంభవించలేదు. ఈ సందర్భంగా మరో విషయం కూడా చెప్పుకోవాలి. కాకతీయ సైన్యాలు కళింగపై దాడి చేశాయిగానీ ద్రాక్షారామం దాటిన ప్రాంతంలో వారి సార్వభౌమత్వాన్ని నిరూపించు కున్నట్లు చాటే చారిత్రక నిదర్శనాలు లభించలేదు.

క్రీ.శ. 1248లో నెల్లూరు రాజు తిక్కభూపతి మరణాంతరం రాజ్యంలో పరిస్థితులు అరాజకమవ్వడంతో గణపతిదేవుడి జోక్యం అవసరం పడింది. తాను తెలుగు చోడ వంశస్థుడనని చెప్పుకునే ఒక విజయగండ గోపాలుడు, నెల్లూరు రాజ్యంలో భాగాలైన చెంగల్పట్టు, ఉత్తర ఆర్కాటు జిల్లాలను బల ప్రయోగంతో తన వశం చేసుకున్నాడు. ప్రస్తుత నెల్లూరు కడప జిల్లాలు కలిగివున్న రాజ్య ఉత్తర భాగాలు మాత్రమే హక్కుదారుడైన రాజు, తిక్కభూపతి కొడుకు, రెండవ మనుమసిద్ధి ఆధీనంలో ఉన్నాయి. తన స్థానాన్ని బలపరచుకోవడం కోసం విజయగండ గోపాలుడు ద్రావిడ, కర్ణాటక రాజులతో మైత్రి బంధాలు పెట్టుకున్నాడు. ఇందుకు తోడు పడిహారీలు బయ్యాన, తిక్కన (బయ్యచోడ మహారాజు), అల్లున్ తిక్క మహారాజ గండగోపాలుడని గుర్తించారు. రెండవ మనుమసిద్ధికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. అతడిని నెల్లూరు నుండి వెళ్ళగొట్టారు. మనుమసిద్ధి బలగాల సేనాని గంగయ సాహిణిని ఓడించి, మనుమసిద్ధి భూభాగమైన కడప జిల్లా ప్రాంతాన్ని ఒక వైదుంబ నాయకుడు తిక్కరస గాంగుడు ఉరఫ్ రక్కస

గాంగుడు ఆక్రమించాడు. ఆ విధంగా రాజ్యం పోగొట్టుకున్న మనుమసిద్ధి గణపతిదేవుడి సాయమర్థించాడు. సుప్రసిద్ధ కవి, ఆంధ్ర మహాభారత రచయిత అయిన తిక్కనను మనుమసిద్ధి తన రాయబారిగా గణపతిదేవుడి సభకు పంపాడు. గణపతిదేవుడు వెంటనే సామంత భోజుని నాయకత్వంలో దక్షిణానికి సైన్యాలను పంపి, రెండవ మనుమసిద్ధిని అతని పూర్వికుల సింహాసనంపై అధిష్ఠితుని చేయమని ఆదేశమిచ్చాడు. ఆ ఆదేశాన్ని అనుసరించి, కాకతీయ సైన్యం నెల్లూరు ప్రవేశించి, బయ్యన, తిక్కన పడిహారులను వధించింది. తర్వాత ద్రావిడ మండలంలోకి ప్రవేశించిన సామంత భోజుడు తంజావూరు జిల్లా వలియారులో ద్రావిడ, కర్ణాటక, విజయగండగోపాల కూటమి సైన్యాన్ని ఓ నిర్ణయాత్మక యుద్ధంలో ఓడించి, క్రీ.శ. 1250లో కంచిని పట్టుకున్నాడు. అయితే, 1282 వరకూ విజయగండ గోపాలుని శాసనాలు కంచిలో ఉండటంవల్ల, మనుమసిద్ధి నెల్లూరు రాజ్యంలో తన అధికారాన్ని పునఃప్రతిష్ఠించుకున్నప్పటికీ, కంచిలో తన అధికారాన్ని నిలబెట్టుకోలేకపోయాడని తెలియుచున్నది. అంతకుముందు పేర్కొనినట్లు కాయస్థ నాయకుడు సేనాని గంగయసాహిణి ఓడించిన వైదుంబ నాయకుడు రక్కసగాంగుని, అతడి సేనాని చోడతిక్కను పాకనాడులో జయించి, కాకతీయ సైన్యాలు తెలుగు చోడరాజు మనుమసిద్ధికి అతని భూభాగాలు అప్పగించాయి. తెలుగు చోడబలగాల సేనాని గంగయసాహిణి సామర్థ్యాన్ని గుర్తించిన గణపతిదేవుడు అతడిని తన కొలువులోకి తీసుకొని బాహత్తర నియోగాధిపతి (డెబ్భైరెండు నియోగాల పరివేక్షకుడు)గా నియమించాడు. ఆ విషయాన్ని క్రీ.శ. 1254నాటి త్రిపురాంతకం శాసనం (South Indian Inscriptions IX:332,343) తెలియజేస్తాయి. వైదుంబ నాయకుడైన రక్కసగాంగుడి నుండి తిరిగి జయించిన మార్జవాడి ప్రాంతాన్ని గంగయసాహిణి కుటుంబపు ఆస్తిగా కూడా యిచ్చాడు గణపతిదేవుడు. మహాకవి తిక్కన విజయపు ఘనత అంతా తన ప్రభువు రెండవ మనుమసిద్ధికి కట్టబెట్టినా, కాకతీయసైన్యం నిర్వహించిన పాత్రను ఎంతమాత్రం నిర్లక్ష్యం చెయ్యడానికి వీలులేదు.

గణపతిదేవుడు యాదవరాజు జైతుగికి అల్లుడయిన కారణాన, తన అరవైయేళ్ళ సుదీర్ఘ పాలనలో సేవుణలతో అతడి సంబంధాలు మైత్రీపూర్వకంగా ఉండేవి. అంతేకాదు, గణపతిదేవుడు సేవుణ రాకుమారులకు ఆశ్రయం కల్పించి, వారిని తన కొలువులో చేర్చుకున్నట్లు తెలియుచున్నది. ఒక అప్రచురిత శాసనం ప్రకారం, ఒక యాదవ నాయకుడు విశ్వనాథుడు పృథ్వీశ్వర శిరఃకందుక క్రీడావినోద, బందీకృత ఆంధ్రరాజ బిరుదాంకితుడై ఉన్నట్లు తెలియుచున్నది. అంటే, గణపతిదేవుడి పరిపాలనా కాలంలో తీరాంధ్రపై జరిగిన కాకతీయుల దండయాత్రలో అతడు పాల్గొన్నట్టూ, అప్పుడే పృథ్వీశ్వరుడు ప్రాణాలు కోల్పోయినట్లూ, మనకు తెలుస్తుంది. అదేవిధంగా గణపతిదేవుడు పాండ్యులకు వ్యతిరేకంగా దక్షిణదిశ దండయాత్ర చేపట్టినప్పుడు అతని క్రింద కొంతమంది ఆరె లేక యాదవ నాయకులు సేనానులుగా పనిచేసినట్లు తెలియుచున్నది.

**పాండ్య దండయాత్ర:**

గణపతిదేవుడి మిత్రుడు నెల్లూరు తెలుగు చోడరాజు రెండవ మనుమసిద్ధి (వీరగండ గోపాలుని)పై క్రీ.శ. 1257లో పాండ్యరాజు మొదటి జటావర్మ సుందర పాండ్యుడు దండెత్తాడు. పాండ్య దండయాత్ర పాక్షికంగా కులోత్తుంగ రాజేంద్ర చోళుడికీ, అతని మిత్రుడు కంచి విజయగండ గోపాలునికీ వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది. మొదటగా పాండ్య సేనలు విజయగండ గోపాలునిపైన, అతడి మిత్రుడు, బలవంతుడైన కాడవ నాయకుడు కొప్పెరున్ జింగని పైన దాడిచేశాయి. వీరిద్దరూ లొంగిపోవటమేకాక, నెల్లూరి రాజ్యంపై దాడి చేయడంలో పాండ్యరాజుతో చేతులు కలిపారు.

రెండవ మనుమసిద్ధి కాకతీయ, సేవుణ, బాణ పాలకులను సాయమర్థించాడు. కాకతీయ రాజ్యం మధ్య త్రిపురాంతకంలో మూడవ రాజేంద్ర చోళుని, పాండ్య

సేనాని కొప్పెరున్ జింగాని శాసనాలు ఉండటంవల్ల, పాండ్యులు ఈ నాయకులను కాకతీయ రాజ్యంలోనికి చొచ్చుకు పొమ్మని ఆదేశమిచ్చినట్లు తెలియుచున్నది. కొప్పెరున్ జింగడు ద్రాక్షారామం వరకు వెళ్ళాడు. బహుశా కాకతీయరాజు శత్రువైన కళింగరాజుతో సంపర్కం పెట్టుకొనడానికై ఉంటుంది. అయితే, గణపతిదేవుడు అతడిని ఓడించాడు. కానీ, పాండ్య శిబిరంలో చీలిక తీసుకువచ్చే లక్ష్యంతోనూ, కాడవ నాయకుని హృదయం గెలవడంకోసమూ, గణపతిదేవుడు కొప్పెరున్ జింగను వీరపాదముద్ర (వీరులకు తొడిగే కడియం)తో అలంకరింపజేసి గౌరవించాడు.

పాండ్యుల శాసనాల ప్రకారం, కొప్పెరున్ జింగ నాయకత్వంలో దండయాత్ర ఉత్తరంగా ముందుకు సాగగా, పాండ్యుల ముఖ్యసైన్యం జటావర్మసుందర పాండ్యుడు, భువనైక విక్రమ పాండ్యుడు, జటావర్మ వీరపాండ్యుల నాయకత్వంలో నెల్లూరును పట్టుకొని, వీరగండ గోపాలుని వధించింది. ఆ ఘోర యుద్ధం క్రీ.శ. 1263లో ముత్తూరులో జరిగింది. అతడి మిత్రులు కాకతీయులు, సేవుణులు, బాణులు కాలికి బుద్ధి చెప్పారు. (Annual Report on Indian Epigraphy and South Indian Epigraphy, 1913: No. 232,340). తెలుగు చోడరాజ్యాలు నెల్లూరు, కంచి పాండ్య సామ్రాజ్యంలో భాగాలయ్యాయి. ఈ విజయాన్ని పురస్కరించుకొని జటావర్మ సుందరపాండ్యుడు వీరాభిషేకాన్ని చేయించుకున్నట్లు తెలియుచున్నది. (Annual Report on Indian Epigraphy and South Indian Epigraphy, 1914:pt II, Para 18). బొమ్మపై కాకతీయ వరాహం, బొరుసుపై పాండ్య చిహ్నం చేపలతో ప్రత్యేక నాణాలు ముద్రితమయినట్లు తెలియుచున్నది. ఇదే గణపతిదేవుడికి మొదటిదీ, చివరదీ అయిన యుద్ధ పరాజయం. దీని తర్వాత అతడు చురుకుగా రాజకీయాల్లో పాల్గొనడం విరమించినట్లుగా తెలియుచున్నది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

వ్యతిరేక పరిస్థితులలో గణపతిదేవుడి పాలన ప్రారంభమైనప్పటికీ, అది ఆంధ్రదేశ చరిత్రలో అత్యంత ఉజ్జ్వలంగా భాసిస్తుంది. అతడు సింహాసనం అధిష్ఠించే సమయానికి ఆంధ్రదేశం రాజకీయ అస్థిరత్వంలో కొట్టుమిట్టాడుతోంది. చాళుక్య-చోళులు, కళ్యాణ చాళుక్యుల అధికారం అంతరించింది. కొన్ని చిన్నా-పెద్దా రాజ్యాలు మిగిలాయి. అవి ఆధిక్యం కోసం ఒకదానితో మరొకటి పోట్లాడుకుంటున్నాయి. ఆ తరుణంలో గణపతిదేవుడు దేశానికి, ఒక రాజకీయ ఏకతను, పునరుద్ధరించే బాధ్యతను చేపట్టాడు. యుద్ధం చేసీ, దౌత్యంవల్లా అతడు ఆ లక్ష్యాన్ని సాధించగలిగాడు. అది ప్రశంసనీయం!

గణపతిదేవుడికి మహాఘనత తీసుకువచ్చే అతిగొప్ప సంఘటన అతడు తన రాజధానిని హనుమకొండ నుంచి ఓరుగల్లుకు మార్చడం. కొత్త రాజధాని పునాది రాయిని గణపతిదేవుడి తాత రెండవప్రోలుడు తన పాలన చివరి సంవత్సరంలో వేసినట్లు తెలుస్తోంది. గణపతిదేవుడు ఆ పనిని కొనసాగించి, ఒకదానిలో ఒకటిగా రెండు కోటలను రాతి, మట్టి కోటలను కట్టాడు. క్రొత్త కోట, సంప్రదాయం ప్రకారం, డెబ్బైయైదు బురుజులు కలిగివుండి, రాజుకొలువులో ఉన్న ఒక్కొక్క నాయకునికీ, దాని రక్షణ బాధ్యతను అప్పగించడం జరిగింది.

**గణపతిదేవుడి సామంతులు, మంత్రులు, సేనానులు:**

గణపతిదేవుడి పాలనాకాలం విజయవంతంగా సాగటానికి, సామంతులు, మంత్రులు, సేనానులు ఆయనకు చక్కని సహకారాన్ని అందించినట్లు చరిత్ర రూఢి చేస్తోంది.

కాకతీయ సామంతుల్లో పాతవారు రేచెర్ల, మల్యాల నాయకులు. రేచెర్ల కుటుంబపు పెద్దరుద్రుడు గణపతిదేవుడి పాలన మొదటి రోజుల్లో రాజ్యభాగాన్ని పునఃప్రతిష్ఠించటంలో అతిముఖ్యపాత్ర నిర్వహించాడు. యాదవ రాజులతో జరిగిన యుద్ధాలలో రుద్రదేవుడు, అతడి తమ్ముడు మహాదేవుడు మరణించారు. గణపతిదేవుడిని దేవగిరిలో బంధించడం జరిగింది. సర్దారులు తిరుగుబాటు చేశారు. కాని రేచర్ల రుద్రుడు విశ్వాసనీయుడుగా నిలిచి, తిరుగుబాటును అణచి వేయటమేకాక, విదేశీ ఆక్రమణదారులను పారద్రోలాడు.

దేవగిరి బందిఖానా నుండి గణపతిదేవుడు తిరిగి వచ్చిందాకా రాజ్యాన్ని పాలించాడు. రుద్రుని సైన్యాధిపతి రాజనాయకుడు, కళింగపై దండయాత్ర చేయడమేకాక, చాలా యుద్ధాల్లో విశిష్ట సేవలందించాడు. మల్యాలలో చౌండుడు, అతని కుమారుడు కాటయ ప్రత్యేక ప్రస్తావనకు ఎంతో అర్హులైనవారు. వారు దీవి, వెలనాటి ప్రాంతాల విజయంలో ప్రధాన పాత్ర వహించారు. ప్రాముఖ్యపరంగా తర్వాత పేర్కొనతగినవారు. దీవి అయ్యనాయకులు. వారిని ఓడించిన గణపతిదేవుడు రాజీధోరణిలో తన కొలువులోకి తీసుకున్నాడు. జాయపసేనాని విశిష్టతలున్నవాడు. అతడి బిరుదంగజ-సాహిణి సూచించేటట్లు, గజబలాన్ని నడుపుటలో అతడు చక్కటి నైపుణ్యం కలిగినవాడని విదితమవుచున్నది. అంతేకాదు, జాయపసేనాని కళలు, సాహిత్యంలో అభిరుచీ, అభినివేశం ఉన్న ప్రసిద్ధ పురుషుడు. అతడు నృత్యంపై రచించిన గ్రంథం ''నృత్తరత్నావళి'' ఆ అంశంలో విశిష్ట గ్రంథంగా పరిగణింపబడుతున్నది.

గణపతిదేవుడి సామంత మిత్రుల (సామంతులు కాదు)లో ముఖ్యులు, శక్తిమంతులు - నెల్లూరు చోడరాజు రెండవ మనుమసిది, ఏరువ భీముడు, కొణిదెన ఓపిలిసిది. చక్రనారాయణ రాజులు - మాధవ మహారాజు, అతడి కొడుకు సారంగధరదేవుడు మరో సామంత పంక్తివారు. వీరు ప్రస్తుతపు ప్రకాశం జిల్లాలోని అద్దంకి ప్రాంతాన్ని పాలించారు. కొంతమంది వేంగి చాళుక్య వంశస్థులైన నాయకులు గణపతిదేవుడి శాసనాలలో పేర్కొనబడినట్లు తెలుస్తోంది. అయితే, వారి ప్రాముఖ్యత మనకేమి తెలియుటలేదు. గణపతిదేవుడి కూతురు రుద్రమను నిడదవోలు చాళుక్య రాకుమారుడు వీరభద్రునకిచ్చి వివాహం చేయడం జరిగింది. (South Indian Inscriptions X:360).

గణపతిదేవుడి మంత్రులలో ఇందులూరి సోమయ మంత్రి ప్రముఖుడు. జన్మరీత్యా బ్రాహ్మణుడు. అయినప్పటికీ, సభలో అతడు మహాప్రధానిగా వ్యవహరించాడు. తన అస్త్రవృత్తిని అనుసరిస్తూ, తన అర్హత కారణంగా మాత్రమే రాజు కొలువులో ఉన్న ప్రముఖ సేనానుల్లో ఒకడయ్యాడు. క్రీ.శ. 1212లో గణపతిదేవుడు కళింగపై దండెత్తినప్పటి విశేషాలు, విజయాలు *శివయోగసారం* అనే గ్రంథం వివరంగా వర్ణిస్తుంది. ఆ కాలంలోని మరోగొప్ప ప్రధాన మంత్రి ప్రోలయ భీమనాయకుడు. అతడి విశిష్ట బిరుదాలు:- ఆరువేలదూషక (వెలనాడు విధ్వంసకుడు), కంచి చూరచూర (కంచిని కొల్ల గొట్టినవాడు). అలాగే, కాయస్థ వంశస్థుడైన గంగయ సాహిణి మరోవిశిష్ట అధికారి. తన పరిపాలన తర్వాతి భాగంలో గణపతిదేవుడు అతనిని తన కొలువులోకి తీసుకున్నాడు. అతడి ఉన్నత పదవి - బాహత్తర నియోగాధిపతి (డెబ్భైరెండు రాజసేవల పర్యవేక్షకుడు - వీరిలో సైన్యాధ్యక్షుడు, మహాప్రధానులు, ప్రధానులు మొదలయిన పదవులు కూడా వస్తాయి.) గణపతిదేవుడి కొలువులో ఈ ఉన్నత పదవిని వహించడమేకాక, అతడు తురగ సాధనికుడు (తురగబల సేనని)గా కూడా సేవలందించినట్లు తెలియుచున్నది. నల్గొండ జిల్లాలోని పానుగల్లు నుండి, కర్ణాటకలోని కోలారు జిల్లా కైవారం వరకూ ఉన్న విశాల భూభాగాన్ని గణపతిదేవుడు అతనికి ఇచ్చినట్లు తెలియుచున్నది. అతడు ఆ ప్రాంతాన్ని కడప జిల్లాలోని తన రాజధాని వల్లూరు పట్టణం నుండి పరిపాలించినట్లు తెలుస్తోంది. (South Indian Inscriptions X:364). గంగయసాహిణి క్రీ.శ. 1257లో మరణించాడు. తర్వాత అతని మేనల్లుడు జన్నిగదేవుడు అతడి వారసుడిగా గణపతిదేవుడి కొలువుకు వచ్చినట్లు చరిత్ర చాటుచున్నది.

ఒక విధంగా పేర్కొనాలంటే, గణపతిదేవుడి విజయాలన్నీ పైన పేర్కొన్న కుటుంబాల వారి విశ్వసనీయ సేవలవల్లనే సాధ్యపడ్డాయి. ఆ విధంగా గణపతిదేవుడు తన కుటుంబాన్ని ధృఢంగా స్థాపించి, రాజ్య ఆర్థిక పరిస్థితి మెరుగు పరచటంపై దృష్టి పెట్టాడు. ఆ దిశగా చేపట్టిన మొదటి చర్య సముద్ర వ్యాపారాన్ని ప్రోత్సాహించడం. ఇది సతార్కిక పరిణామమే. గణపతిదేవుడి సేనాని జాయపనాయకుని గణపేశ్వరం శాసనం (Epigraphia Indica III:82-84), గణపతిదేవుడి మోటుపల్లి స్తంభ శాసనం (Epigraphia Indica XII: 188-

1౨౦) ఈ క్రమాన్ని వివరిస్తాయి. మొదటి శాసనం గణపతిదేవుడి పేర ఆలయ నిర్మాణం గురించీ, నరిగెగడ్డకు వచ్చే ప్రతి పడవ చెల్లించే సుంకాన్ని ఆలయానికి కానుక ఇవ్వటం గురించీ, నమోదు చేస్తుంది. రెండవ శాసనం "అభయ శాసనం", అది సముద్ర వ్యాపారస్థులకు హామీలనిస్తుంది. ఈ ప్రాంతాల్లో వర్తక వాణిజ్య ఉద్ధారణ, పురోభివృద్ధులకు అందించిన ప్రోత్సాహం గురించీ, ఈ కాలంలో, అంటే పన్నెండవ శతాబ్ది నుండి వ్యాపారస్థులు, చేతివృత్తుల వారు చేసిన అసంఖ్యాక దానాలు చెప్తాయి. రాజ్య కోశాన్ని నింపడమే కాకుండా, రాజ్యానికిది గట్టి ఆర్థిక పునాదిని వేసింది. స్థానిక సముద్ర వ్యాపారంతో సంబంధమున్న వివిధ సామాజిక బృందాల ఆర్థిక పరిస్థితి కూడా యిందువలన మెరుగు పడుతుంది.

గణపతిదేవుడు రాజ్య విస్తీర్ణం కోసం చేసిన యుద్ధాలలో విజయం పొందడమే కాకుండా బంధుత్వాలు కలుపుకొని కూడా అందరితో సఖ్యంగా ఉన్నాడు. గణపతిదేవ మహారాజు తన సర్వతోముఖ ప్రతిభతో మహాసామ్రాజ్యాన్ని స్థాపించి చక్రవర్తి అయ్యాడు. దాదాపు ఆంధ్రదేశమంతా ఆనాడు కాకతీయుల యేలుబడి క్రింద ఉండేదని చరిత్ర చాటుచున్నది. గణపతిదేవుడి 63 యేండ్ల సుదీర్ఘ కాలపు పరిపాలన 1262లో ముగిసినట్లు చరిత్ర రూఢి చేస్తున్నది.

**ప్రొ. రావినూతల సత్యనారాయణ**
**హైదరాబాద్. ఫోన్: 961 852 4702.**

## కుచేలుడు – కృష్ణుడు



పాకాల వెంకట
రాజమన్నార్

పాకాల వెంకట రాజమన్నార్ న్యాయశాస్త్ర కోవిదులుగా, పరిపాలనాదక్షునిగా అగ్రస్థానంలో నిలిచిన ఆంధ్రుడు. అయితే ఆయన మనసుకు సన్నిహితంగా సాహిత్యం, లలిత కళలు ఉండేవి. రాజమన్నార్ సాహిత్య, సాంస్కృతిక సభలలో పాల్గొని ఆ సభలకు నిండుదనం తెచ్చేవారు. అంతేకాదు ఆయన రక్షించిన నాటికలు ఎంతగానో ఆదరణ పొందాయి. రాజమన్నార్ 1929లో రచించిన 'తప్పెవరిది' తెలుగులో మొట్టమొదటి ఆధునిక నాటికగా పేర్కొంటారు.

రాజమన్నార్‌కి కవులంటే ఎంతో గౌరవం. ఎంకి పాటలు రచించిన నండూరి సుబ్బారావు గారిని స్వయంగా కలుసుకుని అభినందించడానికి రాజమన్నార్ ఏలూరులో ఆయన ఇంటికి వెళ్లారు. నండూరి వారు రాజమన్నార్ అంతటివారు తమ ఇంటికి రావడమేమిటని ఆశ్చర్యపోయి కృష్ణుడు కుచేలుని ఇంటికి వచ్చినట్లు ఉందన్నారు. రాజమన్నార్‌ని సాదరంగా ఆహ్వానించి తమ కవితలు వినిపించారు.

రాజమన్నార్ విని ఎంతో ఆనందించి నండూరి వారిని అభినందించి ఇప్పుడు కుచేలుడు కృష్ణుడిని విడిచిపెడుతున్నారు. అలా నిజ జీవితంలో రాజమన్నార్ సందర్భశుద్ధితో హాస్యాన్ని పండించేవారు.

అందుకు మరొక ఉదాహరణ మద్రాసులో జరిగిన ఒక సభకి రాజమన్నార్ అధ్యక్షత వహించారు. ఇక రాజమన్నార్ అధ్యక్షోపన్యాసం ఇవ్వాలి. సభ నిర్వాహకులు 'Now President's Address' అని రాజమన్నార్‌ని ఆహ్వానించారు. రాజమన్నార్ తమ కుర్చీలోంచి లేచి మైక్ వద్దకు వచ్చి "విక్టోరియా క్రిసెంట్, ఎగ్మూర్, మద్రాసు" అని చెప్పి కూర్చున్నారు.

అది వారి చిరునామా - సభలో నవ్వుల జల్లులు, హోరు తగ్గాక రాజమన్నార్ మైక్ వద్దకు వచ్చి ఆలోచనలు రేకెత్తించే ఉపన్యాసం ఇచ్చారు.

**తాజీ ప్రసాద్, చెన్నై. ఫోన్: 917 674 6536.**

## రాజ్యాంగ పరిషత్తులో మహిళలు-7
# దుర్గాబాయ్ దేశ్‌ముఖ్
**(ఏప్రిల్ 15, 1909 - మే 9, 1981)**

*- ముత్తంగి వేంకట భారతలక్ష్మి*

అనన్య ధైర్యసాహసాలుగల స్త్రీమూర్తి ఆమె. స్త్రీ జనాభ్యుదయానికి అవతరించిన శక్తిస్వరూపిణి. అకుంఠిత దీక్ష, దృఢనిశ్చయంగల ధీశాలి. 'దుర్గాబాయి స్త్రీ అయితేనేమి, అందువలన ఇబ్బంది ఏముంది, ఆమె నాతో సరితూగగల వ్యక్తి' అని ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రశంసించారు. ఆమె కూడా 'ఉక్కు మహిళ'గా పేరు తెచ్చుకుంది. అడుగడుగునా తగిలే అవరోధాల్ని అధిగమించి, పట్టుదల, సహనం, సామర్థ్యంతో ముందుకు సాగిన ఆమె వ్యక్తి కాదు, ఓ వ్యవస్థ. మద్రాసు, హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లోనూ దేశం నలుమూలలా ఎన్నో ప్రజాహిత సంస్థలను స్థాపించడం ఓ జీవిత కాలంలో ఎవరికీ సాధ్యం కాని పని. అనేక సంస్థలను స్థాపించి, అవి సక్రమంగా పనిచేసేలా చేయడం దుర్గాబాయికే సాధ్యం. 'భారత స్త్రీజాతికి పునరుజ్జీవనం' ప్రసాదించిన దుర్గాబాయి తెలుగు నేలపై పుట్టటం తెలుగు వారికే కాదు - యావత్ మహిళా లోకం గర్వించదగిన విషయం. 15 జూలై, 1909లో రాజమండ్రి (రాజమహేంద్రి)లో చెన్నూరు రామారావు, కృష్ణవేణమ్మలకు జన్మించింది. ఆమె తాతగారు మనోహరరావు పంతులు చిత్తశుద్ధిగల పోలీస్ ఆఫీసర్. ఆయన సంఘసంస్కర్త వీరేశలింగం పంతులుగారి సాంఘిక, సంస్కరణ కార్యకలాపాలకు మద్దతు ఇచ్చేవారు. నాటి ఆచారం ప్రకారం ఎనిమిదేళ్ల దుర్గాబాయిని జమిందారీ కుటుంబానికి చెందిన సమీప బంధువు సుబ్బారావుకిచ్చి వివాహం చేయడం, తండ్రి తాను చేసిన పొరపాటుగా తర్వాత గుర్తించారని దుర్గాబాయి తన ఆత్మకథలో రాసుకున్నారు.

సంఘసేవపట్ల తనకున్న ఆసక్తి, శ్రద్ధలను అర్థం చేసుకొన్న భర్త సుబ్బారావు ఆమెను తనతో వైవాహిక జీవితం గడపమని నిర్బంధించలేదు. ఆమె తన 12వ ఏట ప్రారంభించిన బాలికా హిందీ పాఠశాలకు లక్ష రూపాయలు అందజేసి ఆర్థికంగా ఆదుకున్నాడు. ఆమె చేసే సంక్షేమ కార్యక్రమాలకు అండగా నిలబడేవాడు. తండ్రి కాకినాడలో ఉద్యోగం చేస్తుండటం వలన కాకినాడనే తన కార్యకలాపాలకు కేంద్రంగా చేసుకుంది. పదేళ్లకు మాతృభాష తెలుగు, సంస్కృతం, హిందీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించింది. సంగీతం పట్ల ఆమెకున్న మక్కువ గ్రహించి, తండ్రి ఆమెకు వీణా, హార్మోనియం నేర్పించారు. తాతగారి సంఘసంస్కరణాభిలాష, తండ్రి సంఘసేవ, తల్లి పట్టుదల వారసత్వంగా పొందిన దుర్గాబాయి 12వ యేట 'బాలికా హిందీ పాఠశాల'ను స్థాపించి, జాతీయ సమైక్యతకు హిందీ భాష అవశ్యకతను గుర్తించింది. ఆమె తల్లి మొదటి విద్యార్థిని, తన వయసుగల ఆడపిల్లలకు హిందీ పాఠాలతోపాటు దేశభక్తి గీతాలు పాడడం, రాట్నం వడకటం నేర్పించసాగింది. 30-50 సంవత్సరాల మధ్య వయసుగల స్త్రీలు హిందీ నేర్చుకొంటుంటే ఎంతో మంది పురుషులు, ఆమె భర్త సుబ్బారావు హిందీ నేర్చుకొన్నారు.


దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

కాకినాడలో (1923) కాంగ్రెస్ మహాసభలు ప్రారంభమయ్యే కొన్ని నెలల ముందు 600 మహిళలకు హిందీ నేర్పి కాంగ్రెస్ సభలలో వాలంటీర్లుగా పనిచేయడానికి శిక్షణ ఇచ్చింది. 14 ఏళ్ల దుర్గాబాయిని వాలంటీర్‌గా తీసుకోవడానికి వయసు సరిపోదు కాబట్టి, ఆ బాలికను 'ఖాదీ ఎగ్జిబిషన్' స్టాల్ దగ్గర టిక్కెట్ తీసుకుని లోనికి సందర్శకులను అనుమతించమని కొండా వెంకటప్పయ్య గారు ఆదేశించారు. నెహ్రూజీ పరధ్యానంగా టికెట్ లేకుండా ప్రవేశించబోతే దుర్గాబాయ్ టికెట్ అడిగింది. అక్కడున్న కాంగ్రెస్ నాయకులు ఆమెను మందలించారు. 'తప్పేముంది - నా డ్యూటీ నేను చేశాను' అని దుర్గాబాయి బదులు ఇవ్వగా, ఆ బాలిక కర్తవ్య నిర్వహణకు ముగ్ధులైన నెహ్రూజీ టికెట్

తీసుకొని ఆ బాలికను అభినందించారు. కాంగ్రెస్ మహాసభలకు వచ్చిన చిత్తరంజన్ దాస్, షౌకత్ ఆలీ, జమూన్‌లాల్ బజాజ్ వంటి ప్రభృతులు బాలికా హిందీ పాఠశాలను దర్శించి, ప్రిన్సిపాల్ ఎవరని అడుగగా కొండా వెంకటప్పయ్య దుర్గాబాయే ప్రిన్సిపాల్ అని చెప్పారు. ఆంగ్ల విద్యను బలవంతంగా రుద్దుతున్నారని ఐదో క్లాస్‌తో చదువు విరమించిన బాలిక 12వ ఏట పాఠశాలను స్థాపించి ఎంతో మంది స్త్రీలకు వాలంటీర్లుగా శిక్షణ ఇవ్వటం ఆమెకు పుట్టుకతోనే నాయకురాలి లక్షణాలు వచ్చాయనిపిస్తుంది.

1921లో గాంధీజీ పర్యటనతో దుర్గాబాయి కుటుంబం దేశ సేవకు అంకితమయినది. దుర్గాబాయి తండ్రి కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరారు. విదేశీ వస్త్రాలను తగలబెట్టి, ఇంట్లోవారంతా ఖద్దరు, చేనేత వస్త్రాలు ధరించడం మొదలుపెట్టారు. కుమార్తె దేశభక్తి తల్లిదండ్రుల్ని, తమ్ముడిని ప్రభావితం చేశాయి. ఆంధ్ర దేశ పర్యటనలో భాగంగా గాంధీజీ రాజమండ్రికి వస్తున్నారని, దుర్గాభాయి తెలుసుకుంది. అంత చిన్న వయసులోనే సామాజిక స్పృహ గల దుర్గాబాయి, సాంఘిక దురాచారాల వలన మగ్గిపోతున్న దేవదాసీలు, పరదాలలో బంధీలుగా ఉన్న మహమ్మదీయ స్త్రీలు, గాంధీ మహాత్ముని కలుసుకున్నట్లయితే వారిలో మంచి మార్పు వస్తుందని ఆశించి, సభా నిర్వాహకులను అడిగింది. వారు జాతీయోద్యమానికి ఐదు వేలు ఇస్తే గాంధీజీని కలుసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. ఆమె దేవదాసీల వద్దకు వెళ్ళి, గాంధీజీ దక్షిణాఫ్రికా భారతీయుల గౌరవం గురించి పడిన పాట్లు విశదీకరించి, రూ. 5,000/- విరాళంగా సేకరించి, వారం రోజుల్లో ఆ మొత్తాన్ని కొండా వెంకటప్పయ్య, బులుసు సాంబమూర్తి గార్లకు అందజేసింది. టౌన్‌హాల్‌లో సమావేశానికి దేవదాసీలు, ముస్లిం స్త్రీలు రాలేదు. అందుచేత ఆమె స్థానిక పాఠశాల హెడ్మాస్టర్ శివయ్య శాస్త్రి గారిని అడిగింది. చిన్నపిల్ల దుర్గాబాయి గాంధీజీ కోసం పని చేస్తుంటే పెద్దవాడైన తాను అరెస్టుకు భయపడనని చెప్పి పాఠశాల ప్రాంగణంలో సమావేశానికి ఏర్పాటు చేశారు. ఐదు నిమిషాల సమయాన్ని కనీసం రెండు నిమిషాలైనా గాంధీజీ మాట్లాడితే చాలు అని చెప్పింది దుర్గాబాయి కాంగ్రెస్ నాయకులకు. గాంధీజీ ఉపన్యాసం అరగంట పైన సాగింది. ఆయన హిందూస్థానీలో మాట్లాడుతుంటే దుర్గాబాయి తెలుగులో తర్జుమా చేసింది. టౌన్‌హాల్లో సభకు ఆలస్యమవుతోందని నాయకులు దుర్గాబాయిపై కోపం ప్రదర్శించారు. ఆయన అంతసేపు మాట్లాడడం తన తప్పు కాదని, వారినే ఆయన ఉపన్యాసాన్ని ముగించమని చెప్పమంది. దేవదాసీలు, ముస్లిం వనితలను చైతన్య పరచడంకంటే వేరే నిర్మాణాత్మక కార్యక్రమాలు లేవని గాంధీజీ చెప్పారు. వీడ్కోలు ఇస్తున్న దుర్గాబాయ్‌ని కారు ఎక్కమని ఆదేశించారు. ఆయన ప్రసంగాన్ని కొండా వెంకటప్పయ్య గారు తర్జుమా చేయడానికి సిద్ధంగా ఉంటే అంతకు ముందు సమావేశంలో అద్భుతంగా తర్జుమా చేసిన దుర్గాబాయినే చేయమన్నారు. ఆనాటి నుంచి దక్షిణ భారతదేశంలో గాంధీజీ ఎక్కడ ఉపన్యాసం ఇచ్చినా దుర్గాబాయి తర్జుమా చేసేది. గాంధీజీ ప్రసంగం పూర్తయ్యాక దేవదాసీలందరూ తమ ఆభరణాలను తీసి జాతీయోద్యమానికి విరాళంగా ఇచ్చివేయటం కాంగ్రెస్ నాయకులకు విస్మయం కలిగించింది. దుర్గాబాయి సామర్థ్యం చూశాక, గాంధీజీకి మహిళలు జాతీయోద్యమంలో నిర్మాణాత్మకమైన పాత్ర వహించగలరని నమ్మకం కలిగింది. దుర్గాబాయి ఏర్పాటు చేసిన సమావేశం దేవదాసీలలో మార్పు కలిగించింది. ఈ సంఘటనే 1937లో దేవదాసీ వ్యవస్థను రద్దు చేయడానికి చట్టం చేయాలని మద్రాసు శాసన మండలి సభ్యురాలు డా. ముత్తు లక్ష్మారెడ్డిగారికి స్ఫూర్తి కలిగించింది.

బ్రిటిష్ పాలకులు హిందీ భాషా ప్రచారం చేసేవారిని, నూలు వడకటం, జాతీమ గీతాలు ఆలపించడం, జాతీయోద్యమ భాగాలుగా పరిగణించి, వారిని తీవ్రవాదులుగా ముద్రవేసి జైల్లో పెట్టేవారు. దుర్గాబాయి 'బాలికా హిందీ పాఠశాల'లో జరుగుతున్న కార్యకలాపాలను చూసి, ఆమెను అరెస్టు చేసి జైల్లో

పెట్టారు. దుర్గాబాయి జైల్లో ఉన్నప్పుడు తల్లి కృష్ణవేణమ్మ, సోదరుడు నారాయణరావు పాఠశాలను నడిపేవారు. దుర్గాబాయి జైలుకు వెళ్లినప్పుడు చాలామంది భయపడి హిందీ అభ్యసించడానికి రాలేదు. 1932 సత్యాగ్రహ ఉద్యమంలో కృష్ణవేణమ్మను కూడా అరెస్టు చేశారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం చీరాలలో చేయాలని, టంగుటూరి ప్రకాశం పంతులు, కాశీనాధుని నాగేశ్వరరావు గార్లు అనుకుంటే దుర్గాబాయి దక్షిణ భారతదేశానికి ముఖ్య పట్టణమైన మద్రాసులో ప్రారంభించమని కోరింది. మద్రాసు నగరంలో సత్యాగ్రహ శిబిరాలు వెలిశాయి. 70 వాలంటీర్లతో మొదటి సత్యాగ్రహం ప్రారంభం కాగానే నాయకులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ వాలంటీర్ల సమావేశంలో దుర్గాభాయిని ఉద్యమ నాయకురాలిగా చేశారు. ఊరేగింపులో ముఖాన పెద్ద బొట్టు, జుట్టు విరబోసుకుని, చేతిలో జెండా పట్టుకుని జాతీయగీతం ఆలపిస్తున్న దుర్గాబాయిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆవిడ రూపం, ఉత్తేజం, కంఠం ప్రజల్లో దేశభక్తిని, ఉత్సాహాన్ని రేకెత్తించింది. మద్రాసులో ప్రముఖ నాయకులంతా ఆమె వెనుక నడిచారు. హైకోర్టు లెవెల్ క్రాసింగ్ వద్ద పోలీసులు లాఠీఛార్జి చేయగా ఎంతో మంది నేలకొరిగారు. ఆడవాళ్లను ప్రక్కకు తోసేసారు. సాంథోమ్ బీచ్ వద్ద ఉప్పు పిడికిలితో పట్టుకొన్న దుర్గాబాయిపై లాఠీచార్జి చేశారు. చర్మం చిట్లిపోయి రక్తం కారుతూంటే ఆమెను వ్యాన్‌లో పడవేశారు. ఇదంతా చూస్తున్న లార్డ్ కన్నింగ్ హామ్ 'లయనెస్ దుర్గాబాయి' (సివంగి దుర్గాబాయి) అన్నాడట.

ఆమె నాయకత్వంలో ఉద్యమం శిఖరాగ్రస్థాయికి చేరుకొన్నది. స్వయంగా ఉప్పు తయారు చేసి, ఇతరులను ప్రబోధించినందుకు ఆర్కాటు జిల్లా మెజిస్ట్రేట్ సంవత్సరం పాటు జైలు శిక్ష విధించడంతో ఆమెను విడుదల చేయమని ప్రజలు తీవ్రమైన హర్తళ్లు జరిపారు. రాయవెల్లూరు జైలులో దుర్గాభాయితో పాటు అక్కడ ఆచంట రుక్మిణి లక్ష్మీపతి, పొణకా కనకమ్మ, సంగం లక్ష్మీబాయి, సుభద్ర, కృష్ణవేణి మొదలైన వారంతా ఉండటం చేత జైలు ఓ సాంస్కృతిక కేంద్రమైనది. ప్రతి క్షణం నూతనోత్సాహాలు నింపే సాధనా స్థలంగా మారింది. విదుషి ఆచంట రుక్మిణి లక్ష్మీపతి వద్ద దుర్గాబాయి ఆంగ్ల నేర్చుకుంది. జైలులో తాను హిందీ ఎంతో మందికి నేర్పేది. జైలు జీవితంలోనే ఆమెకు రచయిత్రిగా గుర్తింపు వచ్చింది. జైలు అధికారులను దుర్గాబాయి ఇబ్బందులకు గురిచేసేది. చీరలు చింపి, జెండాలు తయారుచేసి 'గాంధీజీకి జై - స్వాతంత్రం సిద్ధించాలి' అంటూ జైల్లో తిరిగేవారు. జైలు అధికారులు రంగు చీరలు తీసేస్తే, తెల్లచీరలకు ఆకుపసరు, కుంకుమ రాళ్ల పొడితో జెండాలు తయారు చేసేవారు. జైల్లోనే తన బృందంతో నాటకాలు వేయించడం, జాతీయ గీతాలు పాడడం చేస్తూ, కరకు జైలు వాతావరణాన్ని ఆనందోత్సాహాలతో నింపేవారు. జైల్లో ఖైదీలంతా రాట్నంపై నూలు వడికేవారు. రెండు వందల నుండి రెండు వేల గజాల నూలు వడకాలని నిశ్చయించుకున్నారు. దుర్గాబాయి రోజూ 2000 గజాలు నాజూకుగా, సన్నగా నూలు వడికేవారు. ఆమెలా నూలు ఎవ్వరూ వడకలేరని అనుకునేవారు. తాను వడికిన నూలుతో ఆకుపచ్చ అంచుతో నాజూకుగా రెండు ధోవతులు తయారుచేసి వాటిని నెహ్రూకు బహూకరించింది.

1981లో గాంధీ - ఇర్విన్ ఒడంబడిక కారణంగా దేశవ్యాప్తంగా రాజకీయ ఖైదీలను విడుదల చేయగా దుర్గాబాయ్ 7 మార్చి, 1931న విడుదలయింది. లండన్‌లో రెండో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ విఫలం కావడంతో గాంధీజీ తిరిగి రాగానే అరెస్ట్ చేశారు. అందుకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు, పికెటింగ్‌లు, బహిరంగ సభలు చేశారు. 1932లో దుర్గాబాయిని, ఆమె తల్లి కృష్ణవేణమ్మను అరెస్టు చేసి, దుర్గాబాయిని రహస్యంగా మధురై జైలుకు తరలించి ఆమె తల్లిని కన్ననూరు జైల్లో పెట్టారు. రాజకీయ ఖైదీగా దుర్గాబాయికి 'ఏ' క్లాసు ఇచ్చినా ఆమె 'సి' క్లాసు కోరుకొన్నారు. ప్రభుత్వం దృష్టిలో ఆమె అత్యంత ప్రమాదకర వ్యక్తి. ఆమెను మరణ దండన విధించిన నేరస్థుల మధ్య గాలి, వెలుతురు చొరని గదిలో

ఉంచారు. భోజనానికి ఇనప మూకుడు, కటిక నేలపై పడక. ఆమె జైల్లోని పోలీసులను మానవత్వంతో మెలిగి, అందరినీ సమానంగా చూడమని చెప్పినందుకు, ఆమెను దారుణ హింసకు గురి చేశారు. మరణశిక్ష విధించబడిన ఖైదీల ఆక్రందనలు, ఆర్తనాదాలు, అరుపులకు అలవాటుపడ్డ దుర్గాబాయి ఓ రోజు అలసి సొలసి కటిక నేలపై గాఢంగా నిద్రించింది. ఇంతలో గొంతు పిసికి చంపబోతున్న పసికందు ఆక్రందన వినిపించి ఉలిక్కిపడి లేచింది. ప్రక్క గదిలో ఇద్దరు స్త్రీలు తిట్లతో, పోట్లాటలతో గొడవ చేస్తున్నారు. పసిబిడ్డ ఏడుపు విని, ఆమె గోడ ఎక్కి అవతలి వైపుకు దూకి, గొంతు పిసికి చంపబోతున్న బిడ్డను బలవంతంగా లాక్కొని గుండెలకు హత్తుకుంది. ఒకామె దుర్గాబాయిని కింద పడేసి రక్కి కొట్టింది. అంతవరకూ కుమ్ములాడుకొన్న స్త్రీలు ఇద్దరూ కుమ్మక్కై బిడ్డను లాక్కొన్నారు. బిడ్డను చంపేసి ఆ నేరం దుర్గాబాయి మీద నెట్టే ప్రయత్నం చేశారు ఆ కర్కోటక స్త్రీలు. దుర్గాబాయి కేకలు విని అక్కడకు వచ్చిన జైలు సూపరింటెండెంట్, జైలు అధికారులు వారి బారి నుండి ఆమెను రక్షించారు. ఆమె ధైర్యసాహసాలకు మెచ్చుకొని ఆమెను ఏదైనా కోరుకోమన్నారు. ఆమె తోడు కోసం వీణ కొనివ్వమని అడిగింది. వీణా గానం తన జైలు జీవితానికి ప్రాణాధారమవుతుందని ఆశించింది. ఆమె జీవితంలో ఈ సంఘటన ఎంతో మార్పు తెచ్చింది. ఆమెలో 'లా' చదవాలనే కోరిక బలపడింది. దుర్గాబాయి స్వభావం తెలుసుకున్న జైలు అధికారులు ఆమెపై కక్ష సాధింపు చర్యలు మానివేశారు. ఆమె ఆరోగ్యం క్షీణించి ఫిట్స్ రావడం మొదలైనందున బ్రిటీష్ ప్రభుత్వం ఆమెను విడుదల చేసింది. జైల్లో ఒంటరితనం, జైలు వాతావరణం, అక్కడ ఆహారం - వీటన్నింటి ప్రభావం మూలంగా జైలు నుంచి విడుదలైన తర్వాత ఒక సంవత్సరం పాటు ఆమె ఏ పనీ చేయలేక పోయింది. డాక్టర్ సలహాపై రాజకీయాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించింది.

కాకినాడకు తిరిగివచ్చిన దుర్గాబాయిని గోరాగారు (గోపరాజు రామచంద్రరావు బాటనీ ప్రొఫెసర్‌గా ఉండేవారు) ఆంగ్ల విద్యను నేర్పించి, 1934లో బెనారస్ విశ్వవిద్యాలయంలో మెట్రిక్ పరీక్షకు వెళ్ళమని సలహా ఇచ్చారు. మదన్ మోహన్ మాలవ్య ప్రోత్సాహంతో, ఆర్థిక ఉపకార వేతనంతో ఇంటర్మీడియట్ కూడా చదవగలిగింది. రాజకీయాలపై ఆసక్తితో రాజనీతి శాస్త్రం (పొలిటికల్ సైన్స్)లో పట్టభద్రురాలవ్వాలని వాంఛించినా మాలవ్యాకు స్త్రీలు రాజనీతిశాస్త్రం చదవడం ఇష్టం లేదు. దుర్గాబాయి వెంటనే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రయాణమైంది. అప్పటి వైస్-ఛాన్సలర్ డా. కట్టమంచి రామలింగారెడ్డి ఆమెతో స్త్రీలకు ప్రత్యేక వసతి గృహం లేనందున సీటు ఇవ్వడం సాధ్యం కాదు అన్నారు. ఉన్నత విద్యలో చేరే స్త్రీలందరూ కలసి ఒక వసతి గృహం ఏర్పరుచుకొని, వైస్-ఛాన్సలర్‌తో ఆ సమస్య తీరిందని చెప్పారు. 1939లో దుర్గాబాయి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఏ. ఆనర్స్ రాజనీతి శాస్త్రంలో చేరింది. మొదటి డివిజన్‌లో పాసైనందువలన టాటావారి స్కాలర్‌షిప్‌తో ఆమెకు 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్'లో చదవడానికి అవకాశం లభించింది. కానీ ఆమె 'లా' చదివి స్త్రీల సమస్యలను పరిష్కరించాలనే పట్టుదలతో మద్రాసులో 'లా' కాలేజీలో చేరి 1941లో 'లా' పట్టా పుచ్చుకొని, 1942 డిసెంబర్‌లో ప్రాక్టీసు ప్రారంభించింది. 1937లోనే దుర్గాబాయి తల్లి, సోదరుడితో మద్రాసుకు మకాం మార్చారు. ఆమె పేరుప్రఖ్యాతులు గాంచిన ప్రథమ మహిళా క్రిమినల్ లాయర్. భర్త సుబ్బారావు దుర్గాబాయి అనుమతితో పునర్వివాహం చేసుకున్నాడు. కానీ కొన్నాళ్ళకే మరణించాడు. ఆయన చనిపోయేముందు రెండో భార్య తిమ్మాయమ్మతో దుర్గాబాయి దగ్గరికి వెళ్లమని చెప్పారట. మహిళలపట్ల ఎంతో సానుభూతి చూపే దుర్గాబాయి ఆమెను అక్కున చేర్చుకుని, ఆమెకు చేతిపనులు విభాగంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగంలో చేర్చుకుని భద్రత కల్పించింది.

దుర్గాబాయి మైలాపూరు తాము ఉంటున్న ఇంట్లో వెనకనున్న విశాల స్థలంలో 'లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్' పేరుతో స్కూలు (ప్లే స్కూల్) పెట్టారు.

ఆటలు, పాటలు ద్వారా విద్య నేర్పించడం వారి తల్లి కృష్ణవేణమ్మ చూసుకునేవారు. పిల్లలతో పాటు అధిక సంఖ్యలో తల్లులు వచ్చి హిందీ, తెలుగు, చేతిపనులు నేర్చుకోవడంతో వారందరికీ ఇంట్లో స్థలం సరిపోయేది కాదు. దుర్గాభాయి 'ఆంధ్ర మహాసభ' మైలాపూర్‌లోనే నిర్వహిస్తున్న బులుసు సాంబమూర్తి గారి అనుమతితో స్త్రీల విభాగం 'ఆంధ్ర మహిళా సభ' ప్రారంభించి స్త్రీలకు ఉపయోగకరమైన నేత, టైలరింగ్, అల్లికలు నేర్పించడం మొదలుపెట్టారు. 'లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్' ఆ విధంగా 'ఆంధ్ర మహిళాసభ'గా పరిణామం చెందింది. ఈ సంస్థ శాఖోపశాఖలుగా విస్తరిల్లి, అక్షరాస్యత, విద్య, సాంకేతిక విద్య, ఆరోగ్యం ఇతరత్రా సేవలు చేపట్టింది. చాలా కాలం వరకు ఆంధ్ర మహిళా సభకు సొంత భవనాలు లేవు. చిన్నప్పటి నుండి ప్రజాహిత సంస్థలు స్థాపించడంలో నిష్ణాతులైన దుర్గాబాయికి జైపూర్ రాజా, విక్రమ్ దేవ్ వర్మ రూ. 5,000/-, మీర్జాపురం, బొబ్బిలి, పిఠాపురం సంస్థానాధీశులు స్థలం, భూరి విరాళాలు అందజేయడంతో భవనాలు ఏర్పడి ఆంధ్ర మహిళా సభ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థగా నిలిచింది. దుర్గాబాయి రాసిన 'ది స్టోన్ దట్ స్పీకెత్' (రెండు సంపుటాలు)లో 'ఒక్కో పునాదిరాయి ఒక్కో సంస్థకు భవనంగా మారి సాంఘిక సంక్షేమ బాటలో ఒక్కో మైలురాయిగా నిలిచాయి' అన్నారు. 12 ఏళ్ల బాలికగా ఆమె స్థాపించిన 'బాలికా హిందీ పాఠశాల' మొదటి మైలురాయి. అక్కడ నుండి శరవేగంతో ఆమె ఎన్నో సంస్థలు స్థాపించారు.

ఆంధ్ర మహిళా సభతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణ పర్యవేక్షిస్తూ, మరోవైపు హైకోర్టులో మొదటి మహిళా క్రిమినల్ లాయర్‌గా పేరుప్రఖ్యాతులు గాంచిన దుర్గాబాయి పేరును రాజ్యాంగ నిర్మాణ సభకు, టంగుటూరి ప్రకాశం, రాజాజీ, కామరాజ్ నాడార్ ప్రభృతులు ప్రతిపాదించారు. చారిత్రాత్మక ఘట్టం అయిన రాజ్యాంగ నిర్మాణంలో స్టీరింగ్ కమిటీకి ఎంపికైన ఏకైక మహిళ దుర్గాబాయి. ఒక సంవత్సరంలో ముగుస్తుంనుకొన్న రాజ్యాంగసభ ఇంచు-మించు మూడు ఏళ్లపాటు కొనసాగింది. అప్పుడామె ఢిల్లీ ఫెడరల్ కోర్టులో నమోదయి ప్రాక్టీస్ చేస్తూ రాజ్యాంగ నిర్మాణ సభ సమావేశాలకు హాజరయ్యేవారు. స్త్రీల సమస్యల గురించి చర్చించకుండా దాటవేస్తారేమోనని ఆమె అప్రమత్తతో అన్ని సెషన్స్‌కు హాజరయ్యేవారు. రాజకుమారి అమృత్ కౌర్, రేణుకా రేలతో పాటు ఎంతో బాధ్యతాయుతంగా 725 సవరణలు ప్రతిపాదించారు. హిందూ కోడ్ బిల్లు ప్రామాణికం చేయడానికి సెలెక్ట్ కమిటీని, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, టేక్‌చంద్, రేణుకా రే, పి.యస్. దేశ్‌ముఖ్, దుర్గాబాయి, అమ్ము స్వామినాథన్, వి.సి. కేశవరావులతో డా. అంబేద్కర్ ఏర్పరిచారు. హిందూ కోడ్ బిల్లులో ప్రధాన అంశాలు - 1. ఆస్తిలో హక్కు, 2. రెండు పెళ్లిళ్లు, 3. భరణం, 4. విడాకులు, 5. దత్తత, 6. మైనర్ పిల్లల, 7. మైనరు పిల్లల సంరక్షణ బాధ్యత. వీటన్నింటినీ కూలంకషంగా చర్చించిన తర్వాత దీన్ని చట్టబద్ధం చేయాలని తమ సహకారాన్ని అందించిన వారిలో ముఖ్యులు సర్. బి.యన్. రావు, దుర్గాబాయి, అల్లాడి కృష్ణస్వామి. రాజ్యాంగ పరిషత్‌లో చర్చలు జరుగుతున్న సమయానికి, దుర్గాబాయికి న్యాయవాదిగా అనుభవం, న్యాయశాస్త్రాన్ని క్షుణ్ణంగా చదివిన విద్యార్థిగా న్యాయశాస్త్రంపై అవగాహన ఉంది. న్యాయశాఖకు సంబంధించిన అంశాన్ని ప్రతిపాదిస్తూ వాటిని నూతన రాజ్యాంగంలో చేర్చాలని కోరారు.

1. స్వతంత్ర భారతదేశంలో న్యాయాధికారులంతా భారతీయ పౌరులై ఉండాలి. 2. న్యాయస్థానాలు (జ్యుడీషియరి) స్వయం ప్రతిపత్తి కలిగి ఉండాలి. 3. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రాలలో నూతన హైకోర్టు స్థాపన. 4. ప్రావెన్షియల్ హైకోర్టులలో న్యాయాధికారుల నియమించే పద్ధతి. 5. దిగువ కోర్టులో న్యాయం జరగనట్లయితే పౌరులకు హైకోర్టు, సుప్రీమ్ కోర్టులకు అప్పీలు చేసుకునే అవకాశం.

దుర్గాబాయి దార్శనికత, విశాల దృక్పథం కేవలం కోర్టులకు, న్యాయశాస్త్రానికి పరిమితం కాలేదు. సాంఘిక సంక్షేమంలో ఆమెకున్న అపారమైన అనుభవం, బాల్యం

నుండి సామాజిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఆమెకు స్త్రీల సమస్యల పట్ల లోతైన అవగాహన ఉంది.

దేవదాసీ వ్యవస్థ రద్దు చేయించడానికి చట్టం మద్రాసు శాసనమండలిలో ఏర్పరచిన డా. ముత్తులక్ష్మి రెడ్డిని అభినందిస్తూ, దేశంలో హేయమైన ఈ వ్యవస్థను వివిధ రూపాలలో మతానికి సంబంధించిన విషయంగా పరిగణిస్తున్నారని, రాజ్యాంగంలో ఈ వ్యవస్థను రద్దు చేయించాలని ప్రొ. షా చేసిన ప్రతిపాదనను దుర్గాభాయి మద్దతునిచ్చారు. బానిసలుగా ఆడా, మగా భేదం లేకుండా మనుష్యుల్ని ఒక చోట నుండి మరొక చోటికి రవాణా చేయడం రాజ్యాంగపరంగా నిషేధించాలని ఆమె ప్రతిపాదించారు.

బాల కార్మికులకు, యువతకు వెట్టి చాకిరీ నుండి ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఆ విధంగా చట్టం చేయాలని సూచించారు.

తల్లిదండ్రులు లేని అనాధ శిశువులను, విడిచిపెట్టేసి శిశువులను గురించి ప్రభుత్వం పట్టించుకోనట్లయితే వాళ్ల గతేమవుతుంది, ఎటువంటి రక్షణా, ఆలనా-పాలనా లేని లేకపోయినట్లయితే అటువంటి బాలలు అనాధ బాలికల ఆకలి బాధకు తట్టుకోలేక దొంగతనాలకు పాల్పడిన నేరగాళ్ళుగా తయారు కావటం, బిచ్చగాళ్ళుగా మారటం జరుగుతుంది. అందుచేత ప్రభుత్వం సకాలంలో వారిని ఆదుకొని మంచి పౌరులుగా తయారు చేసే బాధ్యత తీసుకోవాలి. ఆరోగ్యంగా, మంచి బుద్ధులతో వాళ్లు పెరిగేటట్లు చూడాలి. ఈ బాలలే భావి పౌరులు, వారిపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. అడవి పక్షులకు రక్షణ కల్పించాలని డ్రాఫ్టింగ్ కమిటీ నిర్ణయించి చట్టం చేసినప్పుడు, అనాథ బాలల సంరక్షణ కోసం చట్టం తయారు చేయలేదా? అని సాంఘిక సంక్షేమం గురించి నిరంతరం తపనపడే దుర్గాబాయి ప్రశ్నించారు. కౌన్సిల్ ఆఫ్ స్టేట్ సభ్యుల వయోపరిమితి 35 సంవత్సరాల నుండి 30 సంవత్సరాలు తగ్గించి, యువతకు వారి శక్తి సామర్థ్యాలు చూడడానికి అవకాశం ఇవ్వాలన్నారు. అందుకు ఉదాహరణ 40 ఏళ్లలోపే అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులయిన నెహ్రూజీని, 24 ఏళ్లకే ఇంగ్లాండుకు ప్రధానమంత్రి అయినా పిట్ ఉదాహరణలిచ్చి తన వాదనను సహేతుకంగా సాగించారు. గవర్నరును ఎన్నుకోవాలా, నామినేట్ చేయాలా అన్న అంశంపై వాదోపవాదాలు జరిగినప్పుడు దుర్గాబాయ్ పార్టీ రాజకీయాలకు, పార్టీ తగాదాలకు అతీతంగా ఉండే వ్యక్తిని నియమించాలి అంటూ కొన్ని నిబంధనలు పేర్కొన్నారు. సినిమాలకు సెన్సార్ బోర్డు అవశ్యకతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం సెన్సార్ బోర్డును ఏర్పరచాలని అన్నారు. సినిమాలలో జాతీయ, అంతర్జాతీయ సమైక్యత భావనలు ప్రకటించే విధంగా, విలక్షణమైన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలి అన్నారు.

రాయవెల్లూరు జైలులో ఉండగా దుర్గాభాయికి అక్కడ మహిళా ఖైదీలను కలుసుకొని మాట్లాడే అవకాశం కలిగింది. వారికి ఎందుకు నేరస్థులుగా ఖైదులో ఉంచారో వారికే తెలియని పరిస్థితిని గమనించి, స్త్రీలు విద్య లేకపోవడం వలన అటువంటి దుస్థితిలో ఉన్నారని రాజ్యాంగ పరిషత్‌లో స్త్రీ విద్య అవశ్యకతను నొక్కి వక్కాణించారు దుర్గాబాయి. స్వాతంత్రోద్యమంలో రాజకీయ ఖైదీలుగా జైలు శిక్ష అనుభవించిన మహిళా సభ్యులు జైలు సంస్కరణల గురించి రాజ్యాంగ పరిషత్‌లో ఎమెండ్‌మెంట్స్ చేయాలని సూచించారు. జైల్‌లో (డిటెన్షన్) మూడు నెలలకు మించి, నేరం విచారించకుండా ఏ వ్యక్తినీ ఉంచరాదని, ఖైదీకి అప్పీలు చేసుకునే హక్కు ఇవ్వాలని పూర్ణిమా బెనర్జీ ప్రతిపాదించిన ఎమ్ ఎమెండ్‌మెంట్‌తో ఏకీభవిస్తూ దుర్గాబాయి ఖైదీలను విచారణ జరిపే బోర్డు ఎదుట హాజరు పరచని ఖైదీలు అప్పీల్ చేసుకునే అవకాశం ఇవ్వాలన్నారు. జైల్లో ఉన్న వ్యక్తి మీద కుటుంబ పోషణ భారం ఉన్నట్లయితే ఆ వ్యక్తి జైల్లో ఉన్నంత కాలం కుటుంబ పోషణ బాధ్యత ప్రభుత్వం వహించాలని పూర్ణిమా బెనర్జీ అన్నారు. అనుభవంగల క్రిమినల్ లాయర్‌గా దుర్గాబాయి నేరస్తుల కుటుంబ పోషణా భారం ప్రభుత్వం వహించడం ఎంతవరకు ఆచరణలో

సాధ్యం అని ప్రశ్నించి, నేరస్తులు కుటుంబ పోషణా భారం ప్రభుత్వం వహిస్తే నేరగాళ్లు నేరాలు మళ్లీ-మళ్లీ చేసి జైలుకు వస్తారన్నారు.

ప్రివీ కౌన్సిలు రద్దు చేసి, నూతన రాజ్యాంగంలో సుప్రీంకోర్టు ఏర్పరచాలి అన్న అంశంపై చర్చ జరుగుతుండగా, దుర్గాబాయి స్పందించి, చాలా కాలం నుండి న్యాయపాలన పరిధిలో బ్రిటిష్ న్యాయవ్యవస్థ, ఇండియా న్యాయ వ్యవస్థతతో సంబంధం ఉంది. దీనివలన ఇండియా న్యాయ వ్యవస్థ లబ్ధి పొందింది. నూతన రాజ్యాంగంలో సుప్రీంకోర్టు రాజ్యాంగాన్ని కాపాడే వ్యవస్థలా ఉండాలి అన్నారామె. డ్రాఫ్ట్ కాన్స్టిట్యూషన్‌ను సమర్థిస్తూ ఆమె ఈ రాజ్యాంగం ఏ ఒక్క పార్టీది కాదు. ప్రజల కాన్స్టిట్యూషన్. కొంతమంది విమర్శకులు 'మోటార్ వెహికల్ టాక్సేషన్ యాక్ట్'లా ఉందని చాలా చౌకబారుగా మాట్లాడారు. మన రాజ్యాంగంలో ప్రప్రథమంగా వయోజన ఓటు హక్కు, ప్రాథమిక హక్కులు ప్రతి పౌరులకు స్త్రీ-పురుష భేదం లేకుండా ఇస్తూ చిన్న-చిన్న ముక్కలుగా ఉన్న దేశాన్ని పటిష్టమైన దేశంగా తయారు చేసింది. అటువంటి రాజ్యాంగాన్ని మోటార్ వెహికల్స్ టాక్సేషన్‌తో పోల్చడం చాలా చౌకబారు వ్యాఖ్య అన్నారామె. రాజ్యాంగ నిర్మాణ సభలో దుర్గాబాయి సభ్యులతో పోట్లాడడానికి కారణం, ఆమె అనుభవం, వైదుష్యం, బాల్యం నుండి ఆమె ఎదుర్కొన్న పరిస్థితులు, అందుచేతనే ఆమె దృఢమైన వాదనా బలంతో వారిని ఎదుర్కోగలిగారు. రాజ్యాంగంపై మరొక విమర్శ ఏమిటంటే రాజ్యాంగం పౌరులకు విధులు (డ్యూటీలో) విధించలేదు. హక్కులు మాత్రమే ప్రకటించింది. పౌరులు తమ హక్కులు అడిగినప్పుడు వారి బాధ్యతలను గుర్తించుకోవాలి అన్నారు దుర్గాబాయి.

ఆనాటి వార్తాపత్రికలలో ప్రభుత్వం త్వరలోనే భాషా ప్రాతిపదికపై ఆంధ్ర రాష్ట్రం ఏర్పడడానికి సదుపాయాలు కలిగిస్తున్నామని ప్రకటించింది. 'పార్టిషన్ కౌన్సిల్' ప్రజల ప్రశాంత జీవితాన్ని భంగాపరచకుండా జాగ్రత్తలు వహిస్తారని ఆశిస్తున్నాను అని ముగించారామె. ఆమె జాతీయ భాషపై వాదోపవాదాలు జరిగినప్పుడు దుర్గాబాయి అన్నారు- "జాతీయ భాషగా హిందూస్థానీయే ఉండాలి. ఎందుచేతనంటే హిందీ మరియు ఉర్దూ హిందుస్థాని భాషగా మారింది. ఉర్దూ లిపికి బదులుగా దేవనాగరి లిపిని వాడడానికి అంగీకరించారు మన మిత్రులు. హిందుస్థానీ జాతీయ భాషగా అంగీకరించాలంటే దక్షిణాది రాష్ట్రాలకు కష్టమే కాని దక్షిణ భారతదేశంలో మేమంతా గాంధీజీ పిలుపునందుకుని హిందీ ప్రచారం చేశాం. ఇది నేర్పించడానికి పాఠశాలలు పెట్టి నేర్పాము. ముఖ్యంగా స్త్రీలు, పిల్లలు హిందీ నేర్చుకోవడానికి ఉత్సాహం చూపించేవారు. గాంధీజీ ప్రభావం వల్ల సాయంకాలం వేళల్లో కాలేజీ విద్యార్థులు, లాయర్లు, ఆఫీసులో పనిచేసేవారు రిక్రియేషన్ క్లబ్‌లకు వెళ్లకుండా శ్రద్ధగా హిందీ నేర్చుకునేవారని ఆమె తన స్వానుభవంతో చెప్పారు. 15 సంవత్సరాల గడువు ఇవ్వాలి. ఈలోగా నేర్చుకుని భాషను ఉపయోగించగలరు" అన్నారామె.

రాజ్యాంగ పరిషత్తు సమావేశాలు ముగిశాక ఆమె ప్రధాన మంత్రి నెహ్రూ దగ్గరికి వెళ్లి "నాకు ఇంక సెలవు ఇవ్వండి. రాజ్యాంగ నిర్మాణ సభలో పాల్గొనడం, మీవంటివారి పరిచయ భాగ్యం కలగటం, నా జీవితంలో గొప్ప సంఘటన" అన్నారు. నీవు వెళ్లటానికి వీల్లేదని ఖచ్చితంగా చెప్పి, ఆ మర్నాడే ఆమెను ప్రణాళికా సంఘం సభ్యురాలిగా నెహ్రూ ప్లానింగ్ కమిషన్‌లో సాంఘిక సంక్షేమ విభాగానికి దుర్గాబాయిని ఆధ్వర్యం వహించమని కోరారు. కానీ సాంఘిక సంక్షేమం కోసం ధనం కేటాయించలేదు. ఆమె వెనువెంటనే నెహ్రూ దగ్గరికి వెళ్లి ధనాన్ని కేటాయించనప్పుడు సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా చేయాలని సూటిగా ప్రశ్నించింది. నెహ్రూ ఏ సమాధానం చెప్పలేక ఆనాటి ఆర్థిక శాఖా మంత్రి సి.డి. దేశ్‌ముఖ్‌ను కలుసుకోమని సలహా ఇచ్చారు. సి.డి. దేశ్‌ముఖ్ దుర్గాబాయి చెప్పినదంతా విని ప్రణాళిక నిర్ణయం అయిపోయిన తర్వాత డబ్బు కేటాయించడం ఎలా సాధ్యం అన్నారు. అందుకామె- "నేను జన్మతః సంఘ సేవికను, 30 ఏళ్ళుగా సంఘ సేవకుల మధ్య జీవిస్తున్నాను. వారి

స్వచ్ఛంద సేవకు దేశం రుణపడి ఉంది. స్వరాజ్యం వచ్చాక సంఘ సేవా కార్యక్రమాలను ఇప్పుడే చేపట్టబోతున్నాం. అటువంటి సంస్థలకు చేయూతనివ్వకపోవడం ఎంతవరకు సబబు?'' అని ఆయనను నిలదీసింది. దేశ్‌ముఖ్ ఆమె పటిష్టమైన వాదనకు ఊపిరి తీసుకోలేక పోయారు. "మీకు ఇప్పుడు ఎంత కావాలి'' అని అడిగాడు. సుమారు పది కోట్లు కావాలన్నది. ప్లానింగ్ కమిషన్ చివరి దశలో నాలుగు కోట్లు కేటాయిస్తానని దేశ్‌ముఖ్ చెప్పారు. అంతవరకైనా లభిస్తున్నందుకు దుర్గాబాయి సంతోషించింది. భారతదేశ ప్రణాళికా సంఘంలో ఏకైక మహిళా సభ్యురాలు ఆమె. దుర్గాబాయి కార్యదీక్ష, సామాజిక సేవపట్ల ఆమెకున్న నిబద్ధత దేశ్‌ముఖ్‌ను ఆకర్షించాయి. నెహ్రూ ఆశించినట్లుగా వారిరువురూ వివాహం దేశాభ్యుదయానికి దోహదపడింది. 1953లో నెహ్రూజీ సాక్షి సంతకం చేయగా, కృపలానీ దంపతులు సాక్షులుగా దుర్గాబాయి, దేశ్‌ముఖ్‌ల వివాహం జరిగింది. దుర్గాబాయి తన పుస్తకం 'చింతామణి, నేను'లో వారిరువురి మధ్య సదవగాహన, వారిరువురూ కలిసి చేసిన సాంఘిక సంక్షేమ కార్యక్రమాల గురించి వ్రాశారు. దుర్గాబాయి ప్రణాళికా సంఘ సభ్యత్వానికి రాజీనామా చేస్తే నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆమెను సెంట్రల్ సోషల్ వెల్‌ఫేర్ బోర్డుకు అధ్యక్షురాలిగా నియమించారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1953-62 వరకు పదేళ్లపాటు సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేశారు. భారతదేశ సాంఘిక సంక్షేమానికి ఆ దశకం స్వర్ణయుగమని చెప్పవచ్చును. ఆనాటి స్వచ్ఛంద సేవాసంస్థలకు చైతన్యం కలిగించి పటిష్ఠంగా సేవాభావంతో పని చేయించగలగడం దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కే సాధ్యం. పదివేలకు పైగా స్వచ్ఛంద సేవాసంస్థలకు జీవం పోసినది ఆమె. సాంఘిక సంక్షేమంలో స్త్రీ సంక్షేమంతో పాటు బాలల, బలహీన వర్గాల, దివ్యాంగుల సంక్షేమం కూడా ఉన్నాయి. ఆమె ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా ఉన్నప్పుడు సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డును స్థాపించినట్లయితే స్త్రీల సంక్షేమ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు రూపొందించడం సాధ్యమవుతుందని ప్లానింగ్ కమిషన్ సిఫార్సు చేశారు. ఏ సమాజంలోనైనా స్త్రీలు పూర్తి భాగస్వాములు అనే ఆమె విశ్వాసం. ఆమె తన శక్తి సామర్థ్యాలు వినియోగించి, స్త్రీలను, బాలికలను సమాజంలో వారి పాత్ర పూర్తిగా నిర్వహించేలా తీర్చిదిద్దారు. ఆమె పెంచి, పోషించిన సంస్థలన్నింటిలో అంకితభావం ఉన్న సామాజిక సేవా కార్యకర్తలు ఉండేవారు. వారికి ఆమె నియమావళిని నిర్దేశించారు. ఆమె భగవంతుని సేవగా చేసే స్వచ్ఛంద సేవకులను అవార్డులు, రివార్డుల కోసం ఆశించవద్దని ఆదేశించారు. అదేవిధంగా అంకితభావంతో నిస్వార్థంగా సేవ చేసే వారి కృషిని అన్నివిధాలా గుర్తించాలని చెప్పారు. ఆమె మహాత్మాగాంధీ ఆచరణలో చూపించిన నిష్కామ సేవను ఉదహరించేవారు. "సంస్థలలో 'తర్వాత ఎవరూ' అన్న ప్రశ్న ఉదయించకూడదు. మనుషులు శాశ్వతం కాదు, కానీ సంస్థలు శాశ్వతంగా ఉంటాయి. ఆ భావనతోనే నేను ప్రతిభాపాటవాలున్న యువతరాన్ని వెతికి, తరువాత తరాన్ని తయారు చేస్తాను. నిజాయితీ, సామర్థ్యం కల ఒక కార్యకర్త కొన్ని కోట్లు గడించగలడు. కొన్ని కోట్ల ధనం నిజాయితీ, నమ్మకస్తుడయిన ఒక కార్యకర్తను తయారు చేయలేదు. అనుకున్న కార్యాన్ని సాధించాలంటే ఎన్నో ఒడిదుడుకులు, కష్టనష్టాలకు ఓర్చుకొని ధైర్యంతో, సాహసంతో ముందుకు సాగాలి'' అన్నారామె. ఆమె జీవితమే ఆమె సందేశం. 1958లో భారత ప్రభుత్వం జాతీయ స్త్రీ విద్యాసమాఖ్యకు దుర్గాబాయిని అధ్యక్షురాలిగా నియమించింది. స్త్రీ విద్యాభివృద్ధికి ఆమె వందకు పైగా సలహాలు, సూచనలు తయారు చేశారు. 1959-1962 వరకు నిర్వహించి, జాతీయ కౌన్సిల్ సిఫారసులను కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ అంగీకరించనందువలన దుర్గాబాయి రాజీనామా చేయవలసి వచ్చింది.

ఢిల్లీ పురపాలక సంఘం నుండి స్థలం సేకరించి, ఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించి, ఆంధ్ర స్కూల్ భవన్, శ్రీ వెంకటేశ్వర కళాశాల భవనాలు ఏర్పరిచింది.

భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ''సాంఘిక సేవలో దుర్గాబాయి నా గురువు'' అని ప్రశంసించారు. ఢిల్లీలో, మద్రాసులో ఎన్నో భవనాలు నిర్మించి, ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన దుర్గాబాయి 1956లో ఆంధ్ర మహిళా సభ హైదరాబాద్‌లో స్థాపించారు. ఆంధ్ర మహిళా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శిశువిహార్, ప్రాంతీయ చేతివృత్తుల శిక్షణా సంస్థ, చేనేత శిక్షణా ఉత్పత్తి కేంద్రం, నర్సింగ్ హోమ్, మిడ్ వైఫ్ ట్రైనింగ్, వయోజన సాంఘిక విద్యాభవనం వీటన్నిటితోపాటు 'బ్లైండ్ రిలీఫ్ సొసైటీ' అనే సంస్థను పునరుద్ధరించే బాధ్యతను కూడా ఆమె చేపట్టింది.

జైల్లో ఉండగా రచనా వ్యాసంగం మొదలుపెట్టి, కథలు, నవలలు రాసిన దుర్గాబాయి తర్వాత సాంఘిక సంక్షేమమే ఆమెకు ఊపిరి అయినందున, ఇంగ్లీషులో 'ది స్టోన్ దట్ స్పీకెత్', 'చింతామణి అండ్ ఐ', 'సోషల్ వెల్‌ఫేర్ ఇన్ ఇండియా' గ్రంధాలను మూడు సంపుటాలుగా రచించారు. సోషల్ వెల్ఫేర్ గురించి ఎన్నో వ్యాసాలు ప్రచురించారు. 2009లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ శతజయంతి ఉత్సవం జరిగింది. దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాంఘిక సేవ గురించి, ఇంగ్లీషు, తెలుగులో పుస్తకాలు, అసంఖ్యాకమైన వ్యాసాలు వచ్చాయి. దుర్గాబాయి, దేశ్‌ముఖ్ దంపతులు ఎన్నో అంతర్జాతీయ సమావేశాలకు హాజరై ఎన్నో బిరుదులను, అవార్డులను పొందారు. సి.డి. దేశ్‌ముఖ్‌కి మెగాసెసే అవార్డు విద్యారంగం కృషి చేసినందున దుర్గాభాయికి నెహ్రూ లిటరసీ అవార్డు, యునెస్కో అవార్డు, పాల్. జి. హాఫ్‌మన్ అవార్డులు లభించాయి. 1975లో భారత ప్రభుత్వం ఈ అపూర్వ దంపతులకు 'పద్మవిభూషణ్' ఇచ్చి గౌరవించింది.

దుర్గాబాయి 12 ఏళ్ల వయసు నుండి ఓ అరవై ఏళ్లపాటు తుదిశ్వాస విడిచేవరకు (1921-1981) నిర్విరామంగా సంఘ సేవకు అంకితమైన జీవించింది. ఆమె స్వాతంత్ర యోధురాలు, సత్యాగ్రహి, నిరంతర విద్యార్థిని, సంఘ సంస్కర్త, స్వచ్ఛంద సేవిక, సాంఘిక సంక్షేమ నిర్మాత, సంక్షిప్త విద్యతో పాటు ఎన్నో విద్యలు మహిళా లోకానికి అందించింది. ఓ బాలికా వధువు బాల్య వివాహ బంధం నుండి బయటపడి దేశ సాంఘిక సంక్షేమానికి తల్లిగా పరిణతి చెందినది. దుర్గాబాయి స్థాపించిన సాంఘిక సంక్షేమ సంస్థలు మహిళల విద్య, ఆరోగ్య, ఆర్థిక సంక్షేమాలను పరిరక్షిస్తూ నేటికీ ఏనాటికీ నిలిచి ఉంటాయి. స్త్రీల సంక్షేమం గురించి అంత పాటుపడిన వ్యక్తి మరొకరు ఈ ప్రపంచంలో లేరంటే అతిశయోక్తి కాదేమో!

*



విజయలక్ష్మి పండిట్

## రాజ్యాంగ పరిషత్తులో మహిళలు-8

# విజయలక్ష్మి పండిట్

**(ఆగస్ట్ 18, 1900 - డిసెంబర్ 1, 1990)**

విజయలక్ష్మి పండిట్ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ప్రెసిడెంట్‌గా ఎంపిక అయిన ప్రథమ మహిళ. స్వాతంత్రోద్యమంలో సుప్రసిద్ధ కాంగ్రెస్ నాయకులు మోతీలాల్ నెహ్రూ కుమార్తె, జవహర్‌లాల్ నెహ్రూ చెల్లెలు కావడంచేత రాజకీయ వాతావరణంలో పుట్టి పెరిగింది. మోతీలాల్ నెహ్రూ అలహాబాదులో బారిస్టరుగా స్థిరపడిన సుసంపన్న కాశ్మీరీ బ్రాహ్మణులు. జవహర్‌లాల్ పుట్టిన 11 ఏళ్ల తర్వాత జన్మించిన కుమార్తెకు స్వరూప కుమారి అని పేరు పెట్టారు. ఇంటివద్ద గవర్నెస్ (ఆ రోజుల్లో బ్రిటిష్ వనితలు సంపన్న కుటుంబాల ఇళ్ళలో చిన్న పిల్లలకు ముఖ్యంగా ఆడపిల్లలకు చదువు చెప్పేవారు) తరువాత స్విట్జర్లాండ్‌లో ప్రైవేటుగా చదివింది. 1921లో ఆమెకు రంజిత్ సీతారాం పండిట్ మహారాష్ట్ర పౌరసత్వ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన బారిస్టర్‌కి ఇచ్చి వివాహం చేశారు.

ఆయన గొప్ప సంస్కృత పండితుడు. కాంగ్రెస్ కార్యకర్త కావడం చేత ఆయన నెహ్రూ కుటుంబానికి సన్నిహితుడు. వివాహం అయ్యాక స్వరూప్ కుమారికి విజయలక్ష్మి అని భర్త ఇంటి సంప్రదాయం ప్రకారం పేరు మార్చారు. విజయలక్ష్మి పండిట్‌గా ఆమె అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి, అనేక దేశాలకు రాయబారిగా, ఇండియన్ హై కమిషనర్‌గా లండన్‌లో అత్యున్నత పదవులు అలంకరించారు. క్రియాశీల రాజకీయాలలో ఆమెకు పదహారేళ్ళ వయసులో పాల్గొనే అవకాశం లభించింది. సమీప బంధువు రామేశ్వరి నెహ్రూ, దక్షిణాఫ్రికాలో భారతీయ కార్మికుల పట్ల బ్రిటిష్ ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తిస్తున్నందుకు నిరసన తెలిపే సమావేశం అది. 1932లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరారు విజయలక్ష్మి పండిట్. అప్పటి నుంచి ఆమె తన కుటుంబ సభ్యులతో పాటు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. ఆమెకు మహాత్మాగాంధీ పట్ల భక్తివిశ్వాసాలు ఉన్నాయి.

1937లో అలహాబాదు ప్రావెన్షియల్ ఎలక్షన్‌లో విజయలక్ష్మి పండిట్ పోటీచేసి గెలుపొందారు. స్థానిక స్వయం ప్రభుత్వం (లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్)లో ఆమె హెల్త్ మినిస్టర్‌గా నియమింపబడ్డారు. స్వాతంత్రానికి పదేళ్ల ముందే ఆమె క్యాబినెట్ మినిస్టర్ అయిన తొలి భారతీయ మహిళ. ఆమె తన అనుభవాల్ని 'సో బికేమ్ మినిస్టర్' అనే పుస్తకంలో రాశారు. యునైటెడ్ ప్రావిన్స్‌లో మినిస్టర్ కావడం ఆమె రాజకీయ జీవితంలో మొదటి మైలురాయి. రెండేళ్ల తర్వాత భారత సేవల్ని బ్రిటిష్ ప్రభుత్వం అనుమతి లేకుండా రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొనటానికి పంపించినందుకు నిరసనగా ఇండియన్ మినిస్టర్లు అందరూ రాజీనామా చేసినప్పుడు ఆమె వారికి మద్దతు ఇచ్చి రాజీనామా చేశారు. అప్పటి నుండి ఆమె భర్తతో పాటు చురుకుగా స్వాతంత్రోద్యమంలో పాల్గొని మూడుసార్లు అరెస్టు అయ్యారు. తండ్రి, అన్నగార్లతో పాటు 1932-33లో సహాయ నిరాకరణోద్యమంలో, 1940లోను, క్విట్ ఇండియా ఉద్యమం (1942)లో పాల్గొన్నందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను జైలులో పెట్టింది. 'జైలు రోజులు' (ప్రిజన్ డేస్) అనే పుస్తకంలో ఇలా వ్రాశారు- "దేశం మిలటరీ పాలనలో ఉంది. పోలీసులు కాంగ్రెస్ నాయకులందర్నీ విచారణ జరపకుండా అరెస్టు చేసి, జైల్లో ఉంచారు. అర్ధరాత్రి అలహాబాదులో మా తండ్రి నివాసగృహం ఆనంద్‌భవన్‌లో ఒక్కర్తినే నిరాయుధురాలిగా ఉన్నన నన్ను ఎన్నో లారీలతో పోలీసులు వచ్చి అరెస్టు చేసి జైల్లో పెట్టారు (12 ఆగస్టు, 1942). జైల్లో అనుభవాల గురించి చెబుతూ కటికనేల మీద నిద్ర, ఆడవారికి కనీస అవసరాలను తీర్చుకునేందుకు ఇబ్బందులకు గురి అయ్యేవాళ్లం అన్నారు. కొన్ని రోజుల తర్వాత ఆమె మేనకోడలు పాతికేళ్ల ఇందిరను కూడా అరెస్టు చేసి జైల్లో పెట్టారు. రాజకీయ ఖైదీలను, మగ, ఆడ తేడా లేకుండా కొట్టి హింసించి బాధలు పెట్టేవారు. 1944లో ఆమె భర్తను కూడా ఎన్నో లారీలలో పోలీసులు వచ్చి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆయన 1944లో లక్నో జైల్లో తీవ్ర అనారోగ్యానికి గురి అయి మరణించారు. భర్త మరణంతో విజయలక్ష్మి పండిట్ జీవితం తలక్రిందులయింది. ముగ్గురు ఆడపిల్లల పోషణాభారం ఆమెపై పడింది. ఆ రోజుల్లో స్త్రీలకు వారసత్వ సంపదపై హక్కు లేదు. ఆర్థికంగా ఇబ్బందులు కలిగినా వాటిని లక్ష్యపెట్టకుండా స్వాతంత్ర సమరంలో పాల్గొన్నది. అన్న జవహర్‌లాల్ ఆదరణతో విజయలక్ష్మి రాజకీయ జీవితాన్ని విడనాడకుండా అమెరికాలో పర్యటించి వలస పాలన, సామ్రాజ్యవాదం వలన ఒకప్పుడు సుభిక్షంగా ఉన్న భారతదేశం వలస పాలకుల దయాదాక్షిణ్యాలపై ఎలా ఆధారపడవలసి వచ్చిందో అమెరికా వాసులకు వివరించారు. 1946లో భారతదేశానికి తిరిగివచ్చి యునైటెడ్ ప్రావిన్స్ (సంయుక్త పరగణాలు) స్థానిక స్వపరిపాలనా వ్యవస్థలో ఆరోగ్యశాఖ మంత్రిగా కొనసాగించారు. సంయుక్త పరగణాల నుండి ఆమె రాజ్యాంగ పరిషత్తు ఎంపికయ్యారు. 1941-43 మధ్యకాలంలో విజయలక్ష్మీ పండిట్ ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్‌కు ప్రెసిడెంట్ అయ్యారు.

1946లో మొదటిసారిగా విజయలక్ష్మి పండిట్ భారత దౌత్య ప్రతినిధుల బృందానికి నాయకత్వం వహించి యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీకి ఆమె తన మొదటి అధికార దౌత్య యాత్ర చేశారు. తరువాత వరసగా 1947, 1948, 1952, 1963 సంవత్సరాలలో ఆమె భారత ప్రతినిధులకు దౌత్య యాత్రకు సారథ్యం వహించారు. దౌత్య కార్యాలయ బాధ్యతలతో ఆమె ఎక్కువగా రాజ్యాంగ సభలో పాల్గొన్నలేకపోయారు. 20 జనవరి 1947 నాడు జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగ లక్షణాలు, ధ్యేయ్యాలు గురించి తీర్మానం చేసిన తర్వాత విజయలక్ష్మి పండిట్ ప్రసంగించారు. ఆమె రాజ్యాంగ సభలో చేసిన ఒకే ఒక ప్రసంగం ఆమెకున్న విస్తృత రాజకీయ జ్ఞానం, అనుభవాల్ని వెల్లడిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం, ప్రపంచ దేశాలు శాంతి నెలకొల్పే దిశలో ఆలోచిస్తుండగా భారతదేశం శాంతియుత స్వాతంత్ర పోరాటాన్ని కొనసాగించి, ప్రపంచ దేశాలన్నిటికీ ఆదర్శ ప్రాయమైనది. స్వాతంత్ర భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడానికి రాజ్యాంగ నిర్మాణ సభ (కాన్‌స్టిట్యూషనల్ అసెంబ్లీ)ను ఏర్పరచాలని విజయలక్ష్మి పండిట్ పదేళ్ళ ముందు (1937) సంయుక్త పరగణాలు (యునైటెడ్ ప్రావిన్స్) స్వయంపాలన ప్రారంభోత్సవంలో ప్రతిపాదించారు. రాజ్యాంగ పరిషత్తు ఏర్పడి, భారత రాజ్యాంగాన్ని రూపొందించడం భారత స్వాతంత్ర ప్రగతి బాటలో 'చారిత్రక మైలురాయి' అన్నారు. బ్రిటిష్ సార్వభౌమత్వం అంతం కావడానికి రోజులు దగ్గర పడ్డాయి. కానీ అది అంత త్వరగా అంతమవదు. బ్రిటిష్ సార్వభౌమత్వ సంకెళ్ళ నుండి విడిపించుకోవడానికి బర్మా, ఇండోనేషియా, ఇండో-చైనాలు ప్రయత్నిస్తున్నాయి. శాన్‌ఫ్రాన్సిస్కోలో యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ (యు.ఎన్.ఓ.) ఆవిర్భవించినప్పుడు ఆసియా దేశాలన్నీ వారి సార్వభౌమ పాలకుల అధికార స్వరాన్ని ప్రతిధ్వనించాయి. ఒకే ఒక దేశం స్వాతంత్ర్యం రాకపోయినా, ప్రపంచంలో ఉన్న అణగదొక్కబడిన వారిని గురించి, పరిపాలనాదాస్యంలో మగ్గుతున్న వారి గురించి గొంతెత్తి చెప్పింది అని అనగానే సభలో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. ఇండియాకు ప్రపంచాన్ని నడిపించే శక్తికలదని యునైటెడ్ నేషన్ అసెంబ్లీ గుర్తించింది. స్వాతంత్ర భారతదేశం ఆసియా ఖండాన్నే అనే కాదు యావత్ ప్రపంచానికి నాయకత్వం వహించగలదు. రాజ్యాంగ నిర్మాణ సభలో మనం రూపొందిస్తున్న రాజ్యాంగం కేవలం మన దేశం పట్ల మన విధి నిర్వహణ మాత్రమే కాదు, యావత్ప్రపంచం ఎదురు చూస్తోందన్న విషయం మరువరాదు. బ్రిటిష్ పాలన అంతమయ్యాక ఆసియా దేశాలన్నీ ఏకం కావాలి. భవిష్యత్తులో ఇండియా తటస్థ రాజ్యాంగ విధానాన్ని పాటించాలి. మన దేశానికి స్వాతంత్రం సంపాదించి, స్వాతంత్రం కోసం పోరాడుతున్న దేశాలకు మద్దతు ఇవ్వాలి. స్వతంత్ర భారతదేశంలో మైనారిటీ వర్గాలు సహాయ సహకారాల కోసం విదేశ శక్తులపై ఆధారపడినట్లయితే వారు దోషులుగా పరిగణింపబడతారు. హక్కుల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నాం కానీ మన విధులు, బాధ్యతలు గురించి విపులంగా చర్చించుకోవాలి. మన ముందు రెండు దృక్కోణాలు ఉన్నాయి. బ్రిటిషు దొరతనము ఏలుబడిని అంతమొందించడం మరొక మంచి విషయం, మన దేశాన్ని సోషల్ డెమోక్రటిక్‌గా నిర్మించడం. ఆసియా దేశాలన్నింటిలో ఇండియా ఒక్కటే ప్రజాస్వామ్య దేశంగా ఎన్నో శతాబ్దాల నుండి నిలబడింది. ఇండియా సామాజికంగా, ఆర్థికంగా స్వాతంత్రం సాధించాలి'' అంటూ ఆమె దూరదృష్టితో, విశాల దృక్పథంతో దేశ నిర్మాణం గురించి ప్రసంగించారు.

దేశానికి స్వాతంత్రం రాగానే విజయలక్ష్మి పండిట్ అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత పదవులు అలంకరించారు. రాజకీయ దురంధరత, వ్యవహార దక్షతగల విజయలక్ష్మికి అవి విజయ సపానాలయ్యాయి.

1947లో సోవియట్ యూనియన్‌కు తొలి భారత రాయబారిగా నియమించబడ్డారు. 1949 సంవత్సరం ఆరంభంలో అమెరికాకు రాయబారిగా, అదే సమయంలో మెక్సికోకు రాయబారిగా వ్యవహరించారు.

1951లో ఆమె ఇండియాకు తిరిగి వచ్చి మొదటి లోక్‌సభ జనరల్ ఎలక్షన్లలో పోటీ చేసి గెలుపొందారు. పార్లమెంటు సభ్యురాలు అయ్యారు. సెప్టెంబర్ 1953లో యునైటెడ్ నేషన్ జనరల్ అసెంబ్లీ (ఐక్యరాజ్య సమితి)కి ఎన్నుకోబడిన తొలి ఏషియన్, ప్రథమ మహిళ. ఆమె అందించిన సేవలు శ్లాఘనీయమైనవి. 1954-61 నుండి దాదాపు ఏడేళ్ల పాటు లండన్‌లో ఇండియన్ హై కమిషనర్‌గా కీలక పాత్ర పోషించారు. అదే సమయంలో ఐర్లాండ్‌కు భారత రాయబారిగా ఉన్నారు. ఆ సమయంలో ఇండో-బ్రిటిష్ సంబంధాలలో చోటుచేసుకున్న ఎన్నో మార్పుల వలన ఉద్రిక్తత నెలకొన్నది. ఆమె చాకచక్యంతో పరిస్థితిని మెరుగుపరిచారు. ఆమె 'హై కమిషనర్‌షిప్' రెండు ప్రభుత్వాల మధ్య సంబంధిత విషయాలకు 'సంక్షిప్త దర్శిని'గా నిలిచినది. 1958-61 మధ్యకాలంలో ఆమె స్పెయిన్‌కు రాయబారిగా ఉన్నారు. 1962-1964 మధ్యకాలంలో మహారాష్ట్రకు గవర్నర్‌గా నియమింపబడ్డారు. 1964లో ఆమెకు అత్యంత ప్రియమైన సోదరుడు, భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మరణం కోలుకోలేని దెబ్బ. నవంబర్‌లో నెహ్రూ నియోజకవర్గం (ఆయన మరణం వలన ఏర్పడిన ఖాళీ) నుండి పోటీ చేసి లోక్‌సభకు ఎంపిక అయ్యారు. 1968 వరకు పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. 1978లో యునైటెడ్ నేషన్స్‌లో మానవ హక్కుల కమిషన్‌కు భారత ప్రతినిధిగా ఎంపికయ్యారు. 1977లో భారత ప్రధాని ఇందిరాగాంధీ (మేనకోడలు) ఎమర్జెన్సీ ప్రకటించడం ప్రజాస్వామ్య విలువల్ని హరించినట్లు అని ఆమె భావించి మేనకోడల్ని తీవ్రంగా విమర్శించారు. అప్పటి నుండి విజయలక్ష్మి పండిట్ - ఇందిరాగాంధీల మధ్య సఖ్యత లోపించింది. విజయలక్ష్మి పండిట్ జనతా పార్టీకి మద్దతు ఇచ్చారు.

ఆమె ఏ బడికీ వెళ్ళి చదువుకోలేదు. అయినా ప్రపంచంలో ఏ వ్యక్తినీ వరించని అత్యున్నత పదవులు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్రతో పాటు సుదీర్ఘమైన రాజకీయ జీవితంలో సుమారు 41 సంవత్సరాలు ఎన్నో పదవులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేపట్టి క్రియాశీల రాజకీయ రంగంలో ప్రముఖ పాత్ర వహించారు. క్రమబద్ధమైన చదువు లేకపోయినా సోమర్ విల్ కాలేజీ, ఆక్స్‌ఫర్డ్ చేత (ఇందిరాగాంధీ కొన్నాళ్ళు చదివిన కాలేజీ) ఆనరరీ ఫెలోగా గౌరవించబడ్డారు. అలీగఢ్ యూనివర్సిటీకి ఆమె ఎగ్జిక్యూటివ్ మెంబర్. ఆమె తన జీవిత చరిత్ర 'ది స్కోప్ ఆఫ్ హ్యాపీనెస్' (1978), 'ది ఇవల్యూషన్ ఆఫ్ ఇండియా' (1958) వ్రాశారు. తన సుదీర్ఘ జీవిత కాలంలో తన కుటుంబ సభ్యులలో మూడు తరాల ప్రధాన మంత్రుల్ని అన్నగారు నెహ్రూ, మేనకోడలు ఇందిరాగాంధీ, మేనకోడలు కుమారుడు రాజీవ్‌గాంధీలను చూశారు. వారంతా కేవలం భారతదేశానికి ప్రధానమంత్రులు మాత్రమే. విజయలక్ష్మి పండిట్ 20వ శతాబ్దంలో అంతర్జాతీయ రాజకీయ రంగంలో ప్రముఖ పాత్ర పోషించి, నాయకత్వం వహించిన మహిళ. అగ్ర రాజ్యాలైన సోవియట్ యూనియన్, అమెరికా దేశాలకు రాయబారిగా, బ్రిటిష్ ప్రభుత్వం నుండి దాస్య విముక్తి పొందిన భారతదేశం నుండి లండన్‌లో హైకమిషనర్‌గా, అన్నింటినీ మించి ఐక్యరాజ్య సమితికి అధ్యక్షురాలిగా ఎన్నుకోబడిన ఘనత యావత్ మహిళాలోకం గర్వించదగిన విషయం. ఆరు దేశాలకు భారతదేశ రాయబారిగా స్నేహ, సౌహార్ద్రాలు పెంపు చేసి శాంతియుతంగా కీర్తి గాంచిన నెహ్రూ సోదరి విజయలక్ష్మి పండిట్ మన దేశానికి ఘనకీర్తి తెచ్చారు.

*

**ముత్తంగి వేంకట భారతలక్ష్మి**
కాకినాడ. ఫోన్: 944 021 5330.



# మా ఊరు మాధవ నగరం

– కొసరాజు వెంకటేశ్వరరావు

1930లో అప్పటి నిజాం ప్రభుత్వం గోదావరి నదిపై మంజీరా నదిపైన నిజామాబాద్ జిల్లా - బాచుపల్లి అనేచోట - ఆనకట్టను నిర్మించి దానికి 'నిజాం సాగర్' అని నామకరణం చేసింది. ఆ ఆయకట్టు క్రింద భూములకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో బాన్సువాడ, బోధన్, నిజామాబాద్, ఆర్మూర్ తాలూకాలలో ఉన్న వ్యవసాయ భూముల కోసం నిజాం సాగర్ కెనాల్‌ను త్రవ్వించారు. కానీ ఆ నీటిని వ్యవసాయ భూములకు రైతులు వినియోగించుకోలేకపోవడంతో ఆ నీరు వృధాగా పోతుండేది. ఆనాటి నిజాం రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ భూముల్లో ఎక్కువ భాగం దేశ్ముఖ్, దేశ్‌పాండే పటేల్, భూస్వాముల ఆధీనంలో ఉండేది. రైతులు తమ ఆధీనంలో ఉన్న అర ఎకరం, ఎకరం కొద్దిపాటి భూమిని చెరువుల క్రింద, కుంటల క్రింద తమ కుటుంబ అవసరాలకు సరిపడే వరి ధాన్యం పండించుకునేవారు. మిగిలిన మెట్ట భూముల్లో మక్కలు (మొక్కజొన్న), జవార్ (జొన్న), పల్లీలు (వేరుశెనగ), చనే (సెనగలు), పత్తి, గోధి (గోధుమలు) మొదలైన మెట్టపైర్లు పండిస్తుండేవారు. నిజాంసాగర్ ఆయకట్టు క్రింద ఉన్న భూముల్లో ఎవరైనా పంటలు పండిస్తామంటే వారికి ఆ భూముల్ని చౌకగానే ఇస్తామని - ఆ భూములు కొని వ్యవసాయం చేసుకోవచ్చని నైజాం ప్రభుత్వం వారు దినపత్రికలలో ప్రకటించి, ప్రోత్సహించినా ఎవరూ ముందుకు రాలేదు. ఆ ఆయకట్టు క్రింద ఉన్న భూములన్నీ పీడితులు (వ్యవసాయం చేయని భూమి) బీడు భూములుగానే ఉండిపోయాయి.

1940లో యాదృచ్ఛికంగా జరిగిన ఒక సంఘటన నిజామాబాద్ జిల్లా చరిత్రనే మార్చివేసి జిల్లా అభివృద్ధిని ముందుకు పరుగెత్తించింది. కృష్ణాజిల్లా పసుమర్రు గ్రామానికి చెందిన రైతు త్రిపురనేని సత్యనారాయణకు విజయవాడలోని మారుతీ సినిమా హాల్‌లో వాటా ఉండేది. ఆయన తమ్ముడైన వెంకయ్యకు ఆ హాలు నిర్వహణ బాధ్యత అప్పగించి, ఆయన ఖమ్మం జిల్లా మధిర తాలూకాలో ఉన్న తన భూముల్లో వ్యవసాయం చేసుకునేవాడు. వెంకయ్యకు ఆ సినిమా హాలు ప్రక్కనే ఉన్న మాడపాటి క్లబ్‌లో పేకాట ఆడడం అలవాటు ఉండేది. అప్పటి నిజామాబాద్ తాలూక్దార్ (ఇప్పటి జిల్లా కలెక్టర్)గారి బావమరిది కూడా ఆ క్లబ్‌లో పేకాట ఆడుతుండేవాడు. ఆయనతో వెంకయ్యకు స్నేహం ఏర్పడింది. ఒకరోజు మాటల మధ్యలో "మీరు నిజామాబాద్ వస్తే మా బావ గారితో పరిచయం చేసి, నిజాం సాగర్ ఆయకట్టు క్రింద భూముల్ని చౌకగా ఇప్పిస్తాను. మీరు అక్కడ వ్యవసాయం చేసుకుంటూ మంచి పంటలు పండించుకోవచ్చు" అని అన్నాడట. రైతుబిడ్డ అయిన వెంకయ్య గారికి చౌకగా వ్యవసాయ భూమి దొరుకుతుందనేసరికి ప్రాణం లేచి వచ్చినట్టయింది. ఆ మరునాడే ఆయనతో నిజామాబాద్‌కి వెళ్లి కలెక్టర్ను కలవగా ఆయన మీకు ఏ గ్రామంలో భూములు కావాలో చూసుకొని చెప్పండని వెంకయ్యతో అన్నాడట.

వెంకయ్యగారు నిజాంసాగర్ ఆయకట్టు క్రింద ఉన్న భూముల్ని బాన్సువాడ నుండి ఆర్మూర్ వరకు పరిశీలించి నిజామాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న ధర్మారంలో ఉన్న నల్లరేగడి భూములవైపే మొగ్గుచూపి అదే విషయాన్ని కలెక్టర్ గారికి తెలియజేశాడు. ఆయన వెంటనే దరఖాస్తుపై 240 ఎకరాల భూమిని - ఎకరానికి రూ. 30/- చొప్పున - ఇంటి స్థలాన్ని సెంటు రూ. 1.25/లకు (నైజాం కరెన్సీ) వెంకయ్యకు కేటాయించాడట. వెంకయ్య వెంటనే తిరిగి పసుమర్రు వెళ్లి తన వెంట పది కుటుంబాల వారిని నిజామాబాద్ తీసుకువచ్చి వారికి తలా 20 ఎకరాలు (బీగాలు) ఇచ్చి - ఇళ్లస్థలాలు ఇచ్చి, వారికి ధర్మారంలో నివాసం ఏర్పాటు చేయడానికి కారకులయ్యారు. ఆ విధంగా వచ్చిన రైతులు తమ భూముల్లో ఉన్న వాగులు, వంకలు పూడ్చి - తుప్పలు, రాళ్లు, ఎత్తు పల్లాలతో ఉన్న భూములను చదును చేసి, వ్యవసాయ యోగ్యంగా చేసి - కాలువలు - ఉప కాలువల ద్వారా వచ్చే నీటితో

- వరి పండించడం ప్రారంభించి - ఆ ధాన్యాన్ని నిజామాబాదులోని గాంధీ గంజ్‌లో విక్రయించి - ఆ విధంగా వచ్చిన డబ్బును తమ గృహ మరియు వ్యవసాయ ఖర్చులకు వాడుకునేవారు. పశువుల పోషణ ద్వారా పాలు, పెరుగు దొడ్డిలోను - చేలల్లో పండించే కూరగాయలు పుష్కలంగా లభిస్తుండేవి. వీరిని చూసి కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన అనేక చిన్న సన్నకారు రైతులు - తమకు ఉన్న కొద్దిపాటి భూమిని అమ్ముకొని - నిజామాబాద్ జిల్లాకు 1948 నుంచే వలసలు వెళ్లి నిజాంసాగర్ ఆయకట్టు క్రింద భూములు కొని అనేక గ్రామాల్లో (బాన్సువాడ, బోధన్, నిజామాబాద్, ఆర్మూర్ తాలూకాలలో) స్థిరపడి అక్కడ చౌకగా ఉన్న భూములు కొని వ్యవసాయ యోగ్యంగా చేసి పంటలు పండించడం ప్రారంభించారు. ఈ విధంగా పసుమర్రు చుట్టుప్రక్కల గ్రామాలైన పెరిసేపల్లి, గుడ్లవల్లేరు, కురుమద్దాలి, చట్లపెనుమర్రు గ్రామాలకు చెందిన రైతులు హైదరాబాద్ - నిజామాబాద్ రహదారిలో ఉన్న భూముల్ని కొని తమ-తమ కుటుంబాలతో వచ్చి పూరిళ్ళు నిర్మించుకొని - వ్యవసాయం చేయడం ప్రారంభించారు. ఆ రోజుల్లో ధర్మారం నుండి నిజామాబాద్ నగరానికి వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం సరిగా లేదు. కంకర రోడ్డు మార్గం మాత్రమే ఉండేది. రవాణా సౌకర్యం కూడా సరిగా ఉండేది కాదు. బస్సులు చాలా తక్కువగా ఉండేవి. ఎడ్లబండ్లు, రిక్షా, సైకిల్, కాలినడకన మాత్రమే ప్రయాణించవలసి వచ్చేది. రైతులు వరి పంట పండించడం మొదలుపెట్టడంతో పాలు, పెరుగు పుష్కలంగా లభించేవి. పెరట్లో కూరగాయల కూడా విరివిగా పండేవి. కూరగాయలు బంధువులకు, స్నేహితులకు ఉచితంగా పంపిణీ చేసినప్పటికీ ఇంకా మిగిలిపోయేవి. ఆ కూరగాయలను రైతులు తమ ఎడ్లబండిలోను, సైకిల్ పైన ప్రతి గురువారం నిజామాబాద్ నగరంలో జరిగే అంగడి (సంత)కి పంపించి అవి అమ్మగా వచ్చిన డబ్బుతో పప్పు, ఉప్పు, నూనెలు, దినుసులు మొదలైనవి కొని తెచ్చుకునేవారు. అదేవిధంగా పాలు, పెరుగు నెత్తిమీద పెద్ద తపాళా (పాత్ర)లోనూ అల్యూమినియం క్యాన్‌లలో, పాలు సైకిల్ మీద - కాలినడకన రహదారి సరిగా లేని నిజామాబాద్‌కు తీసుకువెళ్లి పాలు హోటళ్ళకు, పెరుగు కొన్ని ఇళ్లవారికి తెల్లవారుజామునే పోసి - తిరిగి వెంటనే ఉదయం ఏడు, ఎనిమిది గంటలకల్లా తమ ఇళ్లకు చేరుకుని - వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యేవారు. కొందరు సాయంత్రం కూడా పాలు సైకిళ్ళ మీద నిజామాబాద్‌లో హోటళ్లకు పోసి వచ్చేవారు. నిజామాబాద్ ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండటం - కాలినడకన పోయేవారికి చాలా కష్టంగా ఉండేది. నిజామాబాద్‌కు దగ్గర్లోనే ఉన్న - రహదారి ప్రక్కనే ఉన్న - నల్లరేగడి భూములపై వీరి దృష్టి పడి - ఆ భూమిని కొని, తమ భూములలోనే పూరిళ్ళు నిర్మించుకొని ఉండటం ప్రారంభించారు. వీరు రజాకార్ల దౌర్జన్యాలను తిప్పికొట్టారు.

ఆ విధంగా 1948 ప్రారంభంలో కొన్ని కుటుంబాలు ధర్మారం నుండి మరికొన్ని కుటుంబాలు కోస్తా ఆంధ్ర జిల్లాల నుండి ఆ ఊరిలో వ్యవసాయ భూములు కొని, పూరిళ్ళు నిర్మించుకొని రైతులుగా స్థిరపడ్డారు. రహదారి ప్రక్కనే ఉన్న నిజామాబాద్ తురకల (ముస్లిం)కు చెందిన భూముల్ని కొని తమ-తమ పొలాల్లోనే పూరిపాకలు నిర్మించుకొని వ్యవసాయం ప్రారంభించారు. రజాకార్ల దౌర్జన్యాలు మితిమీరి పోవటం స్త్రీల ధన, మాన, ప్రాణాలకు ఘోరమైన ముప్పు దాపురించిన పరిస్థితులను నిశితంగా గమనిస్తున్న ఆనాటి భారతదేశపు ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 1948 సెప్టెంబర్ నెలలో సైనిక చర్య ద్వారా భారత సైన్యం నైజాం రాష్ట్రాన్ని అన్ని వైపుల నుండి ముట్టడించి హైదరాబాద్ నగరంలో ప్రవేశించగా అప్పటి నిజాం తన రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి అంగీకరించాడు. నైజాం రాష్ట్రం భారత దేశంలో విలీనం కాగానే అనేక పరిపాలనా సంస్కరణలు అమలులోకి తేబడినాయి. నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఐ.ఎ.ఎస్. తెలుగు అధికారి మాధవరావు గారు నియమించబడ్డారు. కోస్తా ఆంధ్ర ప్రాంతానికి చెందిన వీరు అదే ప్రాంతం నుండి నిజామాబాద్‌కు వలస వచ్చిన రైతులతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండేవారు. ఒకనాటి సాయంత్రం ఆయన జిల్లా పర్యటనకు వెళ్లి

తిరిగి వస్తుండగా దారిలో రోడ్డు ప్రక్కనే ఉన్న కొన్ని పూరిపాకలు కనిపించాయి. అక్కడి వారి వేషభాషలు చూసి అక్కడ ఉన్న కొందరితో పరిచయాన్ని చేసుకోగా వారు తాము నిర్మించుకోబోయే పూరిపాకలకు నిట్టాళ్ళు, దూలాలు, గుంజలు దొరకటంలేదని ఆయనతో విన్నవించుకోగా ఆ మరునాడే అటవీశాఖ ద్వారా ఆ గ్రామానికి కావాల్సిన కొయ్య సామాగ్రి ఏర్పాటు చేసి వారి ప్రేమకు పాత్రులైనాడు.

మాధవరావు గారు తమకు చేసిన సహాయానికి కృతజ్ఞతాపూర్వకంగా ఆ గ్రామానికి 'మాధవనగరం' అని నామకరణం చేసి - రెవెన్యూ రికార్డులలోకి ఎక్కించారు. మొట్టమొదట పూరిపాకలు నిర్మించుకున్నవారిలో ముఖ్యులు శ్రీ చాపరాల అచ్చయ్య, వేములపల్లి వెంకటనారాయణ, శ్రీరాములు, వేములపల్లి గోపాలకృష్ణయ్య, చెరుకూరి రంగయ్య, మండవ రాఘవయ్య, కుడితిపూడి భూషయ్య, సజ్జా సత్యం, యార్లగడ్డ రాఘవయ్య, నాదెళ్ల రామారావు, త్రిపురనేని చిట్టయ్య, త్రిపురనేని రంగదాసు, వేములపల్లి రంగారావు, పేరేచర్ల వీరయ్య, గుంటుపల్లి వీరారావు, దేవినేని సత్యం, దేవినేని నాగేశ్వరావు సోదరులు. వీరిలో కొందరు మట్టిగోడలతో ఇల్లు కట్టి పైకప్పు జమ్ము, వరిగడ్డితో వేయించారు. ఆర్థిక స్తోమత లేనివారు మోపాల్ అడవుల్లో దొరికే పబ్బు కంపతో దడి కట్టి రెండు గుంజలతో దర్వాజాలు ఏర్పాటు చేసుకుని ద్వారానికి తలుపులు బదులు ఏదైనా పాత చీర దర్వాజాకు వేలాడదీసేవారు. పబ్బు కంపను అటవీశాఖవారు పగటిపూట రవాణా చేయనీయరు కనుక అందరూ కలసికట్టుగా ఏడెనిమిది బండ్లు కట్టుకొని రాత్రిపూటే మంచిప్ప లేక మోపాల్ అడవులకు చేరుకుని పగలంతా పబ్బు కంప నరికి బళ్ళలో నింపి ఆ కంప మధ్యలో టేకు విప్ప చెట్లు నరికి ఆ దూలాలను, నిట్టాడులను, గుంజలను బయటకు కనిపించకుండా దాచి తిరిగి ఆ మర్నాటి రాత్రి బయలుదేరి తెల్లవారేసరికి గ్రామానికి చేరుకొని ఆ పబ్బు కంపను ఇంటి దడులకు ఉపయోగించేవారు. టేకు, విప్ప దూలాలను, గుంజలను పశువుల పాకకు ఉపయోగించేవారు. అడవికి వెళ్ళేటప్పుడు ఎడ్ల మెడలో గంటలు తీసివేసేవారు. అటవీశాఖ అధికారులకు అలికిడి కాకుండా గుట్టుచప్పుడు కాకుండా ఈ అడవి పనులు పూర్తి చేసేవారు. ఎవరైనా వచ్చి ఆ దుంగల్ని గుర్తించి పట్టుకున్నా వాళ్లకు మామూళ్ళు ఇచ్చి పంపించివేసేవారు. ఇదేకాక లంబాడీలు మదనపల్లి, మెంట్రాస్‌పల్లి గ్రామాల వద్ద ఉన్న అడవులలో టేకు, విప్ప, కలప నరికి దొంగతనంగా రాత్రికి రాత్రే మాధవనగరం రైతులకు అమ్మి వెళ్ళిపోయేవారు. ఆ విధంగా తెచ్చిన కలపను వరి గడ్డివాముల్లోనూ, పెంట పోగుల్లోనూ, చెత్త క్రింద దాచి - అవి పాతబడినట్లుగా కనిపించగానే నిజామాబాద్ పులాంగ్ వద్ద ఉన్న రంపపు మిల్లులో కోయించి - వాటిని తలుపులకు, బండి నగలకు, కాడి చక్రాలకు, ఇరుసులకు, కాలి గుంజలకు, దూలాలకు ఉపయోగించేవారు.

రోడ్డుకు ఎడమ వైపున తురకాళ్ళవద్ద కొన్న పది పదిహేను ఎకరాల భూమిని ప్రక్క గ్రామమైన ధర్మారానికి చెందిన కలగర భద్రయ్య గారు కొలచి ప్లాట్లుగా విభజించి ఒక్కొక్క రైతుకు ఇంటి స్థలం కోసం ఇచ్చారు. ఈ భూముల తర్వాత నిజామాబాద్‌కు చెందిన వైశ్యుల వద్ద కొంత భూమిని కొని కొసరాజువారు, కాజావారు, నిమ్మగడ్డవారు, బాల సుబ్బారావు, యలమంచిలివారు, వడ్లమూడి కోటేశ్వరరావు, గుంటుపల్లి వీరయ్య, పిన్నీటి కోటయ్య, ఆలా ప్రకాశరావు, పంగులూరి హనుమయ్యగార్లు కొనుక్కొని ఆ స్థలంలోనే పూరిపాకలు నిర్మించుకున్నారు. కొందరు తడికలు అల్లించి వాటిని తమ ఇంటి గోడలుగా అమర్చుకునేవారు. మరికొందరు చలికి తట్టుకోలేక ఆ తడికలను రెండు వైపులా మట్టితో అలికి కప్పేవారు. ఆ రోజుల్లో విద్యుత్ గ్రామాలలో ప్రవేశించలేదు. మొదట్లో ఇళ్లల్లో బీరువాలు ఉండేవి కావు. ఇంట్లో ఒక వాసాన్ని దండెంలాగా కట్టి తమ బట్టలన్నీ ఆ దండెం పైన వేసేవారు.

ఆ రోజుల్లో వంట పిడకలు, పేళ్ళతో తయారు చేయబడేవి. నిజామాబాద్ సంతలో దొరికే మట్టికుండలను తెచ్చి పెద్ద బానలతో త్రాగే నీరు, మట్టి పాత్రలలో అన్నం, కూరలు వండేవారు. పాలు కూడా మట్టి కుండలలో కాచి, అదే పాత్రలలో పెరుగు తోడు

పెట్టేవారు. పాలు, పెరుగు పిల్లులకు, కుక్కలకు అందకుండా ఉట్టిలో జాగ్రత్త చేసేవారు. అప్పటికి ఇంకా రైస్ మిల్లులు ప్రారంభం కాకపోవడంతో తమ ఇంటిలో రోటిలోనే వడ్లు దంచి ఆ బియ్యంతోనే రెండు పూటలా స్త్రీలు అన్నం వండేవారు. దంపుడు బియ్యం, చిక్కని పాలు, రుచికరమైన మీగడ, పెరుగు, నెయ్యి, తమ పెరట్లోనే పండించే వివిధ రకాలైన కూరగాయలతో వండిన కూరలు, కలుషితం కాని గాలి, నీరు మూలంగా ఆనాటి గ్రామస్తులు చాలా ఆరోగ్యంగా జీవించేవారు. స్త్రీలు, పురుషులు మంచి కష్టజీవులు కనుక వారిని చూసి రోగాలే భయపడేవి. ఆ రోజుల్లో నిజామాబాదులో అశోక నర్సింగ్‌హోమ్‌గా పిలవబడే డా. అడుసుమిల్లి వెంకట సుబ్బారావు గారి ఆసుపత్రి ఉండేది. జ్వరం, తలనొప్పి, వళ్లు నొప్పులు, జలుబులాంటి రోగాలకు అందరూ ఆ ఆస్పత్రికే వెళ్లేవారు. ఆ విధంగా వచ్చిన రోగులు డాక్టర్ గారి చిరునవ్వుతో పలకరింపు కాంపౌండర్ పున్నారావు గారి చక్కని పరిచర్యంతో సగం జబ్బు నయం అయిపోయేది. బాన్సువాడ, బోధన్ తాలూకాలలో స్థిరపడిన రైతులు కొందరు, స్థానికులు కూడా ఆ ఆసుపత్రికే వచ్చేవారు. రోగులకు అవసరమైన మందులు డాక్టర్‌గారే ఇచ్చేవారు. ఒకవేళ ఆయన వద్ద లేకపోతే ఆ మందులను మెడికల్ షాపులో కొనుక్కోవలసి వచ్చేది. డాక్టర్ గారు ఎవర్నీ ఫీజు అడిగేవారు కాదు. ఎవరు ఎంత ఇచ్చినా సంతోషంగా స్వీకరించేవారు. రైతులు పాలు, పెరుగు, నెయ్యి, కూరగాయలు డాక్టర్ గారికి సంతోషంగా ఇచ్చేవారు. డాక్టర్ గారు కాపురం పై అంతస్తులో ఉండేవారు. ఏ అర్ధరాత్రి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఎటువంటి విసుగూ చూపకుండా డాక్టర్ గారు వెంటనే క్రిందకు దిగి వచ్చి, రోగిని పరీక్షించి, ధైర్యం చెప్పి కావలసిన ఇంజక్షన్లు, మందులు ఇచ్చేసరికి రోగికి సగం రోగం తగ్గిపోయినంత సంతోషం కలిగేది. అవసరమయితే చిన్న - చిన్న శస్త్ర చికిత్సలు కూడా చేసి ఆ కుట్లు ఊడదీసే వరకూ తన ప్రక్కనే పై అంతస్తులో ఉన్న గదుల్లో బెడ్లు ఇచ్చేవారు. రోగుల వెంట వచ్చేవారికి వంట చేసుకునే సౌకర్యం, టాయ్‌లెట్స్, బాత్రూములు, త్రాగు నీటి సౌకర్యాలు కల్పించబడేవి. డాక్టర్ గారి భార్య కూడా తమ ఆసుపత్రి గదుల్లో ఉండేవారితో చాలా ఆప్యాయంగా, కలివిడిగా ఉండేవారు. ఆ గదుల్లో ఉండేవారితో రోగుల పట్ల డాక్టర్ గారు బాగా శ్రద్ధ చూపించేవారు. వారిని ఆరోగ్యవంతులను చేసి తిరిగి వారి-వారి గ్రామాలకు పంపించే వరకు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఉండేవారు. చలికాలంలో చలి, వానా కాలంలో వర్షాలు ఎక్కువగా ఉండేవి. ఆ రోజుల్లో ఈ ప్రాంతంలో ఉన్న అడవులు ఎక్కువగా ఉండటంతో వర్షాలు ఎక్కువగా కురిసేవి. ముసురు పట్టిందంటే వారం రోజులు దాకా ఆగేది కాదు. నిజామాబాద్ వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉండేది. కాలి నడకన, సైకిల్, టాంగా (గుర్రపు బండి), ఎడ్లబండి, సైకిల్ రిక్షాలు మాత్రమే ప్రయాణ సాధనాలుగా ఉండేవి.

విజయవాడ నుంచి నిజామాబాద్ రావాలంటే రైలు, బస్సు ప్రయాణం 24 గంటలు పైగానే పట్టేది. నైజాం రాష్ట్రానికి ప్రత్యేక రైళ్లు (నిజాం స్టేట్ రైల్వే) పోలీస్, రెవెన్యూ, బస్సు వ్యవస్థలు ఉండేవి. వారి కరెన్సీని ఆలీ రూపాయగాను, భారత ప్రభుత్వం వారి కరెన్సీను కల్దార్ రూపాయగాను చెలామణిలో ఉండేవి. వీటిని చారానా (పావలా), ఆఠానా (అర్ధరూపాయి), రూప్యా (రూపాయి), దో, చార్, పాంచ్, దస్, బీస్, పచాస్, సౌ, హజార్, లాక్‌గా వ్యవహరింపబడేవి. ఈ ప్రాంతంలో ఈ రెండు కరెన్సీలు చలామణిలో ఉండేవి. ఈ రెండు ప్రాంతాల మధ్య మీటర్ గేజ్ రైళ్లు మాత్రమే నడుస్తుండేవి. ఆంధ్రా నుండి నిజామాబాద్ రైలు, బస్సు ప్రయాణాలు చాలా వ్యయ ప్రయాసలతో కూడుకునేవిగా ఉండేవి. విజయవాడలో రాత్రి ఎక్కిన రైలు మర్నాటి ఉదయం తొమ్మిది, పది గంటల ప్రాంతంలో సికింద్రాబాద్ చేరేది. అక్కడ పగలంతా నిజామాబాద్ రైలు కోసం వేచి చూడవలసి వచ్చేది. తిరిగి అక్కడ మన్మాడు వెళ్ళే రైలు (ఇప్పటి అజంతా ఎక్స్‌ప్రెస్) ఆ సాయంత్రం ఎక్కితే అది ప్రతి స్టేషన్‌లో ఆగుతూ ఏ అర్ధరాత్రికో నిజామాబాద్ స్టేషన్ చేరుకునేది. ఆ సమయంలో మాధవనగరం, ధర్మారం గ్రామాలు వెళ్లాలంటే రిక్షావాలాలు ఇష్టపడేవారు కాదు. ప్రయాణికులకు టాంగాలే గతి. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవటంతో టాంగా ప్రయాణం ఇష్టపడేవారు

కాదు. ఆ రోజుల్లో సికింద్రాబాద్ (పట్నం అని లేక లష్కర్ అని వ్యవహరించేవారు) మరియు నిజామాబాద్ నుండి రైలు చార్జీ అఠాణా (అర్ధరూపాయి) బస్సు ఛార్జి దో రూప్యా (రెండు రూపాయలు)గా ఉండేది. ప్రయాణికులకు రైలు చార్జీకంటే రిక్షా, టాంగా ఛార్జీలే తడిసి, మోపెడయ్యేవని చెబుతూండేవారు. ముందుగా తెలిస్తే వారి-వారి ఎడ్లబండ్లే (గుడిసే బండ్లు) నిజామాబాద్ స్టేషన్‌కు వచ్చి వాళ్ళ-వాళ్ళను వారి-వారి గ్రామాలకు తీసుకుపోతూ ఉండేవి. హైదరాబాద్ - నిజామాబాద్ మధ్య ఉదయం, సాయంత్రం రెండు ఎర్ర బస్సులు మాత్రమే నడుస్తుండేవి. ప్రయాణ ఛార్జీ రెండు రూపాయలు మాత్రమే ఉండేది. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై నడిచే ఎర్రబస్సు ప్రయాణంకంటే రైలు ప్రయాణమే సుఖంగా ఉండేది.

ఆ రోజుల్లో వ్యవసాయ కూలీ (కైకిలు) రేట్లు చాలా తక్కువగానే ఉండేవి. ఆడ కూలీలకు దొ ఆనా (రెండు అణాలు) మగ కూలీలకు తీన్ ఆనా (మూడు అణాలు)గా ఉండేది. బారాబండి (సికింద్రాబాదులో పొద్దున్నే బయలుదేరి ఉదయం 11 గంటలకు నిజామాబాద్ చేరే రైలు) నిజామాబాద్ వెళ్ళిపోగానే కూలీలు వ్యవసాయ పనులు ప్రారంభించేవారు. ఆ రోజుల్లో స్థానిక రైతులు తమకు ఉన్న కొద్దిపాటి భూమిని దున్ని, నీటితో తడిపి, గొర్రుతో లెవెల్ చేసి, వరి విత్తనాలు చల్లి, వరి పంటను తమ కుటుంబ అవసరాలకు సరిపోనుగా పండించుకునేవారు. కానీ వారికంటే ఎక్కువ భూములు కలిగిన ఆంధ్రా రైతులు నారుమళ్లు పోసి - మూడు నాలుగు వారాల తరువాత ఆ వరి నారును పీకి, కట్టలుగా కట్టి - అప్పటికే దున్ని నీటితో సిద్ధం చేసిన మడుల్లో కూలీలకు అందిస్తూ నాట్లు వేయించేవారు. వీరు స్థానిక రైతులకంటే ఎక్కువ ధాన్యం పండించడమే కాకుండా వారికి కూడా వ్యవసాయంలో అధిక ధాన్యం పండించే మెలకువలు నేర్పించి వారి వద్ద చెరకు పండించడం, బెల్లం వండటం, సమిష్టి కుటుంబం యొక్క విలువలు గ్రహించటంవంటి ఎన్నో మంచి విషయాలు నేర్చుకున్నారు. వీరు స్థానికులైన రెడ్డి, కాపు, వెలమ, బ్రాహ్మణ, వైశ్య మరియు సమాజంలోని ఇతర సామాజిక వర్గాలవారితో మంచి సంబంధాలు కలిగి ఉండేవారు.

ఇకపోతే ఆనాటి మాధవనగరం గ్రామ పరిస్థితికి వద్దాం. 1953లో భాషా రాష్ట్రాల పుణ్యమా అంటూ నైజాం రాష్ట్రం మూడు ముక్కలుగా విభజింపబడి కొన్ని జిల్లాలు మహారాష్ట్రలోను మరికొన్ని జిల్లాలు కర్ణాటకలో కలిపివేయబడి మిగిలిన తొమ్మిది జిల్లాలు హైదరాబాదు రాష్ట్రంగా ఏర్పడింది. అదేవిధంగా 1953లో రాయలసీమ, కోస్తా ఆంధ్ర ప్రాంతం కూడా మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడింది. తిరిగి ఆనాటి రాజకీయ నాయకుల, మేధావుల, ప్రజల అభీష్టం మేరకు 1956లో హైదరాబాద్ మరియు ఆంధ్ర రాష్ట్రాలు ఒకే రాష్ట్రంగా ఏర్పడి ఆంధ్రప్రదేశ్‌గా వ్యవహరింపబడినది. దేశ మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగు కావడంతో రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందటం, తెలంగాణ ప్రాంతంలో భూములు చౌక ధరలు, నిజాంసాగర్ ప్రాజెక్టు క్రింద పుష్కలంగా లభిస్తున్న నీటి సౌకర్యాన్ని గురించి తెలుసుకొన్న కోస్తా జిల్లాల వారు నిజామాబాద్ జిల్లాకు అనేక కుటుంబాలు వలస వచ్చి భూములు కొనుక్కొని వేరువేరు గ్రామాలలో స్థిరపడటం ప్రారంభించారు. ఇదేవిధంగా కృష్ణా, గుంటూరు జిల్లాలవారు మాధవనగరం వచ్చి స్థిరపడటంతో ఆ ఊరు క్రమేణా పెరగటం మొదలుపెట్టింది. మొదట్లో రహదారి ప్రక్కనే గృహాలు నిర్మించిన ప్రదేశానికి ఉత్తరం వైపున, తూర్పువైపున పెరగటం ప్రారంభించి, ఇప్పుడున్న సాయిబాబా దేవాలయం వరకు విస్తరించింది, ఇప్పటి వరకు ఎవరి పొలంలో వారు పూరిపాకలు, గొడ్లచావిళ్ళు, వరిగడ్డి వాములు వేసుకుని నివసిస్తున్నారు. ఆ ప్రాంతమంతా నల్లరేగడి కావడంతో వర్షాకాలంలో బురదమయమై రోడ్డుకి వెళ్ళాలంటే కాళ్ళు మోకాళ్ళ వరకు దిగిపోయేవి. ఊరి లోపల ఎటువంటి రోడ్లూ లేనందున మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉండేది. ఊరి లోపల నిలువు మరియు అడ్డరోడ్లను వేసుకోవాల్సిన అవసరాన్ని గ్రామ పెద్దలు గ్రహించారు. ఊరివారందర్నీ సమావేశపరిచి గ్రామంలో రోడ్ల అవసరాన్ని

తెలియపరచి, వారి అంగీకారంతో నిలువు అడ్డ రోడ్లను విభజించి రెండువైపులా కర్రలు పాతి, తాడుతో అందరికీ తెలిసే విధంగా మార్పులు చేసి - ఇక నుంచి ఆయా రోడ్లనే ఉపయోగించాలని నిర్ణయించారు. కానీ ఇంకొక కొత్త సమస్య వచ్చిపడింది. రోడ్లు విభజించారుగానీ వాటికి మెరక వేయాలంటే వాటికి చాలా మట్టి కావలసి ఉంటుంది. అప్పటికే తమ ఇంటి గోడలకు, ఇంటి ముందు గొడ్లచావిడిలో మెరక చేయటానికి ప్రక్కనే ఉన్న పంగెర గ్రామం పక్కన ఉన్న పాటి మట్టి దిబ్బల నుండి పాటి మట్టి, కొన్ని బండ్లు మాత్రమే తేగలిగేవారు. అదేవిధంగా తమ ఇంటి మట్టిగోడలు అలకటానికి ఇల్లు, ఇంటి ముందు ఉన్న వాకిలి అలకటానికి బోరిగం వంతెన ప్రక్కనే ఉన్న మామిడితోటలలో నుంచి ఎర్రమట్టి తమ బండ్లలో తెచ్చుకునేవారు. కానీ ఆ ఊరిలోని రోడ్లకు మెరక వేయడానికి పెద్ద మొత్తంలో కావలసిన పాటిమట్టిగాని, ఎర్రమట్టిగాని పంగెర మరియు బోరిగం గ్రామాలలో లభించడం కష్టం. అంత పరిమాణంలో కావాల్సిన మట్టిని ఎక్కడి నుంచి తీసుకురావాలో గ్రామ పెద్దలకు అర్థంకాలేదు.

ఈలోగా ఒక ఊహించని దుర్ఘటన జరిగింది. వేసవి కాలంలో గృహిణులు తమ వంట ఇంటి బయటే చేస్తుండేవారు. గాలి వేగంగా వీచటంతో ఇంటి బయట పొయ్యిలో ఉన్న నిప్పురవ్వలు గాలికి ఎగిరి ఇంటి ముందు చెరుకు ఆకుతో వేసిన పందిరి పైకి పడి గాలికి మంటలు ఉవ్వెత్తున ఎగిసి ఆ ఇంటికే కాక వెంటనే చుట్టుప్రక్కల ఉన్న ఇళ్లకు గొడ్ల చావిళ్ళకు అంటుకుని నిమ్మగడ్డ వారి ఇల్లు, కొసరాజు వారి ఇల్లు, బాల సుబ్బారావు గారి పూరిపాకలు నిమిషాల వ్యవధిలోనే అగ్నికి ఆహుతి అయి ఇంటిలో నిల్వ ఉంచిన ధాన్యం, అపరాలు, బట్టలు, డబ్బు, వంట పాత్రలు పూర్తిగా కాలిపోయి ఆ యజమానులకు తీర్చలేని నష్టాన్ని కలుగజేశాయి. ఊరిలో ఉన్న వీరారావుగారి బావి, ఉప్పు వీరయ్య గారి బావిలో ఉన్న కొద్దిపాటి నీరు ఆ మంటలను ఆపటానికి సరిపోలేదు. నిజామాబాద్ నుండి అగ్నిమాపక యంత్రాలు వచ్చేసరికి ఆ వాడంతా బూడిదలాగా అయిపోయింది. తమ కళ్లముందే తాము ఎంతో కష్టపడి పండించిన ధాన్యం, ఎంతో దూరం నుంచి తెచ్చిన జమ్ముతో నేచిన ఇళ్ళు, పబ్బు కంపతో చేసిన ఇంటి గోడలు, పప్పులు, ఉప్పులు, గొడ్లపాకలు, వడ్ల పురులు, బండ్లు, నాగళ్లు, గొర్రులు, ఇంటి సామాన్లు నిమిషాలలోనే కాలిపోగా ఆ ఇళ్ళ యజమానులు కట్టుబట్టలతో మాత్రమే మిగిలిన దృశ్యం అందర్నీ దుఃఖంలో ముంచివేసింది. ఊరిలోని ఆడా, మగా కడవలతో, బిందెలతో, కావిళ్ళతో నీరు తెచ్చి పోసినా ఆ మంటలను ఆపలేకపోయారు. అగ్ని బాధితులందరూ తమకు జరిగిన నష్టానికి దుఃఖించినా, మనుష్యుల, పశువుల నష్టం జరగలేదు. కొంతలో కొంత సంతృప్తి చెంది ఒకళ్ళనొకళ్ళు ఓదార్చుకున్నారు. ఆ రాత్రి వారందరకూ తమ బంధువుల ఇళ్లలోనే భోజనాలు ఏర్పాటు చేయబడినా ఎవరూ సరిగ్గా భోజనం చేయలేక ఆ పరిస్థితి వచ్చినందుకు తమలో తావే కుమిలిపోయారు. పశువులు కూడా ఆ ఘోరాన్ని తలుచుకుంటూ కన్నీరు కారుస్తూ ఆ రాత్రి గడ్డిని కూడా ముట్టుక ఆ కాలిపోయిన గృహాలను చూడడానికి వచ్చినవారివైపు దీనంగా చూస్తూ ఉండిపోయి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయి. ఆ మరునాటి తెల్లవారుజామునే ఆవుల, గేదెల పాలు తీయటానికి ఆయా దూడలను విప్పినా అవి తమ తల్లుల వద్దకు వెళ్లకుండా దీనంగా అంబా అని అరుస్తూ నిల్చోవడం యజమానులకు కళ్ళవెంట నీరు తెప్పించిన ఘటన ఎవరూ మర్చిపోలేరు. ఆ మరునాడు తమ కాలిపోయిన ఇళ్లను బాగు చేసుకుని, మిగిలిపోయిన వస్తువులను శుభ్రం చేసుకుని, పొరుగింటివారు ఇచ్చిన బియ్యం, ఉప్పు, పప్పు కూరగాయలతో చిన్న పందిరిలాగా వేసుకుని అక్కడే వంటలు ప్రారంభించారు. తిరిగి ఇల్లు నిర్మించుకునేవరకు తమతోనే ఉండమని బంధువులు, స్నేహితులు బలవంతం చేసినా అంగీకరించక ఆ కాలిన ఇంటిలోనే ఉండటం ప్రారంభించారు. ఊరి పెద్దలు చెప్పినా వారు వినలేదు. తిన్నా తినకపోయినా తమ స్థలంలోనే పడి ఉంటామని చెప్పారు. అట్టి కుటుంబాలకు కొన్ని రోజుల తర్వాత అటవీశాఖ వారు దూలాలు, నిట్టాళ్ళు, గుంజలు ఉచితంగా అందజేశారు.

ఆ కాలిన స్థలంలోనే తిరిగి పాకలు వేసుకున్నారు. ఆ అగ్ని ప్రమాదం తర్వాత ఊరికి నీటి చెరువు ఎంత అవసరమో ఆ ఊరివారు గుర్తించారు. గుంటుపల్లి వీరయ్య గారు ఊరికి పడమరగా ఉన్న తన చేనులో కొంత భాగం చెరువు కోసం ఉచితంగా ఇచ్చారు. ఊరందరి శ్రమదానంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, లారీల సహాయంతో చెరువులోని మట్టిని తీసుకెళ్లి ఊరిలోని నిలువు అడ్డ రోడ్లకు మెరక వేశారు. అదే సంవత్సరం ఆ చెరువు ఉన్న స్థలంలోనే ఆంధ్ర రాష్ట్ర రైతు మహాసభలు నిర్వహించబడినాయి. ఆ సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు శ్రీ రావి నారాయణ రెడ్డి గారు మరియు ఇతర కమ్యూనిస్టు, కాంగ్రెస్ నాయకులు ఆ చెరువును ప్రారంభించారు. దీంతో పశువులకు నీటి కొరత తీరింది. దీనికి ముందు ఇంతకు ముందు పేర్కొన్న రెండు బావులలో నీరు ఊరి ఉపయోగానికి చాలకపోవడంతో ఊరికి 4 పర్లాంగుల దూరంలో ఈశాన్యం మూలన ఉన్న రైలుకట్ట ప్రక్కన ఉన్న బావి నుంచి ఎడ్లబండి పీపాల ద్వారా, పెద్ద గుండిగల ద్వారా, కావిళ్ళ ద్వారా, నెత్తిపై బిందెల ద్వారా నీటిని మోసుకొచ్చేవారు. అది చిన్న ఊరే అయినా త్రాగునీటి సమస్య ఉండనే ఉండేది. ఈ నీటి చెరువుతో అది కొంత తీరింది.

చెరువు త్రవ్వి ఆ మట్టిని ఊరిలో రోడ్లకు మెరక వేశారు. కానీ అది నల్లరేగడి మట్టి కావడంతో వర్షాకాలంలో ఉపయోగానికి వీలు లేకపోయింది. ఆ బురదలో నడిస్తే మోకాలువరకు దిగిపోయేది. చిత్తడి చిత్తడిగా ఉన్న ఆ రోడ్లపై మొరం వేసి రోడ్డు రోలర్‌తో తొక్కించి వాహనాలు నడవడానికి వీలుగా ఉండేటట్లు చేయాలని పెద్దలు నిర్ణయించారు. ఆ ఊరికి దక్షిణంగా 10 మైళ్ల దూరంలో ఉన్న మోపాల్ అడవులలో ఉన్న మొరంను లారీల ద్వారా తీసుకువచ్చి ఆ రోడ్లపై పోయాలని నిర్ణయించి గ్రామంలో లారీ కిరాయి కోసం చందాలు వసూలు చేసి ప్రతి ఇంటి నుండి కనీసం ఒక్కరైనా మట్టి పనికి రావాలని ఆ విధంగా రాలేనివారు కూలి ఖర్చు భరించాలని నిర్ణయించి, మంచి రోజు చూసి ఆ కార్యాన్ని ప్రారంభించారు. నిజామాబాద్‌కు చెందిన 5, 6 లారీలను బాడుగకు తీసుకుని ఆ కార్యక్రమాన్ని వారం రోజుల్లోనే పూర్తి చేశారు. మొగవాళ్లు మొరంను లారీలలో నింపగా ఊరి రోడ్లపై పోసిన తరువాత స్త్రీలే కూలీల సహాయంతో చదును చేసేవారు. ఆ పనిని ఊరివారందరూ ఒక యజ్ఞంలా నిర్వహించారు. ఆ తర్వాత రోడ్డు రోలర్లతో చదును చేయించి ఆ రోడ్లను వాడుకలోకి తెచ్చారు. ఆ వారం రోజులూ ఊరంతా తిరుణాళ్ళలాగా ఉండేది. ఆ రోజుల్లో పాయిఖానా (మలమూత్రాల)కు వెళ్లాలంటే స్త్రీలకు చాలా ఇబ్బందిగా ఉండేది. వాళ్లు ఉదయమే చెంబులు తీసుకుని ఊరి వెలుపల ఉన్న చేలల్లోకి వెళ్లి ఆ పని పూర్తి చేసుకోవాల్సి వచ్చేది. మొదట్లో స్నానాల గదులు లేకపోవడంతో వంట ఇంటిలోనే ఒక మూలనో లేక రాత్రిపూట మాత్రమే స్త్రీలు స్నానాలు చేయవలసి వచ్చేది. అది చిన్న గ్రామమే కనుక ప్రక్కనే ఉన్న బోరిగం పంచాయితీకు కలిపి ఈ ఊరికి ఒక పంచాయితీ సభ్యుణ్ణి ఇచ్చారు. ఆ ఊరిలో ఏ కార్యం జరిగినా అందరూ కలిసి చేసేవారు. ఏదైనా శుభకార్యం జరిగితే ప్రతి ఇంటి నుండి పాలు, పెరుగు, కూరగాయలు పంపించేవారు. ఆ సమయంలో స్త్రీలు కూరగాయలు వండితే పురుషులు అన్న వండేవారు.

ఈ విధంగా మొదటి పది, పదిహేను సంవత్సరాలు ఆ గ్రామం అభివృద్ధికి పురుషులు, స్త్రీలు ముఖ్యభూమిక వహించి ఆ గ్రామాన్ని సర్వతోముఖంగా తీర్చిదిద్ది ఆదర్శ గ్రామంగా పేరు తెప్పించారు. కోస్తా ఆంధ్ర నుండి ఎవరైనా బంధువులు వస్తే వీరికి పండగలాగా ఉండేది. వారికి చక్కటి ఆతిథ్యం, మర్యాదలు ఇచ్చేవారు.

సంక్రాంతి వచ్చిందంటే ఊరంతా పండుగ వాతావరణంగానే ఉండేది. ప్రతి ఇంటి ముందు రంగులు ముగ్గులు, పుష్పాలు, పసుపు, కుంకుమ గొబ్బెమ్మలతో అంతర్గత రోడ్లన్నీ నిండిపోయేవి. ఆ ఊరి యువకులు చెడుగుడు పందాలు నిర్వహించేవారు. ధర్మారం, నిజామాబాద్, మాకులూరు, పంటకుదురు, ఎత్తొండ, అక్బర్‌నగర్, ఆంధ్రనగర్ టీములు పాల్గొనేవారు. ఆ టీములకు గ్రామస్థులే వంతులవారీగా తమ ఇళ్లలోనే భోజనాలు పెట్టేవారు.

ఇకపోతే ఆనాటి వ్యవసాయ పరిస్థితులను గురించి

తెలుసుకుందాం - మా ఊరికి దక్షిణంగా మైలు దూరంలో నిజాంసాగర్ మెయిన్ కెనాల్ ప్రవహిస్తుంది. ఆ కాలువకు తాడెం అనే గ్రామం దిగువన తూములు ఏర్పాటు చేసి కాలువ ద్వారా నీటిని క్రిందకు వదిలేవారు. ఈ కాలువకు సుబ్బారెడ్డి కాలువ, కరణం కాలువ, గోపనపల్లి కాలువ అనే ఉప కాలువల ద్వారా వచ్చే నీటితో ఆ గ్రామానికి చెందిన భూములకు కావలసిన సేద్యపు నీరు అందించబడేది. ఈ ఉప కాలువలకు అక్కడక్కడా డ్రాపులు కట్టి, నీటిని కొంత ఆపి పైన ఉన్న పొలాలకు ముందుగా నీరు అందే ఏర్పాటు ఉండేది. జూలై నెల మొదటి వారంలో బీదరు ప్రాంతంలో కురిసిన వర్షాలకు నిజాంసాగర్ నిండిపోవడంతో ఆ నీటిని వదిలి కాలువలకు వదలివేసేవారు. రైతులు జూన్ నెలలోనే తమ భూములను నాగళ్ళతో దున్ని ఆకుమళ్ళను తయారుచేసి కాలువలలో నీటిని వదలగానే ఆకుమళ్ళు పోసేవారు. జూలై నెల చివరి వరకు ఈ భూముల్లో నాట్లు (ఊడ్పులు) పూర్తి అయ్యేవి. నిజామాబాద్ నుండే కాక పంగెరం, బోరిగం, తాడెం, కదిరం, మోపాల గ్రామాల నుంచీ స్త్రీలు, పురుషులు, కూలీలుగా వచ్చేవారు. ఆడ కూలీలు మాగాణి (వరి పండించే పొలం) చేలోకి పనికి వచ్చే సమయానికి రైతు నారు కట్టలు వ ఆ మడిలో వేసి ఉంచేవారు. స్త్రీలు నాటు వేస్తే మగ కూలీలు గట్లు చెక్కటం, మడిలో పిచ్చి మొక్కలు పీకివేయటం, అవసరమైనప్పుడు ఆడ కూలీలకు నారు కట్టలు అందించడం మొదలైన పనులు చేసేవారు. నాటు వేసే సమయం ఏదైనా గట్టు రాగానే స్త్రీలు తమ వెంట తెచ్చుకున్న తమలపాకులు వేసుకుంటూ ఆ గట్టు మీద కూర్చుంటే మగ కూలీలు చెకుముకిరాయి ద్వారా నిప్పు తయారుచేసి తంబాకు (పొగాకు) చుట్టలు, బీడీలు వెలిగించేవారు. ఆ రోజు ఏదైనా ఒకటి - లేక రెండు మళ్ళ నారు మిగిలిపోయిందంటే కూలీలకు కల్లు (సారాయి)కి డబ్బులు ఇస్తామంటే చీకటి పడేవరకయినా ఆగి - ఆ పని పూర్తి చేసి - ఆ రోజు కూలీతో పాటు కల్లు డబ్బులు కూడా తీసుకుని సంతోషంగా వెళ్లిపోయేవారు. రైతులు వేసే సేంద్రియ ఎరువులతో పాటు రసాయనిక ఎరువులు అయిన యూరియా నాటు వేయక ముందు నా మడిలో చల్లటంమూలాన ఆ నాటు వేసిన 15 రోజుల్లోనే మారాకు వేసి చుట్టూ పెరిగేది. ఆ తరువాత కలుపులు తీసేవారు. రెండవ నెలలో పొట్ట పోసుకొని ఆ నెలాఖరుకు కంకులు బయటకు వచ్చి మూడవ నెలాఖరుకు గింజ పాలుపోసుకొని ఆ గింజ గట్టిపడి నాలుగవ నెలలో కోతకు వచ్చేది. వరి కోతల సమయంలో రైతులు ఎవరి చేలో వాళ్లే ఆ పనులు పూర్తి చేసుకున్నా కుప్పలను నూర్చేనాటికి నాలుగైదు కుటుంబాలు కలిసి జాయింట్‌గా మాసాలు (కుప్పనూర్పిళ్ళు) పని పురులు చుట్టటం, పురిలో ధాన్యం నింపడం మొదలైన పనులు కలిసి చేసేవారు. సంక్రాంతి పండుగ నాటికి ధాన్యం ఇంటికి చేరి - పురుషులతో, సంక్రాంతి ముగ్గులతో, గొబ్బెమ్మలతో, హరిదాసుల కీర్తనలతో ఊరంతా చాలా సరదాగా - సందడిగా ఉండేది. రైతులు తమ చేలో కోత కోయక ముందే రెండవ పంటకు జనుము, ధనియాలు, శనగ, గోధుమ విత్తనాలు చల్లి జనవరి - ఫిబ్రవరి నెలల్లో ఆ పంటకు నీరు పెట్టేవారు. ఇక్కడ చలి వాతావరణానికి పెసలు, మినుములు, పిల్లిమిసర మొదలైన పంటలు పండేవి కావు. రైతులు చేల గట్ల పైన బెండ, దోస, బీర పాదులు పెట్టి కంది విత్తనాలు వేయగా వారి ఇంటికి సరిపోను కందులు, కూరగాయలు పండేవి. ఆ కందులు కడిగి ఎండబెట్టిన తరువాత గృహిణిలు తిరగలి ద్వారా పప్పు చేసి ఆ పప్పును అల్యూమినియం డబ్బాలలో నిల్వ ఉంచి, సంవత్సరమంతా వాడేవారు. రైతులు తమ మాగాణి చేలో వరి, చెరకు పండించేవారు. చెరుకు పక్వానికి రాగానే లంబాడీ కూలీలు చెరుకు నరికి కట్టలు కట్టి బండి లేక లారీలలో షక్కర్ నగర్‌లో ఉన్న నిజాం చక్కెర కర్మాగారానికి తోలేవారు. అవే పిలకలు రెండవ సంవత్సరం కూడా చెరుకును తయారు చేసేవి.

ఊరికి ఉత్తరం మరియు పడమర వైపున ఉన్న మెట్ట పొలాల్లో సెనగ, పత్తి, వేరుశెనగ, ధనియాలు మొదలైన అపరాలు ప్రొద్దు తిరుగుడు పువ్వు, కందులు, గోధుమ మొదలైన పంటలు పండించేవారు. తమ చేల గట్ల పైన పెరిగే పచ్చటి గడ్డిని కోసి తెచ్చి పాడిగేదలకు,

ఆవులకు, ఎడ్లకు మేపేవారు. వడ్లు నూర్చగా వచ్చిన వరిగడ్డిని కట్టలుగా కట్టి బండితో గ్రామంలోకి తోలుకెళ్లి తమ ఇంటికి దగ్గరలోనే వాములు వేసి ఆ వరిగడ్డిని సంవత్సరమంతా తమ పశువులకు అందించేవారు. మెట్ట చేలో వచ్చిన జొన్న కట్టలు, మాగాణి చేలో రెండవ పంటగా వేసిన జనుము కట్టలుగా కట్టి వరిగడ్డి వాము మధ్యలో వేసి వాటిని పశువులకు ముఖ్యంగా ఎడ్లకు మేపేవారు. వాములు వేసే సమయంలో ఒకరికి ఒకరు సహాయం చేసుకునేవారు. ఆరుగాలం కష్టపడి రైతులు అధిక ధాన్యం పండించి తమ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగు పరుచుకునేవారు. తమ ఇంటి అవసరాలకు కావలసిన మంచాలు, పరుపులు, బీరువా, కుర్చీలు, బల్లలు, వంటసామాన్లు కొనుక్కునేవారు. రైతులు తమ పంటను నూర్పిళ్ళు కాగానే అమ్మివేసుకుని తాము చేసిన అప్పులు తీర్చుకోగా ఆ అవసరం లేనివారు పురులు కట్టి, ధాన్యాన్ని నిల్వ ఉంచి, మంచి ధర వచ్చినప్పుడు మాత్రమే అమ్ముకునేవారు. ఒక్కోసారి ఈ పురులు అగ్ని ప్రమాదానికి గురికావడం కూడా జరుగుతుండేది. చిన్న గ్రామమైన మాధవనగరంలో తపాలా కార్యాలయంలో మాధవనగరం, ధర్మారం, మదనపల్లి, మాకులూరు గ్రామస్తులు ఆంధ్రా నుండి వారికి వచ్చే ఉత్తరాలు గంజ్‌లో ఉన్న చింతా లింగయ్య గారికి కిరాణా షాపు అడ్రస్‌కే వస్తుండేవి.

ఇకపోతే ఆ నాటి విద్యా విధానం గురించి తెలుసుకుందాం - విద్య యొక్క విలువను, అవసరాన్ని గుర్తించిన కొందరు రైతులు తమ పిల్లలను విద్యావంతులనుగా చేయాలని నిర్ణయించుకున్నారు. తాము పడుతున్న కష్టాలను తమ పిల్లలు కూడా పడకూడదని - వాళ్లను బాగా చదివించి, మంచి ఉద్యోగులుగా చూడాలనే బలమైన కోరిక మనసులో నాటుకుపోయింది. ఆ సమయంలో ఊరిలో పాఠశాల లేదు. ఊరికి రెండు మైళ్ల దూరంలో ఉన్న ధర్మారం పాఠశాలకు - లేక అంతే దూరం ఉన్న నిజామాబాద్ నగరానికి విద్యార్థులను పంపించవలసిన ఉంటుంది. కొందరు రైతులు తమ బంధువులు, స్నేహితులు ఉంటున్న ధర్మారంలో ఉన్న పాఠశాలకే తమ పిల్లలను పంపిస్తుండేవారు. ఆ పాఠశాల సమయం ముగియగానే కుమ్మరి మాస్టారు గారు ట్యూషన్ చెప్పేవారు. ఆయన చేతిలో ఎప్పుడూ పొడవాటి బెత్తం ఉండేది. ఎవరైనా సరిగ్గా చదవకపోతే వీపు మీద బెత్తం దెబ్బలు వాతలు తేలేవి. ఆ తర్వాత మాధవనగరానికి దగ్గరలో ఉన్న బోరిగంలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభమైంది. ఆడపిల్లలను నిజామాబాద్‌కు పంపటం ఇష్టం లేక కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ బడిలోనే చేర్చేవారు. మగపిల్లలు కొందరు నిజామాబాద్ పులాంగ్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు అప్పుడే కుమార్‌గల్లీలో స్థాపించబడిన వైశ్య పాఠశాలలోనూ చేరేవారు. వేసవి సెలవుల్లో ఇప్పటి అరుణ ప్రింటింగ్ ప్రెస్ యజమాని శ్రీ అన్నే నారాయణరావుగారు ఇప్పటి పంచాయతీ కార్యాలయంలో ఉన్న స్థలంలో గ్రామస్తులు వేసిన పూరిపాకలో ఊరి పిల్లలకు చదువులు చెప్పేవారు. ఆ రోజుల్లో ఆడపిల్లలు మిడిల్ స్కూల్ వరకే చదివి ఆపివేసేవారు. మగ విద్యార్థులు తమ తండ్రికి వ్యవసాయ పనులలో బావుల నుండి ఇంటికి కావలసిన నీరు కావిళ్ళ ద్వారా తెచ్చి సిమెంట్ తొట్లు, కుండలు, బానలు, గుండిగలు మొదలైన వాటిలో నీరు నింపి తమ చదువులు కొనసాగిస్తూ ఉండేవారు. ఆడపిల్లలు తమ తల్లులకు ఇంటి పనులలో తోడుగా ఉండేవారు. ఆ విధంగా కష్టపడి చదువుకున్న విద్యార్థులు కళాశాల పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యాలయాల్లో కష్టపడి చదివి మంచి ఉద్యోగులుగా మన దేశంలోనే కాకుండా దేశవిదేశాలలో కూడా మంచి హోదాల్లో విధులు నిర్వహిస్తూ తమ తల్లిదండ్రులకే కాక ఊరికి, రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు సంపాదించారు. వీరు తమతోపాటు తమ కుటుంబ, ఇతర సభ్యుల అభివృద్ధికి తమవంతు సాయం అందిస్తున్నారు. ఈ గ్రామానికి చెంది విదేశాలలో ఉన్నంతమంది ఉద్యోగులు ఏ ఇతర గ్రామాల్లో లేరు అనటం అతిశయోక్తి కాదు.

ఈ విధంగా మాధవనగరం అభివృద్ధి పథంలో ముందు వరుసలో ఉండడం విశేషమే!

కొసరాజు వెంకటేశ్వరరావు
సుత్తూరు. ఫోన్: 949 063 6659.




సేవాగ్రామం

# సేవాగ్రామం

*– లక్ష్మీ అయ్యర్*

దేశపిత బాపూ భక్తులు ఆయన సిద్ధాంతాలను నమ్మేవాళ్ళు, అహింస, శాంతి, పరోపకార ప్రియులు ప్రకృతి ప్రియులు సందర్శించవలసిన ప్రదేశం మహారాష్ట్రలోని వార్ధా (wardha)లో ఉన్న సేవాగ్రామం.

12, మార్చి 1930లో ఉప్పు సత్యాగ్రహ పోరాటానికై సబర్మతి ఆశ్రమం నుండి 78 మంది అనుచరులతో దండి సత్యాగ్రహానికి బయలుదేరిన గాంధీజీ అది ఒకవేళ ఘనవిజయం సాధిస్తే ఇక్కడకు (సేవాగ్రామానికి) తిరిగి వస్తాను అని చెప్పారంట. 6, ఏప్రిల్ 1930 గుజరాత్‌లో ఉన్న దండి సముద్రపు ఒడ్డున ఉప్పుపై విధించిన చట్టాన్ని ఉల్లంఘించినందుకు మే, 5వ తేదీన చెరసాలలో ఆయన బంధింపబడ్డారు. 1933న కారాగారం నుండి బయటకు వచ్చిన మహాత్మాగాంధీ దేశం నలుమూలన హరిజన యాత్ర చేపట్టారు.

జమునా లాల్జీ కోరికను మన్నించి మహారాష్ట్రలోని వార్ధా దగ్గర 'సే గావ్' అనే చోట గాంధీ 10 సంవత్సరాలు (1936 నుండి) ఉండి సామాన్య జీవితం గడిపారు. కాలక్రమేణ ఆ గ్రామం సేవాగ్రామంగా పేరు పొందింది. చేతిలో చీపురు, ఓ బకెట్టు నీళ్ళు తీసుకొని స్వయంగా సేవ చేస్తూ నేటి స్వచ్ఛభారత్‌కు నాంది పలికిన వ్యక్తి బాపూనే. ఆయనతో పాటు విదేశీ వనిత మిస్. సేల్ట్ (మీరా బహన్) రాట్నం తిప్పుతూ అక్కడి గ్రామీణ జనులకు వస్త్రాలు నేసి ఇచ్చి వాళ్లకు కుట్లూ, అల్లికలూ నేర్పించిందని అక్కడి ఆధారాలు చెబుతున్నాయి. అక్కడగల జామచెట్ల క్రింద కూర్చొని బాపూ పనిచేసేవారంట. ఆ గ్రామమే నేడు సేవాగ్రామంగా పేరుపొందింది. అప్పటి సేవాగ్రామం కనీస వసతులు లేని ఓ భారతీయ సంస్కృతికి పేరుమోసిన కుగ్రామం. ఓ తపాలు కార్యాలయమో, ఓ వైద్య సదుపాయమో కనీసం రోడ్లు కూడా లేని పల్లెటూరు. ఏ వసతి లేని ఇలాంటి గ్రామంలో ఉండడానికి ఎలా అనుకున్నారు అని ప్రశ్నించిన తన పోలాండ్ ఇంజినీయర్ మిత్రులు మారిస్ ఫ్రిడేమన్ కు గాంధి - "ఈ గ్రామపు ప్రజలకు సేవ జేయడానికి మాత్రమె వచ్చాను, దాన్ని దైవసేవగా భావిస్తున్నాను" అని జవాబిచ్చారు. గాంధీ అస్పృశ్యతా నివారణకై 1936 నుండి 1946 వరకు ఇక్కడే ఉండి ప్రజలకు ఎనలేని సేవలు అందించారు. ఆ కాలంలో సుమారు ఆరు వందల మంది హరిజన కుటుంబాలకు ఆయన సేవ చేశారని చెప్పబడుతున్నది. మలేరియా, టైఫాయిడ్‌లాంటి రోగాలతో బాధపడుతున్నవారిని ప్రేమతో అక్కున తీసుకొని వారికి సేవలు అందించారంట.

ఇక సేవాగ్రామం ఆశ్రమం - ఎంత నిశ్శబ్దం - చుట్టూ వృక్షాలు - అందమైన పూల తీగలు - మొక్కలు. ప్రకృతిమాత పరిచిన పచ్చని కంబళి. తెల్లవారి వేకువనే లేచి ఆ ఆశ్రమాన్ని ఓ చుట్టు చుట్టి వచ్చి చూడండి. తెల్లటి ఆవులతో గూడిన గోశాలలు, వనాలు. "ఎక్కడ తిరిగినా నేను నీకు శాంతిని మాత్రమే ఇస్తాను" అని మౌనంగా ప్రేమను ఒలకబోసి నవ్వే అందమైన ప్రకృతిమాత. అక్కడ టీ, కాఫీ, జర్దా, బీడీ, బీడా, పాన్, సిగరెట్ల అంగళ్లు అస్సలు ఉండవు. హోటళ్ళు కూడా ఉండవు. 'ప్రాకృతిక్ ఆహార్ భండార్' అనబడే ప్రకృతి భోజనశాలగలదు. అక్కడ దొరికే ప్రకృతి సిద్ధమైన భోజనం మరియు అంబాడీ షర్బత్ రుచి తప్పక చూడాల్సిందే.

బయట నుండి వచ్చే యాత్రికులకు బస చేయడానికై యాత్రీ నివాస్ కలదు. బయట నుండి

గుడిసె ఆకారంలో కట్టబడిన ఆధునిక వసతులు గల భవనం, ఓ రోజుకు 300 రూపాయలు మాత్రమే బాడుగ. వేడినీళ్ళకి బకెట్టు తీసుకొని వెళ్లి తెచ్చుకోవాలి. పెద్ద తగరం టిన్‌లో వేడి నీళ్ళు కాచి ఇస్తారు. ఉదయం 5 గం.ల నుండి 7 గం.ల వరకు మాత్రమే. చాలా అందంగా, శుభ్రంగా యాత్రీనివాస్ ఉంటుంది. చుట్టూ వృక్షాలు, పూలు, చెట్లతో గూడి గ్రామీణ వాతావరణంలో ఉన్న అధునాతన వసతి గృహమది. పరుగెత్తి - పరుగెత్తి యంత్రంలా సాగే సిటీ జీవనానికి దూరంగా ఏకాంత ప్రదేశంలో నిశ్శబ్దతతో కూడిన పవిత్రమైన, మౌన సౌధం. తెల్లవారి 9 గంటలకు ఆ ప్రకృతి భోజనాలయం తెరువబడుతుంది. క్రింద కూర్చొని చిన్న బల్లపై ఆహారాన్ని ఉంచి తినాలి. విశ్రాంతి ప్రియులైన ముసలి దంపతులు, శాంతి ప్రియులు, ప్రకృతి ఒడిలో సేద తీర్చుకోవాలనుకునే సామాన్య ప్రజలు, మానసిక ఒత్తిడి నుండి బయట పడాలని తలచేవారు తప్పక వెళ్ళాల్సిన చోటు సేవాగ్రామం. అక్కడ ఓ హిందీ కేంద్రీయవిశ్వ విద్యాలయాన్ని స్థాపించాలని గాంధీ ఆ రోజుల్లో అనుకున్నారంట. అది ఈనాడు నెరవేరింది.

ఆ ఆశ్రమంలోని ప్రతి గుడిసె భారతీయ సంస్కృతిని సూచిస్తుంది. అక్కడ పనిచేస్తున్నవారందరూ సౌమ్యులే. ప్రేమతో నిదానంగా విసుగు లేకుండా వినమ్రతతో మాట్లాడుతారు. ఆదినివాస్, బాపూ కుటియా, బాపూ చరఖా, ఆయన చెప్పులు, చేతి కర్ర, వెదురుతో చేసిన ఆయన కుర్చీ, చాపలు దర్శనమిస్తాయి.

బాపూ కా దఫ్తర్ అని పిలువబడే గాంధీ కార్యాలయంలో ఆయన కార్యదర్శి మహాదేవి బాయిబ్యా నేలాల్ మరియు అమృత కౌర్‌లాంటివారు పనిచేశారు. వాళ్ళు ఉపయోగించిన టెలిఫోన్, పాములను పట్టే పంజరం, పెద్ద కర్ర అక్కడ దర్శనమిస్తాయి. పాములను చంపకుండా పట్టి వదిలేసి వస్తారంట. ఓసారి మైదానంలో కూర్చొని అందరితోపాటు గాంధీ ప్రార్థన చేసేటప్పుడు ఆయన పైనుండి ఓ పెద్ద పాము వెళ్లిందంట. ఆయన శాంతంగా అందరిని ఉండమని సైగ చేశారంట.

**ఆశ్రమ గుడిసెలు:** 19-03-1936న గాంధీ తన మిత్రులైన జమునాలాల్ బజాజ్‌కు రాసిన లేఖలో కస్తూరి బాయ్‌కు నచ్చితే ఇక్కడకు పిలుచుకొని రమ్మనమని లేదా తాను ఒంటరిగానే అక్కడ ఉంటానని పేర్కొన్నారు. తనకు ఓ గుడిసె, చెల్లెలు మీరా బహెన్‌కు ఓ గుడిసె వంద రూపాయల ఖర్చుతో వేయింపమని కోరారు. ఆయన కోరికను మన్నించి తయారు చేయించిన గుడిసె నేడు ఆదినివాన్ అని పిలువబడుతున్నది. ఆ గుడిసెలోనే గాంధీ, కస్తూరి బాయి, ప్యారేలాల్ సంత్ తుకడోజి, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ అందరూ కలసి ఉన్నారని చెప్పబడుతున్నది. ఓ మూలలో తన వస్తువులన్నింటిని బాపూ ఉంచేవారంట. అందరికీ భోజనం తనే వడ్డించేవారంట. క్విట్ ఇండియా ఉద్యమం మొదటి సమావేశం అక్కడే జరిగిందని తెలుస్తుంది. 1940లోని సత్యాగ్రహ కార్యాలు అక్కడ నుండే ప్రారంభమయ్యాయి.

**బాపూ కుటి బాపూ దఫ్తర్:** ఈ చోటనే మీరా బహన్ ఆ గ్రామీణ ప్రజలకు కుట్లు, అల్లికలు, చరఖా తిప్పడం, నేత నేయడం నేర్పించిందని చెప్పబడుచున్నది. తీవ్రమైన ఎండ వేడికి తట్టుకోవాలని వెదురుతో చేసిన ఆకుల తలుపును చూడవచ్చు. దానిపై నీళ్ళుచల్లి ఉపయోగిస్తారంట. ఇప్పుడు ఆశ్రమంలో గాంధీ ఉపయోగించిన అన్ని వస్తువులు కళ్ళద్దాలు, చేతి కర్రతో సహా మనం చూడవచ్చు. ప్రార్థన మైదానం గోశాలలు చూడవచ్చు. విశ్వప్రసిద్ధిగాంచిన విప్లవ విమర్శకుడు ఇవాన్ ఇలిచ్ ఇక్కడ ఉన్న బాపూ కుటిలో బస చేసేటప్పుడు ఇలా రాసి ఉంచారు - "నాకిక్కడ నచ్చిన విషయాలు రెండు. ఒకటి ఇక్కడున్న ధార్మిక, దైవిక చింతనలు, రెండోది ఆశ్రమంలోని నిరాడంబరత, ప్రేమతో కూడిన జీవన సరళి. ఇక్కడ నుండి వెళ్లి ఆడంబరంగా షోకులతో జీవిస్తున్న వారిపై నాకు జాలి వేస్తుంది, ప్రకృతి మాత ఒడిలోని సౌందర్యాన్ని ఆస్వాదించ లేనివాళ్ళు. అతి సామాన్య జీవితం సంతోషంగా ప్రేమతో, సేవాదృక్పథంతో కూడిన మనుష్యులతో గడపాలంటే బాపూ కుటిలో ఉండాల్సిందే."

**బా కుటి:** (కస్తూరి బాయి కుటి): జమునాలాల్ జి గాంధీ అనుమతితో నిర్మించి ఇచ్చిన ఓ పెద్ద గుడిసె. అందరి స్త్రీలతో పాటు కస్తూరిబాయి గారు అక్కడ ఉండి నేతపనులు, కుట్లు అల్లికలు, చరఖా తిప్పి నూలు నేయడం, యోగాసనాలు నేర్పేవారంట.

**ఆఖరి నివాస్:** జమునా లాల్ జి తనుండడానికై దీన్ని కట్టారంట. కాని శాంతిదాస్, లార్డ్ లుథియన్ మున్నగువారు ఉన్నారంట. తర్వాత సుశీల నాయర్ ఇక్కడే ఉండి ప్రజలకు చికిత్సలు చేశారంట. ఆ చోటు ఇప్పుడు మహాత్మాగాంధీ ఆయుర్వేద నిలయంగా రూపొంది ఉంది. 1946లో గాంధీగారికి తీవ్ర మైన దగ్గు, జలుబు వచ్చినపుడు ఇక్కడ వైద్యం చేసుకున్నారని చెప్పబడుతున్నది. 25, ఫిబ్రవరి 1948 ఇక్కడ నుండి ఢిల్లీ వెళ్ళాలని అనుకున్నారంట. కాని 30, జనవరి ఢిల్లీలో కాల్పులకు బలి అయిన బాపూ ఇక్కడకు తిరిగి రానందున దాని పేరు ఆఖరి కుటిగా మిగిలిపోయింది. శ్రీ ధర్మానంద కోశాంబి ఇక్కడ ఆమరణ నిరాహారదీక్షతో ఇక్కడే అసువులు బాసారని చెప్పబడుచున్నది.

**ప్రార్థన భూమి:** ఇది ఓ పెద్ద విశాల బహిరంగ మైదానము. ఇక్కడ బాపూతో కలసి అందరూ ప్రార్థన చేసి రాత్రి పడుకొనేవారంట. ఎప్పుడూ చేతికర్ర, పొటాసియం పర్మాంగనెట్ పక్కన ఉంచుకునేవారట. పాములు, తేళ్ళు కరిస్తే చికిత్సకై తయారుగా ఉంటారంట. చుట్టూ ఈ నాడు కనబడే పెద్ద-పెద్ద వృక్షాలు ఆనాడు వాళ్ళు నాటిన మొక్కలు.

**నిర్మల్ తులసి మఠ్:** మాతా కస్తూరి బాయి 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పూనేలో గాంధీతో పాటు పోలీస్ కస్టడిలో ఉన్నప్పుడు సేవా గ్రామపు ప్రజలు ఈ తులసమ్మ కోటలోని ఓ మొక్కను ఇచ్చారంట. ఆవిడ భక్తిశ్రద్ధలతో దానిని కొలిచేవారట. ఆవిడ మరణించిన తర్వాత ఆ తులసి మొక్కను సేవాగ్రామపు తులసికోటలో గాంధీ చేతుల మీదుగా ఉంచారట. తులసి పొధా (తులసి మొక్క) అన్న పేరుతో పెద్ద తులసీ వనం కూడా చూడవచ్చు. ఇంకా వారు ఉపయోగించిన మట్టి కుండలు, మట్టి పాత్రలు, మట్టి పొయ్యి చూడవచ్చు.

**మహాదేవ్ కుటి:** గాంధీ ప్రధాన కార్యదర్శి మహాదేవ్ వార్ధా నుండి ప్రతి రోజు సేవాగ్రామానికి నడచి వచ్చి తపాల (పోస్ట్) తెచ్చి ఇచ్చేవారట. 14, ఆగష్టు 1942న గాంధీ చెరసాలలో ఉన్నప్పుడు ఆయన మరణించారు. ఇంగ్లీష్ మరియు గుజరాతి భాషలలో పాండిత్యంగల మహాదేవ్‌గారి గుర్తుగా కట్టిన గుడిసె. ఆయన లోటు గాంధీ గారిని చాలా కలవరపెట్టింది.

**కిషోర్ నివాస్:** కిశోరే అనబడే ఈయన కూడా బాపూ కార్యదర్శులలో ఒకరు. ఆయన గుర్తుగా ఇది మిగిలింది.

**పరచురే కుటి:** పరచురే శాస్త్రిగారు ఓ పెద్ద సంస్కృత పండితుడు. సబర్మతి ఆశ్రమంలో జనుల సేవ చేస్తూ జీవితం గడిపిన మహానుభావుడు. ఆయనకు ఆకస్మాత్తుగా కుష్టురోగం రావడంతో బాపూ 1939లో సేవాగ్రామం పిలిపించుకొని ఆయనకు తానే స్వయంగా నూనెతో మర్దన చేసేవారంట. అది చూసి అక్కడున్నవారు అక్కడ ఉన్న కుష్టురోగుల సేవానిమిత్తం ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇవిగాక దక్షిణాఫ్రికాలోగల గాంధీజీ మిత్రులు రుస్తుం పేరున ఆయన కొడుకు రుస్తుం భవన్ అనే కట్టడాన్ని కట్టి ఇచ్చారు. నయీ తాలీం అనబడే ఇంకొక గుడిసెలో గాంధి శ్రీ ఆర్య నాయక్ ఆయన శ్రీమతి ఆశదేవి జీతో కలసి ప్రాథమిక పాఠశాలకై ఏర్పాటు చేశారు. తర్వాత శాంతి భవనమనే చోట విద్యాకేంద్రం నెలకొల్పబడింది. చరఖా సహాయంతో నూలు గుడ్డలను నేసెచోట కబీర్ భవనము ఆవిర్భవించింది.

ఇవిగాక అంతర్జాతీయ హిందీ విశ్వవిద్యాలయం, విదర్భ గుడి (కృష్ణుడు రుక్మిణిని పెళ్లి చేసుకొన్న చోటు) గాంధీ గ్రంథాలయంలాంటివి చూడవచ్చు. యాత్రీనివాస్‌లో ఉండాలంటే ఈయనను సంప్రదించవచ్చు. (అశోక్ గిరి జీ - ఫోన్: 982 279 7527).

*రఘుపతి రాఘవ రాజారాం / పతీత పావన సీతరాం*
*ఈశ్వర్ అల్లా తేరే నాం / సబ్‌కో సన్మతి దే భగవాన్*

ప్రొ. ఎన్. లక్ష్మీ అయ్యర్
రాజస్థాన్. ఫోన్: 968 027 6038.

# దయా గుణ చేతన - జ్ఞానామృత బోధన

– దాసరి శివకుమారి

*"బాలకుటీర్ - దిల్ బహార్ / ప్రాంగణ చేతన - పాఠశాల నందన / హీల్ బాలల గ్రామం - అనాథల స్వర్గ ధామం / స్కూల్ ఆన్ వీల్స్ - గ్రామీణ బాలల కరుణ / లలితకళా తేజో నిపుణ - ఎన్నెన్నో దారు శిల్పాల అవతరణ / సంధ్యారాగ, అనురాగ - మమకార మాధురీ పున్నాగ / కాళ్ల మీద బిడ్డ నూయలలూపె అమ్మ - ఏకాగ్రతగా చదువుకొనే పిల్లవాడిగా రాతి బొమ్మ / బంగారు వర్ణపు పూలతో నిండిన తుమ్మ - ఇలా ఏది చూసినా కలిగే గుండెలోన చెమ్మ."*

మాంటిస్సోరి విద్యా విధానంలో ఎందరో శిక్షణ తీసుకుంటారు. కాని దానిని త్రికరణశుద్ధిగా నమ్మి ఆచరణలో పెట్టేవారు కొంతమందే. ఆ కొంతమందిలో డా. నన్నపనేని మంగాదేవిగారు ప్రముఖులు. తన ఆత్మీయ స్నేహితురాలైన గరిగె ప్రభావతిగారితో కలసి ఆ ఆలోచనలను పంచుకున్నారు. విద్యార్థులకు నైతికవిలువలతో కూడిన విద్యనందించి వారిని ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని తపనపడ్డారు. పౌరులు ఉత్తములైతే సమాజం సుసంపన్నంగా, నీతి వంతంగా ఉంటుందన్న ఆలోచనతో 1965 సం.లో గుంటూరులోని బ్రాడీపేటలో 'ఒక్క విద్యార్థిని'తో బాలకుటీర్ అను విద్యాలయాన్ని స్థాపించారు. ఆలోచనలు 'మరియా మాంటిస్సోరి'వే అయినా ఆచరణ మాత్రం మన ప్రాంతానికి, మన వాతావరణానికి తగ్గట్లుగా మార్చుకొని రూపొందించారు. బాలకుటీర్‌లో ప్రవేశించిన ఒక్క విద్యార్థిని పదులు, వందలు, వేలమంది బాలబాలికలయ్యారు. బాలకుటీర్‌పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో నమ్మకాన్ని పెంచుకున్నారు. CBSE సిలబస్‌లో పిల్లలకు చదువునందించమని కోరారు. ఆ కోరికవలనే గుంటూరులోని శ్యామలానగర్‌లో బాలకుటీర్ మరో శాఖను ప్రారంభించింది. ఇక్కడి విద్యాబోధన మొదటి నుంచీ ప్రత్యేక మైనదే. పిల్లలే స్వయంగా నేర్చుకోవటానికీ ఎదుగటానికీ అనుగుణంగా సిలబస్‌ను రూపొందించుకున్నారు. బాలకుటీర్ సహకార్యదర్శి అయిన జయశ్రీగారి నేతృత్వంలో సిబ్బంది అంతా ఎంతో క్రమశిక్షణతో మెలుగుతూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

బాలకుటీర్ ప్రారంభించిన పదేళ్లకు బృహత్తర ప్రణాళికలతో మంగాదేవీ ప్రభావతుల సారథ్యంలోనే చేతన పురుడు పోసుకున్నది. దాతల ఆర్థిక, హార్దిక సహాయాలెన్ని ఉన్నా ఆలోచనా, ఆచరణా సరళి వీరిరువురిదే. 'ఆల్బర్ట్‌ష్వైజర్' అను జర్మన్ వైద్యుడు దక్షిణాఫ్రికాలోని నిరుపేదరోగులకు ఎంతగానో సహాయసహకారాలు అందించారు. అది మంగాదేవిగారి మనసు మీద చెరగని ముద్రవేసింది. తరువాతి రోజుల్లో దీన జనపక్షపాతి అయిన మదర్ థెరిసాను కలుసుకున్న సందర్భంలో ఆమె మంగాదేవిగారితో మాట్లాడారు. "విద్యార్థులకు విద్యనందిస్తున్నావు. మరి అనాథలకు, ఆర్తులకు, నీ వంతుగా ఏం చేస్తున్నావు" అని ప్రశ్నించారు. ఆ ప్రశ్న మంగాదేవిగారిని ఎంతగానో ఆలోచింపజేసింది. ఆ ఆలోచనల ఫలితమే 'చేతన-బహుళార్థ సాధక గ్రామీణ పథకం' రూపుదిద్దుకున్నది. గుంటూరుకు 15 కి.మీ. దూరంలో ఉన్న 'చౌడవరం' కొండలతో, గుట్టలతో నిండివున్న గ్రామీణ ప్రాంతం. ఇక్కడున్న వారంతా కొండల్లో రాళ్లుకొట్టీ, గొఱ్ఱెలను మేపుకొనీ జీవిస్తున్నారు.

వారంతా, నిరక్షరాస్యులైన నిర్భాగ్య కార్మిక పెద్దలూ, పిన్నలూ. ఆ కొండల్లో, గుట్టల్లో మగ్గిపోతూ కటిక పేదరికాన్ని గడిపేవారి జీవితంలో వెలుగులు నింపాలనుకున్నారు. వారి పిల్లల కోసం 'చేతన ప్రాంగణంలో', 'నందన' గ్రామీణ పాఠశాలను స్థాపించారు. విలక్షణంగా ఆలోచించి విశ్వజనీనతను సాక్షాత్కరింపజేయాలని అహరహం కృషి చేశారు. ఆ చిన్నారి గొఱ్ఱెలకాపర్లచేత, రాళ్లుకొట్టే ఆ చిట్టి చేతులతో పలకాబలపం పట్టించి వారిని విద్యావంతులను చేయగలిగారు. మంగాదేవిగారు అందరి విద్యార్థులతో పాటు వారికీ 'దేవమ్మ' అయ్యారు. ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, బట్టలు, పుస్తకాలు అందించి వందలమంది విద్యార్థులను తయారు చేశారు. ఉన్నత చదువులు చదివి వారు విద్యావంతులుగా మారటమేకాక రకరకాల ఉపాధులను పొందుతూ ఎంతో గౌరవనీయ స్థానాల్లో కుదురుకున్నారు. వారంతా "ఇది మాకొక అద్భుతం. ఈ అద్భుతాన్ని మా 'దేవమ్మ' చేసిచూపించారు." అని తన్మయత్వంతో కూడిన ఆరాధనతో చెప్తారు. సమాజం గర్వించదగిన పని చేసినందులకు మంగాదేవిగారెంతైనా అభినందనీయులు. ఇలా 'చేతన'లో మొదటగా ప్రారంభింపబడిన మొదటి పథకం నందన పాఠశాల వేయిరేకులా విరిసిన ప్రసూనంలాగా భాసిస్తున్నది. ఈ చేతన నిర్వహణలో శ్రీమతి మరుద్వతిగారి పాత్ర విశిష్టమైనది. నవ్వులు చిందిస్తూ అలవోకగా కార్యక్రమాలన్నింటినీ నిభాయిస్తున్నారు.

1992వ సం.లో శ్యామలానగర్‌లోనే 'హీల్' సంస్థ ప్రారంభింపబడినది. 'హీల్ బాలల గ్రామం' అన్న పేరూ, దాని ఆశయాలూ డా. కోనేరు సత్యప్రసాద్‌గారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ హీల్ బాలల గ్రామానికి నా సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తానంటూ వారు వ్యవస్థాపక అధ్యక్షులుగా, మంగాదేవిగారు కార్యదర్శిగా ఉండి ఎనలేని సేవలను అందిస్తున్నారు. ఈ 'హీల్ బాలల గ్రామం' 1997 నాటికి 'చేతన'కు తరలివచ్చింది. ఈ సంస్థలో ఉన్న పిల్లలు ఎక్కడో రోడ్డు పక్కన పడి ఉన్న అనాథలు, తల్లీ తండ్రీ తెలియని మరికొందరు దురదృష్టవంతులు. ఇలాంటివారి ఆచూకీ తెలుసుకుని వారిని చేరదీసి తమ ఒడిలోకి తీసుకుని ఆశ్రయమిస్తున్నారు. వీరికి చదువు సంధ్యలు నేర్పి సభ్యసమాజ పౌరులుగా తయారు చేస్తున్నారు. ఈ హీల్ బాలల గ్రామం నిలువెత్తు మానవత్వానికి ప్రతిరూపం. వీరి కోసం ఇక్కడ కాటేజీలు కట్టబడ్డాయి. ఒక్కొక్క కాటేజీలో పదిపన్నెండు మంది పిల్లలు ఉంటారు. వారికి కావలసిన సౌకర్యాలతోపాటు వారి మంచి చెడ్డలు చూస్తూ, అమ్మలా ఆదరించి ప్రేమను పంచే ఒక్కో హౌస్ మదరూ ఉంటారు. పదేళ్లు నిండిన మగపిల్లలకు ప్రత్యేకమైన వసతి గృహమున్నది. హీల్ గ్రామపు బాలలందరికీ పుట్టిన రోజులు కూడా జరుపుతూ వారిలో సంతోషాన్ని, ఉల్లాసాన్ని నింపుతున్నారు. హీల్ బాలల దినచర్య, వారికి రోజువారీ అందించే ఆహారం అన్నీ పట్టికలలో పొందుపరిచి గోడల మీద వ్రాయించి ఉంచారు. యోగ, వ్యాయామాలతో వీరి దైనందిన కార్యక్రమాలు మొదలవుతాయి. చేతనలోనే పండించిన కూరగాయలతో, పండ్లతో, ఆకుకూరలతో, పర్యావరణ హిత ఆహారంతో వీరంతా ఆరోగ్యభాగ్యాన్ని కలిగి ఉంటారు. వీరికొక ఆరోగ్య కేంద్రం, పిల్లల డాక్టర్ల పర్యవేక్షణా ఉన్నది. ఈ పిల్లల కాటేజీల వెనక విశాలమైన ఆటస్థలం, ఆటల పరికరాలతో అలరారుతున్నది. వీరందరికీ విద్యాబుద్ధులు చెప్పిస్తున్నారు. ఎవరైనా చదువులో వెనకపడినవారుంటే వారి కోసం వృత్తి విద్యాశిక్షణా ఇప్పిస్తున్నారు. వీరంతా జీవితంలో, స్థిరపడేవరకూ వారే బాధ్యత తీసుకుంటున్నారు. విద్యాబుద్ధులు గడించినవారు వేరేచోట ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మరికొంత మంది చేతనలోనే ఉండి తమకు తగిన పనిలో కుదురుకుని తమలాంటి మరెంతోమంది విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతున్నారు. హీల్ బాలల గ్రామంలో పిల్లలకే కాదు. ఏ ఆధారమూలేని తల్లులు కూడా ఇక్కడే ఉండి తమ పిల్లల్నీ వారితోపాటు హీల్ పిల్లల్ని కనిపెట్టుకుని ఉంటున్నారు. మూడేళ్లూ, ఆలోపు

పిల్లలకూ 'అంకుర్' ప్రాంగణం ఇటు జీవితానికీ, అటు చదువుకూ పునాదులు వేస్తున్నది. వీరికి మాంటిస్సోరి పద్ధతిలో శిక్షణ ఉంటుంది. ఆరుబయట తరగతి గది నిర్వహణా, దాంట్లో చిన్న చిన్న నాటికల ప్రదర్శనా ఉంటుంది. కాస్త ఎదిగిన పిల్లలను 'ఉషోదయ' ప్రాంగణం ప్రగతి వైపుకు అడుగులు వేయిస్తున్నది. రవీంద్రుని 'శాంతినికేతన్'వలె ఆరుబయటి పాఠశాల వీరికెన్నో నేర్పుతున్నది. ప్రకృతిలో మమేకమై ఆటపాటల ద్వారా, కథల ద్వారా వీళ్ల చదువు నేర్చుకుంటున్నారు. బండి గురివింద గింజలూ, పచ్చతురాయి పూలూ, విరిగిన కర్రపుల్లలూ అన్ని ఇక్కడి విద్యార్థులకు ఉపకరణాలే, పిల్లలే నిర్వహించుకునే 'పప్పెట్ షో' వీరికెన్నో నీతికథలను నేర్పుతున్నది. 'అంకుర్'లోని పిల్లలు, మట్టితో బొమ్మలు చేస్తూ, పూసలు గుచ్చుతూ, నారతో జడలల్లుతూ, గుండీలు, హుక్స్‌లాంటివి పెట్టటం నేర్చుకుంటూ ముచ్చట గొలుపుతూ ఉంటారు.

ఈ సంస్థ చేసిన మరో గొప్ప ప్రయోగం 'స్కూల్ ఆన్ వీల్స్' పాఠశాలకు రాలేని మారుమూల విద్యార్థుల గురించీ ఆలోచించారు. ఆ మారుమూల గ్రామాలకు ఈ బడి బస్సే వెళ్తుంది. బస్సులో చిలుకల, ఏనుగుల రూపంలో తయారు చేసిన అందమైన రాక్స్ ఉన్నాయి. ఆ రాక్స్‌లో ఎన్నో బొమ్మల, కథల పుస్తకాలను ఉంచారు. ఇంకా ఈ బస్సులో క్లాస్‌రూమ్, బ్లాక్‌బోర్డు, టి.వి. అన్నీ ఉండి పిల్లలు వారికి వారే వ్రాసుకునే సౌకర్యమూ ఉన్నది. ఇవన్నీ పిల్లల మనస్సులను ఆకట్టుకుంటున్నాయి. చదువుకోవటానికి పాఠశాలకెడితే ఇవ్వన్నీ ఉంటాయన్న ఆలోచన వాళ్లలో రేకెత్తుతున్నది. ఇంకా వీళ్లు తమతోపాటు జారుడు బల్లలాంటివీ తీసుకెళ్లి స్వేచ్ఛగా ఆడుకోనిస్తున్నారు. ఈ ఆటలతో ఉత్సాహమొచ్చి వాళ్లు బడిబాటపడుతున్నారు. ఆ ఊరి పిల్లలు బడిబాట పట్టిన తర్వాత మరో మారుమూల ప్రాంతానికి బస్సు తరలిపోతుంది. ఈ బస్సు ఇలా నిరంతరం నడవటానికి రోటరీక్లబ్ వారు బస్సును కొనిస్తే, బస్సు లోపలి పరికరాలను యన్.ఆర్.ఐ.లు డా. చౌదరి, డా. తేళ్ల నళినీ, డా. వెంకట్‌గారలు సమకూర్చి ఈ బస్సు నిరంతరం నడపటానికి సాయపడుతున్నారు. చేతన సంస్థలో ఉన్న మరో అపురూపమైనది బొమ్మల లైబ్రరీ. ఈ బొమ్మల లైబ్రరీ హిల్ గ్రామ బాలలకూ, నందన పాఠశాలా విద్యార్థుల కోసం ఏర్పరచబడింది. వేల బొమ్మల్ని కొని ఉంచారు. లక్క బొమ్మల నుంచీ టెడ్డీబేర్‌లవరకూ, మూడు చక్రాల సైకిళ్లు, కార్లు, స్కూటర్లు అన్ని కొలువు తీరాయి. మరో యన్.ఆర్.ఐ. ప్రమీల కె. తుమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన 'దీప్తి' గ్రంథాలయంలో ఎన్నో వేల గ్రంథాలు అందుబాటులో ఉంచారు.



డా. నన్నపనేని మంగాదేవి

ఇక్కడ అమలుపరిచే 'లెర్నింగ్ త్రూ డ్రాయింగ్' విధానం కూడా ప్రత్యేకమైనది. ఎందుకూ పనికిరావనుకుని పక్కన పడేసే కర్రముక్కలతోనూ, చెట్ల మొద్దులతోనూ పిల్లలు ఎన్నో అందమైన కళాఖండాలు తయారుచేస్తూ తమలోని కళాప్రావీణ్యాన్ని తేటతెల్లం చేస్తున్నారు. చూపరులనూ అబ్బురపరుస్తున్నారు.

మంగాదేవిగారి ఆలోచనకు బాలకుటీర్ పూర్వ విద్యార్థి వడ్లమాని హరికిరణ్ వినూత్నమైన 'సైన్సుపార్కు'కు రూపకల్పన చేశారు. ఈ సైన్సు పార్కులో ఎన్నో విషయాలనూ, విజ్ఞానశాస్త్ర సిద్ధాంతాలకు సంబంధించిన పరికరాలనూ ఏర్పాటు చేశారు. పిల్లల మేధస్సును పెంచటానికి ఈ సైన్సు పార్కు దోహదపడుతున్నది.

'శ్రీమతి రమాహరనాథ్ లలిత కళానిలయం', 'డా. విజయమోహన్ కళాప్రాంగణం'లలో ఎన్నెన్నో ప్రదర్శనలు జరుగుతూ ఉంటాయి. అటు లలితగారి మీద ఇటు డా. విజయమోహన్‌గారి మీద అభిమానంతో డా. మంగాదేవిగారు, ఆ ప్రాంగణాలకు వారి పేర్లు పెట్టారు. పిల్లలకెంతో ఇష్టమైన ఆటస్థలంలో విద్యార్థులు ఎన్నో ఆటలను నేర్చుకుంటున్నారు. కొంతమంది

ఉపాధ్యాయులు తమ సబ్జక్టును కూడా ఆటగా రూపొందించారు. 'కబాడీ' ఆటలో 'కబాడీ కబాడీ' అనే కూతకు బదులుగా పద్యపాదాలూ, వ్యాకరణ సూత్రాలు ఎంచుకునేటట్లుగా చేశారు. 'వీరి వీరి గుమ్మడి పండూ, వీరిపేరేమి' అని ఆడే ఆటలో ముక్కు గిల్లుతూ 'నా పేరు సోడియమ్' అని చెప్తుంది. ఆ సోడియమ్ పేరుకు సాంకేతిక నామం చెప్పాలి' అంటూ ఎదురు ప్రశ్నించి 'Na' అనే సమాధానం రాబడుతుంది. ఇలా కూడా చేసి చదువు మరింతగా పిల్లలకు తేలిగ్గా గుర్తుండిపోయేటట్లు చేస్తున్నారు.

చిన్న పిల్లలకే కాకుండా పెద్దలకు కూడా చదువు అందించే ప్రయత్నంలో 'B.Ed కళాశాల' ఏర్పాటయింది. కాబోయే ఉపాధ్యాయులకు కూడా నైతిక విలువలూ, క్రమశిక్షణాయుత విద్యను బోధించారు. ఇదేకాక 'సమగ్రశిశు అభివృద్ధి సేవాపథకం'లో భాగంగా 1982లో మహిళా శిశుసంక్షేమ శాఖవారు 'అంగన్‌వాడీ వర్కర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను' 'చేతన'కు మంజూరు చేశారు. ఈ ట్రైనింగ్‌లో భాగంగా ప్రీస్కూల్, న్యూట్రిషన్, హెల్త్ అండ్ కమ్యూనిటీ పార్టిసిపేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు శిక్షణ ఇస్తున్నారు. వారి ద్వారా కూడా అనేక మంది అనాధ బాలలు, ఒంటరి ఆడవారు ఇక్కడి హీల్‌లో చేర్చుకోబడ్డారు. హీల్ బాలల కోసం బాలకుటీర్ విద్యార్థులు తమ సహాయ సహకారాలు అందిస్తూ వుంటారు. బాలకుటీర్ పూర్వ విద్యార్థులు కూడా ఆర్థికంగా బాగా నిలదొక్కుకున్న తర్వాత నందన పాఠశాల నిర్వహణ కొరకు తమవంతు తోడ్పాటు నిస్తున్నారు. అప్పుడప్పుడూ ఇక్కడకొచ్చి ఇక్కడ వారితో సమయాన్ని గడుపుతున్నారు. ఇక్కడి బాలలకు స్ఫూర్తినిస్తున్నారు. సమాజంలో అనేక రంగాలలో ఉన్నవారు కూడా తరుచూ, ఇక్కడికొచ్చి ఇక్కడి వారికి కథలు చెప్పటం తమ అనుభవాలను పంచుకోవటం, హీల్‌పిల్లలకు చక్కని కౌన్సిలింగ్‌లాగా ఇవ్వటంలాంటివి ఎంతో ఇష్టంగా చేస్తున్నారు.

చేతనలో బాలలేకాక వృద్ధ మహిళలూ సేదతీరుతున్నారు. 'సంధ్యారాగ' 'అనురాగ'లు వీరి నెలవులు. ఈ బామ్మలు పిల్లల మధ్య గడుపుతూ తమ అనారోగ్యాలనూ, తమ వయసునూ మర్చిపోయి ఆనందంగా పిల్లలకు కథలూ, కబుర్లూ చెప్తూ స్వంత అమ్మమ్మా, నాయనమ్మల్లాగా మసులుతున్నారు.

మంగాదేవి గారికి బాలల సంక్షేమం ఒక కన్ను. మొక్కల పెంపకం మరో కన్ను. ఏ అడవి చెట్టైనా, ఏడారి మొక్కైనా ఆమెకు ప్రాణప్రదమే. దారి పక్కన పడివున్న రావి, మఱ్ఱి మొక్కల్ని కూడా తవ్వుకెళ్లి వాటిని పదిలపరిచారు. ఏ రాష్ట్రానికెళ్లినా, ఏ ప్రాంతానికెళ్లినా నర్సరీలను గాలించి, వేల మొక్కల్ని సేకరించారు. అరుదుగా కనిపించే తామరలు, పూలు విరిసే ఎడారి క్యాక్టై మొక్కలు, రేల, దిరిసెన, బెగ్గర్స్‌బౌల్, కప్ అండ్ సాసర్, సింధూర మొదలగు వృక్షాలను పెంచారు. నవగ్రహ వనాన్ని, మెడిసనల్ ప్లాంట్స్‌నూ అభివృద్ధి పరిచారు. ఆమె చేసే పుష్పాలంకరణ, అరుదైన మొక్కల పోషణ గురించి అనేక పత్రికలు, టీ.వి. ఛానెల్స్ వార్తలను ప్రచురించాయి. ఇక్కడి వృక్షసంపద, వాటిమీద కొలువుతీరే పక్షి సమూహాలూ, ఇవన్నీ చూసి ప్రతివారూ పులకించిపోతున్నారు. ఇక్కడుండేవారు ఎంత అదృష్టవంతులో కదా, అనుకుంటున్నారు.

మంగాదేవిగారు బాలల కోసం నైతిక విలువలు, జాతీయత ప్రతిబింబిస్తూనూ, పర్యావరణ పరిరక్షణ పైన తేనెచినుకులు, వేగుచుక్క, శృతిలయలు మొదలగు 30 పైగా పుస్తకాలు రచించారు. 'హరిత ప్రియ' సంస్థను స్థాపించి ఎంతోమందిని సభ్యులుగా చేర్పించారు. వారందరూ ప్రతి సంవత్సరమూ 'హార్టీకల్చర్' షోలు నిర్వహించే స్థాయికి ఎదిగారు. మంగాదేవి గారు 200పైగా రకాలను 'బోన్సాయ్' వృక్షాలుగా పెంచి అరచేయంత కుండీలో గుప్పెడు మట్టి మధ్య ఆ మహావృక్షాలను కుదించి అబ్బురపరుస్తున్నారు. తన కలలపంట చేతనలోని వనాన్ని గురించి 'పచ్చబంగారు లోకం' అనే గ్రంథాన్ని వ్రాసి ఆ మొక్కలతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. అంతేకాక, మట్టిముద్దలో వేప, గానుగలాంటి విత్తనాలను పొదిగి వాటిని కొండల మీద, నేలమీద పిల్లలచేత పడవేయించటం కూడా వీరికే

చెల్లింది. ఈ సంస్థలలోని బాలలకు లలిత కళల్లో ప్రావీణ్యం కలిగించటానికి 'సృజన' ప్రాంగణంలో వారి-వారి నైపుణ్యాలకు పదును పెడుతూ, నాట్యమూ, సంగీతము నేర్పుతున్నారు. ఇంకా ఎండిన కొమ్మలతో రకరకాల కళాఖండాలను తయారు చేస్తున్నారు. అంతేకాక ఇంకా బాలల్లో చిత్రలేఖనం, కథారచన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈనాటి ప్రసిద్ధ బాలసాహిత్యవేత్తలను, సాహిత్యవేత్తలను ఎంపిక చేసి 'మాలతీ సాహితీ ప్రమద' పురస్కారం, 'మంగాదేవి' బాలసాహిత్యపురస్కారం అందిస్తున్నారు. వివిధ అంశాలలో ప్రతిభ కనపర్చిన బాలలకు 'ప్రతిభా పల్లవ' పురస్కారం, 'కర్పూరపుదేవీ చైతన్య' చిత్రలేఖనా పురస్కారాన్ని అందిస్తున్నారు. బాలకుటీర్ వ్యవస్థాపకురాలలో ఒకరు, బాలల ప్రేమికురాలు, కళాపోషకురాలూ అయిన గరిగె ప్రభావతి గారి జ్ఞాపకార్థ 1994వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం బాలల లలిత కళా ఉత్సవాలను బాలకుటీర్ అంగరంగ వైభవంగా జరిపి, ఈ పురస్కారాలన్నింటిని అందిస్తున్నది.

భూమి నుండి పైకిలేచిన ఐదు చేతి వేళ్లు, వాటి మీద పిల్లల పేర్లు వ్రాసిన 'పైలాన్'ను అబ్దుల్ కలాంగారిచేత ఆవిష్కరింపజేశారు. ఇంకా చేతనలో 'కృతిప్రాంగణం' పరిపాలనా భవనాలు, 'చంద్ర', 'శబరి' ప్రాంగణ భోజన గృహం అన్ని వేటికవే ప్రత్యేకమైనవి. 'శ్రీ వెలివెల్లి రత్నా శ్రీనివాసరావు మెమోరియల్ ఆల్టర్ నేటివ్ మెడికేషన్ సెంటరు'తో సహా, పేర్లు, ఉపయోగాలు, వ్రాసివున్న ఔషధ మొక్కలెన్నింటితోనో ఉన్న ఔషధ వనం, గోబర్‌గ్యాస్ యూనిట్, వర్మికంపోస్టు యూనిట్, పశుపోషణలాంటివెన్నో ఉన్నాయి.

మంగాదేవిగారు ఏ పని చేసినా ప్రత్యేకమే. ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమే. చేతన ప్రాంగణంలో ఉన్న శిల్పాలను చూస్తే, వాటి క్రింద వ్రాసి ఉన్న అక్షరాలను చదివితే 'ఔరా'! అనుకుంటాం. చేతనను చూడటానికి ఎంతోమంది నిత్యం వస్తూ ఉంటారు. నడవలేనివారికి బ్యాటరీ కారులో తిప్పి చూపించే సదుపాయమూ ఉన్నది.


బాలకుటీర్ లోగో

ఈ విలక్షణ సంస్థలతో పాటు బాలకుటీర్ 'లోగో' కూడా విలక్షణంగా ఉంటుంది. 'తల్లి ముఖం నుండి సగం, తండ్రి ముఖం నుండి సగం రూపాన్ని తీసుకుని పూర్తి రూపాన్ని పొందిన బిడ్డ ముకుళిత హస్తాలు, తెరిచి ఉంచిన పుస్తకం, వెలుగుతున్న దీపంతో పుస్తక రూపంతో ఉన్న అర్థవంతమైన బొమ్మను ప్రముఖ చిత్రకారుడు 'బాపు' గీసి మంగాదేవిగారి ఆలోచనలకు మరింత పరిపుష్టిని చేకూర్చారు.

ఇన్ని గొప్పపనులను చేస్తున్న డా. యన్. మంగాదేవి గారిని పురస్కారాలు వరించకుండా ఉంటాయా? లెక్కకు మిక్కిలిగా పురస్కారాలను పొందారు. బాలసాహిత్యంలో చేసిన కృషికి నిదర్శనంగా, సాహిత్య అకాడమీ, ఎన్.సి.ఇ.ఆర్.టి., సఖ్యసాహితి వంటి ప్రముఖ సంస్థలు జాతీయ పురస్కారాలను అందించాయి. అంతర్జాతీయ తెలుగు మహాసభ 'శిరోమణి'ని అందించారు. భారతీయ విద్యాభవన్‌వారి 'సర్వోత్తమాచార్య' జాతీయ పురస్కారం కూడా వీరిని వరించింది. 2010లో అబ్దుల్ కలాం చేతుల మీదగా జీవితసాఫల్య పురస్కారాన్ని పొందారు. బాలల సంక్షేమం కోసం చేసిన కృషికి గుర్తింపుగా రాష్ట్రపతి చేతుల మీదగా జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఇంకను జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్రసమర్పణ చేశారు. బాలలంతా 'దేవమ్మ' అని ఆత్మీయంగా పిలుచుకునే డా. మంగాదేవిగారి ఆలోచనలలో, కార్యాచరణలో వారి సంస్థలు మరింత చైతన్యాన్ని నింపుకోవాలని ఆశిద్దాం.

దాసరి శివకుమారి

తెనాలి. ఫోన్: 986 606 7664.



పాల్ గాగున్

# పాల్ గాగున్

[Paul Gauguin]

*– తంగెడ విశ్వేశ్వర ప్రసాద్*

ఉన్నచోట ఉండకుండా పట్టణం నుండి పట్టణానికి, దేశంనుండి దేశానికి నివాసం మారుస్తూ, చాలా సాదాసీదాగా, అప్పుడప్పుడు స్నేహితుల సహాయం పొందుతూ జీవితం వెళ్ళబుచ్చాడు. ప్రేమ-కళల మధ్య నలిగిపోయి కళ కోసం భార్యాబిడ్డల ప్రేమను కాదనుకున్నాడు. తన చిత్రాల ద్వారా కొందరి అసహ్యానికి, చాలామంది ఆరాధనకు కారకుడయ్యాడు. చిరస్థాయిగా నిలిచిపోయే కళాఖండాలను సృష్టించాడు. కానీ బతికినంతకాలం అనామకుడిగా పారిస్ కళాప్రపంచ నిరాదరణకు లోనయ్యాడు. మరణానంతరం ప్రముఖ పెయింటరుగా గుర్తింపు పొంది అఖండ కీర్తిప్రతిష్టలనార్జించాడు. అతడే వర్ణసమ్మేళనంలో పలు ప్రయోగాలు చేసి, పికాసో, మాటిన్‌లాంటి ఆధునిక దిగ్గజకళాకారులపై విశేష ప్రభావం చూపిన పాల్ గాగున్.

గాగున్ తండ్రి జర్నలిస్టు. తల్లి పెరూవియా కులీన కుటుంబానికి చెందిన స్త్రీ. నెపోలియన్ III పాలనకు వ్యతిరేకులు కావడంతో దేశ బహిష్కరణకు గురై పెరూవియా వెళ్ళిపోతారు. గాగున్ బాల్యం కొంత పెరూవియాలోనూ, కొంత ఫ్రాన్స్‌లోనూ గడుస్తుంది. తిరుగు ప్రయాణంలో తండ్రి మరణించగా తల్లితో ఫ్రాన్స్ చేరుకుంటాడు. 1865-1868 మధ్య వాణిజ్య నౌకల మీద, తర్వాత నావికాదళంలో పనిచేశాడు. పది సంవత్సరాలపాటు స్టాక్ ఎక్స్ఛేంజ్ [stock exchange]లో పనిచేస్తున్న సమయంలో డెన్మార్కు వనిత సోఫీగేడ్‌ను 1875లో పెళ్ళి చేసుకున్నాడు.

1874లో మొదటిసారిగా ముద్రాశైలి [impessionist] కళాప్రదర్శనను చూశాడు. ఆ సమయంలో పరిచయమైన పిసారియో ప్రోద్బలంతో ఇంప్రెషనిస్టు శైలిపై అభిరుచి పెంచుకున్నాడు. 1876లో తను చిత్రించిన బొమ్మలను పారిస్ (5,8) ఎగ్జిబిషన్లలో ప్రదర్శించాడు. కానీ అంతగా విజయం సాధించలేకపోయాడు. కుటుంబ పోషణ కోసం ఆ బొమ్మలను అమ్ముకున్నాడు. చివరి ప్రదర్శన తర్వాత తన మకాంను బ్రిటనీకి మార్చాడు. 1890 వరకు అక్కడే గడుపుతూ మధ్య-మధ్య పారిస్, ఆర్లీసు, డెన్మార్కు, పనామా మొదలైన దేశాల్లో గడిపాడు. 1888లో కొద్ది కాలం డచ్ కళాకారుడు వాన్‌గోతో ఆర్లీన్ దక్షిణ ఫ్రాన్స్‌లో గడిపాడు. ఇరువురు ఇంప్రెషనిస్ట్ ఉద్యమ అనంతరం ఆర్టిస్టులే కాని, భిన్నాభిప్రాయాలు కలిగినవారు. వివాదంలో ఏదో విషయమై గొడవపడిన అనంతరం వాన్‌గో చెవి తెగిపోతుంది. అందుకు కారణం గాగోన్ అనే అభిప్రాయం చాలా కాలం ప్రచారంలో ఉంది. కానీ అసలు కారణం అదికాదని చరిత్రకారులు తేల్చిచెప్పారు.

ఫ్రాన్స్‌కు వాయువ్య దిశలో ఉన్న తీరప్రాంతం ప్రకృతి సౌందర్యానికి పేరుగాంచింది. కోపెన్ హాగన్‌లో తల్లిని, చెల్లినీ వదిలివేసి వారితో సంబంధం తెంచుకున్నాడు. బ్రిటనీ తీరప్రాంత అందానికి, అక్కడి సామాన్య ప్రజల జీవన పద్ధతులకు ఆకర్షితుడైనాడు.

బ్రిటనీలోని పాంటు అవెన్ [Pont Aven]లో తన శక్తివంతమైన వ్యక్తిత్వంవల్ల చాలామంది కళాకారులకు కేంద్ర బిందువుగా మారిపోయాడు. కళపైన గాగున్‌కుగల విప్లవాత్మక భావాలపట్ల వారు ఆకర్షితులయ్యారు. గాగున్

చిత్రాలలో కీలకమైనదిగా భావించబడుతున్న ప్రసంగానంతర దృశ్యం [Vision After the Sermon] అన్న పెద్ద చిత్రం అక్కడ ఉన్నపుడు చిత్రించినదే. ఇంప్రెషనిస్ట్ ప్రభావం నుండి పూర్తిగా బయటపడిన తర్వాత రూపొందిన చిత్రం అది.

అన్య ప్రదేశాల వెదుకులాటలో ఫ్రాన్స్‌ను వీడి తహితీ[1] ద్వీపం చేరుకున్నాడు. కృత్రిమ, సాంప్రదాయకమైన ప్రతి అంశం నుండి బయటపడి, వాస్తవ జీవితం ఏమిటో తెలుసుకున్నాడు. 'నాగరకత జబ్బు నుండి బయటపడి, ప్రకృతి ఒడిలో మళ్ళీ ఆరోగ్యవంతుణ్ణి కాగలిగాను' అని చెప్పుకున్నాడు. నువా, నువా [Nua-Nua] పేరుతో ఆత్మకథను రాసుకున్నాడు. తహితీ జనజీవనశైలి, ఆహారం, ఆహార్యం వారి మూఢనమ్మకాలు, (నాగరక ప్రపంచానికి పూర్తిగా భిన్నమైన) అక్కడి పల్లె సౌందర్యానికి, గాగున్ చిత్ర కళపై తీవ్రప్రభావం చూపాయి. అతి సామాన్య జనజీవన భావోద్రేకాలను చిత్రించాలన్న తన అభిమతానికి కార్యరూపం యివ్వగలిగాడు. ప్రాచీన, అనాగరిక తెగల జీవన విధానాన్ని తన చిత్రకళకు ఉద్దీపనలుగా చేసుకున్న ప్రథమ కళాకారుడు. అదే ఇంప్రెషనిస్టుల ప్రకృతివాదంమీద తిరుగుబాటుకు కారణమైంది. జపాన్‌కళాముద్రలు [colour prints], ముదురు రంగుల అద్దపుముక్కల [stained glass] నమూనాలతో బలమైన చిత్రాలను/దృశ్యాలను చిత్రించాడు. ఇరవయ్యవ శతాబ్దపు దారుశిల్పకళకు బాటలు వేసిన ఆద్యుడు. పేదరికం ఎంతగా కుంగదీసినా తట్టుకుని, శక్తివంతమైన చిత్రాలను సృష్టించగలిగాడు.

క్రమక్రమంగా తన పెయింటింగు శైలిని అతి సాధారణంగా మార్చుకొని జీవితంలోని పరిపూర్ణతను తన చిత్రాల ద్వారా ప్రదర్శించగలిగాడు.

పేదరికం, అనారోగ్యం, తన కళకు గుర్తింపు లేకుండా పోవడం అనేవి బాధించినా మరణించేదాకా నిరంతరం పనిచేశాడు. పెయింట్ చేయడానికి తగిన కాన్వాసు, రంగులు ఇతర పరికరాలు లేక ముతక బట్టల మీద చాలా పల్చగా రంగులు పులిమి బొమ్మలు వేశాడు. కానీ ఈ పరిమితుల నుండే మొరటుగా ఉండే బొమ్మలు చిత్రించే శక్తివంతమైన కొత్తశైలి ఉద్భవించింది. అదే తన జీవన దృక్పథానికి తగినదిగా గుర్తించాడు.

మనం ఎవరం? ఎక్కడి నుండి వచ్చాము? ఎటు వెళ్తున్నాము? అన్న ప్రశ్నలకు జవాబు అన్నట్లుగా పెద్ద అన్యాపదేశ [allogory] చిత్రం రచించాడు. తన చిన్నారి కూతురు మరణించిందన్న వార్త విని తట్టుకోలేక ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశాడు. అంతకు ముందే భార్య పిల్లలతో సంబంధాన్నీ తెంచుకున్నాడు. కాగా వారు డెన్మార్కులో ఉండిపోయారు. ఎక్కువ భాగం జీవితంలో పేదరికంలో గడుపుతూ, స్నేహితులపై ఆధారపడుతూ వారిని పీల్చి పిప్పి చేస్తూ బతికాడు. డోమినికాలో (మార్క్వెసెస్ ద్వీపం) 1901లో ఎక్కడ స్థిరపడాలనుకున్నాడో అక్కడే మరణించాడు.

మరణానంతరం గాగున్ పెయింటింగులు బాగా ప్రాచుర్యం పొందాయి. ప్రతీకవాద ఉద్యమ [Symbolist Movement] ప్రముఖుడిగా, శిల్పిగా, ప్రింటు మేకర్‌గా [Print maker], సిరామిక్ కళాకారుడిగా, రచయితగా ప్రసిద్ధిగాంచాడు. రంగుల ఉపయోగంలో కూర్పులో అడుగడుగునా సృజనాత్మకమైన ప్రయోగాలు చేశాడు. చెక్కముక్కలతో కళాఖండాలను సృష్టించడంతో పాటు దారుశిల్పిగా రాణించాడు. పెయింటింగుకు ఎంచుకున్న



When Will You Marry?

1. *తహితీ దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని ద్వీపసముదాయంలో పెద్ద ద్వీపం. **16**వ శతాబ్దంలో ఫ్రెంచివారి కాలనీ ద్వీపం. ఫ్రెంచి రిపబ్లిక్‌లోని స్వతంత్ర రాజ్యం. నల్లరాతి తీరం (యిసుక తిన్నెల)బీచ్‌లు లాగూన్లూ, జలపాతాలూ, ఆరిపోయిన అగ్నిపర్వతాలతో చాలా ఆకర్షణీయమైంది.*

అంశాల సాంఘిక స్థాయిని పట్టించుకోలేదు. వర్ణసమ్మేళనంలో విరూప చిత్రాలను చిత్రించడంలో, ప్రతీకలను ఉపయోగించడంలో విప్లవాత్మక ధోరణిని ప్రదర్శించాడు. అనేక స్వీయచిత్రాలను భిన్నకోణాలలో చిత్రించాడు. ఇతరులతో తన సంబంధాలను పటిష్టం చేసుకోవడానికి స్వీయ చిత్ర రచన చేశాడు. కొన్నిసార్లు తనని క్రీస్తు రూపంలో చిత్రించుకొని తనుపడ్డ బాధ, కష్టాన్నీ క్రీస్తు బాధలతో పోల్చుకున్నాడు. క్రీస్తును అప్పటి సమాజం అర్థం చేసుకోలేకపోవడం, తన సమాజం తనను అర్థం చేసుకోలేకపోవడంలో సామ్యం వెతుక్కున్నాడు.

బతికి ఉండగా పట్టించుకోని ఫ్రాన్సు కళారంగం గాగున్ మరణానంతరం ఆయన గొప్పదనాన్ని గుర్తించింది. "నేనెంత గొప్ప ఆర్టిస్టునో నాకు తెలుసు. అందుకు కారణం నేను పడిన బాధలు, కష్టాలే" అని చెప్పకున్నాడు. 1966లో గాగున్ వేసిన 227 చిత్రాలన్నింటినీ సేకరించి పారిస్‌లో ప్రదర్శించినప్పుడు గాగున్ గొప్పదనం వెలుగులోకి వచ్చింది. ఆ చిత్రాల ప్రభావం అనంతర కళాకారుల ప్రతీకాత్మక ఉద్యమానికి బాటలు వేసింది. నబిస్ [NABIS] ఉద్యమం అలా పుట్టుకొచ్చిందే) 20వ శతాబ్దపు ప్రకృతివాద వ్యతిరేక ధోరణిపై తీవ్ర ప్రభావం చూపింది. పోర్ట్రెయిట్ చిత్రకళలు విప్లవాత్మక ధోరణిలోకి ప్రతినిధులుగా నిలిచే 50 గాగున్ పోర్ట్రెయిట్లు అక్టోబర్ 2019 నుండి జనవరి 2020 వరకు లండన్ నేషనల్ ఆర్ట్‌గ్యాలరీలో ప్రదర్శింపబడి కళాప్రియులను అమితంగా అలరించాయి. గత 50 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూలేని విధంగా 'టేట్ మాడరన్' గాగున్ చిత్రాల ప్రదర్శనను 2010-11లో నిర్వహించి గాగున్‌కు అంకితమిచ్చింది.

* * *

**గాగున్ భావాలు కొన్ని:**

* *చూడాలంటే కళ్ళు మూసుకుంటాను "కళ్ళు మూసుకుని చూస్తాను -*

* *కళ అంటే ఇతరులను అనుకరించడం లేదా తిరుగుబాటు చేయడం -*

* *కళకు వేదాంతం- వేదాంతానికి కళలాంటిది లేకపోతే సౌందర్యం ఎక్కడిది?*

* *నాగరకత మనల్ని రోగగ్రస్తుల్ని చేస్తుంది.*

* *తహితీ స్త్రీల కనుల నిండైన రూపాలు, బ్రిటనీ అంతమైన ప్రకృతి దృశ్యాలు ఆధునిక చిత్రకళలో ప్రఖ్యాతిగాంచిన చిత్రాలుగా పేరుగాంచాయి.*

* *తన (కంటె) ముందు (చేయని)వారు చేయని (కళారంగంలో) పనిని చేయడమే తిరుగుబాటు (లక్షణం) అనిపించుకుంటుంది. వారే గొప్ప కళాకారులౌతారు.*

* *ప్రతీకారం గురించి కలలు కనడమే జీవితం.*

* *మన కంటి అమాయకత్వం, మనం చూసేవాటిలో మార్పులేని స్థిరత్వాన్ని చూపిస్తుంది. ఈ అడ్డంకిని గురించి జాగ్రత్త పడాలి.*

* * *


**పెయింటింగులు వేసి**

**ఋణం తీర్చుకున్న కళాకారుడు – పాల్ గాగున్:**

ఫ్రెంచి కళాకారుడు గాగున్ 1875లో సోఫీగేడ్ [Sophie Gad] అనే డేనిష్ వనితను పెండ్లి చేసుకున్నాడు. తర్వాత 1886లో పెయింటింగు మీద శ్రద్ధ చూపుతున్న తరుణంలో ఆరి వివాహం ఛిన్నమైపోతుంది. భార్యపిల్లల్ని తీసుకుని డెన్మార్క్ వెళ్ళిపోతే గాగున్ మళ్ళీ బ్రిటనీ చేరుకుంటాడు. పాంట్ ఆవెన్ [Pont Aven]లో 'జాలీ' హోటల్‌లో బస ఏర్పాటు చేసుకుని కొద్దిరోజులు గడిపింతర్వాత చౌకరకం బోర్డింగ్ హౌస్‌కు మారుతాడు. దాని యజమానురాలు మేరీ జీన్ గ్లానెక్ [Marie Jeanne Glaanec] (హోటల్) కింది భాగంలో హోటల్ నడుపుతూ, పైగదులను అద్దెకిచ్చేది. తినడానికి తలదాచుకోవడానికి కేవలం 60 ఫ్రాంకులు చెల్లిస్తే నెలరోజులు గడచిపోయేవి. అమెరికా, ఐరోపాకు చెందిన చాలామంది ఆర్టిస్టులు కూడా అదే హోటల్ గదుల్లో ఉండేవారు. ఈ ఆకర్షణీయమైన హోటల్‌లో భోజనం వేళకు అందరూ గాగున్ చుట్టూ మూగి ఆయన చెప్పే కబుర్లను ఆసక్తిగా వినేవారు. తర్వాత పెయింట్ చేసుకోవడానికి ఎవరి దారిన వారు వెళ్ళిపోయేవారు. వారంతా బ్రిటనీ జీవన విధానాన్ని, ఇష్టపడి, బ్రిటనీ దుస్తులను ధరించేవారు. గాగున్ చెక్క దుంగల మీద బొమ్మలు చెక్కేవాడు. పాల్

సెరూసియర్ [Paul Serisier] అన్న యువ చిత్రకారునికి రంగుల మేళవింపు, కూర్పు, ఆకర్షణీయంగా పెయింటు చేయడం, అమూర్త చిత్రాలను వేయడంలోని మెలకువలను నేర్పాడు. ఫలితంగా ఇరవై నిమిషాలలోనే బొమ్మ తయారయ్యేది. ఆ రకంగా ఇంప్రెషనిజం నుండి శాశ్వతంగా బయటపడి, పెయింటింగులో నూతన ఒరవడికి బాటలు వేశాడు. గాగున్ అక్కడ కూడా ప్రశాంతంగా ఉండలేకపోతాడు. 1889లో లే పాల్డు [Le Pauldu] అనే మారుమూలనున్న కుగ్రామానికి అనామకమైన చిన్న ప్రాంతానికి చేరుకుని బీచికి సమీపంలో ఉన్న డి లా ప్లాజ్ [de la plage] అన్న ముచ్చటైన రెండంతస్తుల చిన్న లాడ్జికి [inn] మారిపోతాడు. అది అంతకు ముందున్న బసకన్నా చౌకైనది. (గాగున్ జీవితమంతా లేమిడిలోనే గడిచిపోయింది) ఈ హోటల్ యజమానురాలు మేరీ హెన్రీ, గాగున్‌కూ అతని డెన్మార్క్ స్నేహితుడు జాకబ్ మేజర్ డి. హాన్ [Jocob Meiger De Hann]కూ వండిపెట్టేది. గాగున్ హోటల్ ఖర్చునూ స్నేహితుడే భరించేవాడు. గాగున్ జీవితం ఎప్పుడూ ఇతరుల పైన ఆధారపడే గడిచింది. (స్నేహితులను పీల్చి పిప్పి చేసేవాడని అంటారు).

లాడ్జిలోని ముందు గదిని బార్‌గా మార్చి నాటుసారాలాంటి ఏబ్సింథ్ మద్యాన్ని విక్రయించేది. వెనక ఉన్న గదిని వంట చేయడానికి ఉపయోగించేది. ఆ వంటగదే తర్వాత - తర్వాత ప్రత్యేక ఆకర్షణగా నిలిచిపోయింది. హోటల్ బిల్లు చెల్లించడానికని, చలికాలంలో బయట తిరగడం వీలుకాక గాగున్, అతని మిత్రుడు జాకబ్ వంటగది గోడలను పెయింటింగులతో నింపివేశారు. గాగున్ కప్‌బోర్డు రెక్కలను స్వీయ చిత్రాలతో [self portraits] నింపితే, జాకబ్ గోడలను పెయింటింగులతో నింపివేశాడు. గాగున్ వేసిన చిత్రాలు స్టెయిన్డ్‌గ్లాసు కిటికీలను తలపింపజేశాయి. ఆకర్షణీయమైన, నదురైన ముదురు రంగుల చిత్రాలు, పెయింటింగులు వేసి లాడ్జింగ్ అప్పు తీర్చుకున్నాడు. బ్రిటనీలో ఉన్న కాలంలోనే గాగున్ కుంచె నుండి



Hail Mary

పుంఖానుపుంఖాలుగా వర్ణచిత్రాలు ప్రాణం పోసుకున్నాయి. అన్నీ చిరకాలం నిలిచిపోయేవే. అవే ఇప్పుడు మ్యూజియమ్‌లలో ప్రదర్శింపబడుతున్న కళాఖండాలు. బ్రిటనీలో గాగున్ నివసించిన రెండు హోటళ్ళు పునర్నిర్మాణం తర్వాత కళాకారునికి నివాళిగా స్మృతిచిహ్నాలుగా మార్చబడినాయి. పాంట్ ఏవన్‌లోని గ్లూనెక్ హోటల్‌ను [Art centre] కళాకేంద్రంగా, పుస్తక విక్రయ శాలగానూ, పాల్డులోని లాప్లాజ్ హోటల్‌ను మ్యూజియంగానూ రూపాంతరం చెంది గాగున్‌కు శాశ్వతత్వం కల్పించాయి.

సాంప్రదాయ విరుద్ధంగా పెయింటు చేయాలనే బలమైన కాంక్ష గాగున్‌ను పారిస్‌కు దూరం చేసింది. బతికుండగా చిన్నచూపు చూసిన అదే పారిస్ గాగున్ ప్రతిభను గుర్తించి, ఆయన చిత్రాలను ప్రదర్శిస్తూ తలమీద పెట్టుకుని ఆరాధిస్తోంది.

విశ్వేశ్వర ప్రసాద్
హైద్రాబాద్. ఫోన్: 798 139 8250.

# కళాశాల విద్య - జీవన నైపుణ్యాలు

*- గుజ్జు చెన్నారెడ్డి*

విజ్ఞాన విస్తరణలో నైపుణ్యాల కలయికే ఉత్తమ విద్యగా పరిగణించాలి. చిరుప్రాయం నుండే విద్యార్థులకు జ్ఞానసముపార్జనతో పాటు జీవన పాఠాలు క్రమేపి, దశల వారీగా విద్యార్థుల మస్తిక్షాలలో నిర్లిప్తం చేస్తే వారు ఉత్తమ పౌరులుగా తయారై ఉన్నత సమాజ ఏర్పాటుకు దోహదం చేస్తారు. ఒకప్పటి చదువులో సహజంగానే అలవడే జీవననైపుణ్యాల నేడు ప్రత్యేక కోర్సులు పెట్టి మరీ బోధిస్తున్నా సరిగా అబ్బడంలేదు. చదువుతోనే సభ్యత, నైపుణ్యాలు విద్యార్థులకు సహజంగా అలవడడం లేదని జీవన నైపుణ్యాలు 'జీవన్ కౌశల్' పాఠ్యాంశాలు ఉన్నత విద్యలో అవసరం అని గ్రహించిన విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యు.జి.సి) కళాశాల స్థాయి పాఠ్యాంశాలలో ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల ప్రకటించింది. విద్యాలయాల నుండి వృత్తి విద్య, సాధారణ కోర్సులలో లక్షలాది మంది పట్టాలు సంపాదిస్తున్నా నైపుణ్యాలు కొరవడి ఉద్యోగాల సంపాదనలో వెనుకబడిపోతున్నారని సర్వేలు తేల్చి చెబుతున్నాయి. ఉన్నత విద్య చదివినా అర - కొర నైపుణ్యాలతో ఇరుకైన ఉద్యోగాలు చేస్తూ మానసికంగా కృంగిపోతున్నవారి సంఖ్య తక్కువేం కాదు. నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య ప్రతి విద్యార్థికి అందించాలన్న యు.జి.సి. తన పాఠ్యప్రణాళికలో విద్యార్థుల భావోద్వేగ, మేథోసామర్థ్య, మౌఖిక సంభాషణల నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ పాఠ్యాంశాలలో సమాచార నైపుణ్యాలు (కమ్యునికేషన్ స్కిల్స్), వృత్తి నైపుణ్యాలు (ఫ్రొఫెషనల్ స్కిల్స్), నాయకత్వ నైపుణ్యాలు (లీడర్‌షిఫ్ స్కిల్స్), సార్వత్రిక మానవ విలువలు (యూనివర్సల్ మోరల్స్) అనే నాలుగు కోర్సులు ఉంటాయి. విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత విద్యార్థులు తమ వృత్తిని ప్రారంభించనపుడు, భాద్యతాయుతమైన పౌరులుగా మారినపుడు వారికి సహాయపడే ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందిచడంలో ఈ కోర్సులు సమర్థవంతమైన సాధనాలుగా ఉపయోగపడతాయని ఆశిస్తున్నట్లు కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి సంజయ్ ధోత్రే అభిలాషించారు.

అర్థవంతమైన, ఆరోగ్యవంతమైన అభ్యసన వ్యక్తి జీవిత నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడుతుంది. విద్యార్థులకు సహజ, సృజనాత్మక అభ్యసన లోపించినపుడు జ్ఞానసముపార్జన, మానసిక వికాశం మందగిస్తాయి. పరీక్ష ఆధారిత విద్య, పరిమిత పఠణం, అర్థజ్ఞానం లేని అభ్యసన (rote learning)కు త్రోవ తీస్తుంది. ప్రస్తుత విద్యా విధానం ఇందుకు భిన్నంగా లేదన్నది ఖఠోర సత్యం. మార్కుల వేటలో కార్పొరేట్ విద్యావ్యవస్థలో సృజనాత్మకత లోపించినా ర్యాంకులు సంపాదించి తదుపరి వృత్తి విద్యలో చాలామంది విద్యార్థుల చతికిలపడుతున్నారని ఇటీవల ఒక సర్వే తెలియజేసింది. విద్యా సమయంలో సరైన జీవన నైపుణ్యాలు అలవడక విద్యానంతరం ఉద్యోగాలలో దూసుకుపోతున్న చాలామంది నిజజీవితంలో ఎదురయ్యే విభిన్న పరిస్థితులను ఎదుర్కొనలేక అటు ఉద్యోగం ఇటు కుటుంభం మద్య నలిగిపోతున్నవారి సంఖ్య క్రమేపి పెరిగిపోతుంది. వృత్తిలో కొరవడిన ఆహ్లాద వాతావరణం, ఆరోగ్యవంతమైన పోటీతత్వంతో యాంత్రిక జీవననానిక అలవాటుపడి భావోద్వేగాల అదుపుపై నియంత్రణ లేక శారీరకంగా, మానసికంగా అలసిపోయి ఆరోగ్యం మీదకు కొనితెచ్చుకుంటున్నవారు తక్కువమందేం కాదు. దేశ యువజనాభాకు వృత్తిసామర్థ్యాలు కొరవడితే ఆ ప్రభావం ఉత్పాదిక రంగంపై పడి దేశ స్థూల ఉత్పత్తి కుంటుపడుతుంది.

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం నిపుణుల కమిటీ సిద్ధం చేసిన ఈ జీవన నైపుణ్యాలు/ జీవన్ కౌశల్ పాఠ్యాంశాన్ని గత ఏడాది జూలై 26-28 మద్య ఢిల్లీలో జరిగిన రీసెర్క్ అండ్ ఇన్నోవేషన్ పై జాతీయ సదస్సులో పాల్గొన్న దేశంలోని విశ్వవిద్యాలయాలు, (I.I.T) ఐ.ఐ.టి.లు, ఐ.ఐ.ఎమ్.లు (I I MA), ఐ.ఐ.ఎస్.సి.లు (IISc) నిట్‌లు (NITn) ఐ.ఐ.ఐ.లు (I I I Ts) ఐ.ఐ.ఎస్.సి.ఆర్. (I ISCRS)ల నుండి పాల్గొన్న 600 మంది ఉపకులపతులు, డైరెక్టర్లు సమక్షంలో ఈ యు.జి.సి.

క్వాలిటీ మేండేట్‌ను దత్తత తీసుకున్నారు. పరిశ్రమల అవసరాలకు సరిపడా పరిజ్ఞానం, నైపుణ్యాలు, వైఖరిని అందించి అభ్యాసకునిలోని అంతర్లీనంగా ఉన్న ప్రతిభను, శక్తిని వేగవంతం చేయడానికి పాఠ్యాంశాల జీవన నైపుణ్యాలపై నియమించిన కమిటీ రూపొందించింది. 'స్వయం'లాంటి డిజిటల్ అభ్యసన సంస్థల సేవలను ఉపయోగించుకొని వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు ఉపాధి (కల్పించాలని) అవకాశాలు కల్పించాలని, పరిశోధన రంగంలో విలువలు పాటించి నాణ్యమైన పరిశోధనలును ప్రోత్సహించి విద్యను సమాజ అవసరాలకు అనుసంధానం చేయాలని ఈ సదస్సులో ముక్త ఖంఠంతో నినదించారు.

సమాచార నైపుణ్యాలు, పరస్పర సంభాణ నైపుణ్యాలు, సమయాభావ నైపుణ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం, నిర్ణయం తీసుకునే సామర్థ్యం, సమగ్రతవంటి జీవన నైపుణ్యాలు విద్యార్థుల ఉపాధి అవకాశాలలో కీలక పాత్ర వహిస్తాయి. జీవన నైపుణ్యాల పాఠ్యాంశాలు, తరగతి గది అభ్యాసంతో జీవిత అనుభవం ద్వారా ఒక వ్యక్తి సంపాదించిన ప్రతిభను క్రోడికరిస్తే అవి రోజువారి జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తూ వ్యక్తిగత, సమాజ శ్రేయస్సుకు దోహదపడతాయి. ఈ జీవన నైపుణ్యాలు వ్యక్తి జీవితంలో విజయానికి, నాణ్యతకు కీలకంగా మారి దేశ యువజన జనభా యొక్క సామూహిక సామర్థ్యాన్ని పెంచుతుంది. సోషల్ మీడియా ఉపయోగంలో నైతికత, మర్యాదలు, గూగుల్ శోధన, సవ్యదిశలో వినియోగం, యోగా, ప్రాణాయామం, రెజ్యూమె వ్రాయడం ఈ పాఠ్యాంశాలలో ఒక భాగం.

ప్రేమ, కరుణ అభ్యసిస్తే జీవతంలో ఏమి పొందుతారు. వాటి విలువలు నేర్చుకోకపోతే ఏమి కోల్పోతారు, సహనం, దయ, జాలి గుణాలతో ప్రపంచాన్ని ఏ విధంగా జయించవచ్చు, వ్యక్తిగత జీవితాలను ఎంత ఆహ్లాదకరంగా కొనసాగించవచ్చుననే తెలుసుకునే పాఠ్యాంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. విని అవగాహన చేసుకునే నైపుణ్యం, జట్టు నాయకునిగా ఎంత భిన్నంగా ఉండాలి, జట్టు సభ్యునిగా ఇతర సభ్యులతో సత్సంబంధాలు కొనసాగింపు నైపుణ్యాలు ఉన్నాయి. ఉత్తమ మానవ సంబంధాలు మెరుగు పరుచుకోవడం, వ్యక్తిగత సంబంధాలు, సంది నైపుణ్యాలు, నైతిక ప్రవర్తణ నియమావళి ఒక పాఠ్యాంశంగా ఉన్నాయి. యోగా, ప్రాణాయామం మాడ్యూల్‌లో పరీక్షల సమయంలో మనస్సు, శరీరం సిద్ధం చేసే ప్రణాళికలు ఉన్నాయి. భావోద్వేగ అదుపు, హావభావ ప్రదర్శన నైపుణ్యం, మేధోసామర్థ్యాల అభివృద్ధి, మౌఖిక సంభాషణల నైపుణ్యాలది ఈ ప్రణాళికలో పెద్ద పీఠ.

**సమాచార నైపుణ్యాలు:** లిఖిత, మౌఖిక పరస్పర సమాచార మార్పిడి నైపుణ్యం ఉద్యోగ అన్వేషణలో అత్యంత కీలకం. సమర్థవంతమైన శ్రవణ నైపుణ్యాలను పెంచుకుంటూ భాష వెనుక ఉండే భావాన్ని అన్వేషించడం, డిజిట్ మీడియా ద్వారా సమాచార మార్పిడి అభ్యాసన చేయడం ఈ నైపుణ్యాలలో భాగంగా ఉన్నాయి. స్పష్టమైన ఉచ్ఛరణ, సరళమైన పదజాలం, సమర్థ పద ప్రయోగం, ఆత్మస్థైర్య భావవ్యక్తీకరణ సమాచార నైపుణ్యాలలో ముఖ్యమైనవి. చాలామంది విద్యార్థులు వారి సబ్జెక్టులలో మంచి ప్రతిభ కలిగి ఉండి సమాచార నైపుణ్యాలలో వెనుకబాటుతనానికి కారణం వారికి పాఠశాల స్థాయిలోనే ఆయా నైపుణ్యాలపై తగిన తర్ఫీదు ఇవ్వకపోవడమే. ప్రస్తుత పాఠ్యాంశాలలో నైపుణ్యాల బోధన, అవగాహణ పాత్రకు ప్రాధాన్యత చాలా పరిమితం. అభ్యాసకుల తరగతిగది విద్యంతా దాదాపుగా వినడం, వ్రాయడానికి మాత్రమే పరిమితం. అందుకే 'భారతీయ విద్యార్థులు తరగతి గదిలో హాజరు పిలిచినపుడు తప్ప మరే సమయంలో నోరు విప్పరు' అనే సామెత పుట్టుకొచ్చింది. డిజిటల్ అక్షరాస్యతలో భాగంగా డిజిటల్ టెక్నాలజి ఉపయోగించడంలో పోకడలు, ఇంటర్నెట్ వినియోగం, సోషల్ మీడియా ప్రయోజనాలు, వెబ్‌సైట్ల పరిచయం, నీతి, మర్యాదలు, ఉపయోగించుకునే ప్రతిభావంతమైన మార్గాలు, డిజిట్ మార్కెటింగ్ పరిచయంవంటి ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. సమాచార నైపుణ్యాలలో ఒక ముఖ్యమైన భాగం సంజ్ఞల ఆధారిత సంభాషణలు ఇందులో బాడీలాంగ్వేజ్, కంటిచూపు అనుసంధానం (eye contact), హావభావాలు, ముఖకవళికలు ఉన్నాయి.

**వృత్తి నైపుణ్యాలు:** వృత్తి నైపుణ్యాలు జీవిత నైపుణ్యాలలో

ఒక భాగం. ఒక నిర్దిష్ట ఉద్యోగానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతోపాటు, సంతృప్తికర జీవితం కోసం వృత్తిపరమైన నైపుణ్యాలు అవసరం. సృజనాత్మకత నైపుణ్యాలకే పరిమితం కాకుండా, సహజమైన, తార్కిక, విమర్శనాత్మక ఆలోచన, సమయస్ఫూర్తి సంభాషణవంటి సమాచార నైపుణ్యాల ద్వారా ఒక వ్యక్తి వృత్తిపరమైన నైపుణ్యాలు ప్రదర్శిస్తే తన వృత్తిలో ఒత్తిడి తగ్గించుకొని నాణ్యమైన పనితనం ప్రదర్శించగలడు. విద్యార్థి దశలోనే తన బలం - బలహీనత, అభిరుచి అణచివేస్తూ తన సామర్థ్యానికి సరిపడ వృత్తిని ఎంచుకోవాలి. అమెరికాలో విద్యార్థి పాఠశాల దాటుతున్న సమయంలోనే విద్యార్థుల అభిరుచి, సామర్థ్యాలను అంచనావేసి తదుపరి విద్య లేదా వృత్తిని ఎంచుకోవడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం. మన దేశంలో తాము చదివిన - చదువుకు చేస్తున్న ఉద్యోగానికి సంబంధం లేనివారి సంఖ్య తక్కువేం కాదు. ఈ ప్రతిపాదిత పాఠ్యాంశాలలో సమస్య పరిష్కార నైపుణ్యం, నిర్ణయ నైపుణ్యం, సృజనాత్మక ఆలోచన, క్లిష్టమైన అంచనా, స్వీయ అవగాహణ, ఒత్తిడి నిర్వహణ, సమయ నిర్వహణ, సానుభూతివంటి వ్యక్తిత్వ వికాశ నైపుణ్యాలు ఉన్నాయి.

**సార్వత్రిక మానవ విలువలు:** ఒకవైపు నాగరికత పెరుగుతూ మరోవైపు మానవ విలువలు తరుగుతుండడం నేటి వైచిత్రి. చదువులు పూర్తవుతున్నా చాలామంది/మందిలో ఆశించిన మానవ విలువలు కనిపించడంలేదు. సత్యం, ప్రేమ, దయ, శాంతి, ధర్మం, నిజాయితీ, వినయం, కృతజ్ఞత, ఆకాంక్ష, శ్రేయస్సు, అహింస, నమ్మకం, విశ్వాసం, క్షమ గుణాల కలయికే మానవ విలవలు. విద్యార్థి దశలోనే ఒక వ్యక్తి ఈ వ్యక్తిత్వ వికాశం పొందితే తన వృత్తిలోనే కాకుండా నాణ్యమైన జీవితం గడపగలడు. చదువు సమయంలోనే తోటి విద్యార్థులు, సీనియర్లు, జూనియర్లతో మంచి సంబంధాల కోసం ఇంటర్ పర్సనల్ నైపుణ్యాలు పెంపొందిచుకోవాలి. సామాజిక, సాంస్కృతిక, కార్పొరేట్ మర్యాదలు ఈ పాఠ్యాంశాలలో ఉన్నాయి. విద్యార్థి దశలో ఈ సార్వత్రిక మానవ విలువలు నేర్చుకుంటే సృజనాత్మక, వ్యవస్థాపక మనస్థత్వం అలవడి సామాజిక మేథస్సు సమగ్ర ఆలోచనలు పెంపొందుతాయి. ప్రతి పాఠ్యాంశంలో విలువలు అంతర్లీణంగా ఇమిడి ఉంటే అభ్యాసన సమయంలోనే జ్ఞానంతో పాటు విలువలు విద్యార్థుల మస్తిష్కాలతో నిక్షిప్తమై మంచి పౌరులుగా తయారౌతారు.

పిల్లల సహజ మానసిక ఎదుగుదలతో సంబంధం లేకుండా ప్రీకేజీలంటూ ప్లేస్కూళ్ళంటూ రెండున్నర సంవత్సరాల వయసులోనే పాఠశాలలకు పంపించడం సమంజసం కాదని మానసిక నిపుణులు చెబుతున్నారు. హాయిగా ఆడుకోవలసిన పసిమొగ్గలు బాల్య దశ వికాశం విచ్చుకోక మునుపే తల్లితండ్రుల సుధీర్ఘ ప్రణాళికలకు సమిధలౌతున్నారు. మానసిక నిపుణులు, మానసిక శాస్త్ర ఉపాధ్యాయులు పిల్లలను బడికి పంపించాల్సిన వయసు కనీసం నాగుగేళ్లు ఉండాలన్న నిబంధన పాటిస్తున్న తల్లితండ్రులు అత్యల్పం. విద్యార్థుల నైపుణ్యాల, విలువల ఎదుగుదలకు కేవలం పాఠ్యాంశాలు, పాఠ్యప్రణాళికలు మాత్రమే సరిపోవు. కట్టుబాట్లు, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యవంతమైన గృహవాతావరణం ఎంతో అవసరం. తల్లితండ్రులు తమ ప్రవర్తన, అలవాట్లు ఎలా ఉన్నా తమ బిడ్డలు ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలని ఆశించడం సమంజసం కాదు. విద్యార్థులలో కొరవడిన నైపుణ్యాలను గమనించిన యు.జి.సి., రాష్ట్ర ప్రభుత్వాలు నష్ట నివారణకు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ ప్రతిపాదిత నైపుణ్యాలు కళాశాల విద్య పాఠ్యప్రణాళిలో చేర్చాలని కేంద్రం ప్రయత్నం చేస్తుంటే, నైపుణ్యాల విశ్వవిద్యాలయం ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం సన్నాహం చేస్తుంది. ఇప్పుడున్న డిగ్రీ చదువుకు మరో ఏడాది పొడిగించి నైపుణ్యాల శిక్షణ ఇవ్వాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. అందులో భాగంగానే ఆంధ్ర రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఐదేళ్ళ ఇంజనీరింగ్ కోర్సుపై అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (AICTE)కి ఇటీవల లేఖ వ్రాసింది. విద్యారంగ అభివృద్ధికి ఇప్పటి వరకు వేసిన కమిటీలు, ప్రణాళికలు తక్కువేం కాదు. భారతీయ తత్వానికి తగ్గ అమలు పరచగల ప్రణాళికలు తయారుచేస్తే తప్ప ఆశించిన ఫలితాలు అందుకోలేం.

డా. గుజ్జు చెన్నారెడ్డి
గుంటూరు. ఫోన్: 984 925 4826.

# తెలుగుకు వెలుగు ఎన్నడు కలుగు

*– వి. వరదరాజు*

తెలుగు మాట్లాడే భాషగా మిగులుతుందా? తెలుగు రాయడం క్రమంగా తరగిపోతుందా? అందుకు సందేహం లేదంటున్నారు భాషాపండితులు. ఇప్పటికిప్పుడు కాదుగాని రానున్న కొన్ని తరాల్లో జరుగవవచ్చునంటున్నారు. భాషాప్రేమికుల అభిప్రాయానికి చాలా కారణాలు కనిపిస్తున్నాయి. మనందరిని కలవరపరచే మొదటి కారణం ఇంగ్లీష్ మీడియంలో చదువుకొనేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండం. పట్టణాల్లో, నగరాల్లో ఎవరైనా భాషాభిమానులు తమ పిల్లలను తెలుగు మీడియంలో చదివించాలనుకొంటే వారికి నిరాశే మిగులుతుంది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. దేశంలో మనదే తొలి భాషాప్రయుక్త రాష్ట్రం. కాని అసెంబ్లీ మొదలుకొని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వ్యవహారాలన్నీ ఆంగ్లంలోనే జరుగుతున్నాయి. గత ప్రభుత్వం ఇంగ్లీష్ చదవాలనుకునేవారి కోసం ఇంగ్లీష్ సిలబస్ ముద్రించి పంపిణీ చేసింది. ఉన్నత పాఠశాల స్థాయిలో సక్సెస్ పాఠశాలలు ప్రారంభించింది. ఇవి ఇంగ్లీష్ మీడియం స్కూల్స్. కొత్త ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఈ విద్యా సంవత్సరం నుండి ప్రాథమిక పాఠశాల స్థాయి నుండే ఆంగ్లం మాధ్యమ బడులను ప్రారంభించ తలపెట్టింది. ఇదీ తొలి భషాప్రయుక్త రాష్ట్రంలో వరుసగా ఎన్నికైన ప్రభుత్వాల భాషా నిబద్ధత. వారి మాతృభాషా ప్రేమ.

ప్రాచీన భాషల్లో తెలుగు ఒకటి. తరగని సాహిత్య సంపద మన సొంతం. నేటికీ తెలుగు రచయితలకు కొదువలేదు. తెలుగు నాట బాగా ప్రాచుర్యం పొందిన గ్రంథాలలో రామాయణ, మహాభారతాలదే మొదటి స్థానం. దీన్ని అందరు ఏకీభవిస్తారు. ఈ రెండు అనువాద గ్రంథాలు. వీటిని సంస్కృతం నుండి తెనిగించారు. తెలుగుపై సంస్కృత ప్రభావం అధికంగా ఉండటానికి ఇదే కారణమంటారు పెద్దలు. ప్రాకృతం, ఉర్దూ, ఒడియా, ఇంగ్లీష్ భాషల ప్రభావం కూడా ఉంది తెలుగుపై. నేడు ఆంగ్లం ప్రభావం అన్నింటినీ అధిగమించింది. క్రమంగా పెరుగుతూ ఉంది ఆ ఆధిక్యత. తెలుగుపై ఆంగ్లం ప్రభావం, తెలుగు వారికి ఈ భాషపై మోజు ఈనాటిది కాదు. *కన్యాశుల్కం* నాటక రచనా కాలం నాటికే ఉంది. పర భాషపై మన మోజుకు గిరీశం పాత్ర చక్కని నిదర్శనం. కాస్త మెల్లగానైన మారుతున్న సమాజంలో అత్యధిక నాగరికుల వ్యక్తిత్వానికి కుడా ప్రతీక ఈ పాత్ర. ప్రతి బాషపైన ఇతర భాషల ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న అన్ని జాతులపై ఉంటుంది. ఆ భాష, ఆ జాతి అభివృద్ధి చెందుతున్నాయనడానికి ఆ భాషపై వివిధ భాషల ముద్రను ఒక కొలమానంగా తీసుకోనిచ్చునేమో. వేరొక ప్రాంతం, దేశం ప్రజలతో సంబంధ బాంధవ్యాలు కొనసాగుతున్నప్పుడు సొంత భాషలో లేని పదాలు ఎరువు తెచ్చుకోక తప్పదు. ఆ మాటకు తెలుగుతనం అద్ది తనలో ఇముడ్చుకోవాలి. అభివృద్ధి చెందుతున్న భాషలో అందుకు వీలుంటుంది. డు, ము, వు లు అందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. వీటితో పరభాషా పదాలను తెలుగుగా చేయవచ్చు. ఉదాహరణకు బస్ బస్సు, ఇంగ్లీష్ ఆంగ్లం. ఇలా తేలికగా ఇతర భాషా పదాలను తెలుగులో చేర్చుకొనే మార్గాలను భాషాపండితులు కనుగొనాలి. ప్రజల నోళ్లలో నలిగి సొంతమైనవి చాలా ఉంటాయి. ఇడ్లీ, దోశ, పూరి, వడ,

పానీపూరివంటివి ఎన్నో ఉన్నాయి. ఇలా పలు మార్గాలలో భాష విస్తరిస్తుంది. ఒకటవ తరగతి నుండి విశ్వవిద్యాలయ స్థాయివరకు పాఠ్య పుస్తకాలను తెలుగులోనే అందుబాటులోకి తేవాలి. అనేక శాస్త్ర గ్రంథాలను అనువదించాలి. వ్యవహారిక భాషకు వ్యాకరణం లేని లోటు తీర్చాలి. చేతిలో ఇమిడే నిఘంటువు రూపొందించాలి. శాస్త్ర సాంకేతికాభివృద్ధి చెందుతున్నకొలది సాంకేతిక పద విస్తారణ జరుగుతూనే ఉంటుంది. ఆ వేగాన్ని తెలుగు అందుకోగలగాలి. అప్పుడే భాష సజీవ స్రవంతిగా సాగుతుంది.

గత యభైఏళ్ళలో చాలా ఆవిష్కరణల ఫలాలు ఇంటికి చేరాయి. ప్రతి ఇంట టివి, కంప్యూటర్, ఐపాడ్, బైక్, అందుకుబాటులోకి వచ్చాయి. చేతికి మొబైల్ చేరింది. గృహోపకరణాల సంగతి చెప్పే పనేలేదు. ఆలుమగలు పనిచేస్తేగాని కుటుంబ ఆర్థిక అవసరాలు తీరడంలేదు. తెలుగు నాట ఉమ్మడి కుటుంబాలు మాయమయ్యాయ్. పర్యవసానంగా తాతలు, అమ్మమ్మలు, నానమ్మల కథలు పిల్లల చెవికి చేరడం లేదు. పిల్లలు బడి, ట్యూషన్లలో గడిపే సమయం బాగా పెరిగింది. ఇంటికి వచ్చాక టి.వి., మొబైల్స్ సర్వస్వం అయినాయి. ఇరుగు పొరుగు పిల్లలతో కలిసి ఆడుకునే రోజులు గతించాయి. బాల సాహిత్య సృష్టి తగ్గింది. వెరసి సాహిత్యంపై మక్కువ పెంచే పునాది లోపించింది.

అన్నింటికన్నా ముఖ్యమైంది చదువు. నేటికి మన అక్షరాస్యత శాతం తక్కువగా ఉంది. పాశ్చాత్య దేశాల పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. వారిది మనకన్నా సాంకేతికంగా అభివృద్ధి సాధించిన సమాజం. నిత్య జీవితంలో ఉరుకులు పరుగులు మనకన్నా వారికే ఎక్కువ. కానీ ఆ దేశాలలో పుస్తక పఠనం అధికంగా ఉంది. ముఖ్యంగా 20 నుండి 40 మధ్య వయస్కులు బాగా పుస్తకాలు చదువుతున్నారని సర్వేలు తెలుపుతున్నాయి. మన గ్రామాలకు నిన్నటి వరకు మౌఖికంగానే సాహిత్యం చేరింది. సాహిత్యం అంటే పురాణ సాహిత్యమే. మౌఖికంగా అంటే వివిధ కళారూపాలు ద్వారా అందించడం. మనది మారి మారని సమాజమా? లేక మరేమైనా కారణాలు ఉన్నాయా తెలుసుకోవాల్సి ఉంది.

వి. వరదరాజు
శ్రీకాకుళం. ఫోన్: 949 254 2034.

## మురిపాల ముద్దు

నలచక్రవర్తి దమయంతిని అరణ్యంలో ఒంటరిగా విడిచి వెళ్ళునప్పుడు ఆయన మనోవేదన.

*సీ॥ చెలి నీదు మోముగాంచి ముదంబు చెందుదుగాని, చూడగరోయట నెరుగ*
*నింమషంబు కనకున్న దమిచెగ్గిలుదుగాని, నిన్నెడబాయగోరు వెలుగ*
*విలకించి ఈర్ష్వాశ్రువులవహింపుదుగాని, ఇట్టి దుఃఖస్రురేనెరను నెరుగ*
*మది ధన్యతకు రంజిల్లుదుగాని, క్రూర కర్ముడనే మనంచు నెరుంగ*

*సీ. జంచలాక్షిరొ నీవు నిద్రించువేళ నీవెరుగకుండ నెలమిమై నెన్నియే న*
*ముద్ద లిరుచుంటిగాని, నీయెదనిలిచి, వేడికన్నీరు నించుటేనాడు నెరుగ*

*సీ. కలవారి వాణికోకిల వాణి నరసింహ, గడు మోహమున మెచ్చియిచ్చిన ముద్దు*
*సనబోహి మాట జినతనంబునకెలర్చి, ప్రేమబెట్టిన మురిపెంపు ముద్దు*
*కమలాక్షి ప్రణయకోపమునజూడనివేళ గడకేగి బలిమైనిడిన ముద్దు*
*ఘనవేఱి. మరువేచి ననుముద్దులాడగ, మవిబొంగియిడీ నయన్నారు ముద్దు*

*గీ. ఎల్లముద్దుల రుచులనేనెరిగినాడ, కొనియనారి నిదురింప గనుల నీరు*
*మునుగు నెడబాయవగు, నిడుముద్దునందుదనరు రుచిదాన దానినంతనుభవిత*



దమయంతిని
వదలి వెళుతున్న నలుడు

దేవరకొండ రామనరసింగరావు, విజయగనరం. ఫోన్: 08922-224223.

# జిడ్డు కృష్ణమూర్తి - పునర్దర్శనం

*- కాసుల శ్రీనివాసులు*

కృష్ణాజీ మరణించడానికి ఒకటి రెండు సంవత్సరాల పూర్వం, అంటే 1984 - 1985 ప్రాంతంలో. అడయార్‌లో ఆయన్ని కలిసే అపురూపమయిన అవకాశం మాకు దక్కింది. సూటిగా అడిగాము - "గత వారం మీ ప్రసంగంలో eternal peace గురించి ఉపన్యసించారు కదా, దానిని వివరిస్తారా". దానికి ఆయన ఇచ్చిన సమాధానం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. " నేను ఆ మాటనే వాడలేదు. నేను మాట్లాడిన ప్రతి మాట రికార్డు అయి ఉంటుంది, మీరు ఆఫీసుకు వెళ్ళి cassette వినండి, తేలిపోతుంది."

(గంట తరవాత మేము వెళ్ళి cassette వినడం, అందులో ఆ మాట లేకపోవడం, మేము ఆశ్చర్యానికి గురికావడం, ఇదంతా వేరే కథ).

ఈ విధంగా, మా ఇంటర్వ్యూ అర్థాంతరంగా ముగిసింది. అసహనానికి లోను కావడం మావంతు అయింది. మా అసంతృప్తిని గమనించిన కృష్ణాజీ మాతో ఇలా అన్నారు - "చాలా దూరం నుండి వచ్చారు, అడగవలసింది ఇంకా ఏమైనా ఉంటే అడగండి." అవకాశాన్ని వినియోగించుకొని మేము - "మీ ఫిలాసఫీ సంక్షిప్తంగా కొద్ది మాటల్లో చెప్పగలరా?" అని అడిగాము. దానికి కృష్ణమూర్తి సమాధానం -

"ఆ కనపడుతున్న పర్వత సానువులకు ఆవలి వైపు అందమైన సరస్సు ఉంది. మీరు వెళ్ళి దాని అందాన్ని ఆస్వాదించండి." తార్కికుడైన మా మిత్రుని స్పందన - కేవలం మీ మాటలపై నమ్మకం ఉంచి మేము శ్రమించి పర్వతాన్ని దాటితే, అక్కడ సరస్సు లేకుంటే? ఈ తర్కం మా సమావేశానికి క్షణంలో ముగింపు పలికింది. మారు మాట్లాడకుండా, కృష్ణాజీ తాను కూర్చున్న చాపను చుట్టుకొని లోనికి వెళ్ళిపోయారు.

దాదాపు 35 ఏళ్ల క్రితం ఆయన వ్యక్తపరచిన ఈ సత్యం నేటికీ అపురూపంగా మా మనసుల్లో నిలిచే ఉంది, మమ్మల్ని ప్రభావితం చేస్తూ. ఆ సత్యాన్ని నేను ఈ వ్యాసంలో విశదీకరించే ప్రయత్నం చేస్తాను. ఈ సత్యం ఎక్కడా గ్రంథస్థం కాలేదు, రికార్డు కాలేదు - ***మిసిమి*** మొదటసారిగా దీన్ని వెలుగులోకి తెస్తోంది. ఒక భిన్నమైన సమాజాన్ని ఆవిష్కరించాలన్నది కృష్ణమూర్తి ప్రయత్నం. అందులో హింసా వైషమ్యాలకు తావు ఉండదు. ఈ ప్రయత్నానికి అవసరమైన సావధాన శీలతను మనం సాధించుకోవాలి. అనాదిగా మనం పోగుచేసుకున్న జ్ఞానం దీనికి ఉపయోగపడదు, అంతేకాక అది ప్రతిబంధకం అవుతుంది కూడా. ఇంతకాలం మనం సృష్టించుకున్న ఆలోచనల్లో మనం బందీలుగా మిగిలిపోయాము. అందులోంచి బయట పడడానికి మనం చేసే ప్రయత్నాలు మరో చట్రంలో బిగించేస్తున్నాయి తప్ప మనకు స్వేచ్ఛను ప్రసాదించడం లేదు. అంచేత మొట్టమొదటిగా రావలసింది మన చేతనావర్తంలో సమూలమైన మార్పు.

ఇది సాధించాలంటే మన మన సంకుచితమైన జీవితానికి భరతవాక్యం పలికి, సృజనాత్మకంగా జీవించడం ఆరంభించాలి. అప్పుడే మనలో తరతరాలుగా పేరుకుపోయిన కుళ్ళు, హింస, దురహంకారం తొలగిపోగలవు. విశ్వమానవుడిగా, వినూత్న మార్గదర్శిగా లోకం ముందు నిలిచిన JK మనం అనుభవిస్తున్న ఘర్షణ, అశాంతి, దుఃఖం నుండి మనల్ని విముక్తం చేసే

ప్రయత్నం చేశాడు. ఆయన మాటలు కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించవు, స్వర్గప్రాప్తికి దారి చూపవు. మనిషికీ మనిషికీ ఉండే సంబంధాలు సమూలంగా రూపాంతరం చెందడమే నేటి ముఖ్య అవసరం అంటాడు. అది సాధించడానికి మనలో మానసిక విప్లవం అవసరం అంటాడు. మనిషికి అత్యంత అవసరాలైన తిండి, బట్ట, గూడు అందరికీ పంచడం ఒక సమస్య. ఒక శాసనం ద్వారా, నిర్బంధం ద్వారా ఆ పని చేస్తే, అది వ్యతిరేకతను ప్రోత్సహిస్తుంది. ఈ పని చేయాలంటే పూర్తిగా భిన్నమైన సామాజిక వ్యవస్థ అవసరం. సార్వభౌమిక ప్రభుత్వాలు, కులమత వ్యవస్థలన్నీ అంతమైపోవాలి. వారసత్వం (ఆస్తి వారసత్వం, మానసిక వారసత్వం) నూతన సమాజ ఆవిష్కరణకు అవరోధం. మన పిల్లలు ఈ రెండు వారసత్వాలకు దూరం కావాలి. వాళ్ళు స్వేచ్ఛాజీవులుగా పెరగాలి. **JK** ఇలా అంటున్నారు -"నా ప్రధాన లక్ష్యం ఒక్కటే, వ్యక్తి స్వేచ్ఛ, అన్నీ భయాల నుండి, బంధాల నుండి మనిషి విముక్తి సాధించాలి."

సిద్ధాంతాలు, విశ్వాసాలు, విలువల పైన ఆధార పడి మనిషి జీవిస్తున్నంత కాలం విభేదాలు, ఘర్షణలూ, అశాంతి అనివార్యం అవుతున్నాయి. ఈ దుస్థితి నుండి విముక్తి కలిగించేది స్వేచ్ఛ. తరతరాలుగా మనం మోస్తున్న వీటి బరువు భారం తొలగిపోయినప్పుడు మన శక్తి వృధా కావడం ఆగిపోతుంది. ఆ శక్తి, ఆ స్వేచ్ఛ మనకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తాయి. భావాలు, అభిప్రాయాలు, నమ్మకాల అరణ్యంలో దారి తప్పకుండా మనల్ని కాపాడేది స్వేచ్ఛ. మనస్సు గతం నుండి విముక్తి పొంది శూన్యంగా అయినప్పుడే స్వేచ్ఛ ప్రవేశిస్తుంది. మనం తక్షణం చేయవలసిన ఈ ప్రయత్నం విప్లవాత్మకం. జీవితాన్ని అర్థం చేసుకోవడానికి మనం పోగుచేసుకున్న జ్ఞానం, అనుభవం ఉపయోగపడతాయని ఇన్ని రోజులూ భ్రమపడుతూనే ఉన్నాం. నిజానికి అవి ప్రతిబంధకాలు.

జీవితాన్ని **JK** ఇలా నిర్వచిస్తారు.

జీవితమంటే సౌందర్యం, సంతోషం, గందరగోళం. అది వృక్షం, పక్షి, నీటిపైన పడే చంద్రకాంతి. అది మరణం, అది జీవితం రెండునూ. అది పచ్చని ఆకు, గాలికి ఎగిరే ఎండుటాకూనూ. అది ప్రేమా, దాని అపరమిత సౌందర్యం, అది ఒంటరితనంలో దుఃఖం, ఏకాంతంలోని పరమానందం. దాన్ని మనసు ఆవిష్కరించలేదు. మనం జీవితాన్ని అనుభవించడం లేదు, ఎందుకని?

సమాధానం ఒక్కటే - సృజనాత్మకంగా జీవించడం ఎలాగో తెలియని మూర్ఖత్వం. జీవితమంటే మానవ సంబంధాలే అని తెలుసుకోలేని అశక్తత. నిర్మలమైన హృదయం, మార్దవంగా ఉన్న మనస్సు లేకపోవడం.

జీవితాన్ని సృజనాత్మకంగా మాలచుకోవడానికి మరొక అవరోధం మనం సంపాదించుకొన్న జ్ఞానం. మనం నిర్మించుకున్న విలువలకి, విశ్వాసాలకి మనం బందీలం. ఈ నిబద్ధీకరణవల్ల గొప్ప-గొప్ప జ్ఞానులు కూడా స్వేచ్ఛగా ఆలోచించలేక పోతున్నారు. వారి మనస్సులు నిబద్ధీకరించబడ్డాయి. అంధులమై పోయామన్న విషయాన్ని కూడా గ్రహించలేక పోతున్నాము. ఈ జ్ఞానపర్వతం మనల్ని పూర్తిగా అజ్ఞానులుగా మార్చింది.

మనం చిత్రమైన మనుషులం - ఏదో కావాలని ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాల్లో తిరుగుతాం - అది మనకి సమీపంలో ఉన్నప్పటికీ. సౌందర్యం ఎక్కడో ఉందనుకుంటాము, మనకు దగ్గరలో కాకుండా. సత్యం మన ఇళ్ళల్లోఉండే వస్తువు కాదనుకుంటాం, సుదూర ప్రాంతాల్లో అన్వేషిస్తాము. జీవితంలోని సామాన్య విషయాలను విస్మరించి, ఏదో మర్మభూయిష్టమైనదాన్ని, నిగూఢమైనదాన్ని అందుకోవడానికి ప్రయత్నిస్తాం.

మన చర్యల్లో స్పష్టత ఉండదు. మనం గందరగోళంలో ఉన్నంత కాలం, మన చుట్టుపక్కల గందరగోళాన్నే వ్యాప్తి చేస్తాం. బలమైన మన కోరికలు, తాపత్రయాలు మనల్ని భ్రమల్లోకి, అంతులోని దుఃఖంలోకి లాక్కుపోతాయి.

చాలామంది కోరుకునేది క్షేమంగా ఉండడం - సురక్షితంగా ఉండడం. దీని కోసం సంఘాన్ని ఆశ్రయిస్తాం, గురువుల్ని గౌరవిస్తాం, రాజకీయ జోక్యం ఆహ్వానిస్తాము. మన క్షేమం కోసం, భద్రత కోసం

మతాలు, సిద్ధాంతాలు, విశ్వాసాల మధ్యనే జీవితాన్ని గడిపేస్తాం కానీ అవి మన సమస్యల్ని శతాబ్దాలుగా పరిష్కరించలేకపోతున్నాయని గ్రహించం.

సృజనాత్మకత, ప్రజ్ఞ, వివేకం అన్నీ మన సహజాతాలే, అయినా వాటి కోసం అరణ్యాలలో, సుదూర తీరాల్లో అన్వేషిస్తాము. మన లోలోతుల్లో చూడం.

జీవితాన్ని ఆనందంగా గడపలేని దుర్భాగ్యులం. అశాంతి, ఘర్షణ, ద్వేషం, ఈర్ష్యలాంటి విషాదాల మధ్యే గడిపేస్తాంగాని, శాశ్వతమైన విముక్తి కోసం ప్రయత్నాలు చేయము.

మరో పర్వతం మన అభద్రతాభావం - భద్రత, భయం, ఊహలు, అభిప్రాయాలు, సంప్రదాయలు, అలవాట్లు అనే గోడలను చుట్టూ నిర్మించుకొని మిమ్మల్ని మీరు సంకుచిత పరచుకోవడం మానుకున్నప్పుడు, సృజనాత్మక జీవచైతన్యం మీకు వినూత్న జీవితాన్ని ఇస్తుంది. అప్పుడే మనలో సంకుచిత్వం సమసిపోయి, విప్లవాత్మక విశాలత్వం మనకు తోడవుతుంది. ప్రేమించే వాడికి అభద్రత సమస్య కాదు.

మనకు ప్రేమించడం తెలీదు - ప్రేమనెరిగిన వాడెవ్వడూ ప్రేమను నిర్వచించలేడు. మీరు ప్రేమించండి, తక్షణం దాని పరిమళం మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

ప్రేమ అనే వెచ్చని జ్వాలని ఎలా నిలుపుకోవాలో మనకెన్నటికీ తెలీదు. జ్వాలపోతుంది, పొగ మిగులుతుంది. ప్రేమ మనస్సుది కాదు. అది ఆలోచనల వలలో చిక్కుకున్నదీ కాదు. దాని పట్టుకోవడం, దాచుకోవడం కుదరదు. మనస్సు మౌనంగా ఉన్నప్పుడు, మనస్సు కదలికలు అంతమైపోయినప్పుడు హృదయంలో శూన్యం అవతరించినప్పుడే ప్రేమ సజీవంగా నిలుస్తుంది. నీ నా జీవితానికి నిజమైన అర్థాన్ని తొడిగేదే ప్రేమ. ప్రేమ ఒక్కటే సృజనాత్మక విప్లవం.

నేను - పేరు, పదవి, ఆస్తిపాస్తులు, డాబు, దర్పం, బంధుగణం - వీటిని "నేను" అని భావించి, వాటిని పట్టుకొని వ్రేలాడతాం. నిజంగా అది శూన్యం - శూన్యమంటేనే మనకు భయం. అశూన్యతని నేరుగా ఎదుర్కొన గలిగితే, దాంతో సాహచర్యం చేయగలిగితే (పాముతో గదిలో సహచరించినట్లు) అది మాయమవుతుంది. ఒక సమూలమైన పరివర్తన సంభవిస్తుంది. అది సంభవించడానికి అశూన్యత అనుభవంలోకి రావాలి. అది అనుభవంలోకి వచ్చినప్పుడు మనలో ప్రశాంతత రాజ్యమేలుతుంది. "నేను", "నాదీ"ల కార్యకలాపం ఆగిపోతుంది. మనస్సు నిశబ్దంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే "నేను" "నా" స్పృహలేకుండా ప్రేమతో జీవించగలం.

సత్యాన్వేషణ - కొందరు నిరంతరం సత్యాన్వేషణలో ఉంటారు. అదొక మిథ్య. తెలుసుకోవడం సాధ్యం కాని దాన్ని గురించి ఎలా వెదుకుతారు? వెదకడానికి ముందు, ఏమి వెదకాలో తెలిసి ఉండాలి కదా! కనిపించాలని వెదికితే, కనిపించేది నీ స్వీయ ప్రతిబింబమే. మీరు కోరేదే మీకు కనిపిస్తుంది. సత్యాన్ని అన్వేషించలేరు, "మీరు" లేనప్పుడే సత్యం ఉంటుంది. మన నుంచి మనం తప్పించుకోవడానికి సత్యాన్వేషణ తెచ్చిపెట్టుకున్నా, దాన్ని ఒక పలాయన మార్గంగా చేసుకున్నా, స్వీయ జ్ఞానం లేకుండా మీరు శోధించే దైవం మీ భ్రమే.

సత్యం ఎన్నటికీ నవ్యంగా, సజీవంగా ఉండాలి. దాన్ని క్షణక్షణం కనుక్కోవలసి ఉంటుంది. సత్యం అజ్ఞాతమైనది. తెలుసుకునేందుకు మార్గం ఉండదు, తెలుసుకునేందుకు సాధ్యం కాదు. తెలిసినదైతే అది సత్యం కాదు. కొందరు దేని కోసం తాము అన్వేషిస్తున్నామో, దాని రూపు రేఖలు ఏమిటో తెలియకుండా అన్వేషణ సాగిస్తారు. ఊహల్ని, భ్రమల్ని వెంటాడుతారు. తమకు ఎదురు పడినదే దైవం అని సమాధాన పడిపోతారు. లేక ఈ ఎండమావి వేటలో వాళ్ళ జీవితాలు ముగుస్తాయి.

జ్ఞానం - సరిపూర్ణ మానసిక వికాసం కలగాలంటే మన జ్ఞానం అంతం కావాలి. మన ఆలోచనలు పని చేస్తున్నంత కాలం వికాసం కలగదు. జ్ఞానంవల్ల అవగాహన కలుగుతుంది అని అనుకోవడం భ్రాంతి. జ్ఞానం సృజనాత్మక అవహగనకి అవరోధం. ఉదాహరణకి - ద్వేషం, శతృత్వం, యుద్ధం ఎంత విధ్వంసకరమో మనకి తెలిసినా, మన దేశాలు యుద్ధాలకి సిద్ధపడుతున్నాయి. వాళ్ళ జ్ఞానం వాళ్ళను నివారించలేకపోతోంది. జ్ఞానం

ఎప్పుడూ పాతదే, పరిష్కారం కోరేది క్రొత్తది. పొసగదు. జ్ఞానం అంతం కానిదే శృతి కలవదు. మన జ్ఞానమంతా పాతదే, మన అనుభవంలోనించి పుట్టిందే కాబట్టి మనస్సుకి కొత్తగా ఆలోచించడం చేత కాదు. కొత్తగా ఆలోచించే స్వేచ్ఛ దానికి లేదు.

నిజానికి జ్ఞానం నుండి విముక్తి కలిగినప్పుడే వివేకం ఉదయిస్తుంది, వివేకమే పరిష్కారం చూపుతుంది. అయితే జ్ఞానం, అనుభవం లేకుండా జీవించడం దుర్లభం అనుకుంటాం. నిజమే, ఆలోచన తనని తాను అంతం చేసుకోలేదు. దీనిలోని సత్యాన్ని గ్రహించినప్పుడే ఆలోచన అంతమవుతుంది. ప్రయత్నించండి. మనం నిజమైన జీవితం ఎందుకు గడపలేక పోతున్నాము. జీవితమంటే ఒకరితో ఒకరికిగల సంబంధమే. అదే సమాజానికి మూలం. మనం అసూయపరులైతే, అటువంటి సమాజమే నిర్మిస్తాము. అయితే మనకున్న సంబంధాలు నిజమైన వ్యక్తులలో కాకుండా ఊహాచిత్రాలపై ఆధారపడి ఉన్నాయి. భర్త తన భార్య గురించి, భార్య భర్త గురించి వేరు వేరు ఊహాచిత్రాలు నిర్మించుకుంటారు. ఈ ఊహాచిత్రాల ఆధారంగా వాళ్ళ జీవితాలు గడుపుతున్నారు కానీ నిజమైన వ్యక్తులతో కాదు.

ఊహాచిత్రాలలో జీవించడం సులభం, నిజమైన వ్యక్తులతో మెసలడం కష్టం. అందులో మానసిన భద్రత ఉంటుంది. అయితే ఊహాచిత్రాలతో జీవించడం అంటే నమ్మకాలు, ఆదర్శాలు, అభిప్రాయలతో జీవించడమే. అందుచేత మన జీవితాలు సంకుచితం అయిపోయాయి. విస్తృతపరచుకోవలంటే మనం మన ఆలోచనలతో పోరాడక తప్పదు. అప్పుడు మనల్ని మనం అర్థం చేసుకుంటాం, మన స్వభావం మనకి తెలిసి వస్తుంది.

సంపూర్ణ మానసిక వికాసం ఎలా కలుగుతుంది?

పరిపూర్ణ మానసిక వికాసం అన్నది మహాబోధి కిందో, రుషి ఆశ్రమాలలోనో, పవిత్ర గ్రంథాలలోనో లభ్యమైయే బ్రహ్మపదార్థం కాదు. మనం మన జీవితాల లోలోతులను శ్రద్ధతో పరిపూర్ణ సావధానతతో స్వేచ్ఛగా పరిశీలిస్తున్నప్పుడు, జీవిత సత్యాలు వాటంతట అవే మన ముందు నిల్చుంటాయి. పరిపూర్ణ పరిమళంతో మనలోని వెలుగు ప్రసాదించే, వినూత్న చేతనావర్తనని చేకూర్చి, మనల్ని క్రియాశీలురుగా నిలుపుతుంది. నీ వెలుగు చూపే మార్గంలో నీవు నడిచివెళితే, నీ ముందు నిత్యనూతనమైన జీవితం ప్రత్యక్షమవుతుంది. వేరే మార్గం లేదు. సహజత్వం, నిరాడంబరత, ప్రేమ, దయ, వివేకం - వాటంతట అవే నీకు తోడు నడుస్తాయి. మనం నమ్మకాలకు బందీలం - నమ్మకం పెట్టుకోవడం అంటే నీపై నీవు ఆధారపడడం మాని ఇతరులపైన ఆధారపడడం ఆరంభిస్తావు. స్వేచ్ఛగా ఆలోచించే శ్రమనుండి తప్పించుకోవడానికి నమ్మకాలు పనికి వస్తాయి. వాస్తవానికి శ్రమ లేకుండా జీవించే జీవితం జీవితమే కాదు. నమ్మకం మనస్సుకి హద్దులు గీస్తుంది. నమ్మకాలతో జీవించే జీవితం సంకుచిత జీవితం. అందులో విశాలత్వం శూన్యం - అది జైలులాంటిది.

నిత్యనూతనంగా మనం ఉండగలమా?

మన మనస్సు సమూలంగా మారితే తప్ప జీవితానికి అర్థం ఉండదు. జీవించడం వ్యసనం కాకూడదు. తెలిసినదాని నుండి స్వేచ్ఛ పొందినప్పుడు, మనసుకు సాధ్యమయ్యేది అపారం. ఏ రోజుకి ఆ రోజు నూతన మానవుడవ్వాలి, గతం పూర్తిగా సమసిపోవాలి. ప్రతి రోజూ మరణిస్తే తప్ప అది సాధ్యం కాదు. తన పూర్తి గతానికి, అనుబంధాలకు, ఆందోళనలకు ఎంత పూర్తిగా మరణించాలంటే, మర్నాడు మేలుకొనేసరికి వినూత్న మానవుడవ్వాలి. గతం పూర్తిగా సమసిపోవాలి.

జీవితమంటే ఏమిటి?

జీవితమంటే సౌందర్యం, సంతోషం, గందరగోళం, అది వృక్షం, పక్షి, నీటి పైన పడే చంద్రకాంతి. అది పని, బాధ, ఆశ. అది మరణత్వం, అమరత్వం కోసం అన్వేషణ. అది పరమాత్మలోని విశ్వాసం, అవిశ్వాసం కూడా. అది మంచితనం, ద్వేషం, ఈర్ష్య, దురాశ. అది ప్రేమ, ద్వేషం. అది ధ్యానం, అది ప్రజ్ఞ, అది వివేకం. జీవితానికి ఆరంభం లేదు, అంతం లేదు, అది కేవలం కొనసాగడమే.

*అసంతృప్తి జ్వాల:* మనలో చాలామంది జీవితాన్ని సంతృప్తిగా గడపాలనుకుంటారు. ఒకటి సంతృప్తి

ఇవ్వకపోతే మరొకటి వెదుకుకుంటారు. అసంతృప్తిని తప్పించుకోవాడమే వారి ప్రయత్నం. అంతేగానీ వాళ్ళు అసంతృప్తిని తరచి చూడరు. అసంతృప్తితోనే జీవించడం బాధకరమైనప్పటికీ అదొక మహత్తరమైన అనుభవం. అసంతృప్తి నుండి తప్పించుకోవడానికి కానీ, మార్చడానికి కానీ ప్రయత్నించకుండా ఉండడమే అసంతృప్తి లోతుల్లోకి చొచ్చుకొనిపోవడం. అసంతృప్తి యొక్క మొత్తం ప్రాధాన్యం అర్థం చేసుకోకుండా కేవలం సంతృప్తి పడే మనిషి నిద్రపోతున్నవాడే అవుతాడు. సంతృప్తి ఒక మత్తు మందు. అసంతృప్తి బాధ నుండి బయట పడాలంటే మనస్సు సంతృప్తిని కోరుకోకుండా ఉండాలి. అసంతుష్టికి వ్యతిరేకంగా పోరాడడం అంటే జీవన జ్వాలని ఆర్పివేయడమే. అసంతుష్టిలోని సత్యాన్ని గ్రహించడంవల్ల, గతం దాని ప్రాముఖ్యతని పోగొట్టుకుంటుంది. ఎంత బాధాకరం అయినప్పటికీ జ్ఞానంతో, సంప్రదాయంతో అసంతుష్టి జ్వాలను ఆర్పివేయకుండా దానితో ఉండడం అద్భుతంగా ఉంటుంది.

**వివేకం:**

అనుభవం ద్వారా, జ్ఞానం ద్వారా వివేకం సేకరించలేము. అనుభవం వేరు, జ్ఞానం వేరు, వివేకం వేరు. యుగయుగాలుగా కూడబెట్టిన జ్ఞానం మన దగ్గర కుప్పలు తెప్పలుగా ఉంది. కానీ మనం వివేకవంతులుగా, ఆనందంగా, సృజనాత్మకంగా లేము.

ఆలోచన ఎన్నటికీ కొత్త విషయాన్ని కనిపెట్టలేదు. అది అంతం అయినప్పుడే వివేకం ఉంటుంది. వివేకం ఎప్పుడూ స్వేచ్ఛగా, కొత్తగా ఉంటుంది. వివేకాన్ని పోగు చేసుకొనే సాధనం లేదు. మనస్సు చేసే చమత్కారాలు గ్రహించడం, వాస్తవాలను ఎదుర్కోవడంలోనే వివేకం ఉదయిస్తుంది. వివేకాన్ని అందించడం కుదరదు, దాని పొగుచేసుకొని నేర్చుకోవడం వీలుపడదు. ప్రశ్నించడానికి స్వేచ్ఛ ఉన్నప్పుడే, ఆలోచించి తెలుసుకోవడానికి స్వేచ్ఛ ఉన్నప్పుడే, మనలో వివేకం ఉదయిస్తుంది. అప్పుడే మన మనస్సు అతి చురుకుగా, అత్యంత నిరుష్టంగా తయారవుతుంది. అప్పుడు మనం సంపూర్ణంగా సమన్వయత్వం పొందిన వ్యక్తిత్వం సాధిస్తాము. స్వతంత్రంగా ఆలోచించగలిగనప్పుడే, మనలో వివేకం ఉదయించి, మనం మన జీవిత సమస్యలను సులభంగా పరిష్కరించగలుగుతాము.

నిరాడంబరంగా ఉండడంలో వివేకం ఉంది, వివేకి అట్టహాసంగా ఉండలేడు. అన్నీ నాకు తెలుసు అని భ్రమపడలేడు. కానీ నిడారంబరంగా ఉండడం విపరీతమైన కష్టం. వస్త్ర వాహనాలు లేని నిరాడంబరతకన్నా, హృదయ నిరాడంబరత అర్థవంతమైనది.

వివేకవంతుడైన మనిషి కొంచెంలోనే తృప్తి పడి, అధిక సంపదలు లేకుండా స్వేచ్ఛగా ఉంటాడు. జ్ఞానం అంతం కావడమే వివేకానికి ఆరంభం. వివేకం కాలానికి చెందినది కాదు, కాలరహితమైనది.

కృష్ణమూర్తి మాటలు వింటే ..

కృష్ణమూర్తి మాటలు సమగ్రంగా అవగాహన చేసుకుంటే మన నిరంతర అన్వేషణ ఆగిపోయి, ప్రశాంత జీవనం దక్కుతుంది. మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు క్రమగతిలో ప్రవేశిస్తాయి. అంతరంగ ధ్యానంలో, ధ్యానంలోని మౌనంలో మన లోలోతుల్ని మనమే పరిశీలించుకుంటాము. సృజనాత్మక ఆనందం, ప్రేమాత్మక వివేకం జాగృతం అవుతాయి. అస్తిత్వం యొక్క పరిపూర్ణత మన జీవితాలకు కొత్త సొబగులు దిద్దుతుంది.

కృష్ణమూర్తి మాటలు మనలో అత్యుత్తమ అవహగన కలిగించి, మన మనసుల్ని వికశింపచేసి, ఎన్నో జీవిత సత్యాలను ఆవిష్కరిస్తాయి. కానీ ఆయన మాటలు సంప్రదాయాలకు భిన్నంగాను, విరుద్ధంగాను ఉంటాయి. జీర్ణించుకోవడం కష్టం.

JK మాటలు వినడం ఒక అపూర్వమైన, పరిపూర్ణమైన అనుభవం. మనలో సంవత్సరాల తరబడి పేరుకుపోయిన గెలుపు ఓటముల భారం తొలగిపోతుంది. కొత్త వెలుగు, కొత్త సత్యం ప్రవేశిస్తాయి.

అదో పరిపూర్ణ విప్లవం.

కాసుల శ్రీనివాసులు
హైదరాబాద్. ఫోన్: 970 478 6663.

# మనిషిలో నది

*– పి. విజయకుమార్*

అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేసేది కవిత్వం అన్నాడు దేవరకొండ బాలగంగాధర్ తిలక్. సామాజిక చైతన్యమే కవిత్వం పరమార్థం. అక్షరాల్ని మట్టిలో విత్తి, పంటలుగా మార్చి, అక్షరాల్ని గుండెలో ప్రతిష్టించుకొన్న కవి రావి రంగారావు 'గుండెలో నదులు నింపుకొని' కవిత్వంలో రావి రంగారావు గారి గొంతుక కొత్త స్వరం పలికింది. ప్రతి కవిని రైతు లేదా దేవుడని కాకుంటే దేవుడు నిదురపోతుంటాడు, కానీ రైతు మాత్రం ఎప్పుడూ మేల్కొనే ఉంటాడన్న వాస్తవిక కోణంలో రావి రంగారావు గారి కవిత్వం ప్రవహిస్తుంటుంది. నా కలం రైతు చేతిలో నాగలి కావాలి లేదా సాంకేతికత పెరిగిన ట్రాక్టరు కావాలి. నా కవిత పొలానికి కాపలాకాచే ముసలి తాత, వెచ్చని చుట్ట కావాలి లేదా పురుగు మందు చల్లే ఆధునిక యంత్రం కావాలి.

*రాజకీయాల్ని కాల్చేసే / భోగిమంట కావాలి / కాలుష్యం అంటని / మంచి పంట కావాలి...* అంటాడు.

సామాజిక వాస్తవికతను ఆకాంక్షించిందే కవిత్వమని ఊహలకి వెలుగుల్ని సృష్టించగలనుగాని ఆ భావాలను దాచుకోలేనని కళ్ళు నెత్తికెక్కిన నక్షత్రాలని కిందకి దించి పంటలుగా మార్చాలనే మక్కువ నాకు ఎక్కువ అన్న అభ్యుదయ భావాలు కలిగిన కవి రావి రంగారావు. మంచి కవిత్వం చెబితే వినేవారెవరున్నారు. ఏ తలకాయలకు నేడు కుంకుడుకాయలవసరం లేదని 'కవి తలంటు' అనే కవితలో పేర్కొన్నాడు. షాంపూల యుగంలో కుంకుడుకాయలగూర్చి 'కవి తలంటు' అనే శీర్షికే కవి తలంపును తెలియజేస్తుంది.

అక్షరాల్ని నేల మీద కురిపిస్తే అవి కాల్వలు, నదులుగా ప్రవహించాయి; ఆకాశంలోకి విసిరేస్తే సూర్యచంద్ర నక్షత్రాలుగా వెలిశాయి; కాని గుండెలో ప్రతిష్ఠించుకొని మనిషినయ్యానని పేర్కొన్నాడు. మానవత్వంగల మనిషిగా అక్షరకాంతుల ద్వారా సమాజంలో స్తబ్ధతను, చీకటిని ఛేదించాలనే భావన రావి రంగారావుగారి కవిత్వంలో ప్రతిధ్వనిస్తుంది. లోతైన భావుకత రంగారావుగారి కవిత్వంలో కనిపిస్తుంది. అక్షరాలతో వెన్నెల వంతెన వేయాలనే అభ్యుదయ భావన ప్రతిపల్కులో కనిపిస్తుంది.

చెట్టును అభిమానిస్తున్నాం. చెట్టు పరోపకారానికి ప్రతీక. చెట్టులాగానే మోడును అభిమానించాలని చెట్టు గాయపడి, ఎండి, మోడై ఇంటికి స్తంభమయింది. చెట్టులోనే మోడుని మరచిపోకూడదు. కొండలానే రాయిని, నదిలాగే నీటిబొట్టునూ పూజించాలంటాయి. సమాజంలో పైకి కన్పించేవే కాకుండా బాధ్యతవహించే ప్రతిదానికి విలువనివ్వాలి అనే భావన ప్రతి తలంపులో లోతైన ఆలోచన ఊహకందని భావాల అనుభవాలు దర్శనమిస్తాయి.

*చరాచర సృష్టిలో ఏదైనా / కదలాలి, / కదిలేది ఎదగటానికే! / ఎదిగేది ఒదగటానికే! / ఒదిగేది /పదికాలాలు బతకటానికే!*

ఎదగాలంటే కదలాలి, కదిలించాలి అప్పుడే ఎదిగేది. ఎదిగినా ఒదిగుండాలి. ఒదిగితేనే పదికాలాలు బతుకుతాం. ఆలోచన సజీవంగా ఉంటుంది. మనకి బతుకునిస్తుంది. పదిమందిని బతికిస్తుంది అని 'ఏదైనా ఎక్కడైనా కదలాలి' కవితలో వ్యక్తం చేశాడు.

దేవుడు చాలా తెలివైన పాలకుడని, పాపుల మీద ప్రతీకారం తీర్చుకుంటున్నాడని, ఈ ప్రాణి జీవితంలో ఎన్నెన్ని పాపాలు చేసిందో గుర్తించి దానికి కసిగా మనిషిగా పుట్టించి కసి తీర్చుకున్నాడు దేవుడు అని 'కసి తీర్చుకునే

దేవుడు' కవితలో వ్యక్తం చేశాడు. పార్టీ జెండాల గురించి చెట్టు మీద జెండా పక్షులకు పోగొట్టింది అండ అని, గుడిపైన జెండా భక్తి నెత్తిన బండలాంటిదని, బడి మీద జెండా సరస్వతిని పీకేస్తుంది కండ అని ఇప్పుడు పార్టీ జెండాలంటే మంటల ఎజెండాలు అని పేర్కొన్నాడు. విద్య, వైద్యం రెండూ చెడిపోయిన ఊపిరితిత్తులను ఓటు వైద్యంతోనే అవి కోలుకునే పూల గుత్తులు అని 'చదువు దొంగలు' కవితలో పేర్కొన్నాడు. కృష్ణుడి రాయబారాలు ఏవీ లేకుండానే అన్నదమ్ముల మధ్య యుద్ధం జరిగింది. విశేషం ఏమిటంటే ఒక పక్షం గెలిచిన తరువాత కూడా అదృశ్య రహస్య యుద్ధం జరుగుతూనే ఉంది అంటాడు. మౌనం ఎప్పుడూ దీపం కాదు, భవిష్యత్తులో మానవుడికి శాపం అంటాడు. మనిషీ నీ మౌనం చినుకుల్ని కాల్చుకుతింటున్న అగ్నిపర్వతం, పువ్వుల్ని నంజుక తింటున్న మహారాక్షస వ్రతం అంటాడు. చీకటి మద్యం సీసాను నీ మాటతో పగలగొట్టు. దీపాల ఫలరసాన్ని సేకరించి విశ్వానికి పంచిపెట్టు అంటాడు.

***తెలుపును / నలుపు చేస్తున్న చెలికాడా... / తెలుపును / వెనక్కి నలపకు... / తెలుపంటూ వేరే లేదు / నలుపు పండితే తెలుపవుతుంది / తెలుపే నీ బతుక్కి గెలుపవుతుంది***

ప్రధానంగా ధనం విషయంలో ఇంకా ఆలోచిస్తే వెతికి చూస్తే ఏ రంగంలోనైనా పై విషయం అన్వయించవచ్చు. నలుపు పండితే తెలుపవుతుంది. తెలుపే బతుక్కి గెలుపవుతుంది. గెలుపునిస్తుంది అనడంలో వాస్తవ కోణాన్ని స్పృశించాడు.

రవిని గ్రహణం పట్టింది. భువిని అహం చుట్టింది అంటాడు. శ్రమజీవి చెమటబొట్టు, ఆవనికి ఆయువుపట్టు; ప్రగతికి తొలిమెట్టు అని పేర్కొనడంలోనే శ్రమజీవి స్వేదంతోనే, దేశసౌభాగ్యం వర్ధిల్లుతుందనే భావన కనిపిస్తుంది. రాజుల పరిపాలనలో కాలం కన్నా మనిషి బాగా వెనకపడ్డాడని, ఆంగ్లేయుల పాలనలో మనిషి లేచి నిలబడి నడవడం మొదలుపెట్టాడని, స్వాతంత్ర్యానంతరం కాలంతోపాటు సమానంగా మనిషి పరుగులు మొదలుపెట్టాడని, కానీ ఈనాడు విజ్ఞానం అరచేతిలోకే అందివచ్చిన తరువాత మనిషి కాలం కన్నా వేగంగా పరుగులు తీస్తున్నాడని విశ్వమంతా ఆక్రమించాలని పరితపిస్తున్నాడని అయితే మనస్సు ముందుకు దూసుకుపోతున్నది కాని దారిలో గుండె ఎక్కడో పడిపోయిందంటాడు. సాంకేతిక ప్రగతి పరుగెడుతుంది కాని మానవ సంబంధాలు, అనుబంధాలు కనుమరుగవుతున్నాయనే ఆవేదన 'కాలంతో మనిషి' కవితలో స్పష్టం చేశాడు. మనిషిని డబ్బు జంతువు ఆక్రమించిందని తనలో మనిషిని పాతరేసిందంటాడు. ఆకలి గుహలో రకరకాల పదార్థాల్ని నింపుకుంటున్నాను కాని రైతు అన్నం తిన్నాడో, పస్తులే ఉన్నాడో ఊహించలేదంటాడు అని 'బతికున్నానో లేదో నాకే తెలియదు' అనే కవితలో పేర్కొన్నాడు.

పాము తిరుగుతోంది జాగ్రత్త, రోడ్డుమీద మనుషులు నడుస్తున్నారు... అని ఆ పాము పేరు 'చీకటి' అని 'నయవంచన' అని 'పట్టనితనం' అని 'మూఢజాడ్యం' అని 'పరిపాలన' అని సమాజంలో రోడ్ల పక్క వెలగని వీధిలైట్ల గురించి, ఎండిపోయిన ముళ్ళకంపలు గూర్చి డ్రయినేజీ నీళ్ళు కదలక మురికి పొదలు గురించి నిర్లక్ష్యపు వైఖరిని ఎండగట్టాడు. భయపడటం నుంచే తిరుగుబాటు బావుటా పైకి లేస్తుంది. భయపెట్టటం నుంచే ఓటమికి పునాదిరాయి కిందికి అంటాడు. కాలం ఉప్పు సముద్రం, సారంతీసి మేఘంగా మార్చి స్వచ్ఛజలం అందించే సూర్యుడు కావాలి నరుడు అని ఇలా కాలం 'కలప అడితి' అని కాలం 'మసిబొగ్గుగని' అని కాలం 'వాయుసమ్మేళనం' అని కాలమే మనిషికి నాయకుణ్ణి చేసింది నిజమే కాని కాలానికి సేవచేసుకోవాలి మనిషి అని కాలంతో వ్యాపారం చేస్తే మసి అని 'కాలం' కవితలో వెలిబుచ్చాడు.

ప్రతి జీవిలోనూ ఒక నది కొన్నిటిలో ప్రవహిస్తూ కొన్నిటిలో ఘనీభవిస్తూ మరి కొన్నిటిలో రాయైపోయిందని 'మనిషిలోని నది' కవితలో పేర్కొన్నాడు. అలానే చెట్లలో, పక్షుల్లో, మృగాల్లో కూడా నదులను గూర్చి విశ్లేషించాడు. బతికినంత కాలం మనిషి లోపల, బయట నదిగా ప్రవహించాలి అని మనిషిపోయినా సరే జీవనదిగా ప్రసరించాలంటాడు. మనుషుల్లో తల్లి కడుపులో పడ్డ నది విత్తనం మనిషిగా ప్రవహించటం మొదలుపెడుతుంది

అని బాల్యంలో ఆ నది గలగల ప్రవహిస్తుంది. తరువాత కోరికల చలి తీవ్రత పెరుగుతుందని, ముదిరితే కదలని కొండై స్తబ్ధతగా ప్రవహిస్తుందని పేర్కొంటాడు.

*నదిలో నీరు - రైతు కన్నీరని ఎవరన్నారు!*
*రైతుల్ని చూసి నదే కన్నీరు పెడుతోంది*
*కాలాన్నిబట్టి నదికి పాలెండి పోవచ్చు*
*వక్షస్థలం ఎండిపోవచ్చు, దేహమే ఎండిపోవచ్చు*
*మనిషి ఎండి పోకూడదు - మనిషిలో నది ప్రవహిస్తూనే ఉండాలి.*

రైతుల కష్టాలకు నదే కన్నీరు పెట్టే పరిస్థితులు నెలకొన్నాయి. కాలాన్నిబట్టి నది ఎండిపోయినా మనిషి ఎండిపోకూడదు. మనిషిలో నది మనిషిలోనది చైతన్య స్రవంతి ప్రవహిస్తూనే ఉండాలంటాడు.

*వేలుంది కదా అని / సూర్యుడికి వేలెత్తి చూపకు...*
*వేలే మిగలదు... / నువ్వు వేలెత్తి చూపాలంటే*
*చంద్రుడికి చూపించు - వాడిలో మచ్చలున్నాయని...*
*తప్పులేదు... / లేనిమచ్చల్ని వేలెత్తి చూపకు*
*వేరేమి గలదు*

చరిత్ర పేజీలలో నువ్వే చెరపలేని ఓ మహామచ్చవౌతావు. ఎదుటివాడి తప్పుల్ని వెదికే ముందు నీ తప్పుల్ని గూర్చి ఆలోచించు. లేకపోతే చరిత్రలో మహామచ్చగా మిగిలిపోతావని హెచ్చరిస్తున్నాడు.

చీకటిని కడుపులో దాచుకొని, వెలుతురుకు వేలెత్తి చూపేవాళ్ళకు కూడా వేలెత్తి చూపగలిగే మహాజ్యోతి అంబేద్కరుడే అంటాడు. వేలెత్తి చూపడమంటే విమర్శించడంతో పాటు విప్లవపథం చూపించటం కూడా అంటాడు. ఆదాయం కన్నా వ్యవ'సాయం' ముఖ్యంగా బతికే రైతులాంటివాడు డాక్టరంటాడు. అవసరమైనప్పుడు పొలానికి ఆపరేషన్ చేసి పంటల్ని పండించే ట్రాక్టరు లాంటిది డాక్టరు చేతిలో పట్టా" అని "డాక్టరు - టాక్టరు" కవితలో పేర్కొంటాడు. నది అంటే భూమి కాగితమ్మీద ఆకాశం కవి రాసే ఓ కమ్మని పద్యం" అది చదువుతున్నాం కాబట్టే ఇంకా మనం బతికే వున్నాం అంటాడు. "వెలుతురు సిరా నింపుకున్న కలాలు చిరంజీవులు. దేశం పొలంలో నిజాల నాగళ్ళతో దున్నేగళాలు మహానుభావులు" అంటాడు. పగలు ఎండ చొక్కా తొడుక్కుని, రాత్రివెన్నెల చొక్కా వేసుకొని కొన్నిసార్లు చీకటి బట్టలేసుకొంటూ కాలం సాగిపోతూ ఉందంటాడు.

*వాయువేగంతో బండి నడిపేది / వాయువుల్లో కలిసిపోటానికే! మెరుపు వేగంతో కారు నడిపేది / మెరుపులా మాయమవ్వటానికే! / యమవేగంతో లారీ నడిపేది యమలోకం చేరటానికే / సూపర్ వేగంతో వాహనాలు నడిపేది చూపుల కందకుండా పోటానికే! / 'హెల్‌మెట్' లేకుండా రోడ్డుమీద కొచ్చేది / 'హెల్'లో బంధుమిత్రుల్ని కలవటానికే!*

అతివేగంవల్ల కలిగే అనర్థాల్ని, సమాజంలో జరుగుతున్న ప్రమాదాలను ప్రస్తావించి 'హెల్మెట్' ప్రాధాన్యాన్ని స్పష్టం చేశాడు.

పండగ అంటే మనసులు పండటానికిగాని, మండటానికి కాదు అంటాడు. నీ మనసు అనే గర్భగుడిలో దేవుడున్నాడని, చెత్తకుప్పలు తొలగించి దీపాలను వెలగించమని ప్రబోధించాడు. మంచి మనసును గిల్లకు, దేశంలో మొక్కలు పూయవంటాడు, పుణ్యపురుషుడి తుంచకు, ప్రపంచంలో చెట్లు చిగురించవంటాడు. రావణుడే సిగ్గు పడేవిధంగా రమణుల గౌరవం మీద గాయాలు చేస్తుంటే, నేటి రావణుల్ని పొడి చేయటానికి అసలు రావణుడే దూసుకొస్తున్నాడు అని "చీకట్లను కౌగిలించుకొని పడుకున్నారేంటి!" కవితలో పేర్కొన్నాడు. మేధస్సు, తెలివి ఆకాశం మించేలా పెంచుకుంటున్నాం కాని హృదయం పాతాళంలోకి పారేసుకుంటున్నాం. అందంగా బతుకుతున్నాంగాని ఆనందంగా జీవించలేకపోతున్నాం, మనుషులమనుకుంటున్నాం గాని మనసు లెక్కడున్నాయి చెప్పండి అంటూ మానవ లోకంలో అనేక పార్శ్వాల్ని స్పృశిస్తూ, ప్రశ్నిస్తూ, 'గుండెలో నదులు నింపుకొని' కవిత్వాన్ని సృజించిన మధురాక్షరాల మృదుశిల్పి రావి రంగారావు. గుండె నదుల్లో ఉప్పొంగిన కవిత్వాన్ని సామాజిక చైతన్య పరమావధిగా తనదైన శైలితో అక్షరబద్ధం చేశాడు.

డా. పి. విజయకుమార్
అనంతపురం. ఫోన్: 984 930 2546, 906 370 2546.

సం(క్రాంతి కాంతి కాంగో పొదల్లో - ఈసారి 8 నెలల ఏకబిగిన చైనావారి చేతుల్లో నుండి పనితనం కాంగో కార్మికుల మెదళ్ళో ధారబోసే వృత్తి ధర్మంలో, నేను బయలుదేరే సమయం వరకు కనబడక - అరేబియన్ సం(ద్రపు అంచున, ఎన్నాళ్ళో దాగిన కదిలే కాంత వెలుగు చీరంచు, మగ-పొగ మంచు అలసిన గుప్పిటల తప్పిన కొత్త గంగలా, మెత్తని తరంగాలు, ముంబాయి మత్తు, తెల్లవారుజాము నుండి తాకడంతో, భోగి స్నానం కొరకు మా అమ్మ ని(దలేపినట్లుగా,

''సీటు బెల్టు సరికేసుకో'' ముంబాయిలో దిగుతున్నామన్న అబిసీనియా హోస్టెస్ అధికారపు అరుపులో వినబడ్డాయి. అమ్మ ఆవిరై 8 సం. పోయాయి, నమ్మ లేని నిజం, ఎన్నాళ్ళు వెంటాడుతుందో!

కంగారుతో ఛ(త్రపతి నీడ - జి.వి.కె. రెడ్డిగార్ల పనితనం - ముంబాయి ఎయిర్‌పోర్ట్ - మా తెలుగు గర్వం, క్షణ మురిపెంతో, ఏడు గంటలు ఎలా వీడ్చాలనుకొంటూ - 14.00 గం. ఎయిరిండియా ఫ్లైట్ కొరకు, అన్ని బుకింగులూ దాటూకొంటూ, పంజాబు గ్రిల్‌లో 250/- రూ. సింగిల్ పరోట మీద కసితో దాడి చేశాను, మూడు పెరుగుల - బూందీ మిక్స్ - ఉచితం కదాయని , 'ఓనరు -సింగు' కంగుతినే లోపు, ఆంధ్రుల అతి తెలివి - అన్న అతని చూపు - అందుకనే రాజధాని నీడ లేనివాడా - ''పో'' అన్నట్లుగా తగిలి - మూలసీటున మూడు గంటలు పెరుగు - అరుగు మత్తులో మరచి ముడిచి నిద్దురలో తడిచిపోయాను.

''అది సూడు ఎలా కట్టుకొందో, ఇందాక ఇంకోత్తి - బొత్తిగా'' నా లేని అమ్మ యాస మాటల - తెలుగు, నా అత్యాశ కరడు కట్టిన పెరుగు ని(దను పగల కొట్టడంతో ఉలికిపడి లేచాను - (ప్రక్కనే తెలుగు వెలుగుల చీరలలో నలుగురు పచ్చ పడుచులు - దూరంగా కదులుతున్న (ప్రియాంకా చో(ప్రా బట్ట కట్టులో పోతున్న పరభాషా (తెనుగూ కావొచ్చు) (ప్రౌఢలను మూయని నోటితో - నా ముప్పై సంవత్సరాల గతంతో చూస్తున్నారు!

వారు తప్పక కోనసీమ కోయిటా (కువైట్) - పాత తీయని పాట పాటులే అనుకొని, నా మానాన మొబైల్ విమానపు స్థితి తీసి, తీరిగ్గా నా ఇల్లాలను పలకరించడం (ప్రారంభించాను.

# జనగ(గు)ణ మన – సామజ వర గమన! నా తెనుగు వాన!

**– ఐ.వి. రామరాజు**


నా (ప్రాస వారి యాసలో మాసినదేమో! ''ఒక్కసారి ఇంటికి మాట్లాడానివ్వగలరా సార్'' వారి కనులు బరువు - పరువుతో పలకరించడం, అంతే నా ఫోన్ వారిదిగా అయినది.

వారితో ఇద్దరు మగవారు - తెనుగు నానినవారు - తెలంగాణావారు, తోటివారిగా చెప్పడం - మస్కట్ నుండి వస్తున్నారని, ఫోను పంచుకొనే (క్రమంలో కూటమిగా మాట్లాడినారు. కాని - ''వారు పని వేరు'' - మేము మగ కార్మిక నీరన్నారు.

ఆ చిన్నమ్మలు చిన్నబుచ్చుకోవడం - ముగ్గరక్కల ముద్దుల తమ్ముడిగా పెరిగిన అదే జల్లిసీమ చిల్లులలో గేదెలు కాసిన బాలుడిగా ఎక్కడో గుచ్చుకొంది.

ఆ(ఫ్రికాలో 22 సం. గతంతో గగన గమనంతో రాక పోకల మూలానా కాబోలు, చీకటి ఖండంలో దాచని స్త్రీ సంపదని తోటి పురష (ప్రపంచం ఎన్నడు పరుషంగా పాలించడం చూడకనేమో, ఆ చతుర సిగ్గు ముద్దబంతులపై సం(క్రాంతి చనువుతో - పస్తులున్నారని (గ్రహించి - ఛ(త్రపతి శివాజి విమానా(శయంలో మూడొందల దోశ, అయిదు గంటల ముందున్న నా అత్యాశ, పరోటా(క్రమణ మరచి, వారికి తెచ్చే (ప్రయత్నంలో - బోర్డింగు అరపు రింగు అడ్డుతగిలింది,

''వద్దు బాబు'' వారన్న తెనుగు పదును (నాకంటే వారు ఇరువది సం.లు చిన్న వయస్సు! నాలుగు దశాబ్దాల (క్రితపు నా బుల్లిమనస్సు) - షంషాబాదు దాటి, పు(త్రునితో ఔటరు రింగు రోడ్‌పై ముద్దుల భార్య (డ్రైవింగు రివ్వు, - లేకుండా చేసింది నా ఎప్పటి వారికిచ్చే సిరి నవ్వు, (ప్రయాణపు అలసట అనుకొని సర్దుకొన్నారు.




"మై హోమ్ అవతారు - ఒక దాని బురుజుపై బురుజులు, నిలువ నామాలు - అడ్డ నామాల నేల నేలుతున్న వెలకట్టని అర చంద్రుని వెన్నెల - హై-ధర-బాదు,

నిజామ్ - జమ్ జమ్ మక్కా గంగలు, కాశీగంట తరంగాల ప్రతిధ్వనులు, కాళీశ్వరపు గోదారి పారిజాతపు పాదు!"

మా 'మాల్స్ టౌనుషిప్' నుండి అదే రాత్రి ప్రయాణం, భాగ్యనగరపు కాంతుల వెల వెలలు! రెండు వెలుగుల తెలుగు ఎగిరి, మకర కాంతులు - తూర్పు తీరమంతా ప్రసరించే, సంక్రాంతిగా చిగురిస్తున్న, ఏడాదికి ఒక విడిదిగా ఏకమాసం బ్రతికే బంతిపూలు.

రాజకీయాలు, రాజధానులు, లేవు ఏ ధ్వనులు, కబ్బాడి / ముగ్గుల పోటీల బ్యానర్ల టిప్-టాప్ పందిర్ల రంగుల మాయలో - కోడిపందాలు - కొక్కోరోకోలు, కోకోకోలా సీసాల్లో, కిక్కిరిసన - దొరకని సారాయి వాసనలు, కనబడి కణబడని బాల్యపు అడుగు జాడలు, కాశీ కర్రతో - బరి మధ్యలో అప్పు తెచ్చుకొన్న కసితో - మీసాల నా ఈడు రాజులు, తరుముతున్నారు - ప్రతి పందెపు పోరు.

డేగ (ఎన్నడు డామినేషన్ ) నెమలి, పర్ల & కాకి - బోలెడు పాత పదాలు నా బెంగళూరు సాఫ్ట్ వేరు బాల్యస్నేహితుడితో - పదాక్షరి పాతర నుండి మా సమాంతర పందాలు, మా యాబది వయస్సుపై ఎగిరెగిరి వీక్షించేలోపూ ఓడిపోతున్న నెమలికాలు కత్తి - నెగ్గుతున్న డేగ మగ మత్తు కక్కుర్తి ముద్దు యత్నంలో - మెడలో దిగి కూలిపోయింది, ముందు తను - మరుక్షణం విజేతగా తన ఆడ వాసన నెమలి. ఒక్కో పుంజు ( తక్కువుగా వాటి ధర బ్రాండ్ పట్టి పదివేలు - లక్ష పైవరకు- మౌలాలీ / బంజార హిల్స్ ఫ్లాట్స్ తరగతిలా) కోజా నామపు శవాలుగా వేడి -ఓడి-వాడిన జీడి-బాదపు గడ్డకట్టిన రక్తపు చారలతో, కనుమ పండగ మసాలా ముక్కల కూరగా తనను పెంచిన మహారాజుల నోటిలో కరగపోతున్నాయి.

పదిమంది మెరుపులు - లంగాఓణీలలో వయ్యారంగా దూరంగా చికెన్ పకోడీ దూకాణాల దగ్గర కదులుతున్న వాలు జాడలు, కోడిపందాలలో ఆడవారికి చూసే సమాన హోదా! బహుశా ముగ్గుల పోటీలున్నాయి కాబోలు (బ్యానరులో ప్రకటనతో), గెలుస్తూ నెమలిని ఆడవాసన భ్రమ తగిలి డేగ పుంజు ఎందుకు చావు తెచ్చుకుందో అర్థమైయనది - అక్కడున్న శిఖండుల గుంపు, ఎన్నడు జాడలేని నే పుట్టిపెరిగిన గ్రామంలో ఆ స్వేచ్ఛాశిలల వరద ముంపును - చూసి. అది నా తెలియని గ్రామ ప్రగతి!

గుండాట - మహాభారత పాచికాలాట, చిల్లర కదా అనుకొంటే, కనీసం వంద కాయాలన్నారు - నా అవతారం అనుమానంగా చూస్తూ, చిన్నప్పుడు కాద్దామంటే డబ్బులేని గుండె లబ్ - డబ్‌లు, "వాటి ఆనమాలు ఖచ్చితం - ఐదు పైవందంటూ" నాతోనేనున్న వదలని మిత్రునితో గొప్పగా,

"మూడైయిదులు" అరిచాడు అన్ని గళ్ళు ఆర్.టి.సి. కండక్టరు కళ్ళుతో తడుముతూ. వందకు నాలుగొందులు - విసిరాడు నా కళ్ళపై, డాలర్ల జీతం - ఇవ్వని నా ముసిముసి నవ్వులు.

గుంపు విసిరినట్లుగా కూర్చుండి నాపై చూస్తున్న వాడిన చూపులు:

"ధర్మయ్య కదా? ఇవి ఉంచుకో" సాధించిన మూడువందలు జేబులో పెట్టకనే మరో మూడు వందలు తీసి, ఏదో తన సొమ్ములా చేతులో కుక్కినాను.

"వద్దు బాబు" మర్యాదగా పందిర గడను పట్టుకొని లేస్తూ, అతను బ్రాకట్ - గాంబ్లింగ్ ధర్మయ్య - మా చిన్నప్పుడు అత్తిలి షష్ఠి నుండి కొండాలమ్మ జాతర వరకు

ఆరు నెలలు ఏవో తెలియని అగరు బత్తుల పొగల - పొగాలో.

"లోపల - బయట" గుంపాటలు, అతని వ్యాపారపు - వృత్తి? అతను ఇస్త్రీ - తెల్లని చొక్కా - చెట్టు చుట్టూ కొత్త కరన్సీ కట్టకట్టులే, అతని ఎర్రని కళ్ళు నాలో దాగిన ఒక భయం, మా మోతుబరుల రాజులు/కోమటులుకంటే ధనవంతునిగా భావించేవాడిని.

"నీకు ధర్మయ్య పేరు ఎలా నాలుగు దశాబ్దాల తరువాత కరక్ట్‌గా ఇన్ని వేల గ్రామ జనంలో గుర్తుకొంది!" నా ఆర్.ఈ.సి. సాఫ్ట్ వేర్ మిత్రుని అసూయకు ఎలా వివరించగలను? అది తెలుగు భాష ఘోషయని, ధర్మయ్యకు నేను డబ్బులివ్వలేదు, ముంబాయి విమానయాత్రపు గల్ఫ్ భామలకు నేను ఇవ్వలేకపోయన దోశలు, ఆ అభాగ్యపు ఆడబడుచుల - 'వద్దు బాబు' ముగ్ధ పదం, ధర్మయ్య తిరిగి అదే పదపు పలకరింతతో, తనే వారి ప్రతిరూపంగా స్వీకరించి, నాకే ప్రేమ పులకరింత తిరిగి దానంగా ఇచ్చాడని - ఏ ఆండ్రాయిడు బ్రాండు - వెడల్పు / తరంగదైర్ఘ్యం ధైర్యం చేసి తన (నా మిత్రుని) మానస తనువుకు తాకగలవు?

అది మన తెలుగు నది - మది అలల మంత్రం, దాని దశ - దిశ / వడి - వేడి మార్చలేదు - ఏ యంత్రం.

అన్నట్లు అలా అల వైకుంఠపురపు చలించే చిత్రం వెండి తెర ద్వారం తీస్తూ/చూస్తూ - చాలా కాలం పిదప - పింగళి వెంకయ్య జెండా క్రొత్త రెపరెపలు - గంగా/ కావేరీ సంగమ అంతరంగ జనగణ మన రవి కిరణ - సామజ వర గమన - త్యాగయ్య శ్రావ్యపు మిశ్రమ వనపవనం - వినడం జరిగింది వచ్చే ముందు జనవరి 26న.

సామజ వర గమన - ఆనాడుకన్నా - ఈనాడు సినిమా తారల - అరల మరలలో మిళితం!, మామూలు జనం మరమరాల పిడత క్రింద పప్పు రుచిలా ఎంత ఆదరణ! - ఆ సామజ గమ వర గమన! అదే నా తెనుగు (ఎవ్వరి భాషైనా) పదును - చదును, నా మర్యాదలు "వద్దు బాబు" అన్న ఆ ఆడ ప్రయాణకుల ప్రేమ ప్రమిదల వెలుగు, మా ఊరి ధర్మయ్యలో దూరి - నే తస్కరించిన పంజాబు వారి (ఎయిర్‌పోర్ట్‌లో) అదనపు పెరుగుకు మూల్యం అందేలా నా మాతృభాష, వేషాలు మార్చి నన్ను ఋణ విముక్తున్ని చేసింది. నా అమ్మ (ఎవరి అమ్మైనా) తను లేకున్నా నన్ను ఎన్నడూ కాపాడుతుంది, బాసర సరస్వతి తెనుగు వీణా గాత్రపు అమ్మ అంతరంగం, తన పాదాల పద గోదారి పోలవరం- పోలేరమ్మ అవతారంలో చిత్తూరు (నెల్లూరల్లుకొని) నుండి అన్ని కులాలు తాకుతూ శ్రీకాకుళం వరకు ఆ పై పర దేశాలు పొంగుతూనే ఉంటుంది.

ఐ.వి. రామరాజు, కాంగో- పిప్పర, ప.గో.జి.
ఇ-మెయిల్: ivyramaraju@gmail.com


"…. **మిసిమి** ఫిబ్రవరి - 2020 సంచిక *సంపాదకీయం* లో నాగరకత, సంస్కృతి, సంప్రదాయం..ల మధ్యగల వ్యత్యాసాలు అశ్వినీకుమార్ గారు తెలిపిన తీరు ఆకట్టుకున్నది. *కాకతీయుల చరిత్ర* గురించి మొదటి భాగం చదివి కొంత తెలుసుకున్నాము. కాకతీయులు చతుర్థ కులజులని గమనించాము. ఆనాడు ఆ కులజులు రాజ్యాలేలడం గొప్ప విషయమే. ఈనాడు ప్రస్తుత ప్రధానమంత్రి మొదలుకొని చాలా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆ కోవకు చెందినవారు కావడం గమనార్హం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది సాధ్యమే. రాజరిక వ్యవస్థ ఉన్న రోజుల్లో అది సాధ్యం కావడం ఆలోచించదగ్గ విషయం. నాటక రచయితగా, విమర్శకునిగా, దర్శకునిగా, అధ్యాపకునిగా లబ్ధ ప్రతిష్టులై 2019, జనవరి 15న తనువు చాలించిన మొదలి నాగభూషణ శర్మగారికి **మిసిమి** సమర్పించిన శ్రద్ధాంజలి గొప్పగా ఉంది. *రేడియో నాటకం* రాయదలచిన ఔత్సాహికులకు **మిసిమి** ప్రచురించిన రెండు వ్యాసాలు ఉపయుక్తంగా ఉన్నాయి. ఎం.ఎన్. రాయ్ పై ప్రచురించిన రెండు కథనాలు వారి గురించి కొంత తెలుసుకునే అవకాశం కల్పించినవి. నటన అబద్ధమా? నిజమా? అనే చర్చతో కూడిన వ్యాసం చదివి ఆలోచనలో పడ్డాము…."

*- పంజాల నరసయ్య, హైదరాబాద్*


# చదవండి...

- మిసిమి

**9+5=14 రోజుల మా కేరళ పర్యటన:** కట్టమంచి బాలకృష్ణారెడ్డి. తన 14 రోజుల పర్యటన విపులంగా – వివరంగా – చదివేవారికి చూడాలనే ఆకాంక్ష కలిగే విధంగా రాశారు. ఆయా ప్రాంతాల చారిత్రక విశేషాలతో పాటు ఫోటోలతో సహా ముద్రించారు. యాత్రాకథనాలు ఏదో గైడ్ పుస్తకంలా కాకుండా తమతో పాటు మనల్ని ఆయా ప్రదేశాలు తిప్పుతున్న అనుభూతి కలిగించే – చక్కని రచన – మంచి ముద్రణ – మరి కేరళ దేవతల దేశం కదా!




*పేజీలు: 100, ₹ 100/– ప్రతులకు: సువేరా ఏజన్సీస్, 15–2294, సువేరా హౌస్, బాలాజీ నగర్ కాలనీ, చిత్తూరు – 517 002. ఫోన్: 944 055 9575.*





**(1) దేశభక్తి గీతాలు:** సేకరణ: పి. నారాయణరెడ్డి. 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' అని వేముపల్లి శ్రీకృష్ణ పాడినా, 'సారే జహాసే అచ్ఛా – హిందూస్తాన్ హమారా' అని ఇక్బాల్ పాడినా, 'ఏ దేశమేగినా, ఎందుకాలిడినా' అని రాయప్రోలువారు కీర్తించినా, 'జెండా ఊంఛా రహే హమారా' అని శ్యాంలాల్ గుప్తా జెండా ఎగుర వేసినా 'జయజయ ప్రియ భారతీ' అని దేవులపల్లి గానం చేసినా జన్మభూమిని, కన్నతల్లినీ గౌరవించుకోవటానికే. విద్యార్థులకే కాదు, ప్రతి పౌరునికి ఇవి కంఠతాః రావాలి. మరి త్రిపురనేని రాసిన 'వీరగంధమూ తెచ్చినారము – వీరులెవ్వరో తెల్పుడీ'కి ఇందులో చోటు దొరకలేదెందుకనో. *పేజీలు: 47, ₹ 40/–*

**(2) బాలల కోసం భారతదేశ కథ:** ముల్క్‌రాజ్ ఆనంద్ – తెలుగు: ముద్దకూరి రామకృష్ణ. ఒక దేశ చరిత్ర ఎలా రాయగలము? ఎవరు తమ కాలాన్ని ఆ కాలంలో తమ జీవితాన్ని సమగ్రంగా రాస్తారు – ప్రభుత్వాలు ఈ పని ఎప్పుడూ చేయలేదు. 19–20 శతాబ్దాల్లో వార్తాపత్రికలు – పార్లమెంటు, చట్టసభల రికార్డే చరిత్రగా మారుతోంది. పూర్వకాలంలో ఈ వెసులుబాటు లేదు. అందుకని ఏ చరిత్ర సమగ్రంగా ఉండదు. అనేక కోణాలు, రాసేవారి దృష్టి, రాజకీయాల ప్రమాణం ఎన్నో విషయాలతో ముడిపడి ఉంటోంది. అందుకని ఇంగ్లీషు వారు రాసిన భారతదేశ చరిత్ర పాక్షికమే, పక్షపాతమే! నిజానికి భారతదేశ చరిత్ర ఎవరూ రాయలేదు. అందుకే మన భారతం, రామాయణం ప్రమాణాలయ్యాయి, కల్పనలతో పాటు! ఇప్పటికీ ప్రభుత్వాలు చరిత్ర గురించి ఈ దిశలో నిబద్ధతలో ఆలోచన చేయడం లేదు. ఇది బాలల కోసం రాసింది కాబట్టి స్వాతంత్ర్య సమయంలో రాసింది – కాబట్టి ఆ వాసనలుంటాయి. ముఖ్యంగా విద్యార్థులకు పాక్షికమైన చరిత్రను నేర్పమనటం అన్యాయం! *పేజీలు: 80, ₹ 70/–*




**(3) నవలాలోకం:** ముక్తవరం పార్థసారథి. ముక్తవరం పార్థసారథిగారు వందకు పైగా పుస్తకాలు రాశారు. ఆంగ్లంలో వచ్చిన ప్రపంచ సాహిత్యాన్ని పుక్కిట పట్టి పాఠకులకు అందించారు. ప్రత్యేకంగా ఈ నవలా లోకం (3)లో వారు పాతికమంది ప్రపంచ నవలాకారులను పరిచయం చేస్తూ వారి రచననొకదానిని పాఠకులకు అందించారు. మీరు ఈ పుస్తకం ఆసాంతం చదవండి – ప్రపంచ నవలా సాహిత్యం మీ చేతిలో ఉన్నట్లే – పార్థసారధి గారి కృషి, శ్రమ తెలుగు పాఠకులకు కొంగుబంగారం. *పేజీలు: 188, ₹ 150/–*







**(4) విశ్వ కథా వీధి దేశదేశాల కథలు:** పురిపండా అప్పలస్వామి. ఇవి దేశ దేశాల కథలు. అప్పల స్వామి గారు అనువదించి, సంకలనం చేశారు. ప్రేమ్‌చంద్, మున్షీ ప్రేమ్‌చంద్, చకోవ్, ఎడ్గార్ అలన్ పో, కరోలి, జాకీర్ హుస్సేన్, హెచ్.జి. వెల్స్ ఇలా 18 మంది రచయితల కథలను అనువదించి, అందించారు అప్పలస్వామి. *పేజీలు: 204, ₹ 170/–*

**(5) భారతదేశ చరిత్ర, సామాజిక జీవన చిత్రం కథలు - గాథలు ఐదవ భాగము:** దిగవల్లి వేంకట శివరావు. ఇది భారతదేశ చరిత్ర – సామాజిక జీవన చిత్రాన్ని ఆవిష్కరించే కథలు – గాథలు. పెద్దలను – ముఖ్యంగా కన్న తండ్రిని ఏ విధంగా మనం భక్తిశ్రద్ధలతో పూజిస్తాం? దేవుని గదిలో వారి చిత్రపటాలు పెట్టి పూజలర్పిస్తాం. కానీ దిగవల్లి రామచంద్ర గారు ఈ *కథలు – గాథలు* పుస్తకాన్ని సంపాదకత్వం వహిస్తూ వారి నాన్న గారైన దిగవల్లి వెంకట శివ రావు గారి పట్ల – తమ భక్తి భావాన్ని ఆచరణలో పెట్టారు. వీరి అన్నగారైన దిగవల్లి వెంకట రత్నం గారు వీరి నాన్నగారు సేకరించిన పుస్తకాలన్నీ వారి మేడ పైన గదిలో భద్రపరచి, చిన్న గ్రంథాలయం చేశారు. ఈ అన్నదమ్ములిద్దరూ వారి పితృ పాదాలపై భక్తిని ఈ పుస్తక ప్రచురణల ద్వారా వెలిబుచ్చడమే కాదు – మనలాంటి పాఠకులకు ఎనలేని కానుక అందించారు. ఈ పుస్తకంలో 1857 పూర్వము ఎలాంటి తిరుగుబాట్లు జరిగాయో వివరిస్తూ – అందుకు కారణాలు ప్రజాపీడనము, ప్రభుత్వం పట్ల వ్యతిరేకత లేని మండలమే లేదని చెప్పారు. ఈ తరం వారికి ఎంతమంది ఈ వివరాలు తెలుసు? ఇలాంటి సాంఘిక చరిత్ర పాఠ్య పుస్తకాలలో ఎందుకు పెట్టరో అర్థంకాదు. ఇప్పటికీ రాబర్ట్ క్లైవ్ గొప్పతనమే మన చరిత్ర పుస్తకాలలో కనిపిస్తుంది. అన్నీ తిరగరాయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




*పేజీలు: 302, ₹ 220/-*




**(6) ప్రాచీన భారతంలో వైజ్ఞానిక ప్రగతి:** ముక్కామల నాగభూషణం. ప్రాచీన భారతం – ఔన్నత్యాన్ని వెలికితెచ్చి – వైజ్ఞానికంగా ఎంతగా ప్రగతి చెందిందో – మన వాఙ్మయంలోనే ఈ వివరాలన్నీ దాగి ఉన్నాయని నాగభూషణం గారు వివరించారు – ముక్కామల తలపండిన జర్నలిస్టు – పత్రికా సంపాదకులు – రాతియుగం – సింధు నాగరికత – గణితశాస్త్రం – ఆయుర్వేదం – కళలు – ఇలా ప్రాచీన భారత వైభవాన్ని మన కళ్ళముందుంచారు – నాగభూషణం. ప్రగతి – ఆంధ్రవాణి పత్రిక నడిపిన నాగభూషణం విస్తృత అధ్యయనశీలి. *పేజీలు: 112, ₹ 95/-*



**(7) పర్యావరణ కాలుష్యం : ప్రమాదాలు:** డా. ఎస్. జనార్దనాచారి. పరిసరాలను కాలుష్యంతో నింపివేస్తున్న జనావాసాలు ఎన్నో రోగాలకు లోనవుతున్నాయి. ముఖ్యంగా నగరాలు – నగరాలలోని కాలనీలు – అస్తవ్యస్తమైన మున్సిపాలిటీ వ్యవస్థ – (చివరికి ఒక తిట్టుగా మారిన పేరు) ఎలాంటి ముందు చూపు లేకుండా నగరాలను విస్తరిస్తూ – నీరులేక, మురుగు పారుదల వ్యవస్థ లేక – దోమలకు నెలవైన విషవలయాలయిపోయాయి – వీటి నుంచి ఎలా బయటపడాలో జనార్దనాచారి వివరిస్తున్నారు.

*పేజీలు: 48, ₹ 40/-*




**(8) విచిత్ర ప్రకృతి:** వి.ఆర్. శాస్త్రి. ప్రకృతిలో అన్ని విచిత్రాలే – పడుకోని జంతువు – వేల మైళ్ళ ఎదురీదే – చేపలు – గ్రాము ఆహారంతో వేల మైళ్ళు ఎగిరే పిట్ట – వెచ్చదనం కోసం సంవత్సరానికొకసారి వేల మైళ్లు ప్రయాణించే కొంగలు – నోటిలో గుడ్లు కుక్కుకుని పొదిగే చేపా – ఇవన్నీ వింతలే – ఇంకా ఎన్నో ఉన్నాయి ఈ పుస్తకంలో. *పేజీలు: 116, ₹ 90/-*

**(9) బొమ్మల బాల భాగవతం:** దాశరథి కృష్ణమాచార్యులు – సి. నారాయణ రెడ్డి – మొదటివారు – నా తెలంగాణ కోటి రతనాల వీణ – అన్న కవి – రెండవవారు – కర్పూర వసంత రాయలు రచించిన కవి – వీరిద్దరూ ఈ బొమ్మల భాగవతం ప్రచురించడానికి కారణం – సూపర్‌మాన్, బాట్‌మాన్‌లాంటి టి.వి. సీరియళ్ళు ఎదుర్కోవడానికి – చిన్నతనం నుంచే మన సాహిత్యాన్ని బాలలకు పరిచయం చేయడం అవసరమని – అందుకు దృశ్య విధానం ఉత్తమమని – ఈ బొమ్మల భాగవతం అందించారు – ఇందుకు లంకా సూర్యనారాయణగారి సహకారం ఎంతో ఉందని పేర్కొనటం గమనార్హం.




*పేజీలు: 96, ₹ 100/-*

*పై తొమ్మిది పుస్తకాల కోసం – నవచేతన పబ్లిషింగ్ హౌస్, 12-1-493/ఏ.ఎ., గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్–500 068. ఫోన్: 040–29884453/54.*

# మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి     బహుమతిగా పంపండి

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర ₹ 360/– (సంవత్సర చందా) పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా, ఇ-మెయిల్ ద్వారాగానీ, వాట్సాప్ (నెం : 99 49 51 65 67) ద్వారా గానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని మంచి సారస్వతంతో పలకరించినట్లే......


## Our A/c Details for Online Transfer

Bank : **STATE BANK OF INDIA**
Account : **MISIMI**
A/c. No. : **10261569316**
Branch : **Saifabad, Hyderabad, INDIA**
IFS Code : **SBIN0007315**


*ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 20/- బ్యాంకు ఛార్జీలు కలపండి.*
*ఈ ప్రక్క మెయిల్‌కు తెలియజేయండి. e-mail: misimi90monthly@gmail.com*


## **మిసిమి** ప్రచురణలు


**నోబెల్ వ్యాసాలు**


**మిసిమి** పార్థసారథి వ్యాసాలు



చిత్రకళా నీరాజనం


చార్లీ చాప్లిన్


బైరన్


పునస్సార సాహిత్యం


పారిజాతం


దోసిట చినుకులు


సిద్ధార్థ


ప్రతులకు:
**మిసిమి**
కార్యాలయాన్ని
సంప్రదించండి.
ఫోన్:
**994 951 6567**

**మిసిమి** మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**

MISIMI / మిసిమి
RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2018-20
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.3.2020



వసంత వేళ



రాధే